Vijaya dhwajam

విజయ ధ్వజం

(Learning to Live)

రచన

మకరెంకో

Navodaya publishers

నవోదయ పబ్లిషర్సు,

విజయవాడ-2.

ప్రచురణ నెం 11
ఆషాఢం 1879.

రు. 3-75
(3-12-0)

ఆంధ్రా ప్రింటర్సు,
విజయవాడ-2.

మొదటి సంపుటి

విజయ ధ్వజం

అనువాదం

రెంటాల గోపాలకృష్ణ.

పరిచయం

రష్యాలో 1917 అక్టోబరు విప్లవ వెల్లువతో వచ్చిన మార్పులు బహుముఖం. శిథిలమైన పాత వ్యవస్థ కూలిపోయింది. కొత్త వ్యవస్థ ప్రాదుర్భవించింది. పాత విలువలు మారిపోయాయి. కొత్తవిలువలు పొదుకొన్నాయి. మనిషిని మనిషి దోచుకుతినే - పరపీడన పరాయణత్వం పటాపంచలయింది. మానవుని చేతికి, బుద్ధికి బిగించిన సంకెళ్ళు ఎక్కడికక్కడ, ఎక్కడివక్కడ విచ్చిన్నమైపోయాయి. దాంతో మానవ మనుగడే మారిపోయింది. ఏ యుగంలోనూ లేని నూతన చైతన్యం వెల్లి విరిసింది. యుగయుగాలుగా మానవుడు కంటూ వచ్చిన సుందర సురుచిరస్వప్నం నిజమై, భువిరుజువై, అశేష పీడిత జనాళికి విజయధ్వజమై సమ సమాజరూపాన వెలసింది. సామ్యవాదవిప్లవ విజయం సాంఘిక, ఆర్థిక, రాజకీయ కళారంగాలలో అసదృశమైన సత్ఫలితాలను సాధించింది. జిజ్ఞాసాపరులైన మానవులు భవిష్యత్తును దర్శించి, సమతను కాంక్షించి, సర్వత్రా పరిణామాన్ని ఉపలక్షించి సామ్యవాద వ్యవస్థను సంస్థాపించుకున్నారు.

సామ్యవాద సమాజ జీవిత దర్పణమే ఈ నవల. విప్లవానికి పూర్వం శిథిల సమాజపు అవశేషాలకూ విప్లవానంతరం పరిఢవిల్లిన సామ్యవాద సమాజ నూతన శక్తులకూమధ్య సాగిన సంఘర్షణ ఈ నవలలో అడుగడుగునా ప్రస్ఫుటమవుతుంది. ఒక వంక శిథిల సమాజపు దుష్ఫలితాల ప్రభావాలకు లోనయిన వ్యక్తుల మనః ప్రవృత్తిని మన కళ్ళకు కట్టినట్టు చూపుతూ, మరొకవంక ఆ మనః ప్రవృత్తిని మంచిమార్గాన రూపు దిద్దేటందుకు జరిగిన అనంతమైన కృషి ఈ నవలలో అభివ్యక్తమవుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో జీవితం ఒక జూదంవంటిది. ఈ జూదంలో ఓడిపోతున్నవాళ్ళు అనేకులు. వీళ్ళు నిరుద్యోగులుగా, నిరాధారులుగా వీధులవెంట తిరుగుతూ సహజంగా అనేక దుర్వ్యసనాలకు అలవాటు పడిపోతారు. అరాచకమైన ఈ జీవితాలను చక్కపరచేటందుకు ప్రయత్నాలు ఈ సమాజంలో శూన్యం. చిన్నతనంనుంచీ చదువు సంధ్యలు లేక, సంస్కారం లేక భావి పౌరులు కావలసిన యువకులనేకమంది జేబు దొంగలుగా, తుంటరులుగా, జూదగాళ్ళుగా నిత్యం మనకు వీధుల్లో ప్రత్యక్షమవుతుంటారు. పెట్టుబడిదారీ నాగరికత సృష్టించిన ఇలాంటి పిల్లల జీవితం, దేశంలో సామ్యవాద నాగరికత వెలకొన్న తరువాత ఎలా క్రమబద్ధమవుతుందో, ఎలా సుశిక్షిత మవుతుందో ఎలా సుందరతర మవుతుందో సహజమైన ఆ పిల్లల మానసికశక్తి ఎంత ఉజ్వలవంతమో, అది ఏవిధంగా దేశ పునర్నిర్మాణానికి ఉపయుక్త మవుతుందో 'విజయధ్వజం' అనే ఈ నవల చదివి పాఠకుడు ఇట్టే ఊహించుకోవచ్చును.

కొత్త వచ్చినంత మాత్రాన పాత వెంటనే తుడిచిపెట్టుకపోదు. దాని అవశేషాలు అక్కడక్కడ అగుపిస్తూనే ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ పుణ్యమా అంటూ అన్ని దేశాల్లోలాగానే రష్యాలో సహితం నిరుద్యోగులు, నిలువ నీడ లేనివాళ్ళు, సోమరులు, దేశ దిమ్మరులు అనేకమంది తయారైనారు. అలా తయారైన పిల్లల మనస్తత్వం శాస్త్రీయ బోధనా పద్ధతులపై ఎలా సంస్కరిత మవుతుందో ఈ నవలలో మనం చూస్తాం.

'నా' అనేవాళ్ళు లేక బూట్ పాలిష్ చేస్తూ వీధులు తిరిగే వాన్యా, మోసాలకు అలవాటుపడి జీవిస్తున్న ఇగోర్, అల్లరి చిల్లర పనులు, దొంగతనాలు, చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్న రైజికోవ్ పార్కుల్లో, స్టేషన్లలో తిండీ తిప్పలూ లేక పగలూ రాత్రీ ఆగమ్మకాకుల్లా తిరుగుతున్న పిల్లలనేకమంది కాలనీలో సమిష్టి జీవితం గడుపుతారు. నూతన విద్యాబోధనా పద్ధతులతో వివిధ అభిరుచులను వికసింపచేసే వాతావరణంతో అలరారుతున్న పిల్లల కాలనీలో వీళ్ళ జీవితాలే నిత్య నూతనంగా మారిపోతాయి. ఎవరి అభిరుచులకు తగ్గట్టువారు ఆయా రంగాల్లో సుశిక్షితులై, వివిధ వృత్తులను అలవర్చుకుని భావి పౌరులుగా రాణింపుకు వస్తారు. ఈ మార్పు అంగీకరించని పాత మనస్తత్వపు పోకడలపై, మార్పును వాంఛిస్తున్న నూతన మానసిక శక్తులు అతి చాకచక్యంతో సమర్థనీయంగా సమరం సాగించి విజయధ్వజం ఎత్తుతాయి.

వర్తమాన సోవియట్ నవలా రచయితల్లో మకరెంకో లబ్ధ ప్రతిష్ఠుడు. ఈయన రచించిన అనేక ఉత్తమ నవలల్లో 'విజయధ్వజం' ఒకటి. జీవితాన్ని యథాతథంగా వీక్షించడమే కాక దాని మూల ప్రాతిపదికలను తరచి తరచి పరిశీలించి వివిధ సన్నివేశాలను సంఘటనలను వాస్తవికంగా హృదయంగమంగా చిత్రిస్తూ, సజీవమైన పాత్రలను రూపకల్పన చేయడంలో మకరెంకో సిద్ధహస్తుడు. జీవితంపై ఆసక్తిని, అనురక్తిని, అచంచల విశ్వాసాన్ని అప్రతిహత ధైర్య సాహసాలను కలిగించి ఆయన రచనలు పాఠకులను ఆదర్శ మార్గాభిముఖులను కావిస్తాయి.

మకరెంకో రచించిన ఈ గొప్ప నవల యింగ్లీషులో మూడు భాగములుగా వున్నది. దీనిని అనువదింపజేసి రెండు సంపుటాలుగా ఆంధ్ర పాఠకులకు అందిస్తున్నాం. ఇది ప్రథమసంపుటి. త్వరలోనే రెండవ సంపుటికూడ వెలువరిస్తున్నాం. రెండు సంపుటాలుగా వెలువడుతున్న ఈ నవలను తెలుగు పాఠకులు ఆదరంతో అభిమానిస్తారని ఆశిస్తున్నాం.

ప్రచురణ కర్తలు

1

మనిషిని ఇట్టే పోల్చుకోవచ్చు

ప్రథమ పంచవర్షప్రణాళిక ఇక కొద్దిదినాల్లో పరిసమాప్తి అవుతుందనగా ఈకథ ప్రారంభమైంది.

అప్పటికింకా శీతాకాలం పూర్తిగా గడవలేదు. సూర్యకిరణాలింకా తీక్షణంకాలేదు. బురద, చెత్త, చెదారం ఉన్నచోట పొరలను చీల్చుకుని సూర్యకాంతినేలను తాకడంలేదు. గడ్డకట్టిన మంచు గడ్డకట్టినట్లేఉంది. శీతాకాలపు చిహ్నాలు పేరుకున్న మంచులో ద్యోతకమవుతూనే ఉన్నాయి. కాని స్టేషన్ చౌకుకు పోయేబాటలో మెట్లంగి రాళ్ళమీద బాగా ఎండపడుతోంది. రాళ్ళమధ్యనున్న మన్ను ఇప్పటికే తడి ఆరిపోయి పొడిపొడిగా విడిపోయింది. వచ్చిపోయే బండ్ల చక్రాలతాకిడికి దుమ్ము, ధూళి చిన్నచిన్న కెరటాలుగా లేచి బండ్లతోపాటు ప్రయాణంచేస్తోంది. చౌకుమధ్య దిక్కూ, దివాణంలేకుండా చిన్ననూసికలాగా ఒకతోట పడిఉంది. వేసవి కాలం వచ్చేసరికిమాత్రం ఈతోటలోని దుబ్బులు ప్రకృతిచిహ్నాలను కనపరచడానికా అన్నట్లు అక్కడక్కడ ఆకులు తొడుగుతూ ఉంటాయి. కాని ఇప్పుడుమాత్రం అది అధ్వాన్నంగాఉంది. వసంతం మాట మరచిపోయి శిశిరం తన తలమీదికి వాలిందా అన్నట్లు తోట మ్రోడులతో ఈసుపోయినట్లుంది.

ఈ చౌకునుంచి ఒక చిన్నబస్తీకి పోయే రోడ్డుఒకటి ఉంది. ఆబస్తీ ఏదో తప్పిజారి అదృష్టవశాత్తూ మ్యాపులో కనిపిస్తుందే

తప్ప దానికేమీ ప్రాధాన్యతలేదు. అది రైల్వేజంక్షన్ కనుక సరి పోయింది కాని, లేకపోతే ఆ బస్తీ ఉన్నట్లే మనుష్యులకు తెలిసి ఉండేదికాదు.

దేశంలో నూతన ఆర్థికవిధానం అమలుజరుగుతున్న తొలి సంవత్సరాలలో ఆ చౌకులో కొన్ని అంగళ్ళు, ఆఫీసులు స్థాపితమైనాయి. అక్కడే ఇంకొకచోట విడిగా ఒక భవంతిలో 'పోస్టాఫీసు' ఉంది. దాని తలుపులమీద 'పోస్టాఫీసు' అనే అక్షరాలు పచ్చగా తళతళలాడుతున్నాయి. పోస్టాఫీసు వెలుపల పాడైన పాత గుర్రబ్బండి ఒకటి ఆగిఉంది. బండికి కట్టిన రెండు పొట్టిగుర్రాలు అలుపు తీర్చు కుంటున్నాయి. ఆ చౌకులో జనసంచారం అరుదు. అడపా తడపా ఒకరో ఇద్దరో - ముఖ్యంగా రైల్వేకార్మికులు ఏవో పనిమీద లాంతర్లు పట్టుకునో, చుట్టల చుట్టలు మోకులు నెత్తినపెట్టుకునో, పొరచెక్క సూట్ కేసులతోనో, అటూ ఇటూ మసులుతూ ఉంటారు. స్టేషన్ గోడకానుకుని ఎండలో చలి కాచుకుంటూ రైతులు, తదితర ప్రయాణీకులు చిన్నచిన్న వరుసలుగా కూచుని రైలుకోసం నిరీక్షిస్తున్నారు.

ప్రయాణీకులకు దూరంగా బూట్‌పాలిష్ కుర్రవాడొకడు తన స్టాండుప్రక్కనే విచారంగా కూచునిఉన్నాడు. అతనికి పన్నెండేండ్లు. పేరు వాన్యాగల్చెంకో. ఎండ పొడవచ్చి సూటిగా అతని కళ్ళలో పడుతోంది. తట్టుకోలేక కళ్ళు నులుపుకుంటున్నాడు. బూట్ పాలిష్‌కు ఉపకరించే అతని స్టాండు ఎంతో అరుదుగా ఉంది. నాలుగు కర్రముక్కలు తెచ్చుకుని అడ్డదిడ్డంగా పెట్టి స్వయంగా ఆకుర్రవాడు తయారుచేసుకున్న స్టాండుఅది ఆ స్టాండులాగే అతని సరంజామా అంతా ఆర్భాటం లేకుండా యథోచితంగా ఉంది.

వాన్యా ముఖం ఇంకా తెల్లగా, నిగనిగలాడుతూనేఉంది. వేసుకున్న దుస్తులుకూడా ఇంతవరకు చినుగుపట్టలేదు. కాని అతని మోములోని తళుకు, దుస్తుల బిగువు సడలిపోతున్న లక్షణాలు

ఇప్పటికే ద్యోతకమవుతున్నాయి. ఇంక కొద్దిరోజుల్లో అతని మోములో కాంతి తగ్గుతుంది; దుస్తులు చిరగనూ చిరుగుతాయి. అప్పుడు ఇలాంటి కుర్రవాడు వీధిలో కనిపిస్తే "దయాళువులైన" పెద్ద మనుష్యులు అసహ్యించుకుంటారు; చూసీ చూడనట్లు దూరంగా తొలగిపోతారు. కాని ఇలాంటి మానవుడే ఏ సాహిత్యంలోనో, రంగభూమిమీదనో పాత్రగా కళ్ళఎదుట కనిపిస్తే సమ్మోహితులవుతారు, సంతోషపడతారు. కాని వాన్యా కింకా అంత అదృష్టం పట్టలేదు. అయితే ఇలాంటి కుర్రవాళ్ళను "అభివృద్ధికి వచ్చే మంచి పిల్లకాయలు"గా దేశంలో ఇప్పుడిప్పుడే కొందరు గుర్తిస్తున్నారు.

ఇంతలో తోట అవతలవైపునుంచి ఒక కుర్రవాడు చరచర అంగలువేసుకుంటూ సరాసరి వాన్యా దగ్గరికి వచ్చాడు. జాకెట్టు జేబుల్లో చేతులుపెట్టుకున్నాడు. నోటిచివర సిగరెట్టును పెదవులతో కదిలిస్తున్నాడు. అతను వేసుకున్న దుస్తులు కొత్తవి. వాన్యా చేరువనే ఉన్న జోళ్ళ స్టాండుమీద దర్జాగా తన కాలుపెట్టి పెదవులు బిగబట్టి "ఎరుపురంగు ఉందా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకు వాన్యా అదిరిపడి అతనివంక చూచి చటుక్కున తన సరంజామా అంతా వెతికి ముఖం వ్రేలాడవేశాడు.

"ఎరుపురంగా?" అంటూ నిరాశగా "ఊహు. ఎరుపురంగు లేదు." అని జవాబు చెప్పాడు.

ఆ యువకుడు తనకేదో అవమానం జరిగినట్లు జోళ్ళ స్టాండు మీదినుంచి కాలు తీశాడు. మళ్ళీ జాకెట్టు జేబుల్లో చేతులు పెట్టుకుని చీత్కారంగా సిగరెట్టు ఒక్క దమ్ము పీల్చాడు.

"ఎరుపురంగు లేదూ? అయితే నీ వెందుకూ చున్నట్టి క్కడ?" అన్నాడు.

బేరం కలిసిరానందుకు వాన్యా బేలగా "ఎరుపు లేకపోతే నేం? నాదగ్గర నల్లరంగు ఉంది" అని చెప్పాడు.

ఆ యువకుడు కోపంతో జోళ్ళ స్టాండును ఒక్క తన్ను తన్నాడు. "ఇదంతా వట్టి దగా! నీదగ్గర నల్లరంగుందా! అసలు నీకు జోళ్ళు బాగుచేయడానికి పర్మిట్టు ఉందా? లేదా!"

యువకుడు తన్నిన తాపుకి స్టాండు క్రిందపడింది. సామాను చెల్లాచెదురైంది. వాన్యా క్రిందపడిన సామాను ఆదరాబాదరా పోగుచేసుకుంటూ అతనివంక తదేకంగా చూస్తున్నాడు. తనకు పర్మిట్టు ఉన్నదో లేదో సమాధానం చెప్పేలోపునే ఆ యువకుని వెనకాల ఇంకొక యువకుడు వచ్చి నిలబడటం వాన్యా గమనించాడు. కొత్తగావచ్చిన యువకునివయస్సు పదహారేండ్లు. పొడుగ్గా, సన్నగా ఉన్నాడు. వెడల్పయిన నోరు; కళ్ళల్లో ఆనందం తొణికిసలాడు తోంది. అతని పెదవుల వంపు అతని ఆకతాయితనాన్ని సూచి స్తోంది. వేసుకున్న సూటు కొంచెం పాతపడ్డదే. జాకెట్టుక్రింద మాత్రం చొక్కాలేదు కనుక దాన్ని జాగ్రత్తగా బొత్తాలు పెట్టు కుని కాలరు పైకెత్తాడు. తలకు లేతరంగు గళ్ళటోపీ పెట్టుకున్నాడు.

యువకుని భుజాలమీదికి వంగి వాన్యాతో "నాక్కావల సింది నల్లరంగే. త్వరగా కానీయి." అన్నాడు.

ఈ ఆగంతకుని రాక పట్టించుకోకుండా యువకుడు తన మామూలు ధోరణిలోనే వాన్యాను "ఆ, నీవు బూట్‌పాలిష్ చేసే వాడివే! నీదగ్గర పర్మిట్టు ఉన్నదా లేదా?" అని గుచ్చి గుచ్చి అడగసాగాడు.

వాన్యా తన బ్రష్‌లను నెమ్మదిగా సర్దుకున్నాడు. ఆ యువ కుని కోరచూపులనుంచి తప్పించుకునే అవకాశం అతనికి చిక్క లేదు. పర్మిట్లు, పత్రాలు ప్రజల జీవితాలలో ఎంత ప్రాధాన్య మైనవో వాన్యా ఇంతకుముందు ఎవరో అనగా తాను విన్నాడు. కాని ఇప్పుడు ఈ యువకుడు వేసిన జటిల ప్రశ్నకు సమాధానం ఏమీ తోచక తబ్బిబ్బు పడ్డాడు.

అంతటితో ఆ కుర్రవాణ్ణి విడిచిపెట్టిన మళ్ళీ ఆ యువకుడు మూర్ఖంగా అదే ప్రశ్న వేశాడు.

ఇట్టి విషమపరిస్థితిలో వాన్యా జోళ్ళ స్టాండుమీద ఎవరిదో ఇంకొక బూటుకాలు పడింది. ఆ బూటు చాలా పాతది. రంగు వెలిసిపోయింది. అక్కడక్కడ మట్టిరంగు పేరుకుంది. ఎంతోకాలం నుంచి ఆ బూటు పాలిష్‌ముఖం ఎరగదని చూడగానే ఇట్టే తెలిసి పోతుంది. ఈ కుర్రాడు వాన్యాను ప్రశ్నించినయువకుణ్ణి నిర్లక్ష్యంగా అవతలికి నెట్టి, మర్యాదగా ఇలా అన్నాడు :

"ఆ కుర్రవాడిదగ్గర పర్మిట్టు ఉంటేనేం లేకపోతేనేం? నీకు కావలసిన ఎర్రరంగు అతనిదగ్గర లేకపోయాక, పర్మిట్టు ఉంటే మాత్రం ఏంలాభం?"

తననిలా ప్రక్కకునెట్టి ఎంత మర్యాదగా అడిగినా ఆ యువకుడుమాత్రం ఏమీ చలించలేదు. కోపంగా సిగరెట్టు మళ్ళీ ఒక్కమాటు పీల్చి పేవ్‌మెంటుమీదికి విసిరేశాడు. పళ్ళు ఇకిలిస్తూ వాన్యావంక తిరిగి:

"వాడిదగ్గర పర్మిట్లేకనుక ఉంటే బయటికితీసి చూపించమను." అని గద్దించాడు.

వెలవెలబోయిన బూట్లు తొడుక్కున్న కుర్రాడు కోపంతో రెచ్చిపోయాడు. చౌకంతా ప్రతిధ్వనించేలా బిగ్గరగా అరిచాడు.

"నాప్రాణం తోడేస్తున్నావు! ఏమిటా వెర్రిప్రశ్న? నేనెవర్నో నీకు తెలియదుకాబోలు! నేను ఇగోర్ చెర్నొగొరొస్కీని"

అతనెవరైందీ బహుశః ప్రశ్నించిన యువకునికి తెలిసి ఉండదు. అతనలా కేకపెట్టేసరికి, యువకుడు తనకు దూరంగా కనిపించిన ఎవరితోనో పనిఉన్నట్లు నటిస్తూ అక్కణ్ణుంచి వెనక్కు పరుగుతీశాడు. వెళ్ళిపోతున్న యువకుణ్ణిచూచి ఇగోర్ చెర్నొగొరొస్కీ చిరునవ్వునవ్వుతూ నిలుచున్నాడు. "గుడ్‌బై... నేను గుడ్‌బై అన్నాను. మళ్ళీనీవన వెంతేత?"

చరచరా వెళ్ళిపోతున్న ఆ యువకుడు "గుడ్ బై" అని మెల్లగా సణిగినా అతని పరుగులవల్ల అది వినిపించలేదు. తోట దాకా వెళ్ళిన ఆ యువకుడు అక్కడ ఆగి ఏదో అన్నాడు కాని అప్పటికే ఇగోర్ చెర్నొగొరొస్కీ తన బూటుపాలిష్ గొడవలో పడి అది వినిపించుకోలేదు. తనకాలును మళ్ళీ జోళ్ళస్టాండుమీద మోపాడు.

వాన్యా ఆనందంతో నవ్వుతూ ఒక కన్ను రెట్టగించి ఇగోర్ చెర్నొగొరొస్కీ వంకచూస్తూ.

"నలుపురంగేనా!" అని అడిగాడు. "అవును స్వామీ, అవును. అభ్యంతరమేమీ లేదు. ఆ మాటకొస్తే నాకు నలుపంటేనే ఇష్టం." అన్నాడు ఇగోర్.

వాన్యా బ్రష్‌తీసి పాలిష్ పట్టించాడు. ఇందాక తనను గద్దించిన ఆ యువకుణ్ని ఇగోర్ చెర్నొగొరొస్కీ మందలించడం; అతను హడావుడిగా పరుగెత్తడం; ఈ పీరోచిత కృత్యమంతా వాన్యాకు కళ్ళకు కట్టినట్టేఉంది. చెర్నొగొరొస్కీ అంటే ఆకుర్రాడికి ఎంతో మక్కువ కలిగింది; అయినా వాన్యా ఇలా ప్రశ్నించాడు,

"పాలిష్‌కు పదికోపెక్కు లవుతుంది. అంతవరకూ మీదగ్గర ఉందా?"

ఇగోర్ మోములో సహజసిద్ధమైన నవ్వు వెల్లివెరిసింది.

"అందర్నీ ఇలాగే తెలివితక్కువగా ప్రశ్నిస్తూఉంటావా కామ్రేడ్?"

"అసలు మీదగ్గర పదికోపెక్కులూ ఉన్నాయా?"

"ఊహూ. లేవు." అంటూ ఇగోర్ నింపాదిగా జవాబు చెప్పాడు.

వాన్యా చేస్తున్న పనిని చటుక్కున ఆపేశాడు:

"అదికాదు, అదికాదు......పోనీ, మీదగ్గర ఎంతఉంది!"

"ఏమీలేదు. ఒక్కచిల్లిగోపెంక్క కూడా లేదు. కావలిస్తే చూడు."

"ఏమీ లేనిదానికి మీ బూట్లు నేను పాలిష్ చెయ్యలేను."

ఇగోర్ చెర్నొగొరోస్కీ నోసు వెళ్ళబెట్టాడు. కళ్ళల్లో ఆసక్తిని, ఆతురతను కనపరుస్తూ ఇలా అన్నాడు.

"ఎందుకు చెయ్యలేవు! చేస్తావు. ఎందుకు చెయ్యకూడదూ?"

"వట్టి పుణ్యానికి బూట్లు బాగుచేయడమా!"

"అంతే అనుకో. నటిస్తే- డబ్బేమీ ఇవ్వకుండానే; ఒక మాటు ప్రయత్నించిచూడు. ఆ ప్రయత్నం ఎలా ఫలిస్తుందో నీవే చూద్దువుగాని"

"డబ్బా, దస్కం ఏమీలేకుండా అరవచాకిరీ చేయడమూ?"

అవును. అదేమిటో ఒక్కసారి నీవేచూడు. అలాచేస్తే ముందు ఏంజరగబోతుందో చూడ్డానికి కుతూహలంగా ఉంటుంది."

"అలా అయితే సరే. పాలిష్‌చేసి చూస్తాను.

"ఇక ఇప్పుడు నీవు మంచికుర్రవాడి క్రింద లెక్క.

"ఇక మారుమాటాడకుండా చేసేస్తాను. ఏం జరుగుతుందో చూస్తాను."

ఇలాఅని వాన్యా తన బేరగాడివంక బావగర్భితంగా గబుక్కున చూచాడు. చూసి, చూపును దింపుకుని అమితోత్సాహంతో పని ప్రారంభించాడు.

"నీవిలా అస్తమానం వీధులవెంట తిరుగుతుంటావా!" అని చెర్నొగొరొస్కీ ఆ కుర్రవాణ్ని అడిగాడు.

"ఇంకా అలా తిరగడంలేదు."

"అబద్ధమాడుతున్నావు! నీవు వీధులవెంట తిరుగుతునే ఉన్నావు. నీవు స్కూలుకు వెడుతున్నావా ?

"ఇదివరకు వెళ్ళేవాణ్ణి...తరువాతవాళ్ళు ఎక్కడికో వెళ్ళి పోయారు." "ఎవరూ ? మీ తల్లిదండ్రులా ?" "కాదు. వాళ్ళు నా తల్లిదండ్రులుకాదు...కాని...వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకున్నారు. అంతకు ముందు మా అమ్మ, నాన్న బతికే ఉన్నారు, కాని తరువాత..."

తన జీవితగాథను చెప్పుకునేందుకు వాన్యాకు మనస్కరించ లేదు. అదీకాక తన జీవితంలో జరిగిన దురదృష్ట సంఘటనలను తనకు ఉపకరించేటట్లుగా మలుచుకోవడం ఆతనికింకా చేతకాలేదు. అంతటితో తన కథను ముగించి చెర్నొగొరొస్కీ బూటు మడమలను శ్రద్ధగా పరిశీలించడం ప్రారంభించాడు.

ఉన్నట్లుండి చెర్నొగొరొస్కీ ఆ కుర్రవాణ్ణి ఇలా అడిగాడు:

"ఈ స్టాండు" నీ అంతటనీవే చేసుకున్నావా ?

"ఏం ? ఇది బాగాలేదా ?"

"ఎందుకు బాగాలేదూ, అద్భుతంగాఉంది. నీ వెక్కడుంటు న్నావు ?

ఎక్కడా ఉండడంలేదు. ఇక్కణ్ణుంచి బస్తీకి పోవాలనిఉంది. కాని ఏంలాభం? చేతిలో డబ్బులేదు... ఉన్నవి నలభై కోపిక్కులే."

వాన్యాతన కథంతా నింపాదిగా చెప్పాడు.

చేతిలో ఉన్నపని అయిపోయింది. బూట్లుబాగుచేసి వాన్యా కళ్ళుపైకెత్తి చూచాడు.

"మీ మనస్సుకు నచ్చినట్లు బూట్లు బాగుచేశాను కదూ ? అని వాన్యా సగర్వంగా చిరునవ్వునవ్వుతూ అడిగాడు.

రేగిఉన్న ఆ కుర్రవాడి జుట్టును చెర్నొగొరస్కీ తన చేత్తో దువ్వుతూ "నీవు చాలా హుషారైన కుర్రాడివి. పని బాగాచేశావు. మనిషిని చూడగానే ఇట్టే పోల్చేస్తావు, నాతోరా. ఇద్దరం పట్నం వెళ్ళిపోదాం." అన్నాడు.

టిక్కెట్టూ లేకుండానా ! నాదగ్గరున్నది నలభై కోపెక్కులే."

"నీవు చాలా తమాషా అయిన కుర్రాడివి, నిన్ను నాతో రమ్మన్నాను కాని, అందుకు డబ్బుండాలన్నానా ? ఇద్దరం వెడదామన్నాను. అంతే"

"మరి డబ్బుమాట ఏమిటంటారు ?"

"ఇలా చూడు. నీవు ప్రయాణం చేయదలచుకున్నావు, ప్రయాణానికి కావలసింది రైలుబండికాని డబ్బుకాదు."

అతని మాటలు విని వాన్యా క్షణం ఆలోచించి "అవునవును అంటూ తల ఊపాడు:

అంటే ప్రయాణానికి డబ్బుండక్కర్లేదన్నమాట ! మనకావలసింది రైలుబండి అంతే" అన్నాడు ఇగోర్ చెర్నొగొరొస్కీ.

"మరి టిక్కెట్టుమాట ?"

అదివట్టి లాంచనం మాత్రమే. నీ విక్కడే ఉండు. నే నిప్పుడే వస్తాను."

ఇగోర్ చెర్నొగొరొస్కీ తనజాకెట్టులోపల జేబులోనుంచి ఒక చిన్నకాగితం తీశాడు. దాన్ని విప్పి పరిశీలించాడు. తరువాత ముందుకుచాపి పట్టుకున్నాడు;

"అంతా సవ్యంగానే ఉంది." అంటూ ఆనందంతో పోస్టాఫీసు వైపు చూపించాడు.

"ఆ పోస్టాఫీసు చాలమంచిది. అందులో డబ్బుంటుంది. అది మనకు కొంత ఇవ్వకపోదు. నీ విక్కడేఉండు. నేనిప్పుడే వస్తాను."

చెర్నొగొరొస్కీ తన జాకెట్టు బొత్తాలు సరిచేసుకొని, టోపీ సర్దుకొని పోస్టాఫీసువైపు నడుస్తూ వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న అతన్ని ఆశక్తితోనూ ఆశ్చర్యంతోనూ చూస్తూ వాన్యా అక్కడే నిలుచుండిపోయాడు.

2

మూడు సమోసాలు

స్టేషన్ కానుకుని ఉన్న తోట గుబుర్లమధ్య ఒక పాతబెంచీ ఉంది. దానిచుట్టూ చిందరవందరగా కాగితపుముక్కలు, గుడ్డపీలికలు, ప్రొద్దుతిరుగుడు గింజలు తినిపారేసిన పొట్టు పడిఉన్నాయి. ఇందాక జోళ్ళస్టాండును తన్ని వెళ్ళిపోయిన యువకుడు, వాండా స్టాండ్నిట్స్కాయా ఎక్కడనుంచో ఆ తోటలోకి వచ్చి వాలారు. బహుశా వాళ్ళు బస్తీనుంచే వచ్చి ఉండవచ్చు; లేదా రైలుదిగి వచ్చిఉండవచ్చు. ఎక్కడనుంచి అయితేనేమి, తోట గుబుర్ల వెనకాలనుంచి మాత్రం రావడం స్పష్టం. వాండా తొడుక్కున్న జోళ్ళు బాగా చినిగిపోయాయి. ఇంచుమించు జోళ్లు తొడుక్కోనట్లుగానే ఆమె పాదాలు బయటికి కనిపిస్తున్నాయి. ఆమె గౌనుకూడా పాతదే. నల్లటిజాకెట్టు వేసుకుంది. జాకెట్టురంగు వెలిసిపోయి అక్కడక్కడ మచ్చలేర్పడ్డాయి. ఆ పిల్ల అందమైనదే. కాని జీవితంలో ఒడుదుడుకులను చవిచూచినట్లు ఆమెను చూడగానే ఇట్టే తెలిసిపోతుంది. జుట్టు నాజూగ్గా ఉన్నా, దువ్వుకుని చాలాకాలమై ఉంటుంది. తలంటుకూడా ఆజుట్టు ఎరగదు. అంచాత ఆ పిల్ల జుట్టు నాజూకుగా ఉందని ఇహ ఎంతమాత్రం వర్ణించడానికి వీల్లేదు.

ఆ పిల్ల నిశ్వసిస్తూ బెంచీమీద కూలబడింది. కూలబడుతూనే నిద్రలోఉన్నట్లు సన్నని గొంతుతో చిరచిరలాడుతూ

"నీకర్మం నీవు చూచుకో! చాలుచాలు. నీసంగతి నాకు తెలిసొచ్చింది" అన్నది.

వణకివస్తున్న ఆ యువకుని మోకాలు కొంచెం బిగిసింది. కాలరు మీదికెత్తుకుంటూ గొంతు సవరించుకున్నాడు.

"నాసంగతి నీకు తెలిసొస్తే నేనిక వెళ్ళిపోవచ్చునన్నమాట. అది నీవు తేల్చుకోవలసిన విషయం'' అన్నాడు.

జేబులోనుంచి పర్సుతీసి చాలాసేపు వెదికాడు. వెదుకుతూ నాలికతో పెదిమ అద్దుకున్నాడు. పర్సులోనుంచి మూడునాణాలు తీసి ఆ పిల్ల ప్రక్కన బెంచీమీద పడేసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే వాండా బెంచీమీద చెయ్యి చేరవేసుకుని, చేతులమీద తల ఆనించుకుంది. తలపైకెత్తి తెల్లని మబ్బుల వంక, ఏదో భయంకరమైన కలకంటున్నట్లు తదేకంగా చూస్తూ నిశ్వసిస్తూకూచుంది. మళ్ళీ ఇట్టె ఇటుతిరిగి చెంపన చెయ్యిపెట్టుకుని దూరంగా ఉన్న గుబుర్ల వైపు చూపులను మళ్ళించింది. గ్రీషా రైజికోవ్ తన దగ్గరికివచ్చి కూచునేవరకూ, తాను అలా పరధ్యానంగా అంతసేపు కూచున్నాననే చైతన్యం లేకపోయింది. రైజికోవ్ అందగాడు కాదు, అనాకారి అనే చెప్పాలి. ముఖంలో ఎప్పుడూ దైన్యం తాండవిస్తూ ఉంటుంది. అతని చెక్కిలిమీదఉన్న గాటు ఇంకా పూర్తిగా మాయలేదు. తలకు టోపీలేదు. ఎర్రనిజుట్టు నున్నగా దువ్వుకున్నాడు. కొత్తపంట్లాం తొడుక్కున్నాడు. కాని చొక్కా మాత్రం పాతది. దానికితోడు వదులు. తన కాలిజోళ్ళను తానే చూసి మురిసిపోతున్నట్లు ఠీవిగా రెండుకాళ్లను ముందుకుచాపి చతికిల పడ్డాడు.

రైజికోవ్ ఆ పిల్లవంక తిరిగి "తినడానికేమైనా ఉందా?" అని అడిగాడు.

వాండా ఏమీ చలించకుండా

"నన్ను ఒంటరిగా ఇలా ఉండనివ్వు" అన్నది.

ఆవిడ జవాబుకు అతను కోపం తెచ్చుకున్నట్లు లేదు కాని, మారుమాటాడలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా మౌనంగా కొంతసేపు అలాగే ఉండిపోయారు. దాచినకాళ్లు తిమ్మిరెక్కి రైజికోవ్ గిరుక్కున తిరిగాడు. మూడునాణాలు క్రిందపడ్డాయి. ఒకటి ఇరవై కోపెక్కులది, అయిదు కోపెక్కులవి రెండు, రైజికోవ్ నిమ్మళంగా వాటిని తీసుకుని అరిచేతిలో పెట్టుకున్నాడు:

“ఇవి నీవా?”

ఇలాఅంటూ అరిచేతిలో నాణాలు గలగల్లాడించాడు.

“మూడుసమోసా ముక్కలొస్తాయి.” అన్నాడు నీరసంగా.

ఇలాఅంటూనే ఆనాణాలను మీదికిఎగరేస్తూ స్టేషన్ వైపుకు దారితీశాడు

3

జాలిగల అవ్వ

చెర్నొగొరొస్కీ చరచరా పోస్టాఫీసులోకి వెళ్ళి ఒకమాటు చుట్టూ కలయచూచాడు. గదులు చాలాచిన్నవి. గదులమధ్య పొర చెక్కలతో అరగోడలున్నాయి. ప్రతి అరగోడకూ రెండేసి కిటికీలున్నాయి.ఒకకిటికీముందు పెద్ద 'క్యూ'ఒకటి ఏర్పడిఉంది. రెండో కిటికీ ముందు ముగ్గురు వ్యక్తులు మాత్రమే నిరీక్షిస్తూ నిలుచున్నారు. ఆ కిటికీకి ఒక సైనుబోర్డు వ్రేలాడుతోంది: రిజిస్టర్డుమెయిల్. పోస్టల్ ఆర్డర్ల స్వీకారము, విడుదల.

ఇగోర్ చెర్నొగొరొస్కీ గబగబా కిటికీదగ్గరికి వెళ్ళి ఒక వృద్ధురాలి వెనకాలే నిలుచున్నాడు. ఆమె లావుపాటి మనిషి. నడుము వంగిపోయుంది. అతను ఆత్రుతగా వృద్ధురాలిని కొంచెం

తప్పించుకు కిటికీవంక చూశాడు. లోపల "ఒక యువతి" కూర్చుని ఉన్నట్లు అతనికి తోచింది. కాని అంతలోనే ఆ కూర్చున్నది యువతి కాదనీ, పాలిపోయిఉన్న నల్లకళ్ళజోడుపెట్టుకున్న స్త్రీ యనీ గ్రహించుకోగలిగాడు. తన జేబులోనుంచి కాగితాలు తీయగానే ఆమె వాటిని చూస్తుందని మొదట భ్రమపడ్డాడు. కాని ఆమె అలా చూశ్ళేదు సరికదా, ఏ విధమైన ఆసక్తీ కనపరచలేదు: ఆమెను గురించి అతను ఆలోచిస్తూ ఉండగానే 'క్యూ'లో అతనిముందు నిలుచున్న వృద్ధురాలు తనపని తాను ముగించుకుని మెరుపులాగా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోవడంకూడా చెర్నొగొరొస్కీ గమనించలేదు.

"మీకేంకావాలి?" అనే ప్రశ్న చెవినపడేసరికి అతను ఉలిక్కిపడ్డాడు. కిటికీ లోపలఉన్న స్త్రీ అలా ప్రశ్నిస్తూ అతనివంక తీక్షణంగా చూచింది.

"నా పేరున ఒక పోస్టల్ ఆర్డర్ వచ్చిఉండాలి... రెస్టాంటే పోస్టాఫీసునుంచి... చూడండి, ఇగోర్ చెర్నియూవిన్ పేరున ఏమైనా వచ్చిందేమో?"

ఆవిడ పెట్టెమీద దొంతర్లుగా పడిఉన్న మనియార్డర్లను చేతివ్రేళ్ళతో కదిలించడం మొదలుపెట్టింది. అందులో నుంచి ఒకటి తీసి చూసింది.

"ఇదేనా మీది?

"అవును, అదే."

మీపేరు చెర్నియూవిన్ కదూ?"

అది చూడగానే అతను సంతోషంతో పొంగిపోయాడు:

"సరిగ్గా తూచి చెప్పాలంటే అదే నా పేరు."

అది విని ఆవిడ అతనివంక కోపంగా తేరిపారచూచింది: అవును! ఏం డొంకతిరుగుడు సమాధానం! 'సరిగ్గా తూచిచెప్పడమా!' మీరు చెర్నియూవిన్ అవునా కాదా?"

"ఆ. చెప్పాయ [illegible] [illegible] [illegible] [illegible] దేనికి ?"

అయితే మీ కాగితాలు ఇలా చూపించండి."

చెర్నొగొరొస్కీ వెనక్కు తిరిగి జేబులో చెయ్యిపెట్టుకున్నాడు. తలుపువంక ఓరగా చూచాడు. తలుపు తెరిచిఉంది. అవతల ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ఆకాశంలో ఎక్కడా మబ్బులేవు. ప్రశాంతంగా, గంభీరంగా, స్వేచ్ఛగా, కాంతివంతంగా ఉంది. చెర్నొగొరొస్కీ జేబులోనుంచికాగితాలుతీసి ఆవిడకు అందించాడు. ఆవిడ వాటిని తీసుకుని జాగ్రత్తగా చదివి వెనక్కు త్రిప్పి చూచి మళ్ళీ అతనివైపు దృష్టిని మళ్ళించింది.

మీరు ఆఫీసుపనిమీద జిల్లా సమాచార కార్యాలయానికి వెడుతున్నట్లు దీనిలో వ్రాసిఉందే, అలాంటప్పుడు ఇక్కడెందుకు డబ్బుతీసుకోవడం ?" అని అడిగిందావిడ.

"నేను...నిజంచెప్పాలంటే...ఈఊరిమీదిగా వెడుతున్నాను"

"నిజం చెప్పాలంటేనా! మీ కెంత వయస్సు ?

"పద్దెనిమిది."

"అంతేనని నన్ను నమ్మమంటారా ?"

"బాగుంది. అంత చిన్నవాణ్ణిగా కనిపించడం నా తప్పా ?" అని అతను జంకుతూ జవాబిచ్చాడు.

"ఏమో! ఈ విషయం నేను పోస్టుమాస్టరుతో మాట్లాడాలి..."

ఆవిడ లోపలికివెళ్ళిమూలనున్న తలుపు తెరిచింది. చెర్నొగొరొస్కీముందు నిలబడిఉన్న మనుష్యులు గుసగుసలాడడం ప్రారంభించారు. ఆవిడ తెరిచిన తలుపువైపు ఆతృతతో చూడసాగారు.

చెర్నొగొరొస్కీ ఒక్కమాటు చుట్టూ కలయచూచాడు. 'క్యూ'లో నిలుచున్నవారిలో చాలమంది ఆడవాళ్ళు. ఒకతను

బాగా వృద్ధుడు. ఇంకొకతను కార్మికుడు. అతనికళ్ళు నిద్రమత్తుగా ఉన్నాయి. చెర్నొగొరోస్కీ ముందు బల్లమీద మోచేతులానించి పరధ్యానంగా ఉన్నట్లు ఒక భంగిమ పెట్టాడు.

"చెర్నియావిన్! ఏమిటి మీ చిరునామా!"

అదివిని అతను ఏమాత్రం చలించకుండా ముందు బల్లమీద నుంచి చేతులు తీయకుండా తలప్రక్కకు తిప్పాడు. ఎదురుగా పోస్టు మాస్టరు ప్రత్యక్షమయ్యాడు. అతనిగడ్డం మాసిఉంది. అతనుకూడా తనపట్ల మిత్రభావంతో లేనట్లు చెర్నొగొరోస్కీ పోల్చుకున్నాడు.

"ఏమిటంటున్నారు!"

"మీరెక్కడ ఉంటున్నారు? ఏఊళ్లో!"

"స్టారో సెలస్కీలో ఉంటున్నాను."

"అక్కడ ఉంటుంటే డబ్బు ఈ అడ్రెస్సుకెందుకు వచ్చింది!"

"ఆ విషయం మీకనవసరం."

"ఆ విషయం నాకనవసరమా? అంటే ఏమిటి మీఉద్దేశం!"

"నాఉద్దేశం ఏమిటా? ఇక్కడికి నాకు డబ్బెందుకొచ్చిందో మీకు నిమిత్తంలేదని."

"అలా అయితే నేను మీకు డబ్బు బట్వాడా చెయ్యను."

సొమ్ము బట్వాడా చెయ్యనని ఖండితంగా పోస్టుమాస్టరు చెప్పాడేకాని, అతని చేతులు వణకసాగాయి. వణుకుతోన్న కాగితాన్ని అలాగే పట్టుకుని అతనివంక పరిశీలనగా చూచాడు.

"అయితే సరే. కంప్లయింట్ పుస్తకం ఇలా ఒకసారివ్వండి."

చెర్నొగొరోస్కీ లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ అతన్ని అడిగాడు. పోస్టుమాస్టరు తన బవిరిగడ్డాన్ని తడుముకుంటూ ఆలోచించసాగాడు.

"కంప్లయింట్ పుస్తకమా! అందులో ఏమిటి వ్రాద్దామని"

"ఏం వ్రాస్తానో చూద్దువుగాని. నాడబ్బు నాకు బట్వాడా చెయ్యడానికి బదులు, అర్థం పర్థంలేని మూర్ఖపుప్రశ్నలు అడిగారని వ్రాస్తాను..."

"కొంచెం నిదానించండి. ఇలాచూడు!" అంటూ పోస్టు మాస్టరు బిగ్గరగా అరిచాడు.

దాంతో చెర్నొగొరొస్కీ కూడా గట్టిగా అరవడం మొదలు పెట్టాడు:

"ఏమిటి చూసేది? అవును. మీరడిగినవన్నీ అర్థంలేనిప్రశ్నలు. ఇక్కడికి నాకు డబ్బెందుకొచ్చిందా? ఎందుకొచ్చిందో మీకెందుకా ప్రశ్న? ఆడబ్బునాది, నాకొచ్చింది. నేనుచస్తే తగలెయ్యడానికి డబ్బు పంపారు! లేకపోతే నాపెళ్ళికి పంపిస్తుంటారు. ఎందుకు పంపారో నేను మీకు విడమర్చిచెప్పాలా? డబ్బిస్తే ఇవ్వండి, లేదా కంప్లయింట్ పుస్తకం ఇలా పారెయ్యండి."

'క్యూ'లో నిలుచున్న మనుష్యులు కొందరు విరగబడి నవ్వసాగారు. నవ్వులు విని చెర్నొగొరొస్కీ వెనక్కు తిరిగాడు. 'క్యూ' లో నిలుచున్నవారు తనపక్షమే ఉన్నారని అనుకున్నాడు. ఈఘర్షణ చూచి ఒక వృద్ధురాలు ఇలా అంది:

"వాళ్ళెప్పుడూ ఇంతే! ఆ డబ్బేదో ఆ అబ్బాయికిచ్చేయక ఎందుకలా బాధపెడతారు? డబ్బు అతని తల్లిదండ్రులు పంపించారేమో."

పోస్టుమాస్టరు తన చేతిలోఉన్న కాగితం మరోసారి చదువుకున్నాడు.

"ఎందుకీజనం అక్కడ ఆగిపోయారు? త్వరత్వరగా కదలండి." అంటూ క్యూలోనుంచి ఒక కేక వినిపించింది.

పోస్టుమాస్టరు తన్ను తాను సంబాళించుకున్నాడు కాని, కొంచెం బెదిరిస్తున్న ధోరణిలోనే ఇలా అన్నాడు:

"సరే, సరే. అలాగే నీసొమ్ము బట్వాడా చేస్తాను. కాని నిన్ను గురించి స్టారోసెలస్క్‌లో దర్యాప్తు చేయిస్తాను."

"ఓ! మీరలాచేయాలనే నా అభిమతం."

"అతనికి సొమ్ము బట్వాడా చెయ్యండి" అని పోస్టుమాస్టరు ఆజ్ఞాపించాడు.

పోస్టుమాస్టరలా ఆజ్ఞాపించగానే ఇగోర్ చెర్నియావిన్ లోపలవరండాలోకి వెళ్లి ఒక చేత్తో డబ్బందుకున్నాడు. ఇంకొక చేత్తో స్టారోసెలస్క్ పత్రాలు పట్టుకున్నాడు. అతని పెదవులపై చిరునవ్వు చిందింది.

"వాళ్ళ తల్లిదండ్రులు అతనికి డబ్బు పంపించారుకాబోలు..."

ఎవరో అన్న ఈ మాట విని అతను ఆనందంతో ఉప్పొంగి పోయాడు. చౌకువైపు దృష్టి మళ్ళించాడు. అక్కడ ఆకాశంలో తళ తళలాడే చినచిన్న మబ్బుతునకలు కదిలాడుతున్నాయి. స్టేషన్ ముందర ఉన్న తోటలో గుబుర్లు గాలికి అల్లల్లాడుతున్నాయి. తోటంతా పచ్చని ముసుగుతో ఆచ్ఛాదితమైనట్లు మనోహరంగా అగుపిస్తోంది. స్టేషనుగోడకు చేరగిలబడి రైతులు రైలుకోసం ఎదురు చూస్తున్నారు. అక్కడికి దూరంగా వాన్యా తన జోళ్ళ స్టాండు ప్రక్కకూచుని ఇగోర్ చెర్నియావిన్ కోసం నిరీక్షిస్తున్నాడు. ఇగోర్ ఒక తెల్లనినోటు మడతబెట్టి జాకెట్టు జేబులో పెట్టుకున్నాడు. మిగి లిన డబ్బు జాగ్రత్తగా లోపలజేబులో దాచుకున్నాడు. తరువాత వాన్యాదగ్గరికి వచ్చాడు.

"అభినందనాలు శ్రామికుడా"

జేబులోనుంచి తెల్లనినోటు తీసి మడతవిప్పి బయటికి చూపిస్తూ గంభీరంగా ఇలా అన్నాడు.

"ఇది నీకోసమేనోయి కుర్రాడా. తగిన సమయంలో నాకు సహాయంచేసావుకదూ మరి."

అనోటుచూడగానే, అతని మాటలు వినగానే వాన్యా ఒక్క మాటుగా తీగెలాసాగి నిలుచున్నాడు. ఆ కుర్రవాడి కళ్లలో విశ్రాంతిమెరుపులా మెరిసింది. ఎంతో ఆశతో నెమ్మదిగా ఆ నోటును చేతపుచ్చుకున్నాడు.

ఇగోర్ ఆ కుర్రవాణ్ని నవ్వుతూ పరిశీలించసాగాడు. ఇగోర్ చేతిలో మొదట కనిపించగానే దానివంక వాన్యా ఆప్యాయంగా, గంభీరంగా చూచాడు. కాని కొద్దినిమిషాలలో అతని ముఖంలోని భావం మారిపోయింది ఆశాభావం పోయి, అది తనకు దక్కదనే అపనమ్మకం పుట్టింది. ఎలాగైతేనేం చిట్టచివరకు ఇగోర్ భావాన్ని తాను అర్థం చేసుకున్నట్లు అటు తిరిగాడు.

"ఇప్పుడు మనం ఎక్కడున్నాం?" అని వాన్యా ప్రశ్నించాడు.?

"ఇప్పుడు నీకేం కావాలంటే అది కొనుక్కోవచ్చు. నీఇష్టం వచ్చిన పాలిష్—సింధూరపురంగు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు పచ్చ—నీఇష్టం..."

సంతోషం పట్టలేక వాన్యా పకపక నవ్వాడు.

"ఆకుపచ్చా? అది కొనుక్కొని ఏమిటి చెయ్యడం?" అని అడిగాడు.

"ఏమిటి చెయ్యడమో చెప్తాను. మాటవరసకి ఒక ముసలి నీదగ్గరి కొచ్చిందనుకో."

"ముసలా?" అంటూ ఉత్సాహంతో వాన్యా ఇలా అన్నాడు: "అవును. అది నాదగ్గరికొచ్చి ఇలా అడుగుతుందను కుందాం: 'అబ్బాయీ! నీదగ్గర ఆకుపచ్చ పాలిష్ ఉందా?"

"అలా ఆ ముసలి నిన్ను అడుగుతుందనుకో. అప్పుడు నీవు ఇలా జవాబుచెప్పు: 'ఉందండీ ముసలిగారూ, ఉంది..."

"నాకిది చాలా విచిత్రంగా ఉంది. ఇంతకుముందు మీదగ్గర డబ్బేమీ లేదు. క్షణంలో అంతడబ్బు ఎలావచ్చింది? వింతగా ఉందే!"

వాన్యా అతనివంక అలాగే చూస్తూ ప్రశ్నించాడు. ఆ కుర్రవాడి కళ్లల్లో ఆలోచనలు, వాటితోపాటు ఆనందం కనిపించాయి.

"నీవు చాలా తమాషాఅయిన కుర్రాడివి. జరిగేవన్నీ ఇలాగే జరుగుతాయి. ఇందులో ఏముంది? ఓ నిముషంలో నీవు ఇట్టే క్రుంగిపోతావు. మరో నిముషంలో అట్టే ఆనందంతో పొంగిపోతావు. ఇప్పుడు నీ సంగతే ఒక్కసారి నీవు ఆలోచించుకో. బయలుదేరేటప్పుడు నీదగ్గర ఏమీలేదు. ఇప్పుడో పదిరూబుళ్లున్నాయి."

"మీకు జీతాలందాయికాబోలు."

"లేదు. నాకిబ్బందిగా ఉందని మా నాయనమ్మ పంపించింది. ఎంతో తెలుసా? వందరూబుళ్ళు!"

"అమ్మో! వందరూబుళ్లే!"

ఇగోర్ బిగ్గరగా నవ్వసాగాడు. వాన్యాకుకూడ నవ్వు ఆగింది కాదు. ఇప్పుడు వాన్యా మెదడులో అసలుప్రశ్న బయలుదేరింది.

"మీ నాయనమ్మ వందరూబుళ్లు ఎలా పంపగలుగుతుంది? ఆవిడ వృద్ధురాలు. పనిపాటు చేయలేని మనిషి; మీ నాయనమ్మ కాదు. మీ తాతగారు పంపించి ఉంటారు."

"అయితే సరే. మా తాతే పంపించాడు. అదేమిటో తరువాత చెప్తాను. మన బంధువులనుగురించి ఇంకోసమాటు మాట్లాడుకుందాం. పద, లండన్ నగరానికి ఎలావెళ్ళాలో పుస్తకం కొనుక్కుని చూద్దాం."

ఇగోర్ ఇలా అనడంతోనే వాన్యా మరిప్రశ్నించడం మానుకున్నాడు. ఇప్పుడిహ అతనికి ఏ ఆశ్చర్యమూ లేదు. పెదవులు బిగించి వ్యవహారస్థుడిలాగా పదిరూబుళ్ళ నోటు మడతపెట్టి తన

జేబులో దాచుకున్నాడు. రెండు కాళ్ళూ ఎడంగా పెట్టి దర్జాగా నిలుచున్నాడు. అతను తొడుక్కున్న పంట్లాం పొట్టిది. బూట్లు బాగు న్నాయి. అలా కాసేపు నిలుచుని ఆలోచనా పూర్వకంగా చేతులు ముడుచుకున్నాడు. క్రిందఉన్న తన జోళ్ళస్టాండువంక చూచాడు. హఠాత్తుగా క్రిందగొంతుకపడి కూచుని బ్రష్‌లను, డబ్బాలను స్టాండులో సర్దుకున్నాడు. తరువాత మూతవేసి స్టాండు బెల్టు పట్టుకున్నాడు.

4

రైజికోవ్ సాహసయాత్ర

సమోసాముక్కలు వేడివేడిగా పసందుగా ఉన్నాయి. మాంసం పరిమళం చవులూరిస్తోంది. ముక్కలంతా తినక్కర్లేదు. కొంచెం కొరికితే చాలు, కడుపునిండేటట్టుంది. మనస్సు తీరేటట్టుంది.

వాటిని చూడగానే రైజికోవ్ నీరసమంతాపోయింది. ముఖంలో కళ వచ్చింది. కళ్ళల్లో వెలుగు కనిపించింది. బాణాలవంటి చూపులతో చుట్టూచూచాడు.

బుకింగ్ ఆఫీసుముందు ప్రయాణీకులు వరసగా నిలుచున్నారు. కిటికీ తలుపు వేసిఉంది; కిటికీముందు ఆట్టేమంది లేరు. ఇరవై మంది మనుష్యులు.

రైజికోవ్ ఆ 'క్యూ'వంక తేరిపారచూచాడు. ఇరవై మంది ఉన్న 'క్యూ' అతనికి ప్రమాదకరంగా కనిపించింది. వరసలోఉన్న మనుష్యులు పేదజనం, అమాయకులు, నమ్రతాస్వభావులు. వాళ్ళల్లోకల్లా ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోదగిన ఒకవ్యక్తి అతనికి కనిపించాడు. అతను అంతపొడుగూ కాదు, పొట్టీకాదు. చలికాలంలో వేసుకునే పొట్టికోటు వేసుకున్నాడు. కోటుకాలర్, జేబుల అంచులు

గొర్రెచర్మంతో కుట్టించుకున్నాడు. అతని వెనకాల ఒకావిడ విసుగ్గా చూస్తూ నిలుచునిఉంది. ఆవిడ చాలా సన్నటిమనిషి. అక్కడ ఆట్టేసేపు నిలుచోకుండా వెంటనే పని ముగించుకుని వెళ్ళిపోవడమే ఆవిడకు ఆనందం. ఆవిడ తరువాత వరసగ్గా చాలామంది ఆడవాళ్ళు నిలుచున్నారు. వాళ్ళు సాధారణమనుష్యులు. దుస్తులు మామూలుగా ఉన్నాయి. అందులో ఒక అమ్మాయి చక్కటి నల్లనిదుస్తులు వేసుకుంది. గుప్పెటతో డబ్బుపట్టుకుంది.

తన పనిని జయప్రదంగా నిర్వహించడానికి స్టేషన్‌లు, క్యూలు అనువైన ప్రదేశాలుకావని రైజికోవ్ తెలుసుకున్నాడు. ఇక్కడి మనుష్యులు వెయ్యికళ్ళతో ఉంటారు. వాళ్ళదగ్గరఉన్న ఆ కొద్దిపాటి డబ్బునూ పిడికిళ్ళలో గట్టిగా పట్టుకుంటారు. ముందు వెడితేనే కాని టిక్కెట్లు దొరకవనే భయంలేదు. అందుకోసం ఏలాంటి తొందరా పడక్కర్లేదు. కనుక ప్రయాణీకులు టిక్కెట్లకోసం ఆతురతపడక, ఆ నిలుచున్నకాసేపూ తమ డబ్బుపోకుండా జాగ్రత్తపడుతుంటారు.

ఇలాంటి చిన్నఊళ్ళోకంటె పెద్దపెద్ద బస్తీలలోఉన్న రైల్వే స్టేషన్లు తనపనికి ఎంతో అనుకూలంగా ఉంటాయని రైజికోవ్ తలపోయసాగాడు. కాని అంతలోనే అతనికొక విషయం జ్ఞాపకం వచ్చింది. దానికి ఉండే సాధకబాధకాలు దానికే ఉన్నాయి. అక్కడ రక్షకపటాలం, గస్తీవాళ్ళు; ఇంకా బోలెడు ఆటంకాలు. ఎంతరహస్యంగా కన్నుమరిపించి పనిచేసుక పోదామన్నా రైజికోవ్ వంటి మనుష్యుల మనోరహస్యాలు వాళ్ళకు అవలీలగా తెలిసిపోతాయి. ఘరానా ప్రయాణీకుడిగా ఎంత నటించినా, పెద్ద వ్యవహార్తలా ఎన్ని భంగిమలు పెట్టినా — వాళ్ళు తనలాంటి మనుష్యులను పత్రాలు చూపించమని అడగనైనా అడగరు. చూసీ చూడగానే "రా రా బాబూ, మాతోరా" అంటారు.

పెద్ద పెద్ద స్టేషన్లలో ఏ తరహా ప్రయాణీకులుంటారో రైజికోవ్ ఊహించసాగాడు. వీళ్ళకూ వాళ్ళకూ చాలా భేదం వుంది. అక్కడికీ ఇక్కడికీ వ్యత్యాసం హస్తిమశకాంతరం. అక్కడ గుంపులు

గుంపులు జనం, ఆనందం, ఉత్సాహం, ఉద్వేగం, ఉద్రేకం, అసలు సిసలు జీవితం. ఒక బుక్కింగ్ ఆఫీసునుంచి ఇంకొక బుక్కింగాఫీసుకు రోజల్లా తిరగొచ్చు. స్టేషన్‌లో కనిపించే కూలీలను, తోటి ప్రయాణీకులను శరపరంపరగా ప్రశ్నలు వెయ్యొచ్చు. ఎంక్వయిరీ ఆఫీసు దగ్గర ఎంతసేపయినా వేచిఉండొచ్చు. ఏమీ ఫరవాలేదు. స్టేషన్‌లో రాత్రల్లా కూచోవచ్చు. రాత్రి స్టేషన్‌లో వళ్ళుమరిచి పడుకున్న అమాయక ప్రయాణీకుల జేబులు ఇట్టే కత్తిరించొచ్చు. జేబులే కాదు. వాళ్ళకు తెలీకుండా వాళ్ళ ఆత్మలనే అపహరించొచ్చు. వాళ్ళలా గుర్రుపెట్టి నిద్దర్లుపోతునే ఉంటారు. అయితే అందరు ప్రయాణీకులూ ఇలాఉండరు. కొందరు తెలివిమీరిన ప్రయాణీకుల తరహావేరు. వాళ్ళసలు నిద్దరపొమ్మన్నా పోరు. ఏదో ఆలోచించుకుంటూ, ఏవో కలలుకంటూ అలా తిరుగుతూనే ఉంటారు...... పెద్దస్టేషన్‌లో ఉన్న మజాఅల్లా ఒక్కటే. అక్కడికొచ్చేవాళ్ళు దూరపుప్రయాణీకులు. అందువల్ల వాళ్ళజేబులు నోట్లతో ఉబ్బి ఉంటాయి. రూబుళ్ళతో గలగల్లాడుతుంటాయి. నల్లనివి, గోధుమ రంగువి - రకరకాల నోట్లు, చిన్నవి, పెద్దవి– ఎన్నెన్నో నాణాలు.

చేత్తో టిక్కెట్టు అందుకుని బుక్కింగాఫీసునుంచి బయటపడే మానవుడికన్నా అదృష్టవంతులింకెవరున్నారు?

ఎంతోసేపు 'క్యూ' లో నిలుచుని, తోటిప్రయాణీకులతో పాటు నలిగిపోతూ అటూఇటూ తోసుకుని, టిక్కెట్టుదొరకదేమో అని తొందరపడుతూ, ఆ ఉన్నకాసేపూ తోటి ప్రయాణీకులుచెప్పే కథలూ గాథలూ రకరకాలకబుర్లూ వింటూ, చిట్టచివరకు టిక్కెట్టుతో అతను ఇవతలపడతాడు. మహదానందంతో జనంలోనుంచి, గుంపుల మధ్యనుంచి నడచిపోతూ, వెయిటింగ్‌రూందాకా వెళ్ళి చేతిలోఉన్న టిక్కెట్టును చూచుకుని ఒక్కక్షణంపాటు అన్నీమరచిపోయి పరవశుడవుతాడు......కేచులా హఠాత్తుగా రైజకోవ్ 'క్యూ' వంక చూచాడు. 'క్యూ'లో ఒకావిడ నిలుచునిఉంది. ఆవిడ వెనకాల పాతజాకెట్టు వేసుకుని ఒకతను నిలుచున్నాడు. అతనిబూట్లు

చాలామంచిది. మెడచుట్టూ ఆకుపచ్చని మఫ్లర్ చుట్టుకున్నాడు. పంట్లాం వెనక జేబు ఎత్తుగా ఉంది. చతురస్రంగా జేబులో ఉన్న ఆ ఆకారాన్ని చూసేసరికి రైజికోవ్ మరి ఉండలేకపోయాడు.

గబగబా 'క్యూ' లోకి వెళ్ళి అతని వెనకాల పొందికగా ఒడుపువేసి నిలుచున్నాడు. అటూఇటూ గోడలమీద ఉన్న ప్రకటనలను చూస్తున్నట్లు నటిస్తూ తనముందున్న మనిషిని పరిశీలించాడు. అతని జాకెట్టును పరీక్షించాడు. ప్రకటనను చూస్తున్నట్టు అభినయిస్తూ జాకెట్టు ప్రక్కకు ఒత్తిగిలాడు. కనురెప్పపాటులో రెండే రెండు వేళ్ళు అతని జేబులోకి పోనిచ్చి లోపలున్న సంచీని చటుక్కున లాగేశాడు. సంచి చడీచప్పుడూ లేకుండా అతనిచేతికిచిక్కింది. కనురెప్పపాటులో...ఒక బలమైన చెయ్యి అతనిచేతిని ఠకీమని పట్టుకుంది. కళ్ళముందు భయకంపితమైన ఒకముఖం కనిపించింది.

"భడవా ! ఏమిటీ పని ?..."

రైజికోవ్ తన చేతిని గుంజుకున్నాడు. కాని పట్టువిడిపోలేదు. ఇంకా చేతిని వెనక్కులాక్కుంటూనే గంభీరంగా తగు మనిషిలాగా కోపగించుకుంటూ అతన్ని గద్దించాడు.

"చెయ్యి పట్టుకలాగుతావేం ? నీవు చేస్తున్న పని ఏమిటో నీకు తెలుసునా ? చెయ్యి వదిలిపెట్టు. నీపని నీవు చూసుకో."

"నా చెయ్యిమాటకేం, ముందు నీ చెయ్యి ఏం చేసిందో చెప్పు ?

"పద, ముందుకు – ఆ తరువాత చెప్తాను."

"వదలను చెపుతావా చెప్పవా ?"

ఉన్నట్టుండి రైజికోవ్ ఒక్కసారి అతన్ని ముందుకుతోసి తన చెయ్యి విడిపించుకున్నాడు. చరచర ఇవతలికొచ్చి గేటులోనుంచి ప్లాట్‌ఫారంమీదికి దాటేశాడు. పరుగుతీస్తూ ప్లాట్‌ఫారం దాటి రైలుబద్దీల దగ్గరికి చేరుకున్నాడు. బద్దీలమీదనున్న గూడ్సు బండి అడుగునుంచి అవతలికి వెళ్ళిపోయాడు. అక్కణ్ణుంచి ఒక్కొక్క

పెట్టె క్రిందనుంచే దూరి రైళ్ళను దాటాడు. క్రిందకూచొని చుట్టూ కలయజూచాడు. ప్లాట్‌ఫారంమీద చాలమంది ప్రయాణీకులు అటూ-ఇటూ పచార్లు చేస్తున్నారు. వాళ్ళ తలలు, బుజాలు, అతనికి అగుపించడంలేదు కాని, వాళ్ళకు తొడుక్కున్న బూట్లుమాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. బూట్లమీద జీరాడుతున్న కోటుఅంచులు, బొత్తాలు, కళ్ళముందు కదులుతున్నాయి అతనికి అక్కడనుంచి ఒక కేక వినిపించింది.

"దొంగముండాకొడుకు ? పట్టపగలే చూస్తుండగానే... బందిపోటు."

ఒక పొడుగాటి గోధుమరంగు కోటు మిలమిల లాడింది. రంగుతో తళతళ మెరుస్తున్న బూట్లు ప్లాట్‌ఫారంమీదనుంచి అతని వైపుకేనడిచి వస్తున్నాయి. అది కనిపెట్టి రైజికోవ్ చటాలున లేచి, గూడ్సుబండ్లచాటునుంచి పరుగుపుచ్చుకుని కనుచూపుదూరానికి వెళ్ళిపోయాడు. అతనికి తన నిలువునా క్రుంగిపోయినట్లనిపించింది. అయితే ఈ మానసిక ఆందోళనలో ఇంతసేపూ వేసిన ఆకలిమాత్రం చచ్చిపోయింది.

5

తోటలో విందు

ఇగోర్ ఒకచేత్తో 'రెండు ఫ్రెంచి రొట్టెలు' మరోచేత్తో మాంసపు పొట్లం, జామ్‌డబ్బా పట్టుకున్నాడు. అతను, వాన్యా ఇంకా స్టేషన్ లోనే ఉన్నారు. తినుబడిపదార్థాలు వాన్యాకు చూపిస్తూ ఇలా అన్నాడు:

"ఇక్కడంతా రొంతే. రైల్వేస్టేషన్‌లో పురుగులు, సూక్ష్మ జీవులు ఎక్కువ. ఆ తోటలోకిపోయి బెంచీమీద కూచుని హాయిగా వీటిని తిందాం. అక్కడ బెంచీ చాలా బాగుంది."

కాని వాళ్ళిద్దరూ తీరా తోటలోకి వెళ్ళేసరికి చాలాబాగా ఉన్న బెంచీమీద వాండాస్టాడ్నిట్స్కాయా కూచునిఉంది. బెంచీకి మోచేతులానించుకుని తల వాల్చుకుంది.

ఆ పిల్లను చూచి ఇగోర్ "ఒహో! ఆ పిల్ల బెంచీ ఆక్రమించుకున్నదే!" అన్నాడు.

బెంచీమీదకూచుని పగటికలలుకంటున్న ఆ అమ్మాయి చేరువననే అటూ ఇటూ తిరిగాడు. మొదట ఆమె తొడుక్కున్న చింకిజోళ్ళుచూచి అనుమానంగా పరిశీలించాడు. కాని, ఆమె చూపులు తన చూపులతో కలిసినప్పుడు కొంచెం సర్దుకున్నాడు. గంభీరంగా మూతి బిగించి ఆమెతో ఇలా అన్నాడు:

"నీవా ఎదురుగుండా మేము ఫలహారం చేస్తే మీకేం అభ్యంతరం లేదుకదా ?"

అతను తన ఎదుట మర్యాదగా నిలుచుని ఇలా అడిగేసరికి ఆ పిల్లకు అతనిపట్ల అనుకూలభావం కలిగింది. బొత్తాలు పెట్టుకున్న అతని కోటు, పాలిష్ చేసుకున్న బూట్లు, చూచేసరికి ఆమెకు ఫరవా లేదనిపించింది. నిరాశామయపరిస్థితులలో ఉన్నప్పటికి ఆమె ఒక విధమైన కళ తెచ్చుకుని వయ్యారంగా వెడ వెడ నవ్వింది.

"అబ్బే, నాకేం అభ్యంతరంలేదు" అన్నది.

"మీ దయ" అనేమాట అప్రయత్నంగా ఇగోర్ నోట వెంట వెలువడింది.

వాండా ఆ కుర్రవాళ్ళవంక ఆశ్చర్యంతో చూచి బెంచి కొసకు జరిగింది. ఇంతసేపూ తాను చూస్తున్న మబ్బులు ఆ పిల్లకి ఆసక్తి కలిగించలేకపోయాయి. ఇప్పుడామె అత్యంత సామాన్యమైన స్టేషన్‌చౌకు దృశ్యాలను చూస్తూ కూచుంది. ఇగోర్ గబుక్కున చేతిలోని తినుపదార్థాలు బెంచీమీదపెట్టి తనూ కూచున్నాడు. వాన్యా తన జోళ్ళస్టాండును క్రిందపెట్టి దానిమీద చతికిలబడ్డాడు. ఆ బెంచీకంటే అతని స్టాండు ఎత్తుగా ఉంది. బెంచీమీద బుజాలు

ఆనించుకుని వాన్యా ఫలహారంకోసం ఆత్రుతగా నిరీక్షించసాగాడు. ఇగోర్ మాంసపుకూరను కొంత విడిగాతీసి అతనిముందు పెట్టాడు.

"ఈ జామ్ మనం ఎలా తింటాం వాన్యా? వ్రేళ్లతోటే తీసుకోవాలి" అన్నాడు.

"అక్కర్లేదు. ఏదోలాగ చెంచాలు మనమే తయారుచేసుకుందాం" అంటూ వాన్యా తోటచుట్టూ ఒకమారు కలయచూచాడు. "ఏదో కర్రముక్క పట్టుకొచ్చి చాకుతో చెంచాలు చెక్కుకుందాం" అన్నాడు.

ఇగోర్ ఆ పిల్లవంక తిరిగి "మీ దగ్గర చెంచా ఉందా? అని అడిగాడు. అతని కంఠధ్వనిలో తానెంతో అధికుణ్ణనేభావంస్ఫురించింది. అతని ప్రశ్న వినగానే ఆవిడకళ్లు ఆనందంతో జ్వలించాయి. ఆవిడ దగ్గర చెంచాలవంటివి ఏమీలేవని చూడగానే తెలుసుకోవచ్చు. ఇగోర్ బెంచీమీద పెట్టిన మాంసంకూర కమ్మనివాసన వేస్తోంది. ఆమెకు నోరూరింది. కాని ఏంలాభం? గుటకలుమాత్రం మ్రింగుతూ తనను అలా అడిగినందుకు నొచ్చుకుంది.

"ఏమిటడుగుతున్నారు? చెంచాలా?" అన్నది.

"అవును. వెండివి" అంటూ ఇగోర్ చనువుగా బదులు చెప్పాడు.

వాండా ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ బెంచీమీద మోచేతులానించుకుని ముఖంపైకెత్తి మబ్బులను చూడసాగింది. ఇప్పుడాపిల్ల కళ్ళల్లో దుఃఖంలేదు; నిరాశలేదు, ధ్యానంలేదు.

వాన్యాచేతిలో సగం రొట్టెముక్క ఉంది. ముఖమంతా ముడతలు చేసుకుని రొట్టెముక్క జామ్‌లో నంజుకుని తినడం మొదలుపెట్టాడు. అలాతింటూనే ఆమె ముఖంవంక చూస్తున్నాడు. ఆమె కాలిగోళ్ళుగాని, చింపిరిజుట్టుకాని గమనించలేదు. ఆమె లేత గులాబీలవంటి చెక్కిళ్ళు, కనుకొలకులు, నల్లగా వంపులుతిరిగిన కనుబొమలు; అన్నీ వాణ్ణి ఆకర్షించాయి.

రొట్టెముక్క కొంతతీసి ఆ పిల్లకివ్వబోయాడు. కాని ఆమె అటు చూళ్లేదు. ఆదరా బాదరా ఫలహారంచేస్తున్న ఇగోర్ వంక ప్రశ్నార్థకంగా చూచాడు వాన్యా. అతనలా రొట్టె ఇవ్వబోవడం తనకు నచ్చినట్టు ఇగోర్ అంగీకారసూచకంగా తల ఆడించి అతని భుజాన్ని ఉత్సాహంతో తట్టాడు. వాన్యా చూసీచూడనట్లు ఆపిల్ల మోకాళ్లను తాకాడు. ఆమె తలపైకెత్తి అతన్ని చూచింది. వయ్యారంగా నవ్వ ప్రయత్నించింది. కాని ఆమె నవ్వు మామూలుగా, కృతజ్ఞతాసూచకంగా వ్యక్తమైంది. వాన్యా రొట్టెను ఆమె ముందు పెట్టాడు. ఆ పిల్ల క్షణంసేపాగి రొట్టె తీసుకుంది. కొంతసేపిలా మౌనంగా గడిచిపోయింది. తరువాత మాంసపురొట్టెను కోసుకుంటూ ఇగోర్ ఆమెను మాటల్లోకి దింపాడు. అతను ముక్తసరిగానే మాట్లాడుతున్నాడు. తలెత్తి ఆవిడవంక చూళ్లేదు.

"మీరు ఎందాక వెడుతున్నారు?" అని అడిగాడతను.

వాండా స్టేషన్ వైపు చూచింది. రొట్టె తినడం మానేసింది. సంకోచిస్తూ

"అది నాకే తెలీదు" అన్నది.

"అయితే మాతో వచ్చేయండి" అన్నాడు వాన్యా, సంతోషంతో స్టాండుమీద కూచున్నవాడల్లా గిర్రున తిరిగి ఉల్లాసంగా "మీ పేరేమిటి?" అని అడిగాడు.

"వాండా"

"ఆహా! ఎంత చక్కటిపేరు! వాండా!"

"పోలిష్ పేరు"

"మాతో వచ్చేయండి. ఆ బస్తీలో వాళ్లనాయనమ్మ, తాత ఉన్నారు" అంటూ వాన్యా ఇగోర్ వంక చూపించాడు. ఇగోర్ అతనిమాటలు విని సంతోషించాడు. అతనలా సంతోషిస్తున్నట్లు వాన్యా గ్రహించాడుకూడా.

వాన్యా మాటలు విని, విననట్లూరకున్నదా పిల్ల. తింటున్న పదార్థాలు క్రిందపెట్టి బెంచీని పట్టుకుంది.

"ఎక్కడికి వెళ్లాలో నాకు తెలీదు.

...ఎక్కడికి వెళ్లడం?" అన్నది.

ఆవిడమాటల్లో తాను ఏకాకిననే విషాదభావం ముప్పిరి గొన్నది.

ఇగోర్ ఆవిడవైపు తదేకంగా చూస్తూ జామ్ తినడం మొదలుపెట్టాడు. వాన్యా సంతోషమంతా మటుమాయమైంది. కలవరపడుతూ వాండావైపు దృష్టి సారించాడు. ఏదోఒక తగిన సమాధానం చెప్తాడనే ఆశతో మళ్లీ ఇగోర్ వంక చూచాడు. ఇగోర్ జామ్ డబ్బా క్రిందపెడుతూ కూనిరాగాలు పాడడం మొదలెట్టాడు.

"అలాఅంటే కాదు వాండా. నీవు మాతోపాటు రావాలి. అంతే."

ఇప్పుడు వాన్యా సందేహంతీరింది. కాని వాండా ఇగోర్ వైపు భయపడుతూ చూచింది.

"నే నెక్కడికెళ్లాలో నాకు తెలీదు .."

"అవును, నీకు తెలీదు. కాని నాకు తెలుసు. రైలొచ్చే వేళయింది. రైలెక్కిన తరువాత అన్నీ తీరిగ్గా మాట్లాడుకుందాం."

వాన్యా ఇగోర్ వంక అదోలాచూచాడు. వాండా మౌనంగా కూచుంది.

సరిగ్గా అదేవేళకి తోటగుబుర్లలోనుంచి రైజికోవ్ వాళ్ళ వైపు తొంగిచూచాడు గబగబా ముందుకొచ్చి ఎదురుగా నిలబడి ఫలహారాలవంక చూచాడు. అతను కనిపించగానే వాండా అసహ్యించుకుంది.

ఇగోర్ నవ్వుతూ ఇలా అడిగాడు: "ఏం రైజికోవ్, చిక్కుల్లో పడ్డావా?

రైజికోవ్ మాట్లాడ్లేదు.

"ఒకముక్క రుచిచూడు అన్నిటికన్నా దొంగతనం కట్టు బాటయ్యేపనికాదని నేను మొదటినుంచీ చెపుతూనే ఉన్నాను. బాగా దెబ్బలు తగిలాయా ఏమిటి? అతనెవరో ఇందాక నిన్ను పట్టుకున్నట్టున్నాడు!" అన్నాడు మళ్ళీ ఇగోర్.

"పట్టుకుంటేనేం! విడిపించుకుని వచ్చానుగా!" అంటూ రైజికోవ్ ఫలహారం తినడం మొదలుపెట్టాడు.

"మంచిపని చేశావు. కాని ఏమిటాపని! కొంచెం ఆలోచించి చూడు. ప్రతివాడికీ నిన్ను పట్టుకునేందుకు చేతులున్నాయి. దొంగ పని మంచిదికాదు. నీవూ నాలాగే బ్రతకాలి" అన్నాడు ఇగోర్.

"నాయనమ్మ సాయంతోనా?"

అంటూ నవ్వాడు వాన్యా.

"పోస్టాఫీసుకు వెడితే ఒకనోటు వస్తుంది.

'ఇగోర్! ఇలారా. ఇదిగోనోటు- వందరూబుళ్ళ నోటు, తీసుకో' అంటూ అలాగే నోట్లువస్తాయి. నీవూ అలాగే వంద రూబుళ్ళనోట్లు ఎందుకు తీసుకోకూడదు!"

"నోట్లా? తీసుకుంటే బాగానేవుంటుంది కాని నాకు చదు వొచ్చినప్పటిమాట."

అంటూ రైజికోవ్ బాధపడ్డాడు.

"నీకు చదువురాకపోతే పోనీ. ఏదోఒక పనిచెయ్యి. జేబులు కత్తిరించడంమాత్రం మానుకో. అంతకంటే నీచపువని మరొకటి లేదు. పని! పనిచేయడం తప్పుకాదు. ప్రతివాడూ పనిచెయ్యాలి, సంపాదించుకోవాలి. లక్షలకొద్దీ మనుష్యులు పని చేసుకుంటున్నారు. అందులోనే ఆనందం ఉన్నదంటున్నారు" అని చెప్పాడు ఇగోర్.

6

రైలు పెట్టెలో

పచ్చిక మైదానంగుండా గూడ్సుబండి దూసుకుని వెళ్ళి పోతోంది. కప్పులేని ఒక ట్రక్కుమీద ఒక ట్రాక్టరుఉంది. దాని మీద టార్ పాలిన్ వేశారు. క్రిందికి జారిపడుతున్న టార్ పాలిన్ మీద వాండా ముడుచుకుని పడుకున్నది. అవిడ పాదాలదగ్గర ఇగోర్ చెర్నియావిన్ కూచున్నారు. చేతులు మోకాళ్ళపై పెట్టు కుని ఒకమాటు తనచుట్టూ పరికించాడు. కొంచెం ఎడంగా కాళ్ళు పెట్టుకుని రైజికోవ్ అతనిముందు నిలుచుని ఉన్నాడు. ట్రక్కు అంచునకూచుని కాళ్ళూపుకుంటూ వాన్యా మైదానంవంక చూసి మురిసిపోతున్నాడు. గూడ్సుబండి గ్రామీణప్రాంతాలలో రహదా గులను, దిజ్మండలాన్ని, పర్వతాలను, పచ్చగా కనిపించే ప్రకృతిని దాటుకుంటూ పోతోంది.

సాయంత్రం గడిచింది. చలి ప్రారంభమైంది. టార్పాలిన్ అడుగున ఒక్కొక్కరే చేరడం మొదలుపెట్టారు. చాలాసేపటికి కాని నిద్రపట్టిందికాదు. టార్పాలిన్ అడుగున చేరడానికి చలిఒక్కటే కారణంకాదు. అందులోదూరితే ఎవరికీ అగుపించరు. బండి ఆగి నప్పుడు ప్రయాణీకుల బెడదకూడా ఉండదు.

నిద్రపోయేముందు ఇగోర్ చెర్నియావిన్ ఇలా అన్నాడు:

"మనకు మంచిపెట్టే దొరికింది. జనం గినంలేరు. గాలిరాదనే బెంగలేదు. టిక్కెట్లుమగుతారనే చిక్కులేదు"

తెల్లవారింది. చాలా ఉల్లాసంగా టార్ పాలిన్ ముసుగులో నుంచి అందరూ కదలసాగారు. పెద్ద పెద్ద స్టేషన్లు వచ్చినప్పుడు

మాత్రం మళ్ళీ ముసుగులో దాక్కుంటున్నారు. రైల్వే ఉద్యోగులకు తామూ కనిపించి అనవసరంగా శ్రమకలిగించడం వారికిష్టంలేదు. పెద్ద ప్లేసన్లు దాటగానే అంతా మళ్ళీ ఇవతలికివస్తున్నారు. అంతేకాదు. ఎండపొడలో పడుకోవడమంటే వాండాకెంతో ఇష్టం.

కొంతసేపు పోయాక రైజికోవ్ తెగువతో ఇలా అడిగాడు:

"ఆమెను బస్తీకి ఎందుకు తీసుకెడుతున్నట్టు ?"

ఇగోర్ అతనివంక రిట్టగించి చూచాడు. "ఎందుకైతే నీ కెందుకు ?" అన్నాడు.

"నా కెందుకా ? చెపితే తప్పా ?" అని గొణిగాడు రైజికోవ్.

"నగరంలో ఆవిడకు పనైనా దొరకొచ్చు. ఏదో ఒకపని."

రైజికోవ్‌కు ఎలాగైనా కాట్లాడాలని ఉంది.

"మీరు పనిచేయకుండా ఆవిడచేత పని చేయిస్తారన్నమాట. అంతేనా ?" అంటూ నిగ్గతీసి అడిగాడు.

"అవును. ఆవిడమాత్రం ఏదో ఒకపని చెయ్యాలి: తప్పదు." అంటూ ప్రశాంతంగా ముఖం వెనక్కు తిప్పాడు ఇగోర్. ఏదో హామీ ఇస్తున్నవాడిలాగా ఆ పిల్లవంక చూచాడు.

"ప్రతివాడూ పనిచేస్తాడు." అంటూ వాన్యా రైజికోవ్ వంక చూచాడు.

"మూతిపళ్ళు రాలకుండా ఉండాలంటే నోరుమూసుకుని పడుండు" అన్నాడు రైజికోవ్.

"నీవు చస్తే ఆ పని చెయ్యలేవు" అని సమాధానం చెప్పాడు ఇగోర్.

రైజికోవ్ మెల్లగా ఇగోర్‌వంక తల తిప్పాడు. కోపంతో. అతని కళ్ళు జ్యోతుల్లా అయినాయి.

"ఏమిటన్నావు ?"

"వాణ్ణి కొట్టాలంటే ముందు నీవు నా అనుమతి తీసుకోవాలి."

"నీ అనుమతి కావాలా ?"

"అవును లిఖితపూర్వకానుమతి. తెలిసిందా ?... అందుకు దరఖాస్తు పెట్టుకో.

"ఏం దరఖాస్తు ?"

"అతని పళ్ళూడగొడతానని."

రైజికోవ్ దుడుగ్గా వాన్యావైపు మళ్ళాడు:

"అదేమిటో నేనూ చూస్తాను నీ అనుమతి. వీణ్ణి తంతే ఎవరడ్డొస్తారో చూద్దాం" అంటూ వాన్యామీదికెళ్ళాడు.

వాన్యా చటుక్కున లేచి ఇగోర్ వంక దీనంగా చూచాడు. అతని దగ్గరికి వెళ్ళబోయాడు. అంతలోనే రైజికోవ్ వాన్యా చేయి పట్టుకున్నాడు. కాని ఇగోర్ అడ్డువచ్చాడు. రైజికోవ్ పిడికిలెత్తక పోవడం సరేకదా, అతనివంక కళ్ళెత్తి చూడలేకపోయాడు. కాని అతని ముఖంలో ఎంతో జుగుప్స కనిపించింది. ఇగోర్ ఇట్టే పిడికిలి బిగించి రైజికోవ్ ముఖంమీద కొట్టబోయాడు. కాని ఆ దెబ్బ రైజికోవ్ పొట్టమీద తగిలింది. వెంటనే అతను నిద్రపోతున్న వాండామీదపడ్డాడు ఆ పిల్ల అదిరిపడి లేచింది.

"ఏమిటెదంతా ? ఎందుకలాపడ్డావు ? ఏం జరిగింది ?" అంటూ భయంతో చిన్న కేకపెట్టింది.

ఇగోర్ ప్రశాంతంగా నవ్వుతూ "గాభరాపడకు. ఏమీలేదు. రైజికోవ్‌కు నిద్రవస్తోంది. నీవులేచి అక్కడతనికి చోటివ్వు" అన్నాడు.

వాండా రైజికోవ్ వంకచూచి చీదరించుకుంది. కాని వెంటనే నవ్వింది. అతనిముఖం జేవురించింది. అతనలా అయిపోవడం ఆ పిల్లకెంతో ఇష్టం.

"నీవతన్ని కొట్టావుకదూ ? ఎందుకు ?" అని అడిగింది.

రైజికోవ్ మోచేతిమీద లేచి కూచున్నాడు. ఎర్రని జుట్టు నుదుటపైపడి కళ్ళను కప్పేసింది.

"ఎందుకలా అవహాస్యం చేస్తావు? నీకతను సహాయం చేస్తాడనా నీ ఉద్దేశం? అన్నాడు.

వాండా నిర్లక్ష్యంగా తలతిప్పుకుంది:

"సహాయం చెయ్యొచ్చు"అన్నది.

రైజికోవ్ లేచి పిడికిలి బిగించాడు. కోపంగా "నీవు..."అని ఏదో అనబోయాడు.

ఇగోర్ నవ్వుతూ వాన్యా భుజాలమీద చేతులువేశాడు.

"ఇప్పుడైనా ఈమాట జ్ఞాపకం పెట్టుకో. ఎవరిమీదైనా చెయ్యి చేసుకున్నావా, జాగ్రత్త!" అంటూ నిష్కర్షగా రైజికోవ్‌ను హెచ్చరించాడు.

ఇక చేసేదేమీ లేక రైజికోఫ్ తనజేబుల్లో చేతులు పెట్టుకుని నిలుచున్నాడు.

"ఈపిల్ల ఎలాంటిదో నీకింకా తెలీదుకదూ?"

"ఎలాంటిది?" అంటూ ఇగోర్ ఆశ్చర్యంగా అతనివంక చూశాడు.

"నీవింకా ఆమె పసిపిల్లనుకుంటున్నావా? నీవెవరో అతనికి చెప్పేదా వాండా!"

"నీ ఇష్టంవచ్చినట్లు చావు, పశువా! నేనెవరో అతనికి చెప్పు... ఊ. చెప్పవేం?" అన్నది వాండా.

"అదొకపడుకత్తె!" అంటూ రైజికోవ్, పెద్దగా అరిచాడు.

వాండా లేచి నెమ్మదిగా పెట్టెకోసకు వెళ్ళింది, జాకెట్టు కాలరు తడుముకుంటూ తలవాల్చుకుని నిలుచుంది. ఇగోర్ అతని దగ్గరికి వెళ్ళాడు. రైజికోవ్ పెట్టెఅవతలికొసకు వెళ్ళి ట్రాక్టరువెనకాల దాక్కున్నాడు.

ఏం జరుగుతున్నదో వాన్యాకు తెలిసింది కాదు. క్షణక్షణం అతనికి వింతగాఉంది.

ఇగోర్ ఆపిల్ల దగ్గరికి వెళ్ళాడు. తల వాల్చుకుని క్రిందికి చూస్తూ ఇలా అడిగాడు:

"ఆమాట నిజమేనా?"

వాండా తలఎత్తి అతనివంక చూచింది. ఇదివరకు ఆవిడ హృదయంలో దాగిఉన్న జుగుప్స ఇప్పుడు ఒక్కమాటుగా పెల్లుబికింది.

"అయితేనేం? అవును. ఆమాట నిజం. కాని ఇప్పుడు దానితో నీకేం ప్రసక్తి? అయినా నీపట్ల నేను సరిగ్గా ఉండడమేకదా నీకు కావలసింది" అన్నది.

ఇగోర్ ముఖం ఎర్రబారింది. పెదవులు బిగపట్టుకున్నాడు. తనవంక ఆతృతగా చూస్తున్న వాన్యానుచూచి క్షణంలోనే మళ్ళీ తనదృష్టిని మళ్ళించుకున్నాడు.

సరే, దానికేం లే... నీకిప్పుడెన్నేళ్లు?" అని అడిగాడా అమ్మాయిని.

వాండా వాయ్యారంగా తలఎత్తి ఇగోర్ కళ్ళల్లోకి సూటిగా చూచింది.

"పదిహేను. ఎందుకు?"

ఇగోర్ ఆలోచిస్తూ నిలుచున్నాడు.

"సరే. ఇక నీవెళ్ళిపోవచ్చు" అంటూ విషాదంగా నవ్వాడు.

ఆపిల్ల మెల్లగా, టార్పాలిన్ ఉన్నచోటికి వెళ్లిపోయింది. అక్కడే కూలబడి ట్రాక్టరునుచూస్తూ క్రిందికి ఒరిగింది.

పచ్చికబయళ్లు చూస్తూ ఇగోర్ ఈలపాట పాడుతున్నాడు. దూరంగా పర్వతశిఖరాలు, లోయలు కనిపిస్తున్నాయి.

బండి వెళ్లిపోతోంది. రోడ్డుమీద నడుస్తున్న ఆడవాళ్లు కనిపించారు. జోళ్లులేనివాళ్ల పాదాలు తెల్లగా మెరుస్తున్నాయి. అందులో ఒకపిల్ల ఇగోర్నుచూచి ఏమిటో అన్నది. ఆ మాటకి మిగతా

పిల్లలు నవ్వారు. వాళ్ళవంక నిర్లక్ష్యంగా చూసి ఇగోర్ ముఖం తిప్పుకున్నాడు. వాన్యా ట్రాక్టర్ వెనకాల వాండాను పరిశీలించాడు. ఇగోర్ దగ్గరికి వెళ్ళి మెల్లగా ఇలా అన్నాడు,

"వాండా ఏడుస్తోందా ?"

"ఏడిస్తే ఏడవనీ, మరేంభయంలేదు." అంటూ ఇగోర్ ఆ కుర్రవాడివంక చూడకుండానే సమాధానం చెప్పాడు.

సిగ్నల్ లైను దాటుతూ బండి ఒకమాటు కుదుపు ఇచ్చింది.

"ఇంతసేపటికి ఇక్కడికి వచ్చామన్నమాట" అన్నాడు ఇగోర్.

జతలు జతలుగా ఉన్న రైలుపట్టాలను బండి దాటివేస్తోంది. ఎదురుగా గూడ్సుబండి వస్తోంది. రైలు కుడివైపుకుతిరిగి దూసుకుంటూ స్టేషన్‌లోకి పోయింది. స్టేషన్‌లో బండ్లు నిలిచి ఉన్నాయి. స్టేషన్ అనేక అంతస్థులతో అందంగా ఉంది. బ్రిడ్జీలమీదినుంచి జనం అటూ ఇటూ వస్తూపోతున్నారు. స్టేషన్ దాటి రైలు బస్తీ చివర ఉన్న విశాలమైన మైదానం ప్రక్కగా పోతోంది. మైదానానికి అవతల కొత్తగా వెల్ల వేసిన కుటీరాలున్నాయి. జాగ్రత్తగా, నెమ్మదిగా రైలుపట్టాలు దాటుకుంటూ గూడ్సుయార్డుదగ్గరకు వచ్చింది. ఇప్పుడిక కుటీరాలు కనిపించడంలేదు. ఎర్రని బూడిదరంగు, గోధుమరంగులతో ఉన్న రెండు భవంతులు కొండశిఖరంమీద కనిపిస్తున్నాయి.

వాండా టార్పాలిన్ తొలగించుకుని లేచికూచుంది, నగరం వంక చూచింది. ఇరువైపులా ఉన్న గూడ్సుబండ్లను దాటుకుంటూ సన్నని మార్గంలోనుంచి రైలు మెల్లగా కదలసాగింది. రైలుతో పాటే కదలుతున్నట్లు కనిపిస్తున్న రోడ్డువంక ఇగోర్ సాలోచనగా చూచాడు.

ఉన్నట్లుండి ఇగోర్‌కు వెనకాలనుంచి ఏదో ఒక చప్పుడు వినిపించింది. గభాలున వెనక్కు తిరిగి చూచాడు. పెట్టె కవిన్యాని జాగ్రత్తగా పట్టుకుని ఒక రైల్వేగార్డు పెట్టెమీదికి దుమికాడు.

వాంకా చిడీచప్పుడు లేకుండా, ఒక క్రీనీడలాగా పెట్టెదిగి వెళ్ళిపోయింది.

"నీపేరు ఇగోర్ చెర్నియాఖిన్ కదూ!" అని అడిగాడు గార్డు.

"అవును."

"ఓహో, నీవేనన్నమాట. ఇప్పుడే టెలిగ్రాం అందింది. పోస్టలార్డరుమీద దొంగసంతకం పెట్టి వందరూబుళ్ళు తీసుకున్నావు కదూ?"

ఇగోర్ అతన్ని మెచ్చుకున్నట్లుగా చూచాడు.

"ఎంతత్వరగా పట్టేశారు! నేను డబ్బు తీసుకున్నానా? నన్ను మీరిలా అడగడం చాలా చిత్రంగాఉంటే. లేదు. ఆ డబ్బు నాకక్కర్లేదన్నాను..."

గార్డు తల ఆడించాడు.'

"నాతోరా."

ఇగోర్ ముక్కు నలుపుకున్నాడు.

"ఏం కర్మంవచ్చి పడింది, వాన్యా! ఇక మనం వేరై పోతున్నాం! నీవు చాలా మంచికుర్రాడివి వాంకా...

కామ్రేడ్ గార్డ్! మీతో రావడానికి నిజంగా నాకు టైం లేదు."

"మీరెక్కడికి వెడుతున్నారు!" అంటూ వాన్యా గాభరాగా అడిగాడు.

"వెళ్లడమా? వెళ్ళడమేమిటి! నన్ను అరెస్టుచేస్తే... చట్టం ప్రకారం నన్ను పట్టుకున్నారు."

"ఎందుకు పట్టుకున్నారు!"

"ఎందుకా? మానాయనమ్మ డబ్బు పంపించికదూ మరి."

గార్డు ఇగోర్ భుజంమీద చెయ్యివేసి "పద, పద" అంటూ హెచ్చరించాడు.

ఇగోర్ రైలుకమ్మీ పట్టుకుని క్రిందికి ఉరకడానికి సంసిద్ధుడయ్యాడు.

వాన్యావంక తిరిగిచూస్తూ "కాలనీకి వెళ్ళు వాన్యా. అక్కడెంతో హాయిగా ఉంటుంది" అన్నాడు.

ఇలా అని పెట్టెదిగి ఇగోర్, గార్డువెంట వెళ్ళాడు. వాన్యా వాళ్ళనుచూస్తూ మోకాళ్ళమీద చేతులు వేసుకుని కూచున్నాడు. ఇంతలోనే ఇలాంటి ఆపదవచ్చి పడ్డందుకు నిశ్చేష్టుడయ్యాడు.

ట్రాక్టర్ వెనకాలనుంచి రైజికోవ్ వచ్చి అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. కృత్రిమంగా, వికటంగా నవ్వుతూ ఇలా అన్నాడు;

"ఇగోర్‌కు నోటువచ్చింది, నోటు! ప్రియమైన ఇగోర్! రా, నాయనా, వచ్చి ఈ వందరూబుల్స్ తీసుకో. మంచి పని అయిందిలే— తగినశాస్తి...అరె! వాండా ఏది?"

వాన్యా భయపడుతూ నాకు తెలీదని సమాధానంచెప్పాడు.

7
అతని స్వంతవీధి

"నీ వెక్కడకి వెడతావు?" అని అడిగాడు రైజికోవ్.

ఇరువురూ ట్రాంఆగేచోటికి చేరుకున్నారు. అది గూడ్సుస్టేషన్‌కు దగ్గరలోనేఉంది.

వీధంతా దుమ్ము, ధూళి, రాళ్ళు, రాక్షసిబొగ్గు, వీటన్నిటితో నిండి చీదరపుట్టిస్తోంది. వీధిన వెడుతున్న గుర్రబ్బండ్ల చప్పుళ్ళకూ చక్రాలధ్వనికీ పిచ్చుకలు అదిరిపడి పైకెగిరిపోతున్నాయి.

ట్రాం ఆగేచోట ప్రయాణీకులు బారులుతీరి నిలబడిఉన్నారు. పాలిష్ లేక చాలామంది బూట్లు వెలవెలపోతున్నాయి.

రైజకోవ్ అడిగిన ప్రశ్నకు వాన్యా జవాబివ్వలేదు. అందుకతనికి వ్యవధి లేకపోయింది. అతనిదగ్గరికి ఒక మనిషివచ్చి నిలుచున్నాడు.

"నాజోళ్లు బాగుచేస్తావా?" అని అడిగాడు.

"నలుపురంగు వెయ్యనా?" అన్నాడు వాన్యా.

"నలుపురంగా? అంతకన్నా మరేం చేద్దామనుకున్నావు? నేనొక అధికారిని కలుసుకోవాలి. నాబూట్లు చూస్తే..."

వాన్యాచుట్టూ కలయచూచాడు. కూచునేందుకు అక్కడేమీ కనిపించలేదు. వీధిలో దూరంగా కొయ్యలతో కట్టిన మెట్ల వసారా ఒకటి కనిపించింది.

"ఆ మెట్లమీదికి పోదామా?" అన్నాడు వాన్యా.

అతను సరేనన్నట్లు తల ఊపాడు. వాన్యా తన సామాను తీసుకుని గబగబ అక్కడికి వెళ్ళిపోయాడు. అతను తనదగ్గరికి వచ్చేసరికి బ్రష్ బయటికి తీశాడు...

"అప్పుడే బ్రష్ తీశావేం? ముందు దుమ్ముదులుపు" అన్నాడావ్యక్తి.

వాన్యా తనపనిలో నిమగ్నుడైనాడు. రైజకోవ్ ఎత్తుగాఉన్న ఒక మెట్టుమీద కూచుని మౌనంగా వీధిని పరిశీలిస్తున్నాడు.

"ఎంత పుచ్చుకుంటావు?" అని అడిగాడు ఆ కొత్తమనిషి.

"పదికోపెక్కులు"అని చెప్పాడు వాన్యా.

"నీదగ్గర చిల్లర ఉందా?"

"ఎంతకు ?"

"పదిహేనుకోపెక్కులకు"

వాన్యా తన జేబులో చెయ్యిపెట్టి తడుముకున్నాడు. అతని దగ్గర పదికోపెక్కులనాణాలు పదిఉన్నాయి.

"పోనీ లేకపోతే మానేరు. ఇది ఉంచేసుకో" అంటూ ఆ వ్యక్తి తనపని ముగించుకుని డబ్బిచ్చి వెళ్ళిపోయాడు.

అతనలా వెళ్ళగానే ఒకపిల్లవచ్చి బూట్లకు రంగువేయించుకుని వెళ్ళిపోయింది. తరువాత అక్కడికొక ఎర్రసైనికుడొచ్చాడు.

"ఇదిగో, చూడు. ఇవి ఎత్తుబూట్లు వీటి కెంతవుతుంది ? అని అడిగాడు.

ఎర్రసైనికుడు ఎదుట ప్రత్యక్షమయ్యేసరికి వాన్యా భయపడిపోయాడు. ఇంతకుముందెన్నడూ ఆ కుర్రవాడు సైనికులకు బూటు పాలిష్ చేసి ఎరగడు. వాటికి ఎంత అడగాలో కూడా అతనికి తెలిసింది కాదు.

ఇలా భయపడుతూనే "పది...పది కోపెక్కులు" అన్నాడు,

"ఓరిబడుద్దాయి !" అంటూ రైజికోవ్ గుసగుసలాడాడు.

కాని సోల్జరు సంతోషంతో తన బూటుకాలు స్టాండుమీద పెట్టాడు.

"చవక-కారు చవకరా అబ్బాయ్ ! యెత్తుబూట్లకు ఈ చుట్టుపక్కల ఇరవై కోపెక్కులకు తక్కువ చెయ్యరు" అన్నాడు.

వాన్యా మామూలుగా "బూట్లకు నలుపురంగు వెయ్యనా" అనేమాట అడగడం మరచిపోయాడు. నాలిక బిగించి కనుబొమలు చిట్లించాడు. జాగరగా పరిశీలిస్తూ, శ్రద్ధగా తన పనిచేయడం మొదలుపెట్టాడు. ఒకేతడవ రెండు బ్రష్‌లతోనూ త్వరత్వరగా పాలిష్ చేసేనేర్పు ఆ కుర్రవాడికింకా పట్టుబడలేదు. అంచాత చేతిలో నుంచి ఒక బ్రష్ ఎగిరి అవతలపడింది. వాన్యా విసుక్కొంటూ బ్రష్ తెచ్చుకునేందుకు పరుగెత్తుకు వెళ్ళాడు.

"కుర్రవాడు చురుకైనవాడే" అంటూ ఎర్రసైనికుడు పది కోపెక్కులు అతనిచేతిలో పడేసి "చవక-కారు చవక. అయితేనేం ! బూట్లు ధగధగ మెరిసిపోతున్నాయి" అన్నాడు.

ఇల్లా అని అతను తన బూట్లవంక చూచుకుంటూ వెళ్ళి పోయాడు.

వాన్యా చేతులు, భుజాలు సలుపుపుట్టడం మొదలుపెట్టాయి. మోచేతులపై తల ఆనించుకుని వీధివంక చూడసాగాడు.

ఇళ్ళన్నీ ఒకేలాగ ఉన్నాయి. ఇటికతో కట్టిన రెండంతస్తుల ఇళ్లు. ఇంటింటికీ మధ్య చిన్న ఆవరణ, గేట్లువున్నాయి. గేట్లదగ్గర బెంచీలు; బెంచీలమీద ప్రొద్దుతిరుగుడు గింజలుతింటూ కొందరు మనుష్యులు కూచునిఉన్నారు. పేవ్‌మెంటుమీద ఇద్దరేసి, ముగ్గురేసి మనుష్యులు మెల్లగా మాట్లాడుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇటికలు పరిచిన పేవ్‌మెంటు అది.

వాళ్ళు కూచున్న ఇంటితలుపు తెరిచిన చప్పుడైంది.

"ఇక్కడ మీరేంచేస్తున్నారు. పనీపాటులేక బజార్లు తిరిగే బడుద్ధాయిలు!" అంటూ ఒక కంఠస్వరం వినిపించింది.

వాన్యా అదిరిపడి వెనక్కు తిరిగిచూచాడు. రైజికోవ్ బద్ధకంగా లేచి నిలుచున్నాడు. వాకిట్లో ఒక పొడుగాటి బక్కపలుచటి మనిషి కనిపించాడు. నెరిసిన మీసాలు.

"ఆకతాయిలు! అంతేనా?" అన్నాడు మళ్ళీ.

"కాదు" అన్నాడు వాన్యా.

"ఓహో! అయితే జోళ్ళు మరామత్తు చేసేక్రాడివా? నీ దగ్గర రబ్బరుముడమలున్నాయా!" అని అడిగాడతను!

వాన్యా స్టాండులో రెండు బ్రష్‌లు, రెండు నల్లరంగు డబ్బాలు తప్ప మరేమీలేవు. "ఉహు! నాదగ్గరవిలేవు" అని చెప్పాడు వాన్యా.

"లేవా? అవిలేకుండానే జోళ్ళు బాగుచేస్తానని వీధులవెంట తిరుగుతున్నావా? నీవేపాటి బూటుపాలిష్ క్రాడివో నాకు తెలిసిందిలే. సరే నీవు బూటుపాలిష్‌చేసేవాడివే అనుకుందాం. మరి వాడిమాటా!" అంటూ అతను రైజికోవ్‌వంక చూపించాడు.

రైజికోవ్ ముఖం అటు ప్రక్కకు తిప్పుకున్నాడు. గాభరా పడ్డాడుకూడా. "ఇక్కడ మీరిద్దరూ ఎంతసేపటిబట్టీ నిలుచున్నారు? ఎప్పుడు చీకటిపడుతుందా అని చూస్తున్నారా" అన్నాడు మళ్ళీ అతను.

దీంతో రైజికోవ్ కంగారు మరింత ఎక్కువైంది.

"చీకటితో మాకేం ప్రమేయంలేదు. మా స్నేహితుడొకడు వస్తానన్నాడు. ఇక్కడ నిలుచున్నాం" అని చెప్పాడు రైజికోవ్.

"ఓస్! స్నేహితుడట స్నేహితుడు!"

ఆ వృద్ధుడు తలుపు తాళం బిగించి నెమ్మదిగా మెట్లు దిగాడు. వేలెత్తిచూపుతూ "ఇక్కణ్ణుంచి వెంటనే వెడతావా వెళ్ళవా? నాకు తెలుసు" అన్నాడు రైజికోవ్‌తో.

"సరే, పొమ్మంటే అలాగేపోతాను. అలాగే వెడుతున్నాను లెండి. ఈ వీధిలో ఎవరూ నిలుచోకూడదా ఏం? అది మీ శాసనమా?" అన్నాడు రైజికోవ్.

న్యాయశాస్త్రరీత్యా తనకుగల హక్కులేవో రైజికోవ్‌కు తెలుసును. తన హక్కులను పూర్తిగా కాపాడుకోవాలనే దృఢ సంకల్పంతోనే అతనలా అడిగాడు.

అతని ప్రశ్న వినగానే వృద్ధుడికి వళ్ళు మండింది.

"ఇక్కడ రూల్సు నీకు నచ్చకపోతే నీకు నచ్చిన రూల్సు ఎక్కడున్నాయో అక్కడికే వెళ్ళు. అంతేకాని ఇక్కడ పోతుణాం ఉండడానికి వీల్లేదు. నేను షాపుకు వెడుతున్నాను. వెళ్ళి వచ్చేలోగా ఇక్కణ్ణుంచి వెడితేసరేసరి. లేకపోతే..."

ఇలా హెచ్చరించి ఆ వృద్ధు డక్కడనుంచి వెళ్ళిపోయాడు. రైజికోవ్ మనస్సు చివుక్కుమంది. అతనివంక కాసేపు చూచి మళ్ళీ మెట్లమీద కూచున్నాడు.

"ఎప్పుడు చీకటిపడుతుందా అని ఎదురు చూస్తున్నామట" అని గొణుక్కున్నాడు. అతని కంఠంలో విషాదం తొణికిసలాడింది.

ఇంతలో ఒక యువకుడు అక్కడికి వచ్చాడు.

"దొరికాడు! మనవీధిలోనే... బూట్ పాలిష్ కుర్రవాడు మంచివాడే." అంటూ ఆ యువకుడు వాన్యాదగ్గరకివచ్చాడు.

"నల్లరంగు వేయమంటారా?"అని వాన్యా అడిగాడు.

"ఊఁ, వెయ్యి. రోజూ ఇక్కడికి వస్తూఉంటావా?"

వాన్యా పాలిష్‌డాబ్బాతీసి భుజాలు సర్దుకున్నాడు. కొంచెం తటపటాయిస్తూ "ఆ వస్తుంటాను" అని సమాధానం చెప్పాడు.

పాలిష్ చేయడం అయిపోయాక ఆ యువకుడు ఎంతఅని అడక్కుండానే పదిహేను కోపెక్కులు వాన్యా చేతిలో పెట్టాడు.

"నాదగ్గర చిల్లరలేదే" అన్నాడు వాన్యా.

"ఫరవాలేదులే. ఎప్పుడూ నీకు తడవకు పదిహేను కోపెక్కలిస్తూ ఉంటాను. కాని నీవుమాత్రం ఇంతకంటె కొంచెం ముందుగా రావాలి."

వాన్యా డబ్బు తీసుకొని జేబులో వేసుకున్నాడు. వీధివైపు మళ్ళీ ఒకమాటు చూచాడు.

కను చీకటిపడుతోంది. వీధిలో జనసంచారం తగ్గింది. వాన్యా ట్రాం వంక చూచాడు. అదంటే అతనికెంతో ఆసక్తి. దాన్ని గురించి ఎన్నోసార్లు వినడమేకాని స్వయంగా ఎన్నడూ చూళ్ళేదు. అది వెడుతోంటే తనుకూడా అందులోకూచుని ఎక్కడికో వెడుతున్నట్లు భావించసాగాడు. ఇప్పుడతనికెంతో ఉల్లాసంగా ఉంది. ఆత్మవిశ్వాసం హెచ్చింది. తను మెట్లమీదకూచుని బూట్లు పాలిష్ చేస్తుంటే ఎంతో మంది బాటసార్లు తననుచూచి మెచ్చుకుంటూ వెడుతుంటారు.

"వాన్యా! ఇటుచూడు" అంటూ రైజకోవ్ అతన్ని చిటికె వేసి పిలిచాడు. "నాకో యాభై కోపెక్కులిస్తే నీకేమైనా అభ్యంతరమా? తెల్లవారేసరికి మళ్ళీ నీ డబ్బు నీకిచ్చేస్తాను" అన్నాడు.

"అంతత్వరగా నీకు డబ్బెలావస్తుంది?" అని అడిగాడు వాన్యా.

"మరేంబాధలేదు. ఇట్టే వచ్చేస్తుంది. కొంచెం బదులివ్వు. ఆకలివేస్తోంది. ఏదైనా కొనుక్కోవాలి."

ఈమాట వినగానే వాన్యాకుకూడా ఆకలివేసింది. నిజానికి ప్రొద్దుటినుంచి వాళ్ళేమీ తినలేదు. రాత్రి రైల్లో తిన్నది అప్పుడే అరిగిపోయింది.

"యాభై కోపెక్కులా. అంతడబ్బు నా దగ్గర ఉన్నదో లేదో?...అ, ఆ ఉన్నాయి. యాభై కాదు, తొంభై. ఓహో! ఆ డబ్బుమాట ఇట్టే మరిచిపోయానే!" అన్నాడు వాన్యా.

"ఏ డబ్బుమాట."

"ఇగోర్ నాకిచ్చిన డబ్బు వాళ్ళ నాయనమ్మ పంపించింది కదూ."

వాన్యా జేబులోనుంచి నోటుతీసి మడతవిప్పి దానివంక విచారంగా చూచాడు. మళ్ళీ జేబులో దాచుకున్నాడు.

"సరేలే, దానిమాటకేం? ముందు నాకో యాభై కోపెక్కులివ్వు. అబ్బ! నీ దగ్గర ఎంత డబ్బుంది!" అన్నాడు రైజికోవ్.

"ఆనోటు మార్చడానికి వీల్లేదు" అంటూ వాన్యా తన దగ్గరఉన్న చిల్లరలో సగం రైజికోవ్ కిచ్చాడు. ఇచ్చిన డబ్బు నలభై అయిదు కోపెక్కులు.

డబ్బు తీసుకుంటూ రైజికోవ్

"రాత్రికి వచ్చి కలుసుకుంటాను" అన్నాడు.

ఆ రాత్రి ఎక్కడగడపాలో ఎలా గడపాలో తెలీక వాన్యా బాధపడడం మొదలుపెట్టాడు. ఇంతవరకూ అతనికాబాధ లేకపోయింది.

"మనమీరాత్రి ఎక్కడగడపడం?" అని అడిగాడు వాన్యా.

"ఎక్కడోఒక్కడ గడుపుదాంలే. రైల్వేస్టేషన్లోమాత్రం మనల్ని పడుకోనివ్వరు."

రైజికోవ్ మెల్లగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు. వాన్యా ఒక్కడూ విచారంగా మెట్లమీద చతికిలపడ్డాడు.

బాగా చీకటిపడుతోంది. బాటసారులు అతనివంక చూడకుండానే వెళ్ళిపోతున్నారు. పేవ్‌మెంటుమీద పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళలో ఒకపిల్ల వాన్యానుచూచి బిగ్గరగా అరిచింది:

"అదుగో, కుర్రాడు! బూటుపాలిష్ కుర్రాడు. ఎలా కూచున్నాడో చూడు!"

మరోపిల్ల అతనివంక అలాగే చూస్తూ నిలుచుండిపోయింది. వెనకాలనుంచి ఆ అమ్మాయి గౌను పట్టుకుని ఎవరోలాగారు. ఆ పిల్ల నవ్వుతూ గేటుదగ్గరికి వెళ్ళిపోయింది.

"వాన్యా! భోజనం చల్లారిపోతోంది. ఎంతపిలిచినా రావేం" అని ఎవరో స్త్రీ కంఠం వినిపించింది.

"ఒకసారి, ఒకసారి, ఒకసారి!" అంటూ ఆపిల్ల పాడసాగింది.

వాన్యా చెంపనచెయ్యి పెట్టుకుని వీధికొసకు చూస్తూ కూచున్నాడు. ఇందాక తనను గద్దించిన ఆ ఇంటియజమాని తిరిగి వస్తూ ఉండడం కనిపెట్టాడు.

"ఇంకా ఇక్కడే కూచున్నావా? వాడేడీ, నీస్నేహితుడు" అని అడిగాడు వృద్ధుడు.

"వెళ్ళిపోయాడు."

"నీవుకూడా వెళ్ళిపో. రాత్రి అయింది. ఇప్పుడిక నీ పాలిష్ కోసం ఎవరూ రారు. కాని, ఓ అబ్బాయ్! రేపు ఆరబ్బరుమడమలు తెచ్చిపెట్టు. ఏం?"

"ఇక్కడికి షాపు ఎంత దూరమండీ" అని అడిగాడు వాన్యా.

"షాపులో నీవేం కొంటావు, సిగగొట్లా!"

"అబ్బెబ్బె కాదు. షాపు ఎటువైపుంది?"

"అటు— ఆ మూలకు వెళ్ళు."

వాన్యా తన బ్రష్‌లు, డబ్బాలు సర్దుకున్నాడు. స్టాండు పట్టుకుని షాపు వెతుక్కుంటూ అటు వెళ్ళిపోయాడు.

8

రాత్రి

ఆ రాత్రి వాళ్ళిద్దరూ ఒక గడ్డివాములో పడుకుని నిద్ర పోయారు. అది నగరానికి అట్టే దూరంలో లేదు. ఆ వీధి దాటి రెండు మలుపులు తిరిగితే రైలుపట్టాలు వస్తాయి. అవి దాటి కొంత దూరం వెడితే ఒకపల్లె కనిపిస్తుంది. నిజానికి అది పల్లెలా లేదు. అక్కడికి చాలాదూరంలో దీపాలున్నాయి. అదీకాక చిట్టచివరి ఇంటి అవతల అంతా ఖాళీజాగా. ఆజాగాలో పచ్చిక అవతల గడ్డివాము ఉంది. మొత్తంమీద ఈ ప్రదేశం మెరకమీద ఉంది. అంచాత అక్కడనుంచి చూస్తే నగరంలోని దీపాలు కనిపిస్తుంటాయి. రైలు పట్టాల కూడలిదగ్గర ఒక వీధిదీపం కాంతివంతంగా ప్రకాశిస్తోంది.

వాన్యాకు ఆరాత్రి అక్కడ గడపడం కష్టంగానే తోచింది. ఇంతదూరంవచ్చి ఏకాంతంగా ఉండడం కంటె నగరంలో ఉండి పోతేనే బాగుండునవిపించింది. కాని రైజకోవ్ జేబుల్లో చేతులు పెట్టుకుని ఈలవేసుకుంటూ చరచరా ఇక్కడికి వచ్చేశాడు.

"ఎలాగైతేనేం, ఇక్కడికి చేరుకున్నాం. కొంచెం గడ్డి, కుప్ప చేసుకుందాం. వెచ్చగాఉంటుంది. బస్తీ ఏమంత దూరంలేదు. ఇక్కడ బాగానేఉంది" అన్నాడు రైజకోవ్.

వాన్యా తనస్టాండు క్రిందపెట్టాడు. అతనికి నిద్రపోవాలని లేదు. నగరంవైపు అలాచూస్తూనే ఉన్నాడు. నగరదృశ్యం ఎంతో బాగుంది. దీపాలు తళతళమెరుస్తూ కాంతులను విరజిమ్ముతున్నాయి- ఎన్నో దీపాలు. తోరణాలకుమల్లే కనిపిస్తున్నాయి. ఒక్కొక్కచోట

దీపాలతోరణం ఆరిపోయినట్లు కనిపిస్తోంది. మరొకచోట మాటిమాటికీ వెలుగుతూ ఆరిపోతూ ఉంటోంది. ఇదంతా ఒక క్రీడలాగా ఆ కుర్రవాడికి గోచరించింది. దూరంగా, పెద్దపెద్ద భవనాలు బారులుతీరి, తెరిచిన కిటికీలలోనుంచి రంగురంగులకాంతులను విరజిమ్ముతూ కనిపిస్తున్నాయి. ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ - రంగురంగుల దీపకాంతులు.

"ఏమిటది ? ఎందుకన్ని రంగురంగుల దీపాలు?... కిటికీల్లో అలా వెలుగుతున్నాయేం!" అని ఆశ్చర్యంతో అడిగాడు వాన్యా.

గడ్డిని సర్దుకుంటూ క్రైజికోవ్ "నీ వడిగేదేమిటి ?" అని ప్రశ్నించాడు.

"ఆ కిటికీలలో అన్ని రంగురంగుల దీపాలెందుకు ?" అని

"ఎందుకా ? ఎవరిదీపం వారిది. రకరకాల దీపాలు. ఎవరికి నచ్చిన రంగుదీపం వాళ్ళు పెట్టుకుంటారు. ఆడవాళ్ళకు ఎర్రదీపాలంటే ఇష్టం."

"అంటే వాళ్ళు డబ్బున్నవాళ్లా ?" అని అడిగాడు మళ్ళీ ఆ కుర్రవాడు.

"ఉన్నవాళ్ళూ ఉన్నారు, లేనివాళ్ళూ ఉన్నారు. అందరూ పెట్టుకుంటారు. ఆ దీపాలను పేపరుతో చెయ్యొచ్చు. గదిలో ఒక్కొక్కప్పుడు దీపం తప్ప మరేమీ ఉండదు. తీరా వెళ్ళి చూస్తే తీసుకుపోవడానికి ఏమీ కనిపించదు. ఇట్టే నిరాశపడిపోతాం. ఇంతా వెళ్ళి వట్టి దద్దమ్మలమైపోతాం..."

"అక్కడికెందుకూ వెళ్ళడం ? దొంగిలించడానికా ?"

"దొంగిలించడం అనేమాట మనభాషలోలేదు. దాన్ని మనం తీసుకోవడమనే అంటాం."

"నేను రేపు అక్కడికి వెళ్ళిపోతాను. ఆ ప్రదేశంపేరు 'ఫస్ట్ ఆఫ్ మే' కదూ ?

"నీకు నేర్పు ఉండాలికాని అక్కడ ఏమైనా తీసుకోవచ్చు."

"నే నెందుకు తీసుకోవాలి ?"

"ఓరి వెర్రివాడా! పిచ్చిపుల్లాయివంటే నిజంగా నీవే! ఎందుకు తీసుకోవాలా! అంటే ఏమిటి నీ ఉద్దేశం?"

అక్కడికి బ్రతకడానికి వెళుతున్నాను. వెళ్ళి...తీసుకోవడమూ!"

"ఏం తీసుకుంటే?"

"తీసుకుంటే ఏమీ లేదు. జైల్లో పడతాం."

"జైల్లో పెట్టడానికి వాళ్ళకు నీవు దొరికితే కదా."

"ఆ పప్పులేం ఉడకవు. ఇగోర్‌ను ఇట్టే పట్టుకున్నారు."

"వాణ్ణి పట్టుకున్నారంటే అది వేరు. వాడు వట్టి తెలివితక్కువ వాడు కనుక. పోస్టాఫీసుకు వెళ్ళి డబ్బు కొట్టెయ్యడమంటే తమాషాలా! అయితేనేంలే! వాడికేం ఫరవాలేదు. వాడికింకా మైనార్టీ తీరలేదు. ఖైదులో పెట్టరు"

గడ్డివామిలోనుంచి రైజకోవ్ కొన్ని గడ్డిపరకలు ఇవతలికి లాక్కున్నాడు. పరుపులా పరుచుకుని దానిమీద పండుకున్నాడు.

ఇలా కొంతసేపు గడిచింది. వాన్యా ఇలా అన్నాడు:

"మాఊళ్ళో ఒక గార్డు ఉండేవాడు. అతనికొక కొడుకు. అతని పేరు మిషా. అతనిప్పుడు 'ఫస్ట్ ఆఫ్ మే' కాలనీలో ఉంటున్నాడు. మొన్ననే ఒక ఉత్తరం వ్రాశాడు."

"ఫస్ట్ ఆఫ్ మే" అంటూ రైజకోవ్ "దాసంగతి తరువాత చూద్దాం. ముందు నీవు హాయిగా పడుకో" అన్నాడు.

వాన్యా మౌనంగా ఎంతోసేపు అలాచూస్తూ కూచున్నాడు. తరువాత కొంతసేపటికి అతనికి నిద్రపట్టింది.

ఆకాశంలో నక్షత్రాలు మిలమిలమెరుస్తున్నాయి. వాన్యా తలమీద గడ్డిపరకలు గాలికి కదలాడసాగాయి.

◆ ◆ ◆

వాన్యా పెందలాడే లేచాడు. కాని అప్పటికే తెల్లవారిపోయింది. ప్రొద్దుపొడుస్తోంది. వాన్యా చలికి గడగడవణికాడు. అలా

వణుకుతూనే లేచి నిలుచున్నాడు. అతని బట్టలకు గడ్డిపరకలు అంటుకుని ఉన్నాయి. వాన్యా నగరంవంక చూచాడు. ఇప్పుడది ఇంకో కలా కనిపించింది. వీధి దీపాలు ఇంకా ఆరిపోలేదు. అనవసరంగా, తెల్లవారినా వెలుగుతూనే ఉన్నాయి. అందులో రైలుపట్టాల కూడలిలో ఉన్న దీపం ఒకటి.

రాత్రిలాగా నగరం అందంగా లేకపోయినా చూడడానికి మాత్రం ఎంతో ఉత్సాహం కలిగిస్తోంది. అందంగా కనిపించకపోతేనేం. ఎన్నో ఇళ్లు, భవంతులు, తెల్లని స్తంభాలతో కళకళ్లాడుతున్నాయి. నగరమంటే అదే నగరం. తను అక్కడికి వెళ్ళాలి. వెళ్ళి అన్నీ చూడాలి. కొంతడబ్బు సంపాదించి తను అక్కడికి వెడదామనుకున్నాడు. డబ్బుంటే ట్రాంలో వెళ్ళవచ్చు, నగరంలో సినిమాకూడా ఉంటుంది. నిన్న సాయంకాలం తను బూట్లు పాలిష్‌చేసిన వీధి జ్ఞాపకం వచ్చింది. ఆ వీధిలోకి బూటు పాలిష్ చేసేవాడు వచ్చినందుకు నిన్న ఒకాయన ఎంతో సంతోషించాడు. అక్కడికి వెడితే చేతినిండా పనే. బూట్లు పాలిష్ చేయించుకునేందుకు ఎంతోమంది వస్తారు. తన స్టాండులో ఇంకా నల్లరంగు కావలసినంత ఉంది. స్టాండు తీసుకుని త్వరగా నగరంలోకి వెళ్ళిపోతే మంచిది. స్టాండు తీసుకుందామని వాన్యా క్రిందికి వంగాడు. కాని అది అక్కడ కనిపించలేదు. కాలితో గడ్డిని అటూ ఇటూ కదిలించి వెదకడం మొదలుపెట్టాడు. చుట్టుప్రక్కల కలయచూచాడు. తన స్టాండే కాదు. రైజ్‌కోవ్ కూడా అక్కడ లేడన్న విషయం అతనికి తెలిసిపోయింది. గడ్డివామిచుట్టూ ప్రదక్షిణంచేసి, నిరాశతో వెనక్కువచ్చేశాడు. నగరంవంక దృష్టి నిలిపి ఒకమాటు చూచాడు. మళ్ళీ ఆ ప్రదేశమంతా వెయ్యి కళ్ళతో వెదికాడు. కాని లాభంలేకపోయింది. నిరాశచెంది గడ్డివామికి చేరగిలబడ్డాడు. ఏవేవో ఆలోచనలు అతన్ని వేధించసాగాయి. హఠాత్తుగా అతనికొక విషయం జ్ఞప్తికివచ్చింది. లేచి నిలుచున్నాడు. జేబులు తడుముకున్నాడు. జేబుల్లో చెయ్యిపెట్టివెతు

కున్నాడు. లోపలి గుడ్డను పైకితీశాడు. పదిరూబుల్నో మటు మాయమయినాయి.

వాన్యా రోడ్డువంక రెండడుగులు వేసి అక్కడ ఆగిపోయాడు. ఇప్పుడిక నగరానికి వెళ్ళినా ప్రయోజనంలేదు.

9

ప్రశ్నల పద్మవ్యూహం

నెలరోజులు గడిచాయి. ఒకనాడు తెల తెలవారుతూ ఉండగా ఆహ్వానమందిరంలోకి ఒక రక్షకసైనికుడు వచ్చాడు. అతను యువకుడు. చురుకైనవాడు. తనవిధిని తను తెలుసుకునే వ్యక్తి. అప్పటికింకా ఇగోర్ గదిలో నిద్రపోతూనే ఉన్నాడు. అతన్ని లేపుతూ రక్షకసైనికుడు ఇలా అన్నాడు:

"వెళ్ళడానికి టైం అయింది. కాలనీలో ఉంటే కావలసినంత నిద్ర. కాని నేనుమాత్రం తొమ్మిదిగంటలకల్లా తిరిగివచ్చేయాలి."

ఇగోర్ వదులుగా ఉన్న తనజాకెట్టును సర్దుకున్నాడు. జాకెట్టు లోపల వేసుకున్న షర్టు చాలా పొట్టిది. దాని కాలరు పసుపు పచ్చగా ఉంది. కాలరు జాకెట్టుమీదికి లాక్కున్నాడు.

పనివాళ్ళు చీపుళ్ళుతీసుకుని వీధులూడుస్తున్నారు. నలువైపుల దుమ్ము రేగుతోంది. నగరవాతావరణం ఎంతో హాయిగొలుపు తోంది. ప్రశాంతమైన ఉదయం, ఇంతచక్కని వాతావరణంలో నూతనజీవిత ప్రాంగణంలో అడుగుపెడుతున్నందుకు ఇగోర్ ఎంత గానో ఆనందిస్తున్నాడు.

అయితే అందులోని నూతనత్వంపై అతనికి అంతగా ఆసక్తి లేదు. మాటిమాటికీ ఈ నూతనజీవితాన్ని గురించి పొలీనానికోల

యవ్నా వర్ణిస్తూఉండేది. జీవితం పాతదైనా కొత్తదైనా ఇగోర్ కు ఒకటే. పాతకొత్తలతో ప్రమేయం లేకుండా సాధారణజీవితంమీదనే అతనికి ఆసక్తిఎక్కువ. నిన్నటినిగురించి అతను ఆలోచించడు. రేపటిని గురించి ఆందోళన పడడు. కేవలం ఇవాల్టినిగురించే ఎల్లప్పుడూ అతని ఆలోచన. ఇవాళఅనేది అతనికొక పుస్తకంలోని ఒకపుట వంటిది. దానినిమాత్రమే అతను ఎంతో జాగ్రత్తగా పరిశీలిస్తాడు, పఠిస్తాడు. మహోత్సాహంతో రెండుకళ్ళూ విప్పార్చి వింతలకోసం వెదుకుతూఉంటాడు. ఇవాళమాత్రం అతనికి మరీ బాగుంది. ఈ నెల రోజులూ అతనికి పాడినదే పాటగాఉంది. చదివిన పుటనే చదివినట్లుగాఉంది. చెప్పలేనంత విసుగుకలిగింది.

ఇప్పుడేకాదు. ఇంతకుముందుకూడా చాలాసార్లు అతను అక్కడకి హాజరుకావలసివచ్చింది. బాలనేరస్థులను విచారించే కమిషన్ ఎదుట హాజరుకావడం కొత్తకాదు కనుక అతనికేమీ వింత అనిపించలేదు. అక్కడ పొలేనానిగోలయవ్నా అనే ఆవిడ ఉంది. ఆవిడకక్కడ ఉద్యోగం. చాలా తెలివైంది మంచిది, ఆమెతో అతనికి ఇదివరకే పరిచయమయింది. తనవైపు విచారంగా చూస్తూ మర్యాదగా పలకరించి ప్రశ్నించేది. తన తల్లి దండ్రులెవరో, తన, చదువు సంధ్య లేమిటో, ఎందుకీ నేరంచేయవలసివచ్చిందో—అన్నీ అడిగి 'ప్రశ్నావళి' అనే శీర్షిక క్రింద వ్రాసుకునేది. ఏడాదిక్రితం ఏ జవాబు వ్రాసుకుందో ఇప్పుడూ అవే వ్రాసుకుంది. ఆమె ఎంత మర్యాదగా అడిగిందో అంత మర్యాదగా ఇగోర్ సమాధానాలిచ్చాడు. తనవంటి పిల్లవాళ్ళ అవసరాలు ఏమిటో విసుగులేకుండా ఆమె అడిగి తెలుసుకుంటున్నదని అతను అనుకున్నాడు. అవసరాలను అడగడమేకాక వాటినెంతో నేర్పుతో నెరవేర్చేది. ఇందుకుగాను ఆమె తీసుకుంటున్న జీతం ఏమంతఎక్కువ కాదు. మర్యాదస్థులంటే ఆమెకెంతో మక్కువ. ఆమెతో మర్యాదగామాట్లాడి ఆమెను సంతోషపెట్టడమే అతనికి కావలసింది.

ఇగోర్ ను పిలిచి ఆమె ఇలా అడిగింది:

"మీ నాన్న ప్రొఫెసర్ కదూ?"

"అవును."

"లెనిన్‌గ్రాడ్‌లోనేనా?"

"అవును."

"ఇంటి కెళ్లాలని నీకెందుకు కనిపించడం లేదూ?" అంటూ ఆమె పెన్సిలుతో బల్లమీద కొట్టింది.

"మా నాన్నకూ నాకూ సరిపడదు. ఆయన పద్ధతి వేరు, నా పద్ధతి వేరు. వట్టి కర్కోటకుడు, మొరటు, మా అమ్మకూ కూడా ఎంతో ద్రోహం చేశాడు. ఆయనా నేనూ ఒక ఇంట్లో ఉండడం కుదరదు."

"మీ ఇద్దరూ తరుచు దెబ్బలాడుకుంటూ ఉండేవారా?"

"లేదు. అసలు ఆయనతో మాట్లాడడమంటేనే నాకసహ్యం."

"మీ అమ్మమీద నీకు కనికారం లేదా ఇగోర్?"

"ఎందుకు లేదూ? ఉంది. మా అమ్మను తలుచుకుంటేనే నా గుండె నీరవుతుంది. కాని మా నాన్నను మాత్రం విడిచిపెట్టి రానంటుంది."

"నీ వెంతో బాగా బ్రతికిన కుర్రవాడివి కదా, ఇలాంటి తప్పుడు పనులు యెప్పుడు మానుకుంటావు ఇగోర్?"

"నాకు మరోదారి లేదు, పోలీనా నికోలయెవ్నా! నన్ను బలవంతంగా వాళ్ళు మా నాన్న దగ్గరకు రెండుసార్లు పంపించారు. అయినప్పటికీ నేనక్కడ ఉండలేకపోయాను."

"అయితే ఈసారి మేము నిన్ను మీనాన్నదగ్గరకు పంపించ మనుకో. అప్పుడెలా ఉంటుంది నీకు?

"చాలా బాగుంటుంది."

"మరి ఇంక తప్పుడుపనులు చేయనంటావా?"

"ఇక చేయననే అనుకుంటాను."

"చేయనని ఎందుకనుకుంటున్నావు?

"నాతో ఇంత అప్యాయంగా మాట్లాడింది మీ రొక్క రే కనుక."

"నా మాటలు నీకంత మధురంగా ఉన్నాయా? నీమనస్సును మార్చగలుగుతున్నాయా?" అంటూ ఆమె కృతజ్ఞతతో అతనివంక చూచింది.

"అవును. అవి నా కలాగే అనిపిస్తున్నాయి."

"అయితే నేనేమిటి చేయగలను ఇగోర్? ఎప్పుడూ నీతో అలా మాట్లాడుతూ కూచోనడ మెలాగ. నీలాంటివాళ్ళు ఇక్కడ చాలామంది ఉన్నారని నీకు తెలుసు కదా.

వాకిలవతల తమవంతు ఎప్పుడొస్తుందా అని చాలామంది పిల్లవాళ్ళు ఎదురుచూస్తూ నిలబడి ఉన్నారు. ఆమె తన పెన్సల్‌తో, వాకిలివైపు చూపిస్తూ"వాళ్ళసంగతేమిటో కనుక్కోవద్దూ?"అన్నది.

అతని చెయ్యిపట్టుకుని కష్టతరమైన జీవితపథంలోనుంచి అతన్ని అవతలకి తీసుకుపోలేకపోయాననే దిగులు ఆమె – ముఖంలో స్పష్టంగా కనిపించింది. ఆమె ముఖ కవళికలన్నీ ఇదే భావాన్ని వ్యక్తం చేశాయి. ఆమెను చూచి అతను అర్థంచేసుకున్నాడు. అతని కెంతో సానుభూతి కలిగింది. ఆమె తనవంటివారెంతోమంది బాగోగులను చూడవలసి ఉంటుందని అతనికి తెలుసు. ఆమెవంక అతను సానుభూతితో చూచాడు. ఆమె కళ్ళను క్రిందికి దించుకుని ఎంతో బాధపడుతున్నట్లు, వణుకుతున్న చేతులను బల్లమీద పెట్టింది. పెన్సలుతో బల్లపై మెల్లగా తాకింది.

కొంతసేపటికి అక్కడికొక వ్యక్తి వచ్చాడు. తెల్లని గౌను వేసుకున్నాడు. జుట్టు నెరిసుంది. కనుబొమలమీద చిందరవందరగా పడుతోంది. ఎర్రని జీరలతో కనుగుడ్లు ఉబ్బినట్లు కనిపిస్తున్నాయి. మోయలేని బరువు ఈడుస్తున్నట్లు కనిపిస్తున్నాడతను.

"సలహా గదిలోకి వెళ్ళు ఇగోర్" అంటూ ఆమె అటు ప్రక్కకు చూపింది. "ఈ కామ్రేడ్ నీకేపని ఇవ్వాలో ఆలోచించి చెపుతాడు" అన్నది.

ఇదివరకు ఇలాంటి పరీక్షకు ఇగోర్ నిలబడ్డాడు. కాని అప్పటి పరీక్షకుడు వేరు. తెల్లగౌను వేసుకున్న ఈ వ్యక్తిమాత్రం కాదు. తను కూచున్న చోటునుంచి ఇగోర్ అణకువతో లేచి అద్దాల్తోవన నడవసాగాడు. ఈ అద్దాల్తోవ తనజీవితంలో నూతనమార్గం అవునో కాదో అతను గ్రహించుకోలేక పోయాడు. తెల్లనిగౌను వేసుకున్న ఆవ్యక్తీ, ఇగోర్, కొద్దిసేపట్లోఒకగదిలోకి వెళ్లారు. గదిలో రక రకాల తెల్లని వస్తుసామాగ్రి ఉంది. అక్కడ ఒక కుర్చీమీద ఇగోర్‌ను నిలుచోమన్నాడా వ్యక్తి. ఆ గదిలోఉన్న ఇంకొకవ్యక్తితో అతనిలా చెప్పాడు:

* "మనమిక ఇతన్ని పరీక్షిద్దాం. పద్మవ్యూహపు పరీక్ష"

పరీక్షమాట చెవినపడగానే ఇగోర్‌కు వణుకురావడం మొదలు పెట్టింది. తెల్లని టేబిల్ మీద కూచుని తన్నుతాను నిభాయించు కున్నాడు. తన జీవితంలో నూతనాధ్యాయం మొదలవుతుందని కలలు కనసాగాడు. కాని తెచ్చుకున్న ధైర్యం ఇట్టే సడలి పోయింది. అతని ముందర పెట్టిన కార్డుబోర్డు చూచేసరికి గాభరా పుట్టింది. బోర్డునిండా చిత్ర విచిత్రంగా గళ్లు, రకరకాల గీతలు, త్రోవలు, గీసి ఉన్నాయి. ఆ మిడిగ్రుడ్ల పరీక్షకుడు టేబిల్ మీద చేతులువేసి బొంగురుగొంతుతో ఇలా అడిగాడు:

---

* పిల్లల తెలివితేటలను పరీక్షించేందుకు సోవియట్ రష్యాలో కొందరు శాస్త్రవేత్తలు ఈ పథకాన్ని కనిపెట్టారు. దీనివల్ల ఎంతోచెరుపు కలుగుతున్నదని 4 జులై, 1936 న సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ పేర్కొన్నది ఈ పద్ధతి విద్యార్థుల చదువుతోకాని, వారి ఉపాధ్యాయులతోకాని ఎట్టి ప్రమేయం పెట్టుకోకుండా అవిచ్ఛన్నంగా సాగడం ప్రమాదకరమని స్పష్టం చేసింది. ఈవిధానం కుహనావైజ్ఞానిక పరిశోధనలకు, పెక్కు నిరర్థక ప్రమాద కర పరీక్షలకు దారితీస్తున్నదనీ, విద్యార్థుల మనస్తత్వాన్ని సక్రమంగా అవగతం చేసుకోవీయక విద్యార్థుల తల్లిదండ్రులను విద్యార్థులను అర్థంలేని హాని కరప్రశ్నావళితో ముంచెత్తుతున్నదనీ, పిల్లల మానసికాభివృద్ధికి అవరోధం కలిగిస్తున్నదనీ కేంద్రకమిటీ విశదంగా విశదపరిచింది. అందువల్ల నాటినుంచీ ఈవిధానం దేశంలో రద్దుఅయి విద్యావిధానం చక్కగ రూపొందించబడింది.

"ఓ అబ్బాయ్! ఇటుచూడు. ఈ బోర్డు కేసిచూడు. ఇందులో రకరకాల త్రోవలున్నాయి. నీవు మధ్యన చిక్కుపడ్డావనుకో. ఏ త్రోవగుండా బయటికి రాగలవో ఆలోచించి చెప్పు. ఇదిగో పెన్సిలు; ఏ త్రోవ చూపిస్తావో చూపించు, చూద్దాం."

ఇగోర్ వాళ్ళవంక చూచాడు. కాని అభ్యంతరం చెప్పలేదు. ఉద్యోగి చేతుల్లోనుంచి పెన్సిలు పుచ్చుకుని నవ్వుతూ బోర్డుమీద గీసిఉన్న పద్మవ్యూహాన్ని పరిశీలించసాగాడు. అందులో బయటికివచ్చే త్రోవఒకటి ఉంది. అది నిష్క్రమణం. ఇగోర్ తన పెన్సిలను అక్కడికి పోనిచ్చాడు కాని, అక్కడది ఉంచకుండానే చిట్టచివరకు తీసుకెళ్ళి అక్కడ ఆగిపోయాడు. ఇంతలో బయటినుంచి ఏదో చప్పుడు వినిపించింది. ఇగోర్ అటువైపు చూచాడు. బాల్కనీమీద ఒక అమ్మాయి నిలుచుని అక్కడ వ్రేలాడుతున్న రగ్గును కర్రతోకొట్టి దులుపుతోంది. ఇగోర్ తనముందున్న కార్డుబోర్డువంక చూచి

"ఎలాగోఒకలాగు దీనిఅంతు కనుక్కోవాలి" అనుకున్నాడు.

అతనిలా అనుకున్నాడో లేదో ఒక్కక్షణంలో ఆ మిడిగ్రుడ్ల మనిషి బోర్డు అవతలికిలాగేసి అక్కడ మరొకటిపెట్టాడు. ఇదికూడా పద్మవ్యూహపు బోర్డే. బోర్డుమీద ఒకమూల ఒకమేకపోతు బొమ్మ ఉంది. అది పనికిరాని ఏదో పండును తింటున్నట్లుంది. మరోమూల చేతిలో కర్రపట్టుకుని ఒక అమ్మాయి నిలుచునిఉంది. ఇగోర్ నవ్వుతూ ఆ అమ్మాయి బొమ్మవంక చూచాడు. అయితే ఈచివరనుంచి ఈ అమ్మాయి కర్ర పట్టుకుని ఆ మేకపోతుదగ్గరికి వెళ్ళేలోపునే అది తినదలుచుకున్న దేదో హాయిగా తినేస్తుంది.

ఇగోర్ ఇలా అనుకుంటూ తెల్లగౌను వేసుకున్న పరీక్షకుని వంక చూచాడు.

"దీనికి అర్థం పర్థం లేదు" అన్నాడు.

"దేనికి?"

"ఎందుకక్కడ ఆ బాగాలు? ఆ మేక అక్కడి కెలావచ్చింది!"

"నీవు గదిచుట్టూ చూస్తూ కూచున్నావంటే ఇహ నీకు బయటికి వెళ్ళేమార్గం కనిపించదు."

ఇగోర్ బోర్డువంక శ్రద్ధగా పరిశీలించాడు. మేక ఎంతో సాధువుగా కనిపించింది. దాన్ని అనవసరంగా అవతలికి తరమడం అతని కిష్టం లేకపోయింది.

"దాన్నెందుకు తరమడం! దాన్నలా మెయ్యనివ్వండి" అన్నాడు.

"అంటే ఏమిటి నీ ఉద్దేశం"

"అదలా మేసినందువల్ల మన కేమీ నష్టం లేదు. ఏవో నాలుగు గడ్డిపరకలు - తిననివ్వండి."

"అవి గడ్డిపరకలు కావనుకో, పండ్ల మొక్కలనుకో అప్పుడు?"

"అవి కాందే నేనలా అనుకోను? ఏదో పోతుందని మీరేం దిగులుపడక్కర్లేదు. గడ్డిపరకలేగా."

"ఏమిటలా మాట్లాడుతున్నావు?" అంటూ ఆ పరీక్షకుడు బోర్డును తీసివేశాడు.

"ఇక మనం ఫ్లాట్‌పరీక్ష పెడదామా?" అంటూ మరొకతను పరీక్షకుణ్ణి అడిగాడు.

"వద్దు" అంటూ పరీక్షకుడు నీళ్ళతొట్టి దగ్గరికి వెళ్ళాడు, వేళ్లు జాగ్రత్తగా కడుక్కొని వాకిలివైపుకు వెళ్ళాడు

అవతలికి వెడుతూ "నాతోరా" అని ఇగోర్‌ను పిలిచాడు.

పోలీనానికోలయవ్నా అవతలగదిలో కుర్చీలో కూచుంది. ఎదురుగా ఉన్న కుర్చీమీద వంగుని పరీక్షకుడు నిలుచున్నాడు.

"పరీక్ష బాగా జరిగిందా?" అని ఆమె అడిగింది.

"మట్టి బద్దులైయి. ఏమీ తెలీదు. ఒక్కటీ రైట్ లేదు. బుర్ర బొత్తిగా లేదు, అంతా అపసవ్యం, ఊహాశక్తి శూన్యం, చొరవ అంతకుముందే లేదు" అని పరీక్షకుడు బదులు చెప్పాడు.

"ఏమిటి మీరంటున్నది? అతనికి చొరవలేదా? చాలా ఉంది. ఇది చదివి చూడండి" అంటూ ఆమె కాగితం యిచ్చింది.

అతను కాగితం జాగ్రత్తగా చూడసాగాడు.

"ఇందులో ఉన్నదానికి రెండర్థాలు చెప్పవచ్చు నికోలయవ్నా. ఇది అతని చొరవకు నిదర్శనమో, అనుకరణకు ఉదాహరణో ఎలా చెప్పటం? అంటూ అతను కోపంతో ఆ కాగితాన్ని ఆమెకు మళ్ళీ ఇచ్చి వేశాడు. "ఇలాటివాటివల్ల ఏమీ లాభంలేదు. అంత మాత్రంచేత వీడికి తెలివి ఉన్నదని ఎలా చెప్పడం?" అన్నాడు.

"కాదు. మీరు పొరబడుతున్నారు. మళ్ళీ ఇంకొకసారి పరీక్షించండి. పరీక్షిస్తే మీ తప్పు మీకే తెలుస్తుంది" అన్నదామె.

తనను ఆమె అవమానిస్తున్నట్లు బాధపడి అతను చరచర సలహాగదిలోకి వెళ్ళిపోయాడు:

"బాగుంది. చాలా బాగుంది" నికోలయవ్నా ఇగోర్‌ను చూచి ఇలా అడిగింది:

"ఎందుకిక్కడ కూచున్నావు?"

ఇంతసేపూ ఇగోర్ ఆ మిడిగ్రుడ్ల మనిషివైపు చూస్తూనే ఉన్నాడు. పరీక్షకుడు కోపంగా గదిలోకిపోయి తలుపు వేసుకున్నాడు.

"అందులో ఏమైనా అర్థముందా నికోలయవ్నా?" అని అడిగాడు ఇగోర్.

"అలా అంటేకాదు. ఆ ప్రశ్నలకు నీవు సమాధానం చెప్పాలి" అంటూ ఆమె అతనివంక చూచింది.

"ఎందుకు చెప్పాలి? ఎందుకాబోట్టు?

"నీ శక్తియుక్తుల్ని పరీక్షించడానికి."

"ఎందుకు పరీక్షించడం!"

"వెళ్ళిపో ఇగోర్. నాతో వాదించకు."

ఇగోర్ మళ్ళీ పలహారగదిలోకి వెళ్ళాడు. మౌనంగా గోడకు చేరబడి నిలుచున్నాడు. ఆ మిడిగ్రుడ్ల పరీక్షకుడు ఫైళ్ళన్నీ తిరగేశాడు. డ్రాయర్లు వెదికాడు. అతనలా వెతుకుతూ ఉంటే ఇగోర్ కు కోపం ఆగిందికాదు. తను ఏకాకిననే విషయం జ్ఞప్తికి వచ్చింది. గడిచిన అనేక స్మృతులు మనస్సులో ముసిరాయి. రైలుస్టేషన్, వాన్యాతో ఎడబాటు, తన చిన్ననాటి ముచ్చట్లు, తనతల్లి...తన ఆకతాయి తనం, నిర్దయుడైన తండ్రి, మిగిలిన కర్కోటకపు మనుష్యులు; అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

పరీక్షకుడు ఒక పెట్టెను తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టాడు. అది ఒక అరల పెట్టె.

"కూర్చో" అన్నాడు పరీక్షకుడు.

...గత నెలరోజుల జీవితం ఇగోర్ జ్ఞప్తికి తెచ్చుకోసాగాడు. విశాలమైన నేవ్ మెట్లమీద సైనికోద్యోగితో తాను వెళ్ళడం గుర్తుకొచ్చింది. అవును ఆ నెలంతా దుర్భరంగా గడిచింది. ఎక్కడా ఉత్సాహమన్న మాటలేదు. కాలం వ్యర్థమైపోయింది. నికోలయువ్నా తనను నూతన జీవితం ప్రారంభించమని పదేపదే చెప్పింది. గౌను వేసుకున్న ఈ పరీక్షకుడు తనముందు రకరకాల బొమ్మలు పెట్టాడు.

అక్కడున్న నెల్లాళ్ళలోనూ అతనెంతో శ్రద్ధగా అన్నీ తెలుసుకున్నాడు. కార్డుబోర్డులో ఉన్న రహస్యపు రహదారులు, ఫ్లాట్ పరీక్షలోని జటిల సమస్య అవగతం చేసుకున్నాడు. ఈ పరీక్షలకు వెడుతుంటే అతనికెంతో సరదాగా ఉండేది. బొమ్మలలో ఉన్న మేకులు ఎంతో ఆసక్తిని గొలిపేవి. గౌనులు వేసుకున్న వ్యక్తులన్నా అతనికలాగే ఉండేది. తన సునిశిత ప్రజ్ఞవల్ల పరీక్షకులను మెప్పించడమే కాక ఇతరులను పరీక్షిస్తున్నప్పుడు వారికి సహాయం చేసేవాడు కూడా. కాని అతనికి పరీక్షా ఫలితాలను లెక్కించే విద్య పట్టుపడింది

కాదు. కారణం ఉపాధ్యాయులు ఆ రహస్యాలను ఇతరులకు తెలియనివ్వకపోవడమే. "పరీక్షలు", "పరస్పర సంబంధాలు" అనే పారిభాషిక పదాలచాటున ఉపాధ్యాయులు తమ ఆధిక్యతను కప్పిపుచ్చుకున్నారు.

సలహా గదిలోకంటె ఆహ్వాన మందిరంలో ఉత్సాహం ఎక్కువ. సలహా గదిలో ఎప్పుడూ గడబిడగా ఉంటుంది. రకరకాల నేరాలు చేసిన కుర్రవాళ్ళతోనూ, వాళ్ళ చవకబారు హాస్యోక్తులతోనూ, దురలవాట్లతోనూ ఆ గది గడబిడగా వుంటుంది. ఇగోర్ పరీక్షకులకు సహాయకుడుగా ఈ పిల్లలను ప్రశ్నలు వేస్తుంటాడు.

"అబ్బాయ్! ఇటుచూడు. ఈ ఈలెతో నీవు ఆ వేపను కొట్టేవరకూ ప్యాసు కానట్లే లెక్క... ఇటుచూడు! బంతి ఎక్కడ పడింది? వాలీబాల్ నెట్‌దగ్గరికి తీసుకురా. మీదనుంచి విసరకు. చేతులతో పట్టుకో. దడి దాటాలని చూస్తున్నావా? అవన్నీ వీధుల్లో తిరిగినప్పటి అలవాట్లు. వాటిని మరిచిపో"

కొత్త విద్యార్థి రాగానే అతన్ని పరిశీలిస్తున్నప్పుడు ఇగోర్ అన్నీ జాగ్రత్తగా గమనిస్తాడు. అతనెలాగ విఫలమవుతున్నాడో కనిపెడతాడు.

"అలా చేసినట్లయితే నీ వెప్పటికీ జయించలేవు" అంటాడు.

అయితే అతన్ని బాధ పెట్టేదల్లా ఒకటి. ఆతని స్థితికీ, పరీక్షకుల స్థితికీ భేదంవుంది. ఎంతచేసినా తనకు వచ్చేది రొట్టె, వెన్న అంతే. ఇంతకంటె పోస్టాఫీసులో తను చేసినదానికి లాభం ఎక్కువ. దానికి ఇంత శ్రమకూడా లేదు. ఆట్టే సరంజామా అక్కర్లేదు.

ఇప్పుడు రక్షక సైనికుడితో వెడుతున్నప్పుడు అతనికి ఒక భావం కలిగింది. పోస్టాఫీసులో నాయనమ్మ పంపించినట్లు చెప్పి ఆ డబ్బు తీసుకోవడంవల్ల తనకు ఈ చిక్కువచ్చింది. తన నడత ఏమీ బాగాలేదు. ఇది సిగ్గుమాలిన పని.

కాని ఇదంతా అతని జీవితంలోని పాత్రప్రకరణాలు, గడిచి పోయిన పేజీలు. అతని జీవితంలో ఒక నూతనాధ్యాయం అతి త్వర లోనే ప్రారంభమవుతుంది. ఇద్దరూ బస్తీమధ్య కొచ్చారు. వీధులు దాటి కొత్తప్రదేశాలకు చేరుకున్నారు. సందులు దాటి మార్కెట్టు దగ్గరికి వచ్చారు. మార్కెట్టు బండ్లతో నిండిఉంది. అది దాటి కొరోషిలోవ్కా చేరుకున్నారు. అక్కడ విశాలమైన ప్రదేశం ఉంది. ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ఇళ్ళుచిన్నవి. ఇళ్ల మధ్య పూలతోటలు. పూలచెట్లు వికసించిఉన్నాయి. ట్రాంలు గడబిడగా వస్తున్నాయి, పోతున్నాయి.

కొరోషిలోవ్కా దాటిన తరువాత ట్రాం లైనులకు మధ్యగా ఒకరోడ్డు ఉంది. ట్రాం ఎక్కి కొంతదూరం వెళ్ళగానే సింధూరపు చెట్లతోనిండిన ఒకతోపు ఉంది. సైనికోద్యోగి ఇగోర్‌ను ఆతోపు లోకి తీసుకెళ్ళాడు. తోపుకూ తోపుకూ మధ్య ఒక రోడ్డుఉంది. ఆ రోడ్డు మొదట్లో తీగెలకు వ్రేలాడుతూ ఒకబోర్డు ఉంది, ఆబోర్డు మీాదఉన్న అక్షరాలు ఇవి: ది ఫస్ట్ ఆఫ్ మేకాలనీ.

10

తొలి భావాలు

ఆ రక్షకసైనికుడు, ఇగోర్ చరచరా నడుచుకుంటూ వెళ్ళి పోతున్నారు. తన కర్తవ్యాన్ని తాను నిర్వహించానని ఉద్యోగి సంతృప్తిపడ్డాడు. ఇగోర్ కూడా తాను నూతనజీవితపు సరిహద్దులలో ఉన్నానని సంబరపడ్డాడు.

రోడ్డువెంట వెళ్ళి మలుపు తిరిగేసరికి భవనాలపై కప్పులు కనిపించాయి. వెళ్ళగావెళ్ళగా అక్కడొక ఎన్నో ఎకరాలక్షేత్రం కని పించింది. చేను పూతపెట్టింది. రై పూలు కమ్మనివాసనలు వెదజల్లు తున్నాయి ఆక్షేత్రం అవతల నలువైపులా విశాలమైన వనాలు

కన్నాయి. వనాలముందు కాలనీ ఉంది. కాలనీలో ఒక భవనంమీద ఉండు జండాలు రెపరెప ఎగురుతున్నాయి. ఆజెండాలు చూడడానికి చాలా వింతగా ఉన్నాయి. ఎంతో సన్నగా, పొడుగ్గా ఉన్న ఆ జెండాలు చూచేసరికి ఇగోర్‌కు ఒకవిషయం జ్ఞాపకంవచ్చింది. చాలాకాలం క్రితం తాను కథలపుస్తకాల్లో ఇలాంటి జెండాలనే చూచాడు. ఇలాంటి భవంతులనే కన్నాడు. "ఈభవనాల్లో వాళ్ళు నివసిస్తూ ఉంటారా?" అని అతన్ని అడిగాడు

ఈ ప్రశ్నకు రక్షకసైనికుడు ఆశ్చర్యపడి "ఆ, అవును. మరెక్కడ నివసిస్తారనుకుంటున్నావు?" అని ప్రశ్నించాడు.

"ఏవో జెండాలు. అంతేకదూ? ఎంత చిత్రంగా ఉన్నాయో!"

"అవును. అవి చాలా చిత్రమైనవి. అద్భుతమైనవి. ఇక్కడ కనిపించే ప్రతీదీ అద్భుతమైనప్పటికీ, అన్నీ ఎంతో మంచివి. అంతా నిర్మాణయుతంగా సాగిపోతూ ఉంటుంది."

ఇగోర్ భుజాలు సర్దుకుని చేతులు జేబుల్లో పెట్టుకున్నాడు. కాని దృష్టిమాత్రం ఆ జెండాలమీదనే లగ్నమైఉంది. గాలికి పతాకాలు ఎగురుతున్నాయి. భవనంమీద రెండు గోపురాలున్నాయి. వాటిమీద జెండాకొయ్యలపై పతాకాలు ప్రతిష్ఠితమయ్యాయి.

"ఆ గోపురాలే పెద్ద భవనాల్లాగా ఉన్నాయే! ఏదో పెద్ద మహల్‌లాగా ఉంది" అన్నాడు ఇగోర్.

"మామూలు భవనాన్ని మహల్‌తో పోల్చకూడదు."

ఇగోర్ అతనితో వాదించదలుచుకోలేదు. కాని అతనికా గోపురాలు దివ్యహార్మ్యాలను జ్ఞాపకం తెచ్చాయి. ఈ భావం అతనికి ఆనందం కలిగించింది. కాని తను ఈ హార్మ్యంలోనే నివసించబోతున్నట్లు అతనికి తెలిసిందికాదు.

ఇరువురూ భవనందగ్గరికి వచ్చారు. దగ్గరకొచ్చి చూడగానే అది దివ్య హార్మ్యంలాగా కాక మామూలు భవంతిలాగే కనిపించింది.

భవనం చక్కగా నిర్మితమైంది. రెండంతస్తుల కట్టడం. గోడలు తెళతెళ లాడుతున్నాయి. ఇంటికప్పుకు సరాసరి మెత్తులో కిటికీలు అమర్చి వున్నాయి. అక్కడ వున్న గోపురాలమీద జెండాలు ఎగురు తున్నాయి. భవనముందు ఒక రోడ్డు వుంది. రోడ్డుమీద వరుసలుగా పూలమొక్కలు వేశారు. రోడ్డుదాటి యిరువురూ భవనముందుకు వెళ్ళారు. రకరకాల పూలు వికశించివున్నాయి. ఇన్ని పూల మొక్కలను ఇగోర్ చూచి చాలాకాలమైంది. పూల పాదులలో యిసుక బంగారు రజనులాగా మెరుస్తోంది. అతను ఒక పూలచెట్ల వరుసదగ్గర నిలుచున్నాడు. అతని ప్రక్కనే పూలమొక్కల దుబ్బు మరొకటివుంది. ఇద్దరు ఆడపిల్లలు అటునుంచి వస్తున్నారు. వాళ్లింతో అందంగా, బలంగా వున్నారు. ఒక పిల్ల కళ్ళల్లో నవ్వు కనిపిస్తోంది. చప్పిడి ముక్కు. ఇగోర్‌ను చూచి ప్రక్కనున్న పిల్లతో ఏదో మాట్లాడింది. ఆ పిల్లవి నల్లని కళ్ళు, పచ్చని సంపెంగవంటి శరీర ఛాయ.

“ఎవరో కొత్తపిల్లవాడు. అతని జాకెట్టుచూడు ఎలా ఉందో!”

ఇగోర్ అటు తిరిగి చూచాడు. జాకెట్టు వేసుకోవడంలో వింత ఏముంది?

పేవ్‌మెంటుమీద జనం నడిచివెడుతున్నారు. కొందరు పెద్ద కర్రవాళ్ళు, చిన్నపిల్లలు, అమ్మాయిలు. వారిలో కొందరికి నూనూగు మీసాలు వస్తున్నాయి. మరికొందరికి మీసాలు నల్ల బడుతున్నాయి. వాళ్ళు వేసుకున్న దుస్తులమీదఏవో మరకలు కనిపి స్తున్నాయి. అవి నూనె మరకలయి ఉంటాయనీ, వాళ్ళు పనిచేయ టానికి వెడుతున్నారనీ ఇగోర్ అనుకున్నాడు. వయసు ఎక్కువలేని పిల్లలు నిక్కర్లు వేసుకున్నారు. కాళ్ళకు జోళ్ళులేవు. ఆడపిల్లలు చురుకుగా కనిపిస్తున్నారు. వాళ్ళెప్పుడూ అంతే.

“చాలాచలాకీ అయిన గుంపు!” అంటూ ఇగోర్ రతిక పై నికుడివంక చూచి నవ్వాడు.

కాని అతను ఇగోర్ మాటలు వినిపించుకోలేదు.

తలుపులు తెరిచి ఉన్నాయి. తెరిచిన తలుపులదగ్గర గుంపు నిలుచున్నది. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళల్లోకెల్లా ఒక కుర్రవాడు ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు. అతనికి పదమూడేండ్లుంటాయి, విశాలమైన నుదురు. గంభీరమైన ముఖం. ఆ కుర్రవాణ్ణి చూడగానే ప్రభుత్వకార్యాలయంలో మసలనివాడిలాగా తెలిసిపోతున్నాడు. బూట్లు వేసుకున్నాడు. లేత నీలిరంగుచొక్కా పంట్లాంలో బిగించుకున్నాడు. నడుముచుట్టూ నల్లని బెల్టు చేతిమీద ఒక బాడ్జీ ఉంది. వెడల్పుగా ఉన్న తెల్లని కాలరు మెరుస్తోంది. ములకు ఉన్న రైఫిల్‌ను రెండుచేతులతోనూ పట్టుకున్నాడు.

ఇగోర్ అతన్ని కొంచెంసేపు పరిశీలించి మరోవైపుకు దృష్టిని మళ్ళించాడు. తలుపులు తెరుచుకుని చప్పుడు చేసుకుంటూ ఇద్దరు కుర్రాళ్ళు ఇవతలికొచ్చారు.

“వాస్కా ! ఉండుండు, వాస్కా ! తాళాలు నాదగ్గరున్నాయి.” అంటూ ఒకతను కేకవేశాడు.

ఈ మాటలేకాక మరికొన్ని మాటలుకూడా ఇగోర్‌కు వినిపించాయి. కాని అవి అతనికి స్పష్టంగా తెలియలేదు. కాని ఈసన్నివేశం అతనికి చమత్కారంగా కనిపించింది.

“అలెగ్జీ ? అతనికోసం పంపించాడు. అవి ఎక్కడున్నాయో వెతకమన్నాడు.”

“ఓహో, అలాగా !”

“అలెగ్జీ అన్నాడుకదా : నీవు వాటిని కనుక్కోకపోతే ఈ విషయం సాధారణ సమావేశంలో చర్చిస్తాం.”

“అలాగా ! అలాగా ! అలాగా !”

ఇదేకాక ఇగోర్‌కు ఇంకొకవిషయంకూడా ఆశ్చర్యం కలిగించింది. ఇక్కడికి వస్తున్నప్పుడు ముందు ఏమవుతుందో అన్న ఆతృత

అతనికి కలిగింది. కాని ఈ విస్మృత అతనికి సంతోషం కలిగించలేదు. ఇక్కడికిరాగానే పిల్లలంతా తనను చూచి పరుగెత్తుకుంటూ వచ్చి మీదపడతారనుకున్నాడు. తనచుట్టూ మూగి ప్రశ్నలతో విసిగెత్తిస్తారనుకున్నాడు. అవును. తనుఅందరికీ వింతగానే కనిపించవచ్చు. రక్షక సైనికుడితో తాను వస్తున్నప్పుడు పిల్లలకు మరీవింతగా తోచవచ్చు. కాని తీరా అతను వచ్చేసరికి ఎవరూఏమీ అడక్కుండా ఊరుకున్నారు. చుట్టూ మూగలేదు. అతనూ, రక్షక సైనికుడు అక్కడ ఉన్నట్లే వారు గమనించలేదు. ఈ విషయం ఇగోర్ కు మరీ బాధ కలిగించింది. అతను అక్కడ నిలుచుని ఆలోచించ సాగాడు. ఉహు. కాదు. వాళ్ళు అతన్ని గమనించక పోలేదు. పూల మొక్కలదగ్గర నిలుచున్న తనను అంతా చూశారు అందులో అనుమానంలేదు. తను ఎంత పొడుగున్నాడో, తన రూపురేఖలెలాంటివో వాళ్ళ మనస్సులో ఒక రూపం ఏర్పడివుంటుంది. వాళ్ళ మనస్సులో ఏర్పడిన తన ఆకృతి తమాషాగా ఉండవచ్చు. ఎలాగైనా వాళ్ళు వింతమనుష్యులు. వాళ్ళలాగే తనూ ఉండాలి.

ఇప్పుడు యిక తనకు ఏ అనుమానమూ లేదు. వాళ్ళు తనను గమనించారని స్పష్టంగా కనిపిస్తూనేవుంది. దగ్గరనేవున్న ఒక దారి వెంట ఒక కుర్రవాడు ఈల వేసుకుంటూ చుట్టూ చూస్తూ నడిచి వస్తున్నాడు. తను ఎక్కడికి వెళ్ళాలో స్పష్టంగా అతనికి తెలుసునని అతని నడకనుబట్టి పోల్చవచ్చును. ఇగోర్ కొంచెం దూరంలో వుండగానే ఆ పిల్లవాడు అతనివంక క్షణంసేపు చూచి దృష్టి మరల్చుకున్నాడు. కాని ఇగోర్ దగ్గరికి వచ్చేసరికి నిలుచుండిపోయాడు. అతన్ని ఆ పిల్లవాడిలా అడిగాడు:

"నీ సైజు ఏది మిస్టర్?"

ఆ పిల్లవాడు తననే ప్రశ్నిస్తున్నాడని కొంతసేపటికి కాని ఇగోర్ కు తెలిసిందికాదు. అతను మాటవిని చుట్టూ కలయ చూచాడు. తన దుస్తులను పరిశీలించుకున్నాడు. అవును. ఆ పిల్ల

వాడు తననే ప్రశ్నించింది. తనకు తెలీదు. ప్రశ్నకు జవాబు చెప్పే లోగానే ఆపిల్లవాడు అక్కడనుంచి వెళ్ళిపోయి గుంపులో కలిసి పోయాడు.

అతనలా వెళ్ళగానే భవనంలోనుంచి మరొక కుర్రవాడు ఇవతలికొచ్చాడు. అతనూ అందరిలాగే పొట్టిదుస్తులు వేసుకున్నాడు కాళ్ళకు జోళ్లు లేవు. వయస్సు పన్నెండేండ్లు.

అతను చూడడానికెంతో ముచ్చటగొలుపుతున్నాడు. ఎర్రని చెక్కిళ్లు. స్వాభిమాని. ఆత్మవిశ్వాసంతో చకచక నడిచివస్తున్నాడు. విశాలమైన కళ్ళతో ఆ ప్రదేశమంతా తనదేఅన్నట్లు చుట్టూ చూచాడు. మెడకు రైఫిల్ ఉంది. వసారాదగ్గర ఒకమెట్టు మీద నిలుచుని బిగిల్ తీశాడు. దాన్ని పెదవులదగ్గరికి పోనిచ్చి గట్టిగా ఊదాడు. ఆ పిలుపులో ఎంతో సంతోషం ఉంది. ఆకుర్రవాడు ఒక్కసారి మాత్రమే నెమ్మదిగా బిగిల్ ఊది దగ్గరవున్న పిల్లవాళ్ళ వంక నవ్వుతూ చూచాడు. వెంటనే మెరుపులా మెట్లుదిగి వెళ్ళిపోయాడు భవంతి చివర నిలుచుని మళ్ళీ మరొకసారి బిగిల్ ఊదాడు, అతనలాగ ఎందుకు బిగిల్ ఊదాడో, ఆపిలుపుకు అర్థమేమిటో ఇగోర్‌కు బోధ పడలేదు. తెలుసుకోవాలనే కుతూహలం హెచ్చింది. ప్రక్కనవున్న ఒకతన్ని ఇలాఅడిగాడు:

"ఏమిటాబిగిల్ ?"

"అదా పనివేళయిందని తెలిపే పిలుపు."అని అతను జవాబు చెప్పాడు

ఒక అరనిముషం గడిచింది. అంతాఅక్కడ్నుంచివెళ్ళిపోయారు. ఒకరో ఇద్దరో మాత్రం అక్కడ ఉండిపోయారు. వాళ్ళకింకా విశ్రాంతి చాలనట్టుంది. తరువాత వాళ్ళుకూడా నెమ్మదిగా వెళ్ళిపోయారు. అక్కడికి రైఫిల్‌తో ఉన్న ఒక పిల్లవాడువచ్చాడు. అతన్ని చూచి సైనికోద్యోగి ఇలాఅడిగాడు:

"మనమిప్పుడెక్కడికి వెళ్ళాలి? నా వెంట ఈకుర్రవాణ్ణి తీసుకొచ్చాను."

అదివిని ఆ పిల్లవాడు ఆలోచించడం మొదలుపెట్టాడు.

"కొంచెంసేపాగండి" అని జవాబుచెప్పాడు.

బిగిల్ పట్టుకొని బిగోనల్ అక్కడికి తిరిగివస్తున్నాడు.

"డ్యూటీలో ఉన్న కమాండర్‌ను పిలువు, ఒలోద్యా!"

డ్యూటీలోఉన్న కమాండర్‌తో ఎందుకు అవసరమొచ్చిందో వెంటనే ఒలోద్యాకు అర్థమైంది. తల ఇటుత్రిప్పి ఇగోర్ వంక చూచాడు. తరువాత తలుపు తెరచుకొని "అలాగే పిలుస్తాను" అంటూ వెళ్ళిపోయాడు. ఇక అక్కడున్నది ఇందాకటి రైఫిల్ పిల్లవాడే. అతన్ని ఇగోర్ ఇలా అడిగాడు.

"నీ అనుమతిలేకుండా నేను లోపలికి వెలితే ఏమవుతుంది? మీరు నన్ను షూట్ చేస్తారా?"

అదివిని కాపలాభటుడు తన రైఫిల్ వంక ఒకసారి చూచాడు.

"ఊహు. నిన్ను షూట్ చెయ్యను. కాని తలమీద ఒకపోటు పొడుస్తాను."

అది వినగానే ఇగోర్ ముఖం ఎర్రబారింది. అసంతృప్తితో తల మరోవైపు తిప్పుకున్నాడు. నవ్వుతూ కావలా భటునివంక చూచాడు.

"ఓహో! నీవు ఒకడవన్నమాట?" అన్నాడు.

కాపలాభటుడికి కొంచెం కోపం వచ్చింది. కాని మళ్ళీ నవ్వు తెచ్చుకొని ఇగోర్ వంక చూచాడు.

ఇలా కొంతసేపు గడిచింది. భవంతిలో చప్పుడు వినిపించింది. చల్లగా, ప్రశాంతంగా ఉన్న నడవలోనుంచి ఒక కుర్రవాడు మెరుపులాగా ఇవతలికి వచ్చాడు. వస్తూ రైఫిల్‌ను సర్దుకున్నాడు. అతనికి

పదహారేళ్ళకంటె ఎక్కువ ఉండవు. దుస్తులుకూడా కావలా భటుడి దుస్తుల్లాగానే ఉన్నాయి. కాని ఎడమచేతిమీద ఎర్రటిబాడ్జీ ఉంది. అతన్ని చూడగానే ఇగోర్ ఇట్టే గ్రహించాడు. అతనే డ్యూటీలో ఉన్న కమాండర్.

ఇగోర్‌ను చూపిస్తూ కావలాభటుడు ఇలా అన్నాడు:

"వాళ్ళు ఇతన్ని తీసుకొచ్చారు ఒలెంకో!"

ఒలెంకో ముఖం బక్కపల్చగా పాలిపోయిఉంది. తెలివితేటలు కలవాడిలా కనిపిస్తున్నాడు. సన్నని పెదవులు ఇగోర్ వంక చూపిస్తూ ఒలెంకో రక్షకసైనికుణ్ణి ఇలా ప్రశ్నించాడు:

"ఓచెరు తెచ్చావా?"

"ఆ. ఉంది" అంటూ రక్షకసైనికుడు తన దగ్గరున్న పుస్తకము తెరిచాడు. "ఇక్కడ సంతకం పెట్టు" అన్నాడు.

ఒలెంకో సంతకంచేసి మళ్ళీ పుస్తకం అతనికిచ్చేశాడు.

"సంతకం సరిపోతుందనుకుంటాను."

"అవును."

ఇగోర్ రక్షకసైనికుని చేతిని నవ్వుతూ పట్టుకున్నాడు:

"మన ఇద్దరం ఇక్కడ మళ్ళీ కలుసుకోమనుకుంటాను!" అన్నాడు.

"ఎవరు చెప్పగలరు!" అంటూ సైనికుడు నవ్వాడు.

ఒలెంకోకు శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. ఒలెంకో ఇగోర్ వంక తిరిగి ఇలా అన్నాడు:

"రా. వెడదాం రా."

11

కొందరితో పరిచయాలు

నడవలోకి వెళ్ళగానే ఇగోర్ చెర్నియావిన్‌కు వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలనిపించింది. ఒకదానికొకటి అర్థం చేసుకున్నారనీ, తాను వెళ్ళకూడని చోటుకు వెళ్ళాననీ భావించాడు. ఆశ్చర్యంతో ఒలెంకోవంక చూచి దృష్టి మరోవైపుకు మళ్ళించుకున్నాడు. అతని ముందు వెడల్పుగాఉన్న మేడమెట్లు కనిపించాయి. మెట్లమీద కుంకుమరంగు ముఖమల్ తివాసీ పరిచిఉంది. మెట్లమీది నుంచి వెళ్ళగానే ఒక విశాలమైన వసారా కనిపించింది. వసారాకు ఒక ఓల్‌ద్వారం. ద్వారం మీద గాజుపలక అల్లలాడుతోంది. దానిపైన "నాటకశాల" అనే అక్షరాలు ధగధగమెరుస్తున్నాయి. నాటకశాల వాకిలికి ప్రక్కగా నలుపలకల పెద్దఅద్దం ఒకటిఉంది. ఇంకొకమూల ఉన్న మేడమెట్లు ఆ అద్దంలో ప్రతిఫలిస్తున్నాయి. మేడమెట్లు దాటగానే ఇలాగే ఒక పెద్దహాలు ఉంది. అక్కడకూడా పెద్ద నలుపలకల అద్దం ఒకటి కనిపించింది. త్రోవపొడుగునా గోడలకు ఆనించి కొన్ని పెట్టెలవంటివి ఉన్నాయి. వాటిలో లేతగులాబిరంగు కాగితపు పూలు అలంకరించిఉన్నాయి. ఎర్రటిరిబ్బను అందంగా వ్రేలాడుతోంది.

అక్కడికి వెళ్ళగానే క్రిందఉన్న నల్లనిగుడ్డచూపిస్తూ ఒలెంకో "దీనిమీద కాళ్ళు తుడుచుకో" అని చెప్పాడు.

ఇగోర్ తన బూట్లువంక చూచుకున్నాడు. బూట్లమీద మురికిలేదు.

"బూట్లు బాగానేఉన్నాయి" అన్నాడు ఇగోర్.

కావలాభటుడు ఎదురువచ్చాడు. "లేదు. అవి చాలా మురికిగా ఉన్నాయి. చెప్పిందేమిటో చెయ్యి. శుభ్రంగా కాళ్లు తుడుచుకో" అన్నాడు.

"ఏమిటీ లేనిపోనీ నిర్బంధం" అంటూ ఇగోర్ గొణుక్కున్నాడు.

ఇలా గొణుకుతూనే బూట్లు గుడ్డతో తుడుచుకున్నాడు. గుడ్డ తడిగా ఉండడంవల్ల నల్లబడిందని పోల్చుకున్నాడు. కావలావాడు నేలమీద ఉన్న బ్రష్ చూపిస్తూ.

"ఇహ అక్కడికి వెళ్ళు" అన్నాడు. అతను చెప్పినట్లుగానే ఇగోర్ అక్కడికి వెళ్ళాడు. ఒలెంకో మూడవమెట్టుమీద నిలుచుని ఓపిగ్గా నిరీక్షిస్తున్నాడు. కావలాభటుణ్ణి చూచి ఇగోర్ ఇలా అడిగాడు:

"ఇక్కడ అంతా నీలా ఇద్దరిలాగే ఇంత పట్టుదలగా ఉంటారా?"

ఒలెంకోకు పెదవులు కదిలాడాయి. చేతిలోఉన్న తాళాల గుత్తిని ఊపుతూ గొలుసును వేలికి చుట్టుకుంటున్నాడు.

ఇగోర్ బూట్లు తుడుచుకుంటూ కావలా భటుడివంక చూస్తున్నాడు. కావలావాడి తలమీద కుచ్చుటోపీ ఉంది. టోపీలో నుంచి వెంట్రుకలు క్రిందికి జారి కనుబొమలమీద పడుతున్నాయి.

"నీకెంత వయస్సు?" అని అడిగాడు ఇగోర్.

కావలావాని పెదవులు కదిలాడాయి. కాని వాటిని అతను అదిమిపెట్టుకున్నాడు. అతని పెదవులమీద చిరునవ్వు కనిపించింది. తీక్షణంగా ఇగోర్ పాదాలవంక చూస్తూ.

"అది నీకనవసరం. ముందు బూట్లు తుడుచుకో" అన్నాడు.

ఇగోర్ భుజాలు కంపించుకపోయాయి.

"త్వరగా రా, త్వరగా రా" అంటూ ఒలెంకో పిలిచాడు.

ఎడమప్రక్కగా ఒకమార్గం ఉంది. అదొకటేమార్గం. ఆ మార్గం దాటగానే ఒక వాకిలిముందు "భోజనశాల" అనే గిల్టు అక్షరాలు మెరుస్తున్నాయి. ఆ తలుపు తెరుచుకుని ఒక అమ్మాయి బయటికి తొంగిచూచింది. ఆ పిల్ల తెల్లటిదుస్తులు వేసుకుంది.

"నీవింకా భోజనం చెయ్యలేదుకదూ ఒలెంకో?" అని అడిగింది.

"లేదు లేదు. ఇంకా చెయ్యలేదు. నాకోసం భోజనం ఉంచు లీనా. ఇతనికికూడా. కొత్త కుర్రవాడు" అన్నాడు ఒలెంకో.

"అలాగే ఉంచుతాను" అంటూ ఆ అమ్మాయి తలుపు వేసుకుంది.

ఆ త్రోవకు ఒకప్రక్క పెద్దపెద్ద కిటికీలున్నాయి. మరొక ప్రక్క ఎన్నో వాకిళ్ళున్నాయి. వాకిళ్ళమధ్య గోడలకు ఫ్రేముల్లో వార్తాపత్రికలు అమర్చి ఉన్నాయి. త్రోవ చివర మరొక వాకిలి ఉంది. దానిమీద విశ్రాంతి మందిరం అని వ్రాసి ఉంది. ఆ మందిరం దాటి ఒలెంకో మరో వాకిలి దగ్గరికి వెళ్ళాడు. అది కమాండర్ల కార్యస్థానం ఉండేగది. తలుపు తెరిచి ఇగోర్‌ను లోపలికి రమ్మని సైగచేశాడు ఒలెంకో.

ఇగోర్ లోపలికి వెళ్ళాడు. గదికి పెద్దపెద్ద కిటికీలున్నాయి. కిటికీల మీద ఎండపడి ధగధగ మెరుస్తున్నాయి. అటుచూచేసరికి తళుకుమనే కాంతి అతనికళ్ళల్లో పడింది. వెంటనే చూపు మరల్చుకుని గదిని పరిశీలించాడు. గదిలో రకరకాల బెంచీలున్నాయి. కుడిప్రక్క ఒకమూల విరిగిపోయిన బెంచీలున్నాయి. ఒక బెంచీమీద బిగోనక్ కూచుని తన బిగిల్‌కు మెరుగు పెట్టుకుంటున్నాడు. ఇగోర్ లోనికి వెళ్ళగానే అతనివంక చూచి వెంటనే చూపు మళ్ళించుకున్నాడు బిగోనక్. తరువాత ఇలా అన్నాడు:

"పాలిష్ ఎప్పుడు కొంటారయా? ఎప్పుడడిగినా ఇదిగో అదిగో అని చెప్తున్నారు. ప్రాణం విసిగిపోతోంది. మేనేజిమెంటు అపసవ్యంగా ఉంది. అంతేకదూ విట్యా?"

విట్యా అని పేరుపెట్టి పిలిచిన అతను ఒక చిన్న డెస్క్ ముందు కూచుని ఉన్నాడు.

విట్యా లేచి నిలుచున్నాడు.

“ఇప్పుడు తగినంత డబ్బులేదు” అన్నాడు.

ఎంతడబ్బు కావాలేం? మహాఅయితే ముప్పయి కోపెక్కులు అంటూ బిగోనక్ తన బిగిల్‌కు మెరుగు పెట్టుకుంటున్నాడు. అతను మళ్ళీ ఇగోర్ వంక చూడలేదు. పాలిష్ కొనుక్కునే సమస్యలోపడి అక్కడ ఇగోర్ ఉన్నాడనే విషయం విస్మరించారు.

ఇగోర్ బాగోగులు కనుక్కునే బాధ్యత ఇప్పుడిక విట్యా మీద పడింది. అతని వివరాలు అడిగి తెలుసుకుందామని డెస్క్ దగ్గరనుంచి ఇవతలికివచ్చి అతన్ని సమీపించాడు. అతనుకూడా పొట్టిదుస్తులే వేసుకున్నాడు. ఖాకీనిక్కరు, ఖాకీచొక్కా వేసుకున్నాడు. నడుముకు సన్నని బెల్టు ఉంది. అతనివయస్సు పదహారేండ్లే అయినా ఎంతో లోకానుభవం ఉన్నవాడిలా ఇగోర్‌కు కనిపించాడు.

ఒలెంకో చేతుల్లోనుంచి బరువుగా ఉన్న కవరు తీసుకుంటూ “ఇది కమీషన్ దగ్గరనుంచేనా వచ్చింది?” అని అడిగాడు.

“అవును.”

అతన్ని చూచి ఇగోర్ మర్యాదగా నమస్కరించాడు. విట్యాకూడా మర్యాదతో నమస్కరించాడు. కాని అతని భంగిమలో కనీ కనిపించని వ్యంగ్యం గర్భితమై ఉంది. బిగోనక్ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు. ఇగోర్ వాళ్ళవంక చూచాడు.

విట్యా డెస్క్‌ముందు కూచుని కవరు చదువుతూ “ఇగోర్ చెర్నియావిన్” అని పిలిచాడు.

కవరుమీద అదేపేరు ఉంది.

“నిన్నుగురించి చాలా వ్రాశారే!” అన్నాడు విట్యా.

"అవును. కాని ఇది ఏమంత పెద్దవిషయం కాదు. చాలా చిన్న విషయం. పోస్టలార్డరు తీసుకోవడంలో చిన్న పొరపాటు జరిగింది, అంతే" అన్నాడు ఇగోర్.

విట్యా అతని కళ్ళల్లోకి చూస్తూ నవ్వాడు.

"ఇదిగో ఇలా చూడు. నీవు చేసిన పొరపాటు ఎలాంటిదో ఎవరికీ అక్కర్లేదు. తెలుసుకోవాలని కూడా ఎవరికీ కుతూహలం లేదు. తెలిసిందా? కాని మాకు కావలసిందల్లా ఒక్కటే. ఇక్కడ నీవు ఉంటావా, లేక చడీచప్పుడు లేకుండా ఉడాయిస్తావా?" అన్నాడు.

బిగోనక్ మెల్లగా నవ్వుతూ పైకి చూచాడు. అతని చూపులను ఇగోర్ తప్పించుకున్నాడు. అక్కడనుంచి పారిపోవాలని అతనికి లేదు. కాని అంత సులభంగా లొంగిపోవాలని లేదు.

"ఆ సంగతి తరువాత ఆలోచించుకుందాం."

"అంతేలే." అంటూ విట్యా నవ్వాడు: "సరే. అలెగ్జి సైఫానోవిచ్ దగ్గరికి వెళదాం పద" అన్నాడు.

ఆ గదిలో ఒకమూల విరిగిపోయిన బెంచీలున్నట్లు ఇగోర్ ఇంతసేపటికి చూచాడు. ఆ బెంచీలు దాటగానే చిన్న వాకిలి ఉంది. వాకిలిమీద "కాలనీడైరెక్టరు" అని వ్రాసిన బోర్డుఉంది.

విట్యా తలుపు తెరిచాడు. ఆ మరుక్షణంలో తాను డైరెక్టర్ కార్యాలయంలో ఉన్నందుకు ఇగోర్ ఆశ్చర్యపడ్డాడు. అతని వెనకాలే విట్యా, ఒలెంకోవ్ లు లోనికివెళ్ళారు. బిగోనక్ కూడా అందులో ప్రవేశించాడు. గదిలో డైరెక్టర్ కూచునివున్నాడు. బిగోనక్ బిగిల్ క్రిందపెట్టి డైరెక్టర్‌ను చూస్తూ చతికిలబడ్డాడు.

డైరెక్టర్ తన డెస్కుమీదఉన్న పుస్తకాన్ని తెరిచి పేజీలు తిరగవేయడం మొదలుపెట్టాడు. అతని రూపురేఖలు మామూలుగానే ఉన్నాయి. చెప్పుకోదగ్గ ప్రత్యేకత ఏమీలేదు, మీసాలు సన్నగా కత్తిరించుకున్నాడు. పొట్టిక్రాపు, కాడలులేని కళ్ళజోడు

పెట్టుకున్నాడు. ఇగోర్ లోనికి రాగానే డైరెక్టర్ అతని వంక చూచాడు. అతని కళ్ళల్లో పెద్ద విశేషమేమీ లేదు. గోధుమరంగు కళ్ళు, సాధారణమైన చూపులు.

ఇగోర్‌ను చూపుతూ విట్యా ఇలా అన్నాడు:

“కొత్త కుర్రవాణ్ని తీసుకొచ్చాం, అలెగ్జీ స్టెపానొవిచ్!”

ఇగోర్ మర్యాదగా నమస్కరించాడు. బిగోనక్‌కు నవ్వు ఆగిందికాదు. అతను నవ్వడం డైరెక్టర్‌తోసహా అక్కడున్న వారంతా చూచారు. అతనెందుకు నవ్వాడో డైరెక్టర్‌కు తెలిసినా తెలీనట్లు నటించాడు.

“నీ పేరేమిటి?” అని అడిగాడు.

“ఇగోర్ చెర్నియావిన్.”

“స్కూలుకు వెళ్ళేవాడివా?”

“ఆ. ఏడో ఫారం వరకూ చదువుకున్నా.”

“అంతేనా! ఏం, అంతటితో ఆపేశావేం?”

అలెగ్జీ చూపుల్లో అసంతృప్తి కనిపించింది. కుర్చీకి చేరగిల బడ్డాడు. ఇగోర్ వంక పరీక్షగా చూచాడు. అంతవరకూ చదువుకుంటే మామూలుగా బ్రతకడానికి చాలునని ఇగోర్ ఏనాడో అనుకున్నాడు. అంచాత అతనికి డైరెక్టరు ప్రశ్న విపరీతంగా తోచింది. అతను తనతో వరాచకాలాడుతున్నాడని అనుకున్నాడు. డైరెక్టరు ప్రశ్నవిని ఆశ్చర్యంతో రెండు చేతులూ చాపి ఒక భంగిమపెట్టాడు.

“ఏమీ? ఏడోఫారంవరకూ చదివితే చాలనుకున్నాను. అదే ఎక్కువ” అన్నాడు.

“అదే ఎక్కువా? ఏడోఫారంకోసరా? ఎనిమిది, తొమ్మిది పదిఫారాలు లేవూ? వాటి సంగతో?”

“ఉన్నాయి. కాని అవి అందరికోసం కావు.”

అతనిలా చెప్పేసరికి అలెగ్జీ సెపానొవిచ్ ఆ మాటలు విననట్లు నటించాడు. పుస్తకం పుటలు తిరగేస్తూ కూచున్నాడు. కొంచెం సేపు పోయాక ఇగోర్‌ను ఇలా అడిగాడు:

"ఊ. సరే...ఒకటడుగుతాను చెప్పు:

డినీ ప్రోస్ట్రోవ్ అంటే ఏమిటి?

"ఏమి కేమిటి?"

"డినీప్రోస్ట్రోవ్...అదేమిటో నీకు తెలుసునా?"

"ఆ. ఆ.. అదీ...ఒకస్టేషన్."

"ఎలాంటిస్టేషను?"

"ఒకస్టేషన్... ఒక బ్రిడ్జితో...ఇంకా...అక్కడొకస్టేష నుంది."

వస్తోన్న నవ్వును ఆపుకునేందుకు బిగోనక్ చేతులు అడ్డం పెట్టుకున్నాడు.

"కాను, కాను. తప్పుచెప్పాను...అక్కడ బ్రిడ్జిలేదు"అన్నాడు మళ్ళీ ఇగోర్.

బిగోనక్‌కు ఎంత ఆపుకుందామన్నా నవ్వు ఆగడంలేదు. ఒలెంకోనవ్వడంలేదు కాని అతనిక్రింద పెదవి కదిలింది. అలెగ్జీ పుస్తకంవంకచూస్తూ తల ఆడించాడు.

"అలాంటి సమాధానం చెప్పడానికి నీకు సిగ్గులేకపోయింది. ఎంత సిగ్గుచేటు! నిజంగా ఇది ఎంతో సిగ్గుపడవలసిన విషయం. ఏడు సంవత్సరాలు స్కూల్లో ఉండి విద్యావంతుణ్ణని అనుకుంటూ ఇదా నీ సమాధానం! ఛాఛా! కాస్త ఆత్మగౌరవం ఉండాలి, కామ్రేడ్ చెర్నియావిన్!"అన్నాడు డైరెక్టర్.

"కామ్రేడ్ డైరెక్టర్! నేను మరచిపోయాను..."

"ఏమిటి మరిచిపోయావు?"

"డినీ ప్రోస్ట్రోవ్ అంటే ఏమిటో మరిచిపోయాను."

"అదిమరిచిపోయే విషయంకాదు. తెలిసిందా? ఇందాక నీ వొకమాటన్నావు. జ్ఞాపకముందా?...ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు అందరికోసంకాదన్నావు. ఈ మాట ఎవరైనా వింటే నవ్విపోతారని నీకనిపించడంలేదూ?"

"నేను ఏ అర్థంలో అన్నానంటే..."

"నీవు ఏ అర్థంలో అన్నా నీ మాటకు అర్థం పర్థం లేదు. అలా సమాధానం చెప్పడం ఎంత అసహ్యమో తెలుసునా? ఇంగిత జ్ఞానం ఉన్నవాళ్ళు అలా చెప్పరు."

తనవంక అలెగ్జీ సూటిగాచూచి ఇలా అడిగేసరికి ఇగోర్ నిరుత్తరుడైనాడు. పైకి ఈ వ్యక్తి మామూలుగాకనిపించినా మామూలు మనిషి కాడనుకున్నాడు.

"అవును. అలా జవాబు చెప్పకూడదు. నాకంతా అర్థమైంది కామ్రేడ్ డైరెక్టర్."

"ఇప్పుడు నీ వంటున్న మాటలో కాస్త అర్థమున్నది. మరో ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పు. నీవు మంచి కామ్రేడ్‌వేనా!"

అలెగ్జీ గొంతుకలో ఒకవిధమైన వ్యంగ్యం స్ఫురించింది.

"మంచికామ్రేడా!" అంటూ ఇగోర్ మళ్ళీ అదేమాటనే వల్లించాడు.

"అవును. మంచివాడివా? లేక ఏదో తగుమాత్రం..."

ఈ ప్రశ్నకు ఇగోర్ సులువుగానే జవాబు చెప్పాడు.

"ఆ. నేను మంచివాణ్ణే. చెడ్డ కామ్రేడ్‌ను కాను."

అలెగ్జీ పెదవులమీద నవ్వు తొలకరించింది. ఆ నవ్వులో పిల్లల సహజసిద్ధమైన ఆప్యాయత ద్యోతకమైంది.

"మంచివాడివి. నీవు తెలివితక్కువ వాడివికావు. సంతోషం. సరే కొంతకాలం ఉంటే మేం ఎలాంటివాళ్ళమో నీకే తెలుస్తుంది. విట్యా! ఇతన్ని మనం ఎక్కడికి పంపిద్దాం?"

"ఎనిమిదో దళంలో ఖాళీఉంది."

"అయితే సరే. మరీమంచిది. నీవు ఎనిమిదో దళంలో ఉండాలి. దాని కమాండర్ పేరు మెట్సెరింకో. చాలా మంచివాడు. తెలివైన వాడు. నీవు చమత్కారివేకదూ!"

"ఏదో కొద్దిగా" అన్నాడు ఇగోర్.

"అలా ఉండడం అంత తప్పుకాదు. ఎనిమిదోదళంలో అంతా కొంచెం మూతిబిగించుకుని బెట్టుగా ఉంటారు. అక్కడికి వెళ్ళి నీ చమత్కారం చూపించు. నీవు ఇక్కడనుంచి పారిపోవుకదూ?"

ఈ ప్రశ్నకు ఇదివరకు తను ఏం జవాబు చెప్పాడో ఇగోర్‌కు జ్ఞాపకంవచ్చింది.

"ఆ సంగతి తరువాత చూచుకుందాం" అనే సమాధా నాన్ని మళ్ళీ చెప్పడానికి అతనికి ఎంచాతనో మనస్కరించలేదు. విట్కావంక చూచాడు. అతనికి మారుగా విట్కా ఇలా సమాధానం చెప్పాడు.

"అలా ఎన్నటికీ పారిపోడు అలెగ్జీ. పారిపోవాలని అతనికి ఏకోశానా లేదు."

"అలా అయితే మంచిదే. ఒలెంకో! బయలుదేరు."

ఒలెంకో వెళ్ళడానికి సిద్ధమైనాడు. "అలాగే, కామ్రేడ్ డైరెక్టర్" అన్నాడు.

12

పూర్తి అసంతృప్తి

కార్యాలయంలో వాళ్ళిద్దరూ ఉండిపోయారు. బిగోనక్ డెస్కు మీదనుంచి మోచేతులు తీసి "అలెగ్జీ స్టెపానొవిచ్" అని పిలిచాడు.

"ఎందుకు పిలిచావు ?"

"ఏమీలేదు. మాకు వెంటనే ముప్ఫయి కోపెక్కులు కావాలి. పాలిష్ అయిపోయింది. కొనుక్కోవాలి."

అయితే సరే. ఈ విషయం సప్లయిమేనేజరుతో చెపుతా."

బిగోనక్ లేచి నిటారుగా నిలుచున్నాడు. తల ముందుకు వొంచాడు. అతని ముఖంలో అసంతృప్తి కనిపించింది.

"అతను కొనడు. నాకు తెలుసు. ఏమంటాడో తెలుసా!..." అన్నాడు.

"అలాగా? అయితే ఇదిగో, తీసుకో ముప్ఫయి కోపెక్కులు పాలిష్‌కోసం, నీ ట్రాంచార్జీకి ఇరవై కోపెక్కులూ."

"ఇప్పుడు నేను వెళ్ళిపోవచ్చా ?"

"ఆ. కాని నాలుగు గంటలయ్యేసరికల్లా తిరిగి రావాలి."

"అలాగే వచ్చేస్తాను అలెగ్జీ." అంటూ బిగోనక్ సంతోషంతో శాల్యూట్ చేశాడు. త్వరత్వరగా బయటికి వెళ్ళిపోయాడు.

పిట్టలాగా ఎగిరిపోతూ ట్రోనలో నిలుచున్న కాపలావాణ్ణి దాటుకుపోయాడు. కాని వెంటనే ఆగిపోయి మళ్ళీ వెనక్కు వచ్చాడు.

"ఇప్పుడు డ్యూటీలో ఉన్న కమాండర్ ఏడీ? ఒలెంకో ఎక్కడికి వెళ్ళాడు?" అని అడిగాడు.

కాపలా భటుడు రైఫిల్ మీదికి వంగాడు.

"ఒలెంకో ఆ కుర్రవాడితో ఇప్పుడే అలా వెళ్ళాడు" అన్నాడు.

ఒలెంకో వెళ్ళినదారిని చూపించాడు. బిగోనక్ అతను చెప్పిన దిశకు పరుగెత్తాడు. ఒకమూలకు వెళ్ళి కొంచెంసేపట్లో భవంతుల దగ్గరికి వెళ్ళాడు.

అక్కడ ఒలెంకో, ఇగోర్లు కనిపించారు. వారిద్దరూ స్టోర్సుకి వెడుతున్నారు. గబగబ వెళ్ళి బిగోనక్ వారిని కలుసుకున్నాడు.

"కామ్రేడ్ కమాండర్! నేను నగరంలోకి వెళ్ళాలి. వెళ్ళడానికి నాలుగు గంటలదాకా డైరెక్టర్ కామ్రేడ్ సెలవు ఇచ్చాడు" అన్నాడు బిగోనక్.

"ఆ బట్టలతో నేనా వెళ్ళడం?" అని ఆశ్చర్యంతో అడిగాడు ఒలెంకో.

"అబ్బే నీకు చెపుదామని వచ్చాను. అంతే. దుస్తులు మార్చుకుంటాను. పెరేడు యూనిఫారం వేసుకుంటాను."

"వెళ్ళు. ముందు దుస్తులు మార్చుకో" అంటూ ఒలెంకో ఆగకుండానే వెళ్ళిపోతూ "వెళ్ళేముందు నాకు కనిపించు. ఎలా ఉన్నావో చూస్తాను" అన్నాడు.

"నేను అతనిలాంటి కుర్రాణ్ణి కాదు ఒలెంకో. ఈ విషయం ఇతర కమాండర్లందరికీ తెలుసు దుస్తులు జాగ్రత్తగా వేసుకుంటాను."

"వేసుకుంటావో వేసుకోవో నేను చూడాలికదా."

"అయితే సరే" అంటూ బిగోనక్ వెళ్ళిపోయాడు.

పావుగంట దాటిన తరువాత మళ్ళీ అతను ప్రత్యక్షమైనాడు. అప్పటికి ఒలెంకో ఇగోర్ను స్నానాలగదిలోకి తీసుకెడుతున్నాడు.

"ఇహ నేను వెళ్ళవచ్చా కామ్రేడ్ కమాండర్?" అని బిగోనక్ అడిగాడు.

ఒలెంకో అతనివంక తేరిపారచూచి బెల్టు సరిచేశాడు. బూట్లు పరిశీలించాడు. తెల్లకాలరు సర్దాడు. అతని గులాబీ చెక్కిళ్ళవంక చూచాడు. అవి ఎంతో బాగున్నాయి. బిగోనక్ నల్లని కళ్ళల్లో కమాండర్‌ను చూచాడు. అతని భయం మెల్లమెల్లగా అదృశ్యమైంది. ఏదో విజయగర్వం అతనిలో తొంగిచూచింది. అతని తల మీది టోపీని ముట్టుకోకుండా ఒలెంకో ఇలా అన్నాడు:

"నీకిదేం ఫ్యాషనో నాకర్థంకావడం లేదు. ఎప్పుడూ టోపీ ఒకే ప్రక్కకు పెట్టుకుంటావు."

బిగోనక్ తన టోపీ సర్దుకున్నాడు. గర్వం అతని కళ్ళల్లో తొంగిచూచింది.

"నీదగ్గర అద్దంలేదా? వెళ్ళేముందు ఒకమాటు అద్దం చూచుకోవాలి. నీ దగ్గర ట్రాంచార్జీ ఉందా?" అన్నాడు ఒలెంకో.

"ఆ. ఉంది"

"ఉంటే ఏదీ చూపించు."

"ఉందని చెప్పాను కదూ."

"అదిగో, మళ్ళీ-"

"ఒలెంకో! నామాట నమ్ము."

"అలాకాదు. చూపించాల్సిందే"

బిగోనక్ చేతులు తెరిచి చూపించాడు. అతని చేతిలో రెండు నాణాలున్నాయి.

"ఇదిగో! ఇది ముప్ఫయి కోపెక్కులు- ఇది ఇరవై."

"సరే జాగర్తగా వెళ్ళు ట్రాంచార్జీ చెల్లించకుండా రాకు. నీవది ఎగగొట్టి వస్తే నేను కనుక్కోలేకపోను. టికెట్టు లేకుండా ఎప్పుడూ ప్రయాణం చెయ్యకు. ఈ తమాషాలన్నీ నాకు తెలుసులే. డబ్బు మిగుల్చుకోవాలని తాపత్రయపడుతుంటావు."

"ఇదేమిటి, అలా అంటావేమిటి ఒలెంకో? నేనెప్పుడూ అలా మిగుల్చుకోలేదు. నీవింకా నన్ను నమ్మవుకదా. అశేం కర్మ!"

"నీ సంగతంతా నాకు తెలుసు...సరే వెళ్ళు..."

"అలాగే, కామ్రేడ్ కమాండర్."

ఇప్పుడు బిగోనక్ కంఠస్వరంలో అసంతృప్తి ఏమాత్రం కనిపించడం లేదు.

13

"పరపీడన"

ఆ నగరం చాలా పెద్దది. వీధుల్లోకల్లా మంచిది చెప్పుకోతగ్గది లెనిన్ వీధి. ఆ వీధిలో ఒక చిన్న కొండమీద పెద్ద పెద్ద స్తంభాలతో ఒక తెల్లని భవంతి ఉంది. అది అద్భుతమైన కట్టడం. అదే నాటకశాల. రకరకాల అందమైన షాపులు, నాజూకైన షాపు కిటికీలు ఆ వీధికి మరింత శోభను చేకూరుస్తున్నాయి. వీధిలో జన సమ్మర్దం ఎక్కువగా ఉంది. ఆ పూట వాన్యా చాలా నిరుత్సాహంగా ఉన్నాడు. జనాన్ని తప్పించుకుంటూ నడిచి వెళ్ళిపోతున్నాడు. అతని జుట్టు మాసిపోయింది. ఎత్తుగా పెరిగింది. కాళ్ళకు మేజోళ్ళు లేవు. బూట్ల మడమలు బాగా అరిగిపోయినాయి.

గడిచిన నెలంతా ఎంతో కష్టంగా గడిచింది. గడ్డివామిదగ్గర తన సర్వస్వాన్ని రైజికోవ్ దోచుకుని వెళ్ళిపోయాడు. అప్పటి నుంచీ వాన్యా మనస్సు మనస్సులో లేదు. చాలా దిగులుపడ్డాడు. దుఃఖంకూడా వచ్చింది. ఎన్నెన్నో ఆలోచనలు పుట్టుకొచ్చాయి. ఎంత ఆలోచించినా కష్టాల్లోనుంచి బయటపడే మార్గం కనిపించ లేదు. రైలుపట్టాల కూడలిదాటి ఇదివరకు తాను బూట్లు పాలిష్

చేసిన వీధివైపు తిరిగాడు. అంతకుముందు తాను కూచున్న వసారా మెట్లు చూచేసరికి అతనికి మనస్సు గాయపడినట్లయింది. తనకష్టాలు అప్పటినుంచీ ప్రారంభమైనాయని అనుకున్నాడు.

ఫస్ట్ ఆఫ్ మే కాలనీ ఎక్కడున్నదో అంతు చిక్కడంలేదు. వీధివెంట వెడుతున్న చాలామందిని అడిగిచూచాడు. కొందరు ఆపేరే తమకు తెలీదన్నారు. మరికొందరు అతనిమాటే వినిపించుకో లేదు. కాపాలావాణ్ని అడగడానికి భయంవేసింది. వీధులవెంట తిరుగుతున్న వాళ్ళంటే అతనికి భయం. అతను భయపడుతున్నట్లుగానే దూరంగా కొంతమంది కుర్రవాళ్ళు కనిపించారు. ఇంతమంది జనంతో సంకీర్ణంగా ఉన్న నగరజీవితంలో మసలడం అతనికి చాలా కష్టమని పించింది. పల్లెజీవితం ఇలాఉండదు. అది నిరాడంబరంగా ఉంటుంది.

ఆ కుర్రవాళ్ళ గుంపు దగ్గర పడగానే ఒకయువతిని సమీపించి వాన్యా:

“ఫస్టు ఆఫ్ మే కాలనీ ఎక్కడున్నదో మీకు తెలుసునా? ఎవరిని అడిగినా ఆమాట విననేలేదని చెప్తున్నారు.” అని అడిగాడు.

ఆవిడ కొంచెం ఆలోచించి “ఫస్టు ఆఫ్ మే కాలనీయా? ఆ, విన్నాను, విన్నాను. కాని అది ఇక్కడికి చాలాదూరం. ఊరవతల ఉంది” అని చెప్పింది.

“ఊరవతలంటే ఎక్కడ?”

“ఎక్కడుందో నాకు స్పష్టంగా తెలీదు. నరోబ్రాజ్‌లో దర్యాప్తు చెయ్యి, తెలుస్తుంది.”

నరోబ్రాజ్ అంటే విద్యాశాఖ. ఈమాట అతనికి బొత్తిగా తెలీదు. తరిచి చూస్తున్నకొద్దీ నగరజీవితం మరీ వింతగా, చిక్కుగా ఉంది.

“అంటే ఏమిటది?” అని అడిగాడు వాన్యా.

“అదొక ఆఫీసు. పెద్దభవనంలో ఉంటుంది. అక్కడికి వెళ్ళి అడిగితే నీకు అన్నీ చెపుతారు.”

"భవనమా? దానికెటు వెళ్లాలి?"

"పెద్దబజారులోకి వెళ్ళు. అక్కడడిగితే ఎవరైనా చూపిస్తారు"

"దానిమీద పేరు వ్రాసి ఉంటుందా?"

"ఆ ఉంటుంది."

ఇప్పుడు వాన్యాకు మార్గం సుగమమైంది. కాని దానికోసం వీధులన్నీ తిరగాల్సిఉంది. పెద్దబజారున పడి అటూ ఇటూ చాలా సార్లు తిరిగాడు. ప్రతి గుమ్మందగ్గర ఆగుతూ మెల్లగా నడిచాడు. కనిపించిన నోటీసుబోర్డులన్నీ చదివాడు. కాని నరోబ్రాజ్ మాత్రం కనిపించలేదు. ఎవరినైనా అడిగితే తెలిసిపోతుందని అతనికిప్పటికి తట్టింది. ఒకతను టోపీ పెట్టుకుని చేతిబెత్తం ఊపుకుంటూ వెళ్ళి పోతున్నాడు. వాన్యా అతన్ని అడిగాడు. అతను ఒక పెద్దభవనంకేసి చేతిబెత్తంతో చూపుతూ, "అదిగో! అదే నరోబ్రాజ్. ప్రాదేశిక కార్య నిర్వాహకవర్గ భవనంలో అది ఉందని చెప్పాడు.

ఆ భవనం ఇంతకుముందే వాన్యా కంటపడింది. నోటీసుబోర్డులన్నీ చదివాడుకాని ఆ నోటిసుబోర్డుమాత్రం అతనికి కనిపించలేదు. అయితే ఆ పెద్దమనిషి మాటల్లో విశ్వాసముంచి వాన్యా అటు వెళ్ళాడు.

భవనందగ్గరికి వచ్చాడు. ప్రధాన ద్వారంమీద ఉన్న నోటీసు బోర్డులను జాగర్తగా చదువుకున్నాడు. తనకు కావలసిన బోర్డు కనిపించిందని భావించాడు. కాని ఆ భవనం ప్రక్కగా ఒక ఆర్చి ఉంది. ఆర్చిలోనుంచి వెడితే ముందు కొంచెం జాగా కనిపించింది. అక్కడ తనకు కావలసిన నోటీసుబోర్డు ఉంది. దానిమీద "ప్రాదేశిక విద్యాశాఖాకార్యాలయం" అని వ్రాసి ఉంది.

బహుశా అతను అనుకున్నది ఇది కాకపోవచ్చును. ఇలా అనుకుని ప్రక్కకు చూచాడు. అతని కంటబడినది చాలా ప్రధానమైన విషయం. అయినా దానికీ నరోబ్రాజ్‌కూ సంబంధం ఏమీ లేదనుకున్నాడు. చప్టామీద చాలామంది బూట్‌పాలిష్ కుర్రవాళ్ళు

కూచుని ఉన్నారు. కొంతమంది బూట్లు పాలిష్ చేస్తున్నారు. జనం పోస్టర్లను ఆసక్తితో చదువుతూ నిలుచున్నారు. అయిదో స్టాండు అతని దృష్టిని ఆకర్షించింది. వాన్యా గబగబ అక్కడికి వెళ్ళాడు. పని చేస్తున్న కుర్రవాళ్ళను పరిశీలించ సాగాడు. అతని ప్రక్కనే ఒక బూటుపాలిష్ కుర్రవాడున్నాడు. సన్నగా ఉన్న ఆ పదిహేనేండ్ల కుర్రాడు రెండుచేతులతోను బ్రష్‌లు పట్టుకుని కంటికి కనిపించనంత వేగంగా బూట్లుకు మెరుగుపెడుతున్నాడు. బూట్ల మడములను చూస్తూ తలఎత్తి వాన్యావంక చూచాడు. బూట్లు పాలిష్ చేయించుకుంటున్న వ్యక్తి స్టాండుమీదనుంచి కాలుతీసి జేబులో చెయ్యి పెట్టాడు. ఆ కుర్రవాడు తన స్టాండుమీద ఉన్న బ్రష్‌లు దులుపుకుని మరొకమాటు వాన్యాను పరికించాడు. అతని కళ్ళల్లో సాహసం, చొరవ, చాకచక్యం, మెలకువ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతని కళ్ళవంక చూచేసరికి వాన్యా తికమక పడ్డాడు. కొంచెం పక్కకు ఒత్తిగిలాడు.

"ఏమిటిక్కడ చూస్తున్నావు?" అని ఆకుర్రవాడు వాన్యాను గద్దిస్తూ అడిగాడు.

"నన్నేనా నీవు ప్రశ్నించేది?"

"అవును నిన్నే. ఎందుకిక్కడ దేవుళ్ళాడుతున్నావు? నీవు బూట్లు పాలిష్ చేయగలవా?"

"ఆ, చేయగలను."

"వట్టివి అబద్ధాలాడకు"

"వట్టివికావు నిజం. నాకు వచ్చును."

"అయితే ఒకసారి చేసి చూపించు... అయ్యా! ఏమండోయ్! ఇలా కూచోండి" అంటూ ఆ కుర్రవాడు ఒక పౌరుణ్ని దగ్గరికి రమ్మని పిలిచాడు.

"ఎందుకు వాడికా పరీక్ష? బూట్లు పాలిష్‌చేయడం వాడికి రాదనుకో. రాకపోతే?"

"కాకపోతేనా తరవాత సంగతి చెప్తాను. మీ బూట్లు పాడు చేస్తే నేను బాగుచేస్తాను లెండి....నీ పేరేమిటబ్బాయ్?" అంటూ అతను వాన్యావంక తిరిగాడు.

"వాన్యా."

"పేరు బాగుంది. కూచో."

ఆ కుర్రవాడు ఖాళీగా ఉన్న స్టాండుమీదికి చెయ్యి పోనిచ్చాడు. డ్రాయరు తీసి పాలిష్ డబ్బాలు బయటికి తీశాడు. వాటిలో రకరకాల రంగుల పాలిష్ ఉంది. కొన్ని రంగులేనివి, రెండు ముఖమల్ గుడ్డలు. తెల్లని పొడి ఉన్న రెండు సీసాలున్నాయి. చిన్న బ్రష్ బయటికి తీశాడు. నల్లరంగు పాలిష్ తీశాడు. బ్రష్‌తో స్టాండుమీద కొట్టి ఇలా అన్నాడు:

"త్వరగా కానీయి. చూచావా ఎంతమంది మనుష్యులు ఎదురుచూస్తున్నారో?"

వాన్యా స్టూల్ మీద నిలుచున్నాడు. కాళ్ళు రెండూ ఎడంగా పెట్టి దీక్షగా పని ప్రారంభించాడు. స్టాండుమీద ఒక బూటుకాలు పడింది. బూటు చాలా విలువైనది. బూటుమీద పడుతున్న పంట్లాం మడతకూడా అమూల్యమైనది. వాన్యా తన బ్రష్‌తో బూటుమీది దుమ్మును దులపడం మొదలుపెట్టాడు. అదిచూచి ఆ కుర్రవాడు వాన్యాను గద్దించాడు.

"బూట్లు బాగుచేయడం తెలుసునన్నావే! పంట్లాం మడత పైకి సర్దలేదేం!"

మొదట్లో అర్థంకాక వాన్యా చుట్టూచూచాడు. తరువాత తన పొరపాటు గ్రహించాడు. మెల్లగా పంట్లాం మడత పైకిసర్దాడు. ఇలా చక్కగా పంట్లాం పైకి సర్దినతరువాత తనపని ప్రారంభించాడు. వాన్యాచేత పనిచేయిస్తున్న ఆ కుర్రవాడు తనదగ్గరికి పాలిష్ చేయించుకోడానికి వచ్చిన పెద్దమనిషికి వాన్యా ఎలా పాలిష్

చేస్తాడో అని ఒకకంట కనిపెడుతూనే ఉన్నాడు. అతడు పాలిష్ రాయడం పూర్తయిన తరువాత ఇలా అడిగాడు:

"ఒక్కమాటే అంత రంగు పూశావెందుకు? నీవెంత రంగు పూశావో వాళ్ళకక్కర్లేదు. 'బూట్లు బాగుచేయి' అంటారు వాళ్లు. అంతే! నిజంచెప్పాలంటే అసలు నీవు రంగు ఉపయోగించాల్సిన అవసరమేలేదు. అక్కడ కాస్త బ్రష్‌తో రుద్దావంటే చాలు. పాలిష్ చేయడం అయిపోతుంది. మరి నీవిలా చేశావా?"

వాన్యా ఒకరితరువాత ఒకరికి పాలిష్ చేయవలసివచ్చింది. పని చేస్తున్నందుకు అతనికెంతో హాయిగా ఉంది. దానిమీద మనస్సుపెట్టి శ్రద్ధగా పని చేయసాగాడు. కాని త్వరలోనే అతని రెక్కలు తీపులుపుట్టడం మొదలుపెట్టాయి. మధ్యలో కాస్త పని ఖాళీఅయి తీరుబడి చిక్కినప్పుడు అలుపు తీర్చుకుంటున్నాడు.

"వసూలైన డబ్బు ఇలా ఇచ్చేసెయ్" అన్నాడా కుర్రవాడు.

వాన్యా దగ్గర ముప్ఫయి కోపెక్కులు పోగైనాయి. ఆడబ్బు ముఖ్యంగా తనదగ్గర ఉంచేసుకోవాలని అతను అనుకోలేదు. కాని అది తనకు ఇచ్చేయమని ఆ కుర్రవాడు అడుగుతాడని అతని మనస్సుకు అసలు తట్టనేలేదు. అంచాత డబ్బివ్వమని అడిగేసరికల్లా వాన్యా నివ్వెరపోయాడు.

"డబ్బు నీకిచ్చేయమంటావా?" అని అడిగాడు.

"మరెవరి కిద్దామనుకుంటున్నావు?" అని సమాధానం చెప్పి ఆ కుర్రవాడు వాన్యా దగ్గరున్న డబ్బు తీసుకున్నాడు. తనజోళ్ళ స్టాండు సొరుగులో దాచేసుకున్నాడు. తరువాత ఓ మూడు కోపెక్కులు బయటికి తీశాడు:

"ఇవిగో, ఇవి తీసుకో. ప్రతి పదికోపెక్కులకూ ఒక కోపెక్కు నీకిస్తున్నాను. సరిపోతుందా ?" అన్నాడు.

"ఒకటే. అంటే నీ ఉద్దేశం ?" అని అడిగాడు వాన్యా.

"ప్రతిదినా ఒక కోపెక్కు. తెలిసిందా ?"

"అంటే, నాకు వచ్చేది ఒక కోపెక్కంటావా ?"

"అవును సరిగ్గా చెప్పావు. నీ పనికి ఒకకోపెక్కు వస్తుంది. చేసినపనికి డబ్బు రావాలనుకుంటున్నావుగా నీవు ? అవునా! కాని కాగితాలమాటేమిటి ?"

"ఏ కాగితాలు ?"

"అయితే నీదగ్గర కాగితాలు లేవన్నమాట, సరే. నీవు చేసినపనికి ఒక కోపెక్కు ఎక్కితొక్కి, అది సరేకాని, నాళ్ళెవరైనా వచ్చి బూట్లు తుడవడానికి నీకు పర్మిట్ ఉందా అని అడిగితే ఏం చెబుతావు ?"

"ఏం చెపుతాను ? నాదగ్గర లేదని చెపుతాను."

"నీవామాట చెపుతావు ! 'అలా చెపితే ఏం జరుగుతోందో ఒక్కమాటు ఊహించుకో ! నీజోళ్ళ స్టాండు కాస్తా లాక్కుంటారు. నిన్నొక్కపోటుపొడిచి లాక్కెడతారు. ఎక్కడికో తెలుసా ?... యుర్కా ! నీవతన్ని ఒకకంట కనిపెట్టి ఉండు. నేనలావెళ్ళి కాస్త తినడానికేదైనా తెచ్చుకుంటాను" అన్నాడా కుర్రవాడు. ఆ వరుసలో అతని ప్రక్కనే కూచున్న మరో కుర్రవాడి పేరు యుర్కా. ఇది విని అతను తలఊపాడు.

"అలాగే" అంటూ కష్టంగా సమాధానం చెప్పాడు.

"ఐతే అతనికెంతడబ్బు వస్తుందో అదికూడా కాస్త లెక్క వేసి అట్టిపెట్టు."

"ఈ పనులన్నీ చేయడానికి నాకు తీరికలేదు. ఆ లెక్కా డొక్కా అంతా నీవే చూసుకో."

"అలాగే;నీవేం శ్రమపడక్కర్లేదులే. నేనేచూచుకుంటాను... నీవు డబ్బు దాచుకున్నావూ అంటే ఎలాగో ఒకలాగు నేను కని పెట్టేయగలను. ఇదిగో అబ్బాయ్ ! తెలిసిందా ?"

ఇలా అని అతను వాన్యాముందు నిలుచున్నాడు. అలా నిలుచున్నప్పుడతను బొద్దుగాను, పొడుగ్గాను ఉన్నట్లు అగుపించాడు. అతను వేసుకున్న పంట్లాం చాలా మంచిరకం. అతను తొడుక్కున్న బూట్లుకూడా కొత్తవి. అతనలా విధీ విరామం లేకుండా అధిక ప్రసంగంచేస్తూ, తగవులమారితనంగా తన మనస్సు నొప్పించడంచూచేసరికి వాన్యాకు అసహ్యమనిపించింది.

"నేను నీ డబ్బేమీ దాచుకోను" అని చెప్పాడు వాన్యా, ముఖం మరోవైపుకు తిప్పుకుంటూ.

ఒక్క పలుచని చెక్కిళ్ళు గల ఆ కుర్రవాడు ఇహ అక్కడ నుంచి వీధిలోకి వెళ్ళిపోయాడు. అప్పుడు యుర్కా వాన్యావైపు తిరిగి ఇలా అన్నాడు:

"ఒక్క కోపెక్కు తీసుకుని అతనిదగ్గర చాకిరీ చేస్తున్నావా? ఈ మాట అతనెంతో కటువుగా అన్నాడు. "ఛా, ఛా! ఇంత చండాలపుపని ఎక్కడా ఉండదు! అన్నాడు. వాన్యా జవాబు చెప్పలేదు. యుర్కా అతనివైపు కొద్ది క్షణాలపాటు అలాగే చూచాడు. కొంచెంసేపు ఆలోచించాడు. తరువాత చాలా నిర్లక్ష్యంగా తన జోళ్ళస్టాండ్ మీద తుపుక్కున ఉమ్మేశాడు.

"వాడికి ఈ వెర్రివెంగళాయ దొరికాడు! ఒక కోపెక్కు ఇస్తే చాలు వీడికి!" అన్నాడు యుర్కా, తన ప్రక్కనున్న మరో కుర్రవాడితో.

ఇంతలో మరో బేరగాడు వచ్చాడు. అతన్ని చూచి యుర్కా తన బ్రష్‌లు సిద్ధ పరుచుకున్నాడు.

"రండి. ఇలారండి. మీ బూట్లు నేనే పాలిష్ చేస్తాను" అని పిలిచాడు.

అతని పిలుపు, ప్రవర్తన ఆ బేరగాడికి నచ్చలేదు. అంచాత సరాసరి వాన్యా దగ్గరికి వెళ్ళి అతని జోళ్ళస్టాండ్‌మీద తన కాలు పెట్టాడు.

"వాడొక అకతాయి! వాడికి పాలిష్ చేయడంరాదు. తరువాత నీకు విచారించి లాభంలేదు" అన్నాడు మళ్ళీ యుర్కా.

యుర్కా ముందు కూచోవడమంటే వాన్యాకు భయమేసింది. భయపడుతూనే తనపని తాను ముగించుకుని చేతులో పడిన పది కోపెక్కులు డ్రాయరులో వేసుకున్నాడు. యుర్కా అతనివంక అసహ్యంగా చూడసాగాడు.

"స్విర్కా వట్టి దొంగముండాకొడుకు! ఒక నెల రెండు నెలలు కాదు. వేసవికాలమంతా నాచేత పనిచేయించుకుని నన్ను పీడించుకు తిన్నాడు" అంటూ ఎడమవైపున ఉన్న మరో పాలిష్ కుర్రవాడు బిగ్గరగా కేక పెట్టాడు. "ఒకరోజూ, రెండురోజులూ కాదు, గాడిదకొడుకు! పనిచేయించుకొని మూడు కోపెక్కులే చేతులో పెట్టేవాడు."

"రేటు బొత్తిగా తగ్గిపోయిందా? అయిదు కోపెక్కులు కదూ?" అన్నాడు యుర్కా.

పాలిష్ చేయించుకునేందుకు వస్తున్న మనుష్యులను చూచి కుర్రవాళ్ళు తమ సంభాషణ ఆపివేశారు. ఇహ వాన్యాకు తీరిక లేక పోయింది. వంచిన నడుము వంచినట్లే ఉంది. ఒకపాదం తరువాత మరొకపాదం అతని స్టాండుమీద కనిపిస్తూనేఉంది. అతనలా పాలిష్ చేస్తూ వచ్చిన డబ్బులు సొరుగులో వేసుకుంటున్నాడు. ఇదివరకు తను ఇదేపని చేస్తున్నప్పుడు అతనికెంతో ఉత్సాహంగా ఉండేది. కాని ఇప్పుడదిలేదు. స్టాండుమీద కాళ్ళు మోపుతున్న మనుష్యులెవరో కూడా అతను తలెత్తి పరికించడం లేదు. మౌనంగా తనపని తను చేసుకపోతున్నాడు. పనిచేయగా చేయగా విసుగెత్తింది. అలుపు వచ్చింది. చేతిలోనుంచి బ్రష్‌లు జారిపడ్డాయి. మళ్ళీ సర్దుకున్నాడు. కాని మధ్యలో అప్పుడప్పుడవి అలా పడుతూనే ఉన్నాయి. సిగరెట్టు కాల్చుకుంటూ స్విర్కా అక్కడికి చేరుకున్నాడు.

"ఒకటోరకమైన పనివాడొచ్చాడు రండి. ఇలారండి" అంటూ అక్కడ నిలుచున్న మనుష్యులను పిలుస్తున్నాడు.

మరో అరగంటలో మనుషులు వరదలా వచ్చిపడ్డారు. అక్కడున్న అయిమగురికీ తీరనివని అయింది. వాళ్ళముందు 'క్యూ' ఏర్పడింది. వాన్యా నుదుట చెమటలుపోశాయి. గుండెల్లో నొప్పిపుట్టింది. ఆఖరి బేరగాడు జేబులోనుంచి డబ్బులుతీసి క్రిందికి విసిరేశాడు. వాటిని తీసుకోవడానికి కూడా వాన్యాకు ఓపిక లేకపోయింది.

"మొత్తం ఎంతవచ్చింది? అంతా ఇలాతే" అన్నాడు స్విర్కా.

వాన్యా లెక్కపెట్టకుండానే చిల్లరంతా అతని చేతిలో పోశాడు.

"భేష్! ఒకరూబులు, అరవైకోపెక్కులు. చాలాబాగుంది ఇంకా ఏమైనా ఉందా?

"లేదు."

"ఇలారా. జేబులు చూస్తాను."

వాన్యా జేబులు తీసి చూపించాడు.

"సరే. నీకు పదహారు కోపెక్కులొస్తాయి తీసుకో. నీ డబ్బు నీకు ముట్టినట్లేనా?" అన్నాడు స్విర్కా.

యుర్కా మోకాళ్ళమీద చేతులువేసి కూచున్నవాడల్లా అటు తిరిగి స్విర్కావంక చూచాడు. అతనికళ్ళు ఎర్రగా, చింత నిప్పుల్లా ఉన్నాయి. మిగిలిన కుర్రవాళ్ళకుకూడా వళ్ళు మండుకొచ్చింది. కాని ఆఖునఉన్న కుర్రవాడుతప్ప మరెవరూ మాట్లాడలేదు. అతను కొంచెం సబ్బు.

"నీవొక దళారివి!" అన్నాడతను.

ఆమాటవిని స్విర్కా అతనవంక కోపంగా చూచాడు. గొంతుక చించుకుని పెద్దగా అరిచాడు.

"ఏమిటన్నావు? మళ్ళీ అను" అని భయపెట్టాడు.

ఆకుర్రవాడు తాను అన్నమాట మళ్ళీ అనలేదు. కాని యుర్కా అతన్ని సమర్థిస్తూ నవ్వుతూ ఇలా అన్నాడు:

"వాడేమన్నాడో నీవు వినలేదూ? వాడన్నది నిజం. నీవు చేస్తున్న పనిని ఏమంటారో తెలుసునా?"

"ఏమంటారేం?"

"నట్టి దోపిడీ అంటారు. అవును. నిలువు దోపిడీ! ఒక్క కోపెక్కు వాడిచేతిలో పెట్టడానికి నీకెంత ధైర్యం! ఇలాంటి పనులు పరపీడకులు బూర్జువాలు మాత్రమే చేస్తారు."

స్విర్కా కోపం పట్టలేకపోయాడు. సూదులు గుచ్చినట్లు వాళ్ళవంక చూచాడు. కాని తన కోపాగ్నిని ఆఖరి పిల్లవాడిమీద కురిపించసాగాడు:

"అయితే వాడికి నేనెంత ఇవ్వాలంటావు? వాడికి బూట్లు బాగుచేయడం రాదు. ఎంత పాలిష్ పాడుచేస్తాడో నీకేం తెలుసు? అంతా దుబారా. ఇంతసేపూ నీవు చూళ్లేదా ఏమిటి? వాడిమీద నీకంత అభిమానముంటే నీవే ఇచ్చుకో. మూడు కాదు, ముప్ఫయి కోపెక్కులిచ్చుకో గార్మిడర్. నిన్ను అడిగేవాడెవడూ ఉండడు."

గార్మిడర్ భావంలో మార్పేమీ రాలేదు. స్విర్కా అంటే అతని కసహ్యంగానే ఉంది. మాటమాటాడకుండా తన తల మరో ప్రక్కకు తిప్పుకున్నాడు. యుర్కామాత్రం ఇంతటితో స్విర్కాను వదిలిపెట్టదలుచుకో లేదు.

"నీలాగ గార్మిడర్ పీడకుడుకాడు. అదనంగా నీకుమల్లే అతనిదగ్గర మరో స్టాండు లేదు."

"ఓహో, అదా సంగతి! అతనికీ లేదు, నీకూ లేదు. మీ ఇద్దరికీ లేదు కనుక నామీద విరుచుకపడుతున్నారుగాని స్టాండే కాదు. పాలిష్ కూడా నేనే కొన్నాను. బ్రష్షులు నావి. ముఖమల్ గుడ్డకి బోలెడు డబ్బవుతుంది. నీ స్టాండు ఎంతఖరీదు? నాలుగు రూబుళ్ళు పెట్టి కొన్నావా? మాట్లాడడానికేం, అంతా మాట్లాడతావు."

యుర్కా ఉమ్మేశాడు.

"నాకేం! నాకెలాగూ స్టాండ్ ఉంది. ఉన్నది ఒక్కటే. నీలాగా రెండు లేవు. నీవుకూడా ఎందుకు పనిచేయకూడదూ? పనిచేయకుండా డబ్బులాగడం. అదే దోపిడీ అంటే."

"దోపిడీ? దోపిడీ? చిలకపలుకులు పలక్కు. నీవు 'యువ బోధకుడివి' అయితేకావచ్చు. కాని అబ్బాయి. ఈ కుర్రవాణ్ని ఇక్కడ ఉండమని ఎవరు నిర్బంధించారు? వాడిష్టమొచ్చిన చోటికి వెళ్లమను. వాడికి స్టాండేకాదు. పర్మిట్‌కూడాలేదు. వాడు ఏంచేసినా చెల్లదు."

యుర్కా మళ్ళీ నేలమీద ఉమ్మేశాడు. లేచి నిలుచుని వళ్ళు విరుచుకున్నాడు. ఆవులించాడు.

"అవును. నీలాగే కాని మేము ఊరుకునేదిలేదు. వాడికి సగానికి సగం ఇవ్వు. దారుణంగా ప్రవర్తించకు."

యుర్కా అనిన ఈమాటలు వీధంతా ప్రతిధ్వనించాయి.

"ఏమిటేమిటి? సగానికి సగం ఇవ్వాలా!"

"అవును. పది కోపెక్కులకూ అయిదు."

"అయిదు కోపెక్కులా?"

"అవును. అయిదు"

"వాడిదగ్గర పర్మిట్ లేకపోయినా అయిదు కోపెక్కులివ్వాలా?"

"అవును ఇవ్వాలి."

"మరి నాస్టాండ్ కాస్తా వాళ్లు లాక్కునిపోతే?"

"అలాఅయితే పోనీ, మూడు కోపెక్కులియ్యి. ఇదివరకు గాన్మడర్‌కు అంతే ఇచ్చేవాడివి. వాడికిచ్చినట్లే వీడికీ ఇవ్వు.

స్పిర్కా కేకలుపెట్టడం మాని నవ్వుతూ యుర్కా భుజాలను నిమిరాడు.

"అలాగేలే. నీవు చెప్పినట్లే వాడికి మూడు కోపెక్కులిస్తాను ఎందుకింత రాద్ధాంతం చేస్తావు?"

‘అలా అన్నావు బాగుంది. ఇవ్వు మూడు కోపెక్కులూ ఇవ్వు.”

“ఇస్తానని చెప్పానుగా. ఆడినమాట తప్పను. ఇంతసేపూ ఏదో హాస్యానికి ఒకటని చెప్పాను. పని ఎలాచేస్తాడో చూడకుండానే మొదటే మూడు కోపెక్కులెలా ఇస్తాను చెప్పు? అదీకాక వాడికి అంతా ఇచ్చి నేను బయటికి వెడితే నేను వచ్చేలోపున వాడు పారిపోవచ్చు. అందుకని ఇందాక ఒక్క కోపెక్కు చొప్పునే ఇచ్చాను. దోపిడీ, దోపిడీ అంటున్నావు. నీ దోపిడీతో నాకేంపని? వాడంతట వాడు పనిచేసుకోనీ. ఏదో తమాషాకు అంటే అదంతా నిజమనుకుని ఎందుకలా గోలచేస్తావు? చీటికీ మాటికీ ప్రతివిషయాన్నీ రాజకీయ సమావేశాలుగా మారుస్తావెందుకు?’

స్విర్కా ఎంతోసేపు నవ్వుతూ వాళ్ళందరివంక చూచాడు. గార్డ్నర్ అతనివంక చూడకుండా దూరంగా ఉన్న దేనినోచూస్తూ కూచున్నాడు. యుర్కా దానిలో ఉన్న అంతరార్థం గ్రహించిన వాడిలా నవ్వుతూ తన స్టాండ్ దగ్గరికి వచ్చాడు.

“నీ తమాషా నాకు తెలుసు. పనీ పాటు లేకుండా ఆస్టాంప్‌ను నెల్లాళ్ళు ఒకమూల పారేశావు. ఇలా ఎవరైనా వస్తే వాడి చేత పనిచేయించుకుంటావు. ఇంతా చేయించుకుని వాడిచేతిలో పెట్టేది ఒక్క కోపెక్కుమాత్రమే. వట్టి నీచుడివి!”

“నీకు నోటి దురుసుతనం ఎక్కువ. నేను నీచుణ్ణా? నేను హాస్యానికన్నానంటే నీవు నమ్మవేం?......రా. వాన్యా! ఇలా రా. మనిద్దరం న్యాయంగా లెక్కలు చూచుకుందాం. మొదటిసారి నీవెంత సంపాదించావు? ముప్పయి కోపెక్కులుకదూ? రెండోసారి ఒక రూబులు, యాభై కోపెక్కులు.”

“కాదు కాదు. అరవై కోపెక్కులు.” అన్నాడు యుర్కా.

“సరేలేవయ్యా. అరవై యనే అనుకుందాం. మొత్తం నీవు సంపాదించింది నూట తొంభై కోపెక్కులు. పదికి మూడు చొప్పున

నీకు రావలసింది యాభైఏడు. ఇదివరకు నీకు నేనిచ్చింది పద్దెన్మిది కోపెక్కులు. ఇహ నీకెంత ఇవ్వాలి? ముప్ఫయిఎనిమిది కోపెక్కులు. ఇవిగో తీసుకో. అంటే ఇదివరకటికన్న తడవకు రెండేసి ఎక్కువ ఇచ్చానన్నమాట. ఇహ నీకు చేతినిండా డబ్బే."

స్పిర్కా ఇలా గుణకారం వేస్తుంటే వాన్యా మాట్లాడకుండా అలాగేస్టూల్‌మీద కూచున్నాడు. తక్కిన పాలిష్ కుర్రవాళ్ళు లేవనెత్తిన సమస్య అతనికి ఆసక్తిని కలిగించింది. వాన్యా స్కూలు వదిలిపెట్టి ఎక్కువకాలం కాలేదు. స్కూలులో అక్టోబరు విప్లవం, బూర్జువాల పరాజయం, అంతర్యుద్ధం; వీటినిగురించి వాన్యా చదువుకున్నాడు. ఇవన్నీ చాలాకాలం క్రిందట గతించిపోయిన సంఘటనలుగా అభిప్రాయపడ్డాడుకాని తాను దోపిడీకి గురిఅయిన వ్యక్తినని ఇప్పుడు అకస్మాత్తుగా జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. స్పిర్కా మామూలు మనిషిగా కనిపించలేదు. బూట్లుబాగుచేసే వ్యక్తికంటె విభిన్నంగా కనిపించాడు. అతనిదగ్గర ఉండడమే వాన్యాకు పరమరోతగా తోచింది. కాని స్పిర్కా తన చేతిలో ముప్ఫయిఎనిమిది కోపెక్కులు పడేసేసరికి అతను సంతోషించాడు. ఇప్పుడతనిదగ్గర మొత్తం యాభైఏడు కోపెక్కులున్నాయి. అంతేకాదు. ఇంకా కావలసినంత వ్యవధి ఉంది. సాయంత్రమయ్యేవరకూ బూట్లుపాలిష్ చేసుకోవచ్చు...ఇవాళ ఏదో ఇంత పులుసు అదీ తప్ప మరేమీ తినలేదు. తనముందున్న స్టాండుమీద ఇంకొకపాదం కనిపించింది. సంతోషంతో వాన్యా పాలిష్‌చేయడం మొదలుపెట్టాడు. అయితే స్పిర్కా దీనికి ఒక షరతుపెట్టాడు.

"అబ్బాయ్! స్టాండ్‌ను నీవే ఇంటికి మోసుకురావాలి. నేను మోసేదిలేదు" అని చెప్పాడు.

వాన్యా మారుమాటాడకుండా అలాగేనన్నట్లు తల ఊపాడు.

14

ఎంతకూ అర్థంకానిది

వాన్యా స్పిర్కా దగ్గర మూడువారాలు పనిచేశాడు. రోజుకు అతను సంపాదించేది రూబులు. ఒక్కొక్కనాడు అంతకంటె ఎక్కువే వచ్చేది అతనికి. గిట్టే డబ్బులు భోజనానికి సరిపోతున్నాయి. కాని శ్రమ ఎక్కువ. రోజల్లా పనిచేయవలసివస్తోంది. సాయంత్రమయ్యేసరికి నీరసపడిపోతున్నాడు. రోజల్లా పనిచేయడంతోపాటు స్టాండ్‌ను మోసుకెళ్ళడం ఒకటి. ప్రొద్దున్నే దాన్ని తీసుకరావడం మరీ కష్టంగా ఉంది. స్పిర్కా వుంటున్న చోటు అదృష్టవశాత్తూ అట్టే దూరంలో లేదు గూడ్సుయార్డుదగ్గరే ఉంది. అక్కడికి చాలాదూరంలో ఉన్న గడ్డివామిదగ్గర వాన్యా రాత్రిళ్ళు నిద్రపోతుండేవాడు.

రోజులిలా గడుస్తూ ఉండగా వాన్యాకు యుర్కాతో స్నేహం కుదిరింది. ఇతరపిల్లవాళ్ళతో అంత స్నేహంలేదు. యుర్కా ప్రపంచం తెలిసిన వ్యక్తి. జీవితానుభవం ఎక్కువ. అతనికి తల్లీ తండ్రీలేరు. అయినప్పటికీ వీధుల్లో మాత్రం పడుకునేవాడుకాదు. బస్తీలో ఒకావిడఉంది. ఆవిడ ఉంటున్న గదిలో ఒకమూల అద్దెకు పుచ్చుకున్నాడు.

ఒకనాడు వాన్యా తన చిరకాలవాంఛను అతని ఎదుట వ్యక్త పరిచాడు. వాన్యాకు 'ఫస్ట్ ఆఫ్‌మే కాలనీ'లో చేరాలనిఉంది. అతని వాంఛను యుర్కా మొట్టమొదట బాగుందన్నాడు. కాని తరువాత అతని భ్రమలను పోగొట్టాడు.

"కాలనీ మంచిదే. కాని ఏంలాభం? వాళ్లు నిన్ను చేర్చుకోరు."

"ఎందుకు చేర్చుకోరు?"

"అది అంత సులువనుకుంటున్నావా? నగరంలో అనేకమంది కుర్రవాళ్లున్నారు. వాళ్లందరికీ అక్కడ ఉండాలనేఉంది. ఆమాట కొస్తే నేనొకమాటు అక్కడున్నాను."

"నీవా?"

"అవును. నిరుడే అక్కడ ఉండివచ్చాను. అప్పుడు నాపరిస్థితి బాగాలేదు నాకు స్టాంప్‌కూడా లేదు. కనుక అక్కడికి వెళ్లాను. అక్కడేం బాగుండదనిపించింది. ఇలాగే పనిచేసుకుంటూ నగరంలో బ్రతకడమే బాగుంటుంది అక్కడివాళ్ళు ఖచ్చితంగాఉండే మనుష్యులు. అస్తమానం 'చాలామంచిది, చాలా మంచిది' అంటూ ఉంటాను. నే నెరిగిన మనుష్యులు అక్కడ కొందరున్నారు. కాని నాకేం లాభంలేదు."

యుర్కా తనమామూలు కేవిలో నేలమీద ఉమ్మేశాడు.

"వాళ్లతో అవసరంలేకుండానే నేను బ్రతగ్గలను" అన్నాడు మళ్లీ.

"అయితే యుర్కా! అక్కడ మనలను చేర్చుకోరా?"

"చేర్చుకునేందుకు వాళ్ళకు హక్కులేదు. అందులో చేరాలంటే ముందు నీవు కమీషన్ దగ్గరికి వెళ్లాలి."

"ఏకమిషన్?"

"దానిపేరు కొమోనెస్."

"ఎక్కడ ఉన్నదది?"

"ఇక్కడికి దగ్గరే. ఆ మూలకు వెడితేసరి. కాని ఏంలాభం? నిన్ను వాళ్ళు రానివ్వరు."

"ఎక్కడికి రానివ్వరూ? కాలనీలోకా?"

"కాదు కొమోనెస్‌లోకి. నేనూ అక్కడికి వెళ్ళాను. కాని నన్ను లోపలికి రానివ్వలేదు."

వాన్యా అదేమిటో చూద్దామని కొమోనెస్ దగ్గరికి పరుగెత్తాడు. అది దగ్గరలోనే ఉంది. కొమోనెస్ ముందు ఆగి కొంచెం సేపు తటపటాయించాడు. దాని చూచుకుని లోపలికి వెళ్ళాడు. కాని ఒక క్షణంలోనే బయటికి వచ్చేశాడు. అతని వెంట ఒక పోర్టరు వస్తున్నాడు హాలుదగ్గర ఆగి తలుపులు మూసివేశాడు. అక్కడ ఇద్దరికీ కొంతసేపు సంభాషణ జరిగింది. తలుపుదగ్గర నిలుచుని, వంగాని దుఃఖంతో వాన్యా ఇలా అన్నాడు:

"నన్ను పెళ్ళిపొమ్మనడానికి నీకు హక్కు లేదు."

అతని హక్కులవిగాట ఏ అభిప్రాయమూ వ్యక్తపరచకుండా పోర్టరు ఉత్తర్వులు జారీ చేస్తున్నాడు.

"ముందు ఇక్కణ్నుంచి వెళ్ళిపో."

"అలాకాదు. నేను కాలనీలో చేరాలి."

"కాలనీలో చేరాలని ఉందా? నీ ఇష్టాఇష్టాలతో సంబంధం లేదు. నీలాంటివాళ్ళను అందులో చేర్చుకోరు."

"మరెలాంటివాళ్ళను చేర్చుకుంటారు?"

"చట్టాలను, న్యాయశాస్త్రాలను ధిక్కరించినవాళ్ళను. తెలిసిందా?"

"ఎలాంటివాళ్ళను చేర్చుకుంటారన్నావు?"

"నీకంటె ప్రజ్ఞావంతుల్ని. నీలాంటివాళ్ళందర్నీ చేర్చుకుంటే కాలనీలో లేనిపోని బెడద."

"మరి ఉండడానికి నాకు చోటులేదు"

నివసించడానికి చోటులేదా! అయితే ఇంత బాధ ఎందుకు? స్పాన్ దగ్గరికి వెళ్ళు."

"అదేమిటది?"

'స్పాన్. అదొక ప్రదేశంపేరు. తిన్నగా అక్కడికి వెళ్ళు' అంటూ పోర్టరు తలుపుమూసుకున్నాడు.

"స్పాన్, స్పాన్!" అనుకుంటూ వాన్యా ఇవతలికొచ్చాడు.

ఇప్పుడతని మనస్సు మామూలుగా లేదు. పరిస్థితి తలక్రిందులుగా కనిపించింది. దూరంనుంచి యుర్కా రారమ్మని చేతులతో సౌజ్ఞ చేస్తూ పిలిచాడు. వాన్యా అక్కడికి వెళ్ళాడు.

"నేను నీకు చెప్పలేదూ మరి?"

వాన్యా స్టూలుమీద కూచున్నాడు. బ్రష్‌లు తీశాడు. ఒకతను అతనిస్టాండ్ మీద కాలు మోపాడు. యుర్కా ఒక ఆఫీసరు బూట్లకు పాలిష్ చేస్తున్నాడు. పాలిష్ చేస్తూనే మాటల్లోకి దిగాడు.

"నీవు వెళ్ళగానే రా బాబూ రా అని ఎళ్ళు చేర్చుకుంటారనుకున్నావా?"

వాన్యా తనపని ముగిసేవరకూ ఏమీ మాట్లాడలేదు.

"ఏదో స్పాన్ అని ఉందట. అక్కడికి నన్ను వెళ్ళమని చెప్పాడు."

"ఎవరు చెప్పారు నీకు?"

"అక్కడే ఉన్నాడు, ఒక బట్టతల మనిషి. స్పాన్ అట. అక్కడికి పొమ్మన్నాడు."

"ఉండుండు, చెపుతాను. స్పాన్? ఆ, ఆ. జ్ఞాపకమొచ్చింది. అది నరో బ్రాశ్‌లో ఉంది. నాకు తెలుసు. కాని అక్కడ..."

యుర్కా తల ఊపాడు. అతనికి స్పాన్ అంటే అసహ్యం కాబోలని వాన్యా అనుకున్నాడు.

"ఏం? అది మంచిదికాదా?" అని అడిగాడు.

"అక్కడ...అక్కడికి నీవు దూరంగా ఉండడమే మంచిది. అదంతా వట్టిబూటకం."

స్పిర్కా నిర్లక్ష్యంగా చూస్తున్నాడు. మనుష్యులు బూట్లు బాగుచేయించుకోవడానికి వస్తున్నారు. సిగరెట్లు కాల్చుకుంటూ

వెళ్ళిపోతున్నారు. నెమ్మదిగా ఈల వేసుకుంటూ అటూ ఇటూ పరిశీలిస్తున్నారు. స్విర్కా దృష్టిలో స్పాన్ ఉన్నా లేనట్లే లెక్క.

యుర్కా దూరంగా ఉన్న ఒక వాకిలివైపు చూపించాడు.

"అదిగో, అదే స్పాన్! కాని వాళ్ళు నిన్నక్కడికి రానివ్వరు. నీవు వెళ్ళగానే ఇంకొకగదిలోకి వెళ్ళమంటారు. అది స్వాగత మందిరం. అంతా బూటకమే లెద్దూ!"

ఆ మరుసటి రోజు వాన్యా స్పాన్‌కు వెళ్ళడానికి ప్రయాణమైనాడు. యుర్కా చూపించిన వాకిలి దగ్గరికివెళ్ళాడు. అక్కడ సన్నని మేడమెట్లు కనిపించాయి. ఆ మేడమెట్లు ఢాకేసరికి ఒక ప్రదేశం వచ్చింది. అక్కడ చీకటిగాఉంది. ఎన్నో వాకిళ్ళు ఉన్నాయి. వాకిళ్ళు తెరుచుకుని జనంపోతున్నారు, నస్తున్నారు. వాళ్ళ రాకపోకలకు అనుగుణ్యంగా అవి తెరుచుకుంటున్నాయి, మూసుకుంటున్నాయి. గదులలో సంభాషణలు, టైపు మిషన్ల చప్పుళ్ళు, వినిపిస్తున్నాయి. ఇవతలజాగాలో బెంచీలమీద కొందరు కూచున్నారు. వాళ్ళదుస్తులు, బూట్లు అసహ్యంగా ఉన్నాయి. వాళ్ళముఖాల్లో ఎంతో అలసటకనిపిస్తోంది. అక్కడ ఒకత్రోవ ఉంది. ఆ త్రోవవెంట వెడుతూ వాన్యా బోర్డులన్నీ చదువుతున్నాడు.

ఇవతలికి వచ్చి బెంచీమీద కూచున్న ఒకతనితో ఇలా అన్నాడు:

"ఇదేకదూ స్పాన్?"

"అవును ఇదే. అయితే ఏమిటి?"

స్పాన్ అంటే ఏమిటి?"

"స్పాన్ అంటే స్పానే. లోపలికి వెళ్ళు తెలుస్తుంది."

ఇలా అని అతనొక వాకిలివైపు చూపించాడు. ఆ వాకిలి మీద ఉన్న బోర్డును వాన్యా చదువుకున్నాడు. మైనర్ల సాంఘిక న్యాయహక్కుల రక్షణశాఖ.

బోర్డు వాన్యా మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు. ఆశ్చర్యంతో తిరిగివచ్చాడు.

"అదేనా స్పాన్ అంటే?" అని మళ్ళీ అడిగాడు.

"నామాట నమ్మవన్నమాట! ఓయి వెర్రివాడా! మళ్ళీ బోర్డు చదువుకో. ఒక్కొక్క పదానికి ముందున్న అక్షరాన్ని గుర్తు పెట్టుకో. ఆ అక్షరాలన్నీ కలిపితే స్పాన్ అవుతుంది."

వాన్యా మళ్ళీ చదువుకున్నాడు. ఇప్పుడు అతనికంతా అర్థమైంది. సంతోషపడ్డాడు. తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. అతను వెళ్ళిన గది చాలాచిన్నది. నలుగురు మహిళలు, ఒకతను అక్కడ కూచుని వ్రాసుకుంటున్నారు. వాన్యా వాళ్ళందరివంక ఒక మాటు చూచాడు. అందరిలోకీ చిన్నదైన ఒకావిడదగ్గరికి వెళ్ళాడు. ఆమెవి విశాలమైన నల్లటికళ్ళు. "గుడ్ మార్నింగ్!" అన్నాడు.

ఆవిడ తలెత్తిచూచింది, కాని వ్రాసుకుంటూనే ఉంది.

"ఏంకావాలి అబ్బాయ్ నీకు?" అని అడిగింది.

"స్పాన్ కోసం వెతుక్కుంటూన్నానండి."

"స్పాన్ అంటే ఇదేనయ్యా. ఏం పనిమీద వచ్చావు?"

"మీరు నన్ను "ఫస్ట్ ఆఫ్ మే కాలనీకి" పంపించాలి."

ఇప్పుడావిడకు అనుకోని ఉత్సాహం పుట్టుకొచ్చింది. వ్రాసుకుంటున్న కలం అవతలపెట్టి కళ్ళతో నవ్వుతూ అతన్ని చూచింది.

"అక్కడికి వెళ్ళాలని ఉందా? ఇది నీ స్వంత అభిప్రాయమేనా?"

"అవును."

"అదినీకు పుట్టిన అభిప్రాయంకాదు. ఎవరో నీకు చెప్పారు."

"లేదు. ఎవరూ పంపించలేదు. అది చాలా బాగుంటుందని నేనే విన్నాను."

నల్లటికళ్ళుగల ఆ స్త్రీ ఎదురుగా ఉన్న మరో స్త్రీవంక చూచింది. ఆ యిరువురి పెదవుల పైన చిరునవ్వు కనిపించింది.

"నీవు వీధులు తిరిగే కుర్రవాడివా ?"

"కాదు."

"అయితే ఎందుకొచ్చావిక్కడికి ? మాకు వాళ్ళతో పనిలేదు."

"పనీపాటు లేకుండా వీధులవెంట తిరగడం నాకిష్టంలేదు."

"అయితే నీవు చాలా తెలివైనవాడివన్నమాట."

"ఆమాత్రం తెలివి నాకెందుకుండకూడదమ్మా ?" అన్నాడు వాన్యా, తల ఒక ప్రక్కకు తిప్పుకుంటూ.

"ఉండాలి. ఉన్నదికూడాను." అంటూ ఆవిడ మరొకఆమె వంక చూచింది.

"సరే. ఇహ నీవు వెళ్ళిపో" అన్నది మరో ఆవిడ.

"కాని నేను........."

"కాలనీకి పిల్లలను పంపించేది మేంకాదు. అది కోమోనెస్ పని."

"అలాగా !"

"అవును. అక్కడ చట్టధిక్కారం చేసిన పిల్లలను ఆ కాలనీకి పంపిస్తారు."

"నేను అక్కడికి వెళ్ళాను. వెడితే ఏం లాభం ? వెళ్ళగానే పొమ్మంటారు. అక్కడొక మనిషి ఉన్నాడు-బట్టతల అతను చండ శాసనుడు."

"అవునులే. వెళ్ళగానే నిన్ను పొమ్మంటారు. వాళ్ళలాగా మేముంటే నీవిక్కడ ఇంతసేపు ఉండేవాడివికాదు. ఇహ వెళ్ళు. మమ్మల్ని విసిగించకు."

డెస్కు ముందుకూచున్న యువకుడు లేచి నిలుచున్నాడు.

"వాడు నిన్ను విసిగిస్తున్నాడంటే అందుకు కారణం నీవే. మేరియావికెంటెవ్నా వాడితో అనవసరంగా వాదనలో దిగావు. మరి పనులు ఎలా అవుతాయి?" అన్నాడు.

అతను డెస్క్ దగ్గరనుంచి ఇవతలికొచ్చాడు. వాన్యాదగ్గరికి వెళ్ళాడు. అతని భుజాలు పట్టుకుని గుమ్మంవద్దకు తీసుకెళ్ళాడు:

"ఇహ వెళ్ళరా బాబూ."

గుమ్మంలోనుంచి బయటపడగానే వాన్యా ఆ బోర్డు మళ్ళీ చదువుకున్నాడు:

"మైనర్ల సాంఘిక, న్యాయ హక్కుల రక్షణశాఖ" అందులోని ప్రతి అక్షరం చదివాడు. అవును. అదే స్పాస్ అంటే. అయితే పావుగంటముందు అది ఒకలాగా ఉంది. ఇప్పుడు ఇంకొకలాఉంది...

మూడువారాలు గడిచినతరువాత ఒక దురవస్థ వచ్చిపడింది. బూటుపాలిష్‌కుర్రవాళ్ళు బూట్లు బాగుచేసుకుంటున్నారు ఒక యువకుడు చిన్న పెట్టెపట్టుకుని అటు వచ్చాడు. వచ్చి వాళ్ళను పర్మిట్లు చూపించమని అడిగాడు. తప్పంతా స్పిర్కాదే. కుర్రవాళ్ళ మధ్యన వాన్యాను నిలుచోబెట్టినట్లయితే వాడికి పర్మిట్ ఉందో లేదో తనిఖీ జరుగకపోను. గుంపులో తప్పించుకుపోయేవాడు. కొంచెం అనుభవం ఉన్నవాళ్ళు అదే చెప్పారు. కాని వాన్యాకూచున్న జాగా స్పష్టంగా కనిపిస్తూనేఉంది. రెండోవరుసలో ఒకచివరన అతను కూచున్నాడు. మొట్టమొదట అతన్నే పర్మిట్ చూపించమని ఆ యువకుడు అడిగాడు. ఎదురుగా నిలుచున్న అతన్ని చూచి వాన్యా భయపడిపోయాడు. పెదవులు కంపించాయి, నోటమాటరాలేదు.

"సరే, నీ వస్తువులన్నీ ఒకచోటపెట్టు" అన్నాడు ఆ యువకుడు. వాన్యా తనను ఆదుకోమన్నట్లుగా స్పిర్కావంక చూచాడు. కాని స్పిర్కా తనకేమీ ప్రమేయం లేనట్లు వింతగా నటించసాగాడు. సంతోషంగా వీధిప్రక్క చూస్తున్నాడు.

"సామాను కర్దమంటే సర్దవేం? స్టాండ్ తీయి." అన్నాడు మళ్ళీ ఆ యువకుడు.

"ఆ స్టాండ్ నాదికాదు."

"నీదికాదూ? అయితే ఎవరిది?"

"స్విర్కాడి."

"ఓహో, స్విర్కాదా? స్విర్కా అంటే నీవా?" అంటూ యువకుడు అవతలఉన్న కుర్రాడివంక చూచాడు.

స్విర్కా నిర్లక్ష్యంగా కదిలాడు. అతని వైఖరి చూచేసరికి యువకుడికి కోపంవచ్చింది.

"అవును. స్విర్కాఅంటే నేనే. కాని దానికీ నాకూ ఏమీ సంబంధంలేదు" అన్నాడు స్విర్కా.

ఒరేయ్ అబ్బాయిలూ! ఈస్టాండ్ ఎవరిదర్రా?"

యువకుని ప్రశ్నకు మొదట ఎవరూ సమాధానం చెప్పలేదు. కొంచెంసేపు పోయాక గార్మిడర్ ఇలా అన్నాడు:

"వాన్యాను మనం ఒంటరివాణ్ణి చెయ్యకూడదు. ఆ స్టాండ్ వాడిదికాదు. స్విర్కాడి. స్టాండేకాదు అందులో సామానుకూడా స్విర్కాదే."

"ఓరి దొంగముండాకొడకా! అంతా న్యాయ వ్యతిరేకమే, అది నేను వాన్యాకు అమ్మేశానుకదుట్రా. నీకు తెలీదూ? ఆమాట చెప్పడానికి నీకు నోరు రావడంలేదేం?" అన్నాడు స్విర్కా.

"అది నాదికాదు. వాడు నాకు అమ్మలేదు." అన్నాడు వాన్యా భయపడుతూ.

"ఇలాంటి డబాయింపులు పనికిరావు స్విర్కా" అన్నాడు యుర్కా.

ఇప్పుడు ఆ యువకుడికి అంతా అర్థమైపోయింది. స్విర్కా పన్నాగం పారలేదు. ఇన్నాళ్ళూ తన స్టాండ్ వల్ల అవనంగా గడించే

డబ్బు ఇవ్వడం పోతోంది. అదనపు స్టాండ్ పథకం విఫలమైంది. ఆ యువకుడు రెండే రెండుమాటలన్నాడు:

"రా. నాతో రా."

స్విర్కా ఊపిరి పీల్చుకున్నాడు. చేయిఎత్తి వాన్యా చెవి క్రింద ఒక దెబ్బ కొట్టాడు. గార్డెనర్ గబగబ మధ్యకువచ్చి అడ్డుకో బోయాడు. స్విర్కా తనకాలితో స్టాండ్‌ను ఒకతన్ను తన్నాడు. స్టాండ్‌లో ఉన్న చిల్లరడబ్బులు, పాలిష్ డబ్బాలు పేవ్ మెంటుమీద పడిపోయాయి. స్విర్కా మాట్లాడకుండా జేబులో చేతులుపెట్టుకుని అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఆ యువకుడు సహాయంకోసం చుట్టూ చూశాడు.

"అసందర్భం" అంటూ యుర్కా వాన్యాదగ్గరికి వెళ్లాడు.

పది నిముషాలు గడిచింది. వాన్యా మెల్లగాలేచి వెళ్ళి పోయాడు. అతన్ని ఎవరో ఎగతాళిచేస్తున్నట్లుంది. వీధిచివరకు వచ్చాడు. దీనంగా చూశాడు. ఎవరూ కనిపించలేదు. ఒక కుక్క మరొకవీధిలోకి వెళ్ళిపోతోంది. నిలుచున్న వాన్యావంక అది ఒకసారి అనుమానంగా చూచింది. వాన్యా కొంచెం కదిలాడు. అది తన తోకను రెండుకాళ్ళ సందున పెట్టుకుని వెళ్ళిపోయింది.

వాన్యాదగ్గర ఇరవై రెండు కోపెక్కులే ఉన్నాయి. ఆ వేళ సంపాయించిన డబ్బంతా స్టాండులోనే ఉండిపోయింది. మళ్లీ అతను ఒంటరివాడై పోయాడు. ఆకలి వెంటతరుమసాగింది. చేతిలోఉన్న డబ్బు రెండురోజులకే సరిపోయింది. మూడోరోజున అన్నీ బాధలే. కాలం బాగాలేదు. రోజులు కలిసిరావడం లేదు. గాలి తీవ్రత హెచ్చింది. ఉదయం తెల్లని సూర్యకాంతి. మధ్యాహ్నం రెండు గంటలకల్లా ఆకాశంలో నల్లనిమబ్బులు. సాయంకాలం సుడిగాలి, తుపానుతో నగరమంతా అల్లకల్లోలమవుతోంది.

రోజువిడిచి రోజు వర్షం ధారపాతంగా కురుస్తోంది. అప్పు డప్పుడు ఉరుములు, మెరుపులు ఉండి ఉండి పిడుగులు, రాత్రల్లా

చలిగాలి, ఇలాగ ఒకవారం గడిచింది. వాన్యా పడుకునే గడ్డిపాము మొదటిరోజుననే తడిసిపోయింది. మరుసటిరోజు వాన ఇహాకురవదను కున్నాడు. కాని పగలల్లా తెరిపిచ్చి రాత్రివాన పడింది. పడుకునే గడ్డిపూర్తిగా తడిసిముద్దయింది. మూడవరాత్రి అక్కడ గడపడం దుర్భరమనిపించింది. పడుకునే చోటులేక వాన్యా ఆ రాత్రల్లా వీధుల వెంట ఇళ్ళముందు తలదాచుకుంటూ ఆ రాత్రే అలాగే నడుస్తూ వెళ్ళి స్టేషన్ చేరుకున్నాడు.

స్టేషన్ ప్రశాంతంగా ఉంది. ప్రయాణీకులు కూచునేహాలు అప్పుడే తుడిచారు. మీాదికప్పులు తడిసిఉన్నాయి. విద్యుద్దీపాలు తళతళ మెరుస్తున్నాయి. హాలులో బెంచీలమీాద కొంతమంది ప్రయాణీకులు కునుకు తీస్తున్నారు. ఇద్దరు ఎర్రసైనికులు పొట్లం తెరచి ఏదో తింటున్నారు. మరొకపొట్లం విప్పిబెంచీమీాద ఆరు కోడుగుడ్లను పెట్టుకున్నారు. అవి కిందపడకుండా మోకాళ్ళు అడ్డుపెట్టుకున్నారు మరొకతను కోడిగుడ్డును కోస్తున్నాడు. రొట్టెముక్కలు చిదువు తున్నాడు. చేపలుి తీసుకొని వ్రేళ్ళసందున పెట్టుకుని నోటితో కొరుకుతున్నాడు. వాన్యా వాళ్ళకు కొంచెందగ్గరలోకి వెళ్ళాడు. సైనికులు అతనివంక చూశారు.

"అకలిగా ఉందా ?" అని ఒకతను వాన్యాను అడిగాడు.

"నాదగ్గర డబ్బులేదు"

"డబ్బు సంపాదించకపోవడం చాలా తప్పు. నీవు వీధులవెంట తిరిగే కుర్రవాడివా ?"

"కాదు, కాదు."

"డబ్బులేకపోతేనేంలే. భయంలేదు. ఇలారా. ఇక్కడకూచో"

వాళ్ళ కెదురుగా బెంచీమీాద వాన్యా కూచున్నాడు. సైని కులు తాము తింటున్న పదార్థాలు కొన్ని అతనికి పెట్టారు. ఆప్యా యంగా మాట్లాడుతూ అతనికి కోడుగుడ్లు, రొట్టె అందిస్తూనే ఉన్నారు. ఇంతలో అక్కడికి ఒక గార్డు వచ్చాడు:

ఈ కుర్రాడెవరు? మీతో ప్రయాణం చేస్తున్నాడా? అంటూ వాన్యాను చూపించాడు.

"ప్రస్తుతానికి మాదగ్గరే ఉన్నాడు. మీరు చూస్తున్నారు కదూ" అన్నాడు ఒక సైనికుడు.

గార్డు వాన్యావంక చూచాడు. వాన్యా తింటున్న పద్ధతి చూచి అనుమానించాడు:

"ఈ కుర్రవాడి పద్ధతి అంతా కొత్తగా ఉందే" అన్నాడు.

"ఏ కొత్తా లేదు. అంతా అతనే సర్దుకపోతాడు. అన్నీ అతనే తెలుసుకుంటాడు."

గార్డు అక్కడనుంచి వెళ్ళిపోయాడు. సైనికులు అటువైపు చూడనుకూడ చూడలేదు. మాట్లాడకుండా తింటూ కూచున్నారు. తినుపదార్థాలన్నీ అయిపోయినతరువాత ఆకులూ అవీ వేస్టు బాస్కెట్‌లో పారేశారు. వారిలో చిన్నవాడైన సైనికుడు "బాగుంది. ఇవాళ పండుగలాగా ఉంది" అన్నాడు.

15

వెండి నాణెం

స్టేషన్‌లో బెంచీమీద వాన్యా నిద్రపోయాడు. ఎదురుగుండా ఎర్ర సైనికులున్నారు కనుక ఆ రాత్రి గార్డు అతన్ని ఏమీ అనలేదు. కాని అతను ప్రొద్దున్నే లేచి చూచేసరికి అక్కడ ఎర్రసైనికులు లేరు. గార్డు మౌనంగా అతనివంక చూచాడు. ఇక వెళ్ళిపోకతప్పదని వాన్యా గ్రహించుకున్నాడు.

అక్కడనుంచి లేచి తిన్నగా పెద్దబజారున పడ్డాడు. నరోబ్రాజ్ దగ్గర ఏం జరుగుతోందో చూద్దామనుకున్నాడు. స్పాన్ దగ్గరికి మళ్ళీ వెళ్ళి కాలనీగురించి తిరిగిమాట్లాడాలనుకున్నాడు.

ఇన్ని ఉద్దేశాలు మనస్సులో పెట్టుకుని ఎంత వేగంగా వెడదామన్నా సులభంగా అడుగు పడడంలేదు. స్పాన్ కార్యాలయంలో డెస్కుముందు ఒకతను కూచుని విషాదంగా చూస్తున్నాడు.

షాపులోనుంచి ఒకబ్బాయి బయటికివచ్చాడు. అతను బంగారపురంగు ఎత్తు టోపీ పెట్టుకున్నాడు. అతనే బిగోనక్. అతని టోపీ బాడ్జీ, నల్లని కాంతివంతమైనకళ్ళు చూచేసరికి వాన్యాకు ఎంతో ఆనందం కలిగింది. అలాంటి టోపీ అంటే అతనికెంతో ఇష్టం.

బిగోనక్ చేతిలో బిగిస్‌కు వేసుకునే పాలిష్‌టిన్ను ఒకటి ఉంది. అంగడిముందు నిలుచుని డబ్బాకు అంటించిన కాగితాన్ని జాగర్తగా చదువుకున్నాడు. తరువాత డబ్బానే జేబులో పెట్టుకున్నాడు. జేబులోనుంచి చేయి తీస్తున్నప్పుడు అందులో ఉన్న డబ్బు క్రింద పడింది. క్రిందపడిన నాణెం దొర్లుకుంటూపోయి వాన్యా కాళ్ళదగ్గర

అగిరింది. వాన్యా చటుక్కున వంగి ఆ నాణెం తీసుకున్నాడు. అతను దాన్ని ఏంచేస్తాడో చూద్దామని బిగోనక్ నిరీక్షిస్తూ నిలుచున్నాడు. వాన్యా ఆ నాణాన్ని తీసుకొచ్చి బిగోనక్ చేతిలో పెట్టాడు.

"అది నా ట్రాం చార్జీ. అదిపోతే ఆరు కిలోమీటర్ల దూరం నడవాల్సివస్తుంది" అంటూ విస్మయంతో బిగోనక్ ఆ నాణెం తీసుకున్నాడు.

తనకు అంతకంటె హెచ్చు కష్టాలే ఉన్నాయన్నట్లు వాన్యా మర్యాదగా నవ్వాడు.

"ఆరు కిలోమీటర్లా ?" అని అడిగాడు.

"అవును. ఫస్ట్ 'ఆఫ్ మే కాలనీ' ఇక్కడికి అంతేదూరం. "

ఈ మాట వినేసరికి వాన్యా ఎంతో ఆశ్చర్యపడి ఇలా అడిగాడు:

"ఏమిటన్నారు ? 'ఫస్ట్ ఆఫ్ మే కాలనీయా' ?"

"అవును . ఫస్ట్ ఆఫ్ మే కాలనీ."

"నిజంగా మీరు అక్కడనుంచేవస్తున్నారా ?"

"అవునయ్యాబాబు. అక్కడనుంచే వస్తున్నాను "

వాన్యా తన ఆనందాన్ని ఆపుకోలేకపోయాడు. ఆమాట వినగానే పకపక నవ్వాడు తన ఉన్నతస్థానాన్ని సూచిస్తూ బిగోనక్ కూడా నవ్వాడు.

"అవును. నేను కాలనీలో ఉంటున్నాను మా కాలనీలో ఉండేవాళ్ళ దుస్తులు ఇలాగే ఉంటాయి" అన్నాడు.

ఇలా అని భుజాలెగరవేశాడు. మోచేతిమీద ఉన్న బాడ్జీ బంగారపు అక్షరాలతో ధగధగ మెరుస్తోంది. దానిమీద 'మే'అనే అక్షరాలు, అడ్డంగా వెండిలాగా మెరుస్తున్నపట్టీ.

"నా కక్కడికి వెళ్ళాలని ఉంది."

"నీవు ఆకతాయి కుర్రవాడివా ? నీకేవృత్తీ లేదా ?"

"కాదు. అకతాయిని కాదు. కాని కాలనీలో చేరాలని ఉంది. ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాను. కాని లాభంలేకపోయింది. ఎవరూ నన్నక్కడికి పంపించడంలేదు."

వాన్యా తన గాథవాంఛను వ్యక్తంచేశాడు. ఇరువురూ పేవ్‌మెంటుమీద నిలుచుని మాట్లాడుకుంటున్నారు. బాటసారులు అటూ ఇటూ పోతున్నారు. వెడుతున్న బాటసారులకు త్రోవలో అడ్డంగా నిలుచోవడం మంచిపద్ధతికాదని బిగోనక్, వాన్యా చెయ్యి పుచ్చుకుని ప్రక్కకు తీసుకొచ్చాడు.

"అసలుసంగతి చెపుతానుండు. మా కమాండర్ల కౌన్సిలు మహాచెడ్డది. అంతా నిష్కర్షగా ఉంటారు. నిన్ను చేర్చుకోడానికి పేచీపడదంటారు. నిన్ను మేము ఎందుకు చేర్చుకోవాలి అని అడుగుతారు. అంచాత ఒకపనిచెయ్యి. క్రామోనెస్ అనే ఒక కమీషన్ ఉంది. అక్కడికెళ్ళి ప్రయత్నించు."

"వెళ్లానండీ వెళ్ళాను అక్కడికీ వెళ్ళాను. అన్నిచోట్లకూ తిరిగాను." అక్కడికేకాదు.

"అయితే ఆవిడ నీకు సహాయపడలేదూ?"

"ఎవరూ?"

"ఆవిడ. అక్కడున్నావిడ. ఆవిడ నిన్ను చేర్చుకోలేదా?"

"లేదు, చేర్చుకోలేదు. పై పెచ్చు అక్కడున్నతను నన్ను బయటకు గెంటివేశాడు. చట్టం......... చట్టాన్ని ధిక్కరించిన వాళ్ళకేకదూ అది?" మీరు చట్టాన్ని ధిక్కరించారా?"

బిగోనక్ తన బూటుకాలుతో గోడను తన్నాడు. తలవంచి నవ్వుకున్నాడు.

"చట్టాన్ని ధిక్కరించినవాళ్ళు – అదివాళ్ళు పెట్టుకున్న పేరు. అదేమిటో వాళ్ళకే తెలియాలి. అన్నీ కల్లబొల్లి కబుర్లు. నీవు ఎలాంటి చట్టాన్ని ధిక్కరించావో ఆ భేదమేమీ అక్కర్లేదు."

ఇలాఅని బిగోనక్ కొంచెం హాసంగా చూస్తూ నిలుచున్నాడు. ఇది జటిలమైన సమస్య. తన శక్తికి మించిన విషయం. అతని కనుబొమలు అలాగే కుంచించుకపోయి ఉన్నాయి. మూతి బిగించుకొని క్షణంసేపు ఆలోచించాడు. కోపంగా తల ఊపి ఇలా అన్నాడు:

"వాళ్ళిలా తగలడితే మనకెందుకు? ఒకపని చెయ్యి. వచ్చే శనివారం ఇద్దరం అక్కడికి వెడదాం. నిన్ను చేర్పించమని నేను అడుగుతాను. ఈలోగా మా కమాండర్‌తో మాట్లాడి చూస్తాను. అతను చాలా మంచివాడు. అతని పేరు అల్యోషా జయిరియన్‌స్కీ! కాలనీకి నీకు త్రోవ తెలుసునా? కొరోషిలోవ్స్కాలోనుంచి రావాలి."

"ఓ! అలాగే త్రోవ కనుక్కుంటాను."

"ఇదిగో! ఈ పదికోపెక్కులు తీసుకో. ఏమైనా కొనుక్కుతిను."

వాన్యా ఆ డబ్బు తీసుకున్నాడు:

"మరి నీకు ట్రాం కు చార్జి? నీవు అంతదూరం నడవగలవా? అన్నాడు.

"నడకంటే నాకిష్టమే. కాని నేనెందుకు నడవాలి? ఏమీ ఇవ్వకుండానే ట్రాం ఎక్కుతాను."

"టిక్కెట్టు లేకుండానా!"

"ఆ. నిరభ్యంతరంగా. టికెట్టు లేకపోతే ఎక్కనివ్వరనుకో. అయితేనేం? కండక్టర్ చూడకుండా ట్రాంలో అటూ ఇటూ తిరుగుతూ తప్పించుకుంటాను."

వాన్యా నవ్వాడు. బిగోనక్ మామూలు పద్ధతిలో శాల్యూట్ చేశాడు.

ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు: శనివారం ఎప్పుడొస్తుందా అని రోజులు లెక్కపెట్టుకుంటూ కూచున్నాడు వాన్యా.

శనివారంనాడు వనిలో ఉన్న ఒలెంకోను కలుసుకోవాలను కున్నాడు బిగోనక్. ఆవేళ తాను కాలనీకి నడిచి వెళ్ళవలసి ఉంటుం దని అనుకున్నాడు వాన్యా.

16

న్యూయార్కు దొంగలు

ప్రొద్దున్నే లేవడం, లేచినవెంటనే కాలకృత్యాలు తీర్చు కోవడం, ఆ తర్వాత స్నానం, క్షౌరం ఇవన్నీ కాలనీలో ఉండేవారికి మామూలు. అంతకుముందే డాక్టర్ దగ్గరికి వెళ్ళడం పరిపాటి. ఇగోర్ చెర్నియావిస్ ఉదయాన్నే లేచి మామూలు పనులన్నీ ముగించుకున్నాడు.

ఒలెంకో అతన్ని దర్జీవాడిదగ్గరికి తీసుకెళ్ళాడు. అతను ఇగోర్ కొలతలను తీసుకుంటూ ఉంటే ఒలెంకో ఇలా అన్నాడు:

"ఇది నీ యూనిఫారంకోసం."

ఇగోర్ ఒలెంకో వెంట వెళ్ళాడు. ఇరువురూ సామాన్ల గది దగ్గరికి వచ్చారు. అక్కడొకతను ఉన్నాడు. స్కూలుకు వెళ్ళే టప్పుడు వేసుకునే దుస్తులు, బూట్లు, ఒక ఎత్తు టోపీ, ఒక బెల్టు; ఇవన్నీ అతను ఇగోర్‌కిచ్చాడు. ఇగోర్ వాటిని తీసుకున్నాడు. వాటిల్లో కొన్ని ధరించి తక్కినవి వెంట ఉంచుకున్నాడు.

తరువాత ఒలెంకో, ఇగోర్‌ను వెంటబెట్టుకుని విశ్రాంతిగది దగ్గరికి తీసుకువెళ్ళాడు.

"అయిదుగంటలదాకా నీవు ఇక్కడే ఉండు. పడకగదిలోకి నిన్ను నేను తీసుకెళ్ళను అక్కడ ఎనిమిదవదిళం లేదు. అందరూ

తమల్లో ఉన్నారు. నిన్ను వాళ్ళు పట్టించుకోరు" అని చెప్పాడు ఒలెంకో.

ఇంతవరకూ అంతా సవ్యంగానే సాగిపోయింది. ఒలెంకో నిష్కర్షగా ఉన్నప్పటికీ ఇగోర్‌కు కష్టమనిపించలేదు. కాని ఇప్పుడు మాత్రం అతనికి అదోలాఉంది.

"నేనిక్కడే ఉండాలా? బయటికి వెళ్ళకూడదూ?" అని అడిగాడు ఇగోర్.

"వెళ్ళవచ్చుననుకో. కాని నిన్ను రెండో అంతస్థులోకి, మిగిలినచోట్లకూ రానివ్వరు. ఇంకా నీవు దళంలో చేరలేదుకదూ. నీవు కొత్తవాడివి. నిన్ను ఎవరూ ఎరుగరు."

"కాని నేను యూనిఫారం వేసుకున్నాను కదూ.?"

"వేసుకుంటే మాత్రం? భోజనం వేళదాకా ఇక్కడే ఉండు. భోజనమయ్యాక స్కూలుకు వెడదాం. అక్కడ నిన్నుపరీక్ష చేస్తారు"

ఒలెంకో లోనికి వెళ్ళిపోయాడు. ఇగోర్ విశ్రాంతి గదిలో ఒంటరిగా ఉండిపోయాడు.

అదొక పెద్దహాలు. అందంగా అలంకృతమైఉంది. గోడలకు ఆనుకుని బెంచీలు వరుసలుగా ఉన్నాయి. హాలుకొసన కొంచెం జాగా ఉన్నది. అక్కడ విరిగిపోయిన బెంచీలుఉన్నాయి. అక్కడే ఒక వేదికఅమర్చి ఉంది. దానిమీద చక్కని తివాసీ ఒకటి పరిచి ఉంది. వేదికపైన పాలరాతితో చేసిన స్టాలిన్‌విగ్రహం ఉన్నది. చుట్టూ గోడలకు స్టాలిన్‌జీవితంలోని సంఘటనలు తెలిపే చిత్తరువులు' వివిధభంగిమల వర్ణచిత్రాలు వ్రేలాడుతున్నాయి. హాలులో నలు వైపులా మరికొన్ని చిత్తరువులు, దృశ్యాలు అమర్చిఉన్నాయి. ఇగోర్ వాటివంకచూస్తూ ఎంతోసేపు ఉండిపోయాడు. ఆ హాలులోని ప్రతివస్తువూ ఎంతో ముచ్చటగా ఉన్నందుకు అతను చాలా ఆశ్చర్యపడ్డాడు. కంటికికనిపించినదల్లా ఇంపుగాఉంది. కొన్నిబొమ్మలు ఓక్‌తోచేసిన గాజుపెట్టెల్లో అమర్చబడిఉన్నాయి. నేలమీద అంద

మైన కిటాకీ అప్పుడే కొనివేసినట్లు శోభిస్తోంది. బెంచీలదగ్గర ఒక తోచేసిన నలుచదరపు బల్లలున్నాయి. వాటిచుట్టూ కుర్చీలు.

ఇగోర్ దృష్టి ఒక గోడమూలకు మళ్ళింది. అక్కడ అనేక చిత్రాలున్నాయి. పెద్దవాళ్లవి, యువకులవి, చిన్నపిల్లలవి ఆచిత్రాలు. వాటిలో ఒక ఫోటోను ఇగోర్ ప్రత్యేకించి చూచాడు. ఆఫోటోలో ఉన్న ఒలెంకోను గుర్తుపట్టాడు. కాని మిగతా పిల్లలెవరో అతనికి తెలీలేదు. హాలులో అటూ ఇటూ తిరిగి ఒకపెద్ద అద్దంముందు అతను నిలుచుండిపోయాడు. ఇంతవరకూ తాను వేసుకున్న సూట్లు యూనిఫారం ఎలా ఉన్నదో అతను చూచుకోలేదు. ఇప్పుడది అద్దంలో అతను చూచుకున్నాడు. యూనిఫారం ఎంతో ముచ్చట గొలుపుతోంది. పొడుగాటి పంట్లాం, సన్నని బెల్టు, చక్కగాఉన్న లోపలిచొక్కా, మెడచుట్టూ వెడల్పయిన నీలిరంగు కాలరు, యూనిఫారం అంతా బాగానేఉన్నది కాని, కాలరు తెల్లగా ఉంటే మరీ బాగుండేది. తలజుట్టు పొట్టిగా కత్తిరించిఉంది. అదే అతనికి నచ్చలేదు. జుట్టు అంత పొట్టిగా ఉంటే అసహ్యంగా ఉంటుంది. కాలనీలో ఉన్న చాలామందికి, ఒలెంకోతోసహా పొడుగ్గానేఉంది. అందుకు కాలనీవాళ్ళు ఒప్పుకున్నారు కాబోలు.

అద్దంలో కనిపిస్తున్న తనముఖం చూచి తానే మురిసిపోయాడు. పెదవులపై చిన్ననవ్వు తొంగిచూచింది. కనుబొమలు సన్నగా, నిగనిగలాడుతున్నాయి. అయితే తనముఖంలో ఏదో మార్పు వచ్చినట్లు అతనికి తోచింది. అది గంభీరంగా ఉండడంవల్ల వచ్చిందో, లేక ఆశ్చర్యంవల్ల కలిగిందో అతనికి అవగతంకాలేదు. మార్పు ఎందుకువచ్చిందో, ఎక్కడవచ్చిందో చెప్పలేదు కాని - మార్పుమాత్రం వచ్చింది. అంతే అతనికి తెలుసు.

బెంచీమీదకూచుని ఆలోచనలో మునిగిపోయాడు. బాగానే ఉంది. ఇక్కడ ఈ మే కాలనీలో తానిక నివసించబోతున్నాడు! అయితే ఎంతకాలం? ఏడాదా? రెండేండ్లా? మూడేండ్లా? తనకు అక్కణ్నుంచి పారిపోవాలని మాత్రంలేదు. ఇంతకుముందు రెండేళ్ళ

"స్వేచ్ఛాజీవితం" గడిపాడు. ఆ రెండేళ్ళూ కావలసినంత డబ్బు. అప్పుడు కొంతమంది స్నేహితులయ్యారు. కాని ఆ జీవితం కూడా విసుగు కలిగించింది సినిమాలు, పిప్పరమెంట్లు, చాక్ లెట్లు రకరకాల తిండ్లు ఇవన్నీ విసుగెత్తాయి. అన్నిటికన్నా మరో విషయం మరీ విసిగెత్తించింది అతనికి తలదాచుకునేందుకు చోటులేదు. ఎక్కడ పడుకున్నా అసహ్యంగా వుండేది. కొన్నాళ్ళు స్టేషన్లలోను, పొలాల్లోను, దొంగల గదులలోను కాలంగడిపాడు. ఈ "స్వేచ్ఛా జీవితం"లో అతనికి దక్కిందల్లా అసహ్యమైన దుస్తులు మాత్రమే.

ఇలా జీవితంగడిపితే బాగుండలేదు. తను మొదటగా ఊహించినట్లుగా కొత్త జీవితం తారుమారు అయింది. తనలాంటి "స్వేచ్ఛా జీవులకు" చాలా సుఖంగా ఆనందంగా ఉంటుందని మొదట ఊహించాడు. ఇలాంటి వాళ్ళ జీవితం ఎలా ఉంటుందో తను అమెరికన్ చలనచిత్రాల్లో చూచాడు. వాళ్ళ జీవితం హాయిగా, సుఖప్రదంగా విజయవంతంగా సాగిపోతున్నట్లు వాటిల్లో కనిపించింది. కాని దానికీ, ప్రత్యక్షజీవితానికీ ఏమాత్రం సంబంధం లేదు. ఒకప్పుడు అలాంటి కృత్రిమ కల్పనా చిత్రాలను చూచి తాను ముగ్ధుడయ్యాడు. వాటిలో కనిపించిన పాత్రలకు ఎనలేని సాహసం, గొప్పనేర్పు ఉన్నట్లు నిరూపింపబడింది. వాళ్ళు ఇట్టే దొంగతనాలు చేస్తారు. ఎవరికీ కనిపించకుండా తప్పించుకుపోతారు. వాళ్ళను వెయ్యికళ్ళతో డిటెక్టివ్ లు వెంటాడినా పట్టుకోలేరు. కాని ఆ చలనచిత్రాలు వేరు, వాస్తవిక జీవితాలు వేరు. జీవితంలో ఇలాంటి సంఘటన ఒకటీ కనిపించదు. ఎంతనేర్పుతో దొంగతనం చేసినా డిటెక్టివ్ లు శ్రమలేకుండా, అవలీలగా పట్టేస్తారు. దొంగలను పట్టుకోవడానికి పెద్ద డిటెక్టివ్ లే అవసరంలేదు. ఆయుధాలతో అక్కడఉన్న కాపలాదారుడో, రక్షక సైనికుడో ఆ పనిచెయ్యడానికి చాలు. న్యాయాధికారి టె ళ్ళలోను, స్టేషన్లలోను ఇదే పరిస్థితి. దొంగతనం చేసి తప్పించుకోవాలంటే ఎవరికీ సాధ్యంకాదు. కార్లు గబగబా పరుగెత్తడం, తపీమని ఆగడం, వస్త్రాలు మాయంకావడం, రహస్యపత్రాలు, కత్తి

యుద్ధాలు, పిస్తోళ్లు, శృంగారపాలు, ముసుగు మనుష్యులు, ఇవన్నీ చలనచిత్రాలలోనే. పాలినా నికోలియవ్నాతో ఇగోర్ మాట్లాడిన తరువాత, అతని హృదయం మరీ మారిపోయింది. వట్టిదే! తాను ఊహిస్తున్న జీవితంలో ఏమాత్రం సాహసంలేదు, వీరత్వంలేదు, నిజం లేదు. ఇవన్నీ అమెరికన్‌పద్ధతిలో ఊహించే పగటికలలు. ఆప్రపంచం లోకి తాను ఇహ వెళ్ళకూడదని ఇగోర్ భావించుకున్నాడు.

అయితే కాలనీ తనకు కల్పించినజీవితం ఎలాంటిది? ఇగోర్‌కు చేతినిండా పని అప్పగించారు. న్యాయంగా పని చేయడమంటే ఇగోర్‌కు ఆక్షేపణలేదు. కాని అతను ఏపూటా పనిచేసిన పాపాన పోలేదు. కాలనీలో పనిచేయడమంటే అక్కడున్న వాళ్ళందరికీ సంతోషమే. పనిచేయనివాడికంటె పని చేసేవాళ్ళు అక్కడ గౌరవ నీయులు. ఇగోర్‌కు పని ప్రారంభించడమంటే కష్టంగాఉంది. ప్రారం భించాలని ఉన్నా మనస్సు వెనక్కు లాగుతోంది. తనను ఒకస్కూలుకు పంపిస్తారేమో అనుకున్నాడు. అయితే తనకేపని ఇవ్వాలో డైరెక్టరు జకరోవ్‌కు తెలుసును. ఉన్నతవిద్య అభ్యసించడం అతని కిష్టమే. కాని అతనెప్పుడూ స్కూలుకు సరిగ్గా వెళ్ళలేదు. విద్య ప్రసాదించే ఉత్తమగుణాలేవో అతను గ్రహించలేకపోయాడు. పాఠ శాలలో తనదృష్టిని చదువుమీదకాక మాస్టర్లమీద, వాళ్ల వింత వింత ప్రవర్తనలమీద కేంద్రీకరించాడు. కాలం వృథా చేశాడు. స్కూలులో ఎప్పుడూగోడనచేసే విద్యార్థులమధ్య కూచోవడమంటే అతనికి తలనొప్పిగా ఉండేది.

ఇగోర్ చాలాసేపు ఆలోచిస్తూ కూచున్నాడు. ఏ విషయం అంతుచిక్కలేదు. ప్రతిదీ ఒక ప్రశ్నగానే ఎదురైంది. అన్ని ప్రశ్నల కంటె తన తల్లి ప్రధానమైన ప్రశ్న. జీవితంలోని వైరుధ్యాలను చూచి వాటిని సాధించే సహనంలేక కొంతకాలం అతను ఎటూ ఆలోచించకుండా వుండిపోయాడు. తన తల్లి స్థితిని పట్టించుకోలేదు.

మరి కొంతకాలం పోయాక కాలనీ యువకుని దుస్తులలో ఆమె దగ్గరికి వెళ్ళి కాలనీలో నమస్కరించినట్లు ఆమెకు నమస్కరిస్తే,

ఆవిడ తనను చూచి ఎంతో సంతోషిస్తుంది. ఇలా అనుకుంటూ తనకు కాలనీలో యిచ్చిన పై ఉడుపును పరిశీలించుకున్నాడు. పని చేస్తున్నప్పుడు ఈ ఉడుపు ధరిస్తే దుమ్ము, ధూళి లోపలి దుస్తుల మీద పడదు. అది యిప్పుడు ఎదురుగుండా బెంచీమీద వుంది. ఈ ఉడుపుతో తనకు ఒక కొత్తతరహా జీవితం మొదలవుతుంది. ఆ జీవితం ఎలా వుంటుందో అతను వూహించలేకపోయాడు. అది తెచ్చిపెట్టే భవిష్యత్తు చాలా సంకీర్ణమైంది. అది ఏమిటో తెలీదు కనుక అతనికి ఉత్సాహం కలిగించలేదు.

ఇదివరకు తాను గడిపినరోజులు కొన్ని అత్యుత్సాహభరిత మైనవి; ఆశ్చర్యజనకమైనవి, అత్యంత ప్రమాదకరమైనవి. అప్పుడు తనకు కావలసిందల్లా కేవలం సాహసం. అయితే ఈ రోజునుంచి తనజీవితం ఎలా ఉంటుంది? ఎటువంటి భవిష్యత్తు తనకు రానున్నది ? ఇక్కడ తాను ఒకఅందమైన పంజరంలోకూచుని ఉన్నాడు. చేతిలో రైఫిల్ పట్టుకుని దీన్ని కావలా కాస్తున్నవాడు పెర్కా క్రావ్ చుక్. తను "న్యూయార్కు" నగరపు "దొంగచేప" వంటివాడు. అయితే ఈ చేపను పట్టుకోవడానికి పెద్దగాలం వేయనక్కర లేకపోయింది. తాను ఇట్టే దొరికిపోయాడు.

ఆనాడు డ్యూటీలోఉన్న కమాండర్ ఒలెంకో అక్కడికి వచ్చాడు. ఇగోర్‌ను భోజనానికి రమ్మని పిలిచాడు. అతను విచార వదనంతో ఒలెంకో వెంట వెళ్ళాడు.

17

హాయిగొలిపే సంభాషణ

ఇగోర్ చెర్నియావిన్ భోజనం చేసినతరువాత స్కూలుకు వెళ్ళాడు. అక్కడతన్ని వృద్ధుడైన ఒక ఉపాధ్యాయుడు కలుసుకుని ఆహ్వానించి లోనికి తీసుకువెళ్ళాడు. అతను ఉపాధ్యాయుడో లేక వారతనికూడా ఆ కాలనీలో ఏదైన ప్రత్యేకమైన పేరు పెట్టారో?

ఉపాధ్యాయుని పఠనామందిరం చాలా పెద్దది. నేలమీద రగ్గులుపరిచి ఉన్నాయి. పెద్ద పెద్ద కిటికీలకు సగం సగం తెరలు వ్రేలాడగట్టారు. గది చూడముచ్చటగా ఉంది. ఉపాధ్యాయుడు ఇగోర్‌ను ఒక మూలకు తీసుకవెళ్ళాడు. అక్కడ ఒక పెద్ద సోఫా, రెండు వాలుకుర్చీలు, చిన్న టేబిలు ఉన్నాయి.

ఉపాధ్యాయుడు అతనివంక చూచాడు. ఇగోర్‌కు ఆయన చూపులు ఎంతో ప్రీతిని కలిగించాయి. బొత్తాములున్న జాకెట్టు వేసుకున్నాడు. చొక్కా కాలరు మరక అనేది లేకుండా తళతళలాడుతోంది. ఉపాధ్యాయుడు నున్నగా గడ్డం చేసుకుని ఇవాళ మరీ పరిశుభ్రంగా కనిపిస్తున్నాడు. రాగివర్ణపు అతని మీసాలు వడతిరిగి ఉన్నాయి. వాటిని ప్రత్యేకంగా శ్రద్ధవహించి చక్కగా పోషణ చేసుకుంటూ రావడంవల్ల ఆ మీసాలలో ఒక విధమైన గంభీరత, దర్పము కన్పిస్తున్నాయి. అతన్ని చూడగానే ఇగోర్‌కు అమెరికన్ చలన చిత్రాలలో తను చూసిన ప్రొఫెసర్ జ్ఞాపకం వచ్చాడు. అన్నిట్లోకీ అతనికి నచ్చింది ఉపాధ్యాయుని మాట్లాడే తీరు. అతని మాటల్లో మర్యాద ఉట్టిపడుతోంది.

ఉపాధ్యాయుడు సంభాషణ ప్రారంభించాడు:

"ఇగోర్ చెర్నియావిన్? నీ పేరు ఇగోర్ చెర్నియావిన్ కదూ? ఇంతసేపూ నీవు వస్తావనే ఎదురు చూస్తున్నాను. కూచో బాబూ, కూచో"

ఉపాధ్యాయుడు కుర్చీమీద చేతులు ఆనించుకున్నాడు. ఇగోర్ కూచోగానే అతని ప్రక్కనే ఉన్న సోఫాలో తను కూచు న్నాడు.

ముందుకు చూస్తూ అతను "నా పేరు నికోలాయ్ ఇవానోవిచ్" అన్నాడు. "నిన్ను గురించి ఒకటి రెండు విషయాలు మనం స్పష్టం చేసుకోవాలి: నీవు స్కూల్లో ఏడేండ్లు చదివినట్లుగా అలెగ్జి స్టెపానో విచ్ నాకు చెప్పాడు. కాని అది చాలాకాలం క్రితం అనుకుంటాను. నీ జీవితంలో కొన్ని సంఘటనలు నీ చదువు సంధ్యలకు ఆటంకం కలి గించాయనుకుంటాను. ఏమయ్యా, అంతే కదూ?" అన్నాడు.

ఉపాధ్యాయుడు అతన్ని చూపులతో ప్రశ్నిస్తూ కూచు న్నాడు. ఇగోర్ మోకాళ్ళమీద చేతులుపెట్టుకుని దృష్టి నిగిడ్చి కూచున్నాడు.

"మీరు చెప్పింది నిజం. నేను రెండు సంవత్సరాలుకూడా స్కూల్లో చదవలేదు" అన్నాడు.

"అయితే ఒక్క విషయం చెప్పు, కామ్రేడ్ చెర్నియావిన్. చదివినన్నాళ్ళూ నీవు బాగా చదువుకునే వాడివా?"

"ఎప్పుడో చదువుకునేవాణ్ణి."

"దానికి కారణం నీ అశక్తత కాదనుకుంటాను. జీవితంలో తల వని తలంపుగా అనేక సంఘటనలు తటస్థపడడంవల్ల నీ చదువు చెడిపోయింది."

"అవును. నాకు శక్తి ఉన్నది..."

"అయితే ఏదీ? ఈ విషయం వ్రాయి. ఎలా వ్రాస్తావో ఎంత బాగా వ్రాస్తావో చూస్తాను. ఇదిగో కాగితం, కలం, సిరా

బుద్ధి... నిన్ను ఏమిటి వ్రాయమనను? సరే మరోలా అనుకోకుండా ఉంటే ఇది ప్రయత్నించిచూడు. చాలాక్లుప్తంగా సంక్షిప్తంగా... నీవు లెనిన్‌గ్రాడ్ నుంచి కదూ వచ్చావు? మరీమంచిది. లెనిన్‌గ్రాడ్‌లో నీకు నచ్చినవిషయాలేమిటో వ్రాయి. వీధులు, వంతెనలు, పార్కులు-నీకు ఏవినచ్చితే అవి...ఏం? వ్రాయగలనంటావా వ్రాయలేనంటావా..."

"ప్రయత్నించిచూస్తాను."

అలాగేచూడు. ఈ లోగా నా పని నేను చూచుకుంటాను."

నికొలాయ్ ఇవానొవిచ్ నవ్వుతూ తల ఊపాడు. గదిమధ్య ఉన్న వ్రాతబల్లముందు కూచున్నాడు.

ఉపాధ్యాయుడు వ్రాయమన్న విషయం ఇగోర్‌కు నచ్చింది. లెనిన్‌గ్రాడ్‌లో జ్ఞాపకం ఉంచుకోవలసిన విషయాలు నిజంగా చాలా ఉన్నాయి. తన స్వంతనగరం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతనికి విచారంవేస్తుంది. తనతల్లి అక్కడఉండేది. అంతేకాక లెనిన్‌గ్రాడ్ అందమైన నగరం. తదితర పట్టణాలకంటె అది తన అభిరుచులకు అన్ని విధాలా సరిపోయింది.

అరగంట పోయినతరువాత ఇగోర్ ఒకపేజీ వ్రాసి ఇవానొవిచ్‌కి అందించాడు. ఉపాధ్యాయుడు కళ్ళద్దాలు పెట్టుకని పెదవులు కొరుక్కుంటూ దాన్ని చదవడం మొదలుపెట్టాడు. చదవడం పూర్తి అయిన తరువాత అతనికి నవ్వువచ్చింది. మళ్ళీ చదివాడు.

"చాలా బాగుంది. చక్కగా వ్రాశావు. మళ్ళీమళ్ళీ చదవాలని బుద్ధి పుడుతోంది. కాని ఒక్కపొరపాటు. అయితే అదేమంత పెద్ద పొరపాటు కాదులే. 'కాలమ్' అనేమాట తప్పు వ్రాశావు. చివర యన్ ఉండొద్దూ?"

"అలాగా?"

"అవును. నీకు తెలుసునుకాని మరిచిపోయి ఉంటావు సరే. నీకు లెక్కలు బాగా వచ్చునా?"

ఇగోర్ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేదు. ఇవానొవిచ్ ఒక లెక్క ఇచ్చి దాన్ని చెయ్యమన్నాడు. ఆ లెక్కవంక చూస్తూ ఇగోర్ అలా ఒకనిముషం ఉండిపోయాడు. పెన్సలు చేతిలో ఆడింది కాదు. ఇవానొవిచ్ అతనివంక చూస్తూ డెస్కుముందు కూచు న్నాడు:

"ఏమిటాలోచిస్తున్నావు? లెక్క చెయ్యడం మరిచి పోయావా?"

"అవును. జ్ఞాపకం రావడంలేదు. పూర్తిగా మరిచిపోయాను"

ఇగోర్ కుర్చీలోనుంచి లేచాడు. మర్యాదగా మాట్లాడడం అతనుకూడా నేర్చుకున్నాడు.

"నేనిక మీకు శ్రమకలిగించను. నాకు వ్రాయడంమటుకే వచ్చును. మిగతాదంతా మరిచిపోయాను. ఆల్జిబ్రా, వృక్షశాస్త్రం, రాజకీయాలు; అన్నీ మరుగుపడ్డాయి. మళ్లీ చదవాలంటే లాభం లేదనుకుంటాను. వయస్సు మీరిపోయింది."

ఇవానొవిచ్ తన కళ్ళజోడుకోసం జేబులు తడుముకున్నాడు. కాని అది బల్లమీదనే ఉంది. కళ్ళజోడు పెట్టుకని ఇగోర్ వంక ఆశ్చర్యంతో చూచాడు:

"ఎంత వింతగా మాట్లాడుతున్నావు కామ్రేడ్ చెర్నియా విన్! ఆమాట నిజమని నీవెలా అనుకుంటున్నావు? అందులో కష్ట మైన విషయం ఏముందని? నీవు అన్నీ మరిచిపోయావంటే అది సహజం. ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకుంటే సరిపోతుంది. కుర్చీలో నుంచి లేచిపోయావెందుకు? అలాగే కూచో."

అతను ఇగోర్‌ను మళ్లీ కుర్చీలో కూచోబెట్టి అతనికెదురుగా తన కుర్చీని లాక్కున్నాడు. మోకాళ్ళను చేతులతో తడుతూ కిటి కీల మధ్య పడుతున్న కాంతిని పరికిస్తూ ఇవానొవిచ్ ఇలాఅన్నాడు.

"సరే. ఇప్పుడు నీకు నేనిస్తున్న కార్యక్రమం ఇది. స్కూలు ఇవా త్వరలోనే మూసివేస్తారు. అలాంటప్పుడు నిన్నిప్పుడు స్కూల్లో

చేర్పించడం అర్థంలేని పని. అంచాత ఒక పనిచేస్తాం. వచ్చేటరమ్‌లో నిన్ను సరాసరి ఏవిమిదవ ఫారంలో చేర్పిస్తాం. అయితే కాస్త్రమేష్ చెర్నియావిన్! ఈ వేసవిలో మాత్రం చదువుకోవాలన్న విషయం మరిచిపోకు. చదివితే స్కూల్లో చేరడం సులభం. నిన్ను చేర్చుకో మని గట్టిగా సిఫార్సు చేస్తాను. నీకు ఎంతో నేర్పు ఉన్నది. శక్తి ఉన్నది. చదివితే చాలు. అన్నీ వస్తాయి. ఏమంటావ్?"

"బాగుంది. తప్పకుండా అలాగే చదువుతాను. మీరుచేసిన మేలు మరిచిపోలేను. మీరు చెప్పినవిషయం సాధించడానికి ప్రయ త్నిస్తాను. కాని ఒక్కవిషయం. శిశిర ఋతువువరకూ నే నిక్కడ ఉండకపోవచ్చును. కాలనీ నాకు సరిపడకపోవచ్చును."

"ఏమన్నావు? కాలనీ వదిలిపెట్టి వెళ్ళిపోతానంటావా?"

"అవును."

ఇవానొవిచ్ కళ్ళజోడు నుదుటిమీద పెట్టుకుని అతనివంక తేరిపారచూచాడు.

"ఎక్కడికి వెడతావు?"

"ఎక్కడికి వెడతానో ఇప్పుడు చెప్పలేను. తరువాత ఆలో చించుకుంటాను."

"ఇలాగ వెళ్ళిపోయిన మనిషిని మేమింతవరకూ చూడలేదు. ఇంత మంచిచోటునుంచి వెళ్ళిపోతాననుకునేవాడు కేవలం అమా యకుడు, తెలివితక్కువవాడు, సోమరి. కాని నీవు అలాంటివాడివి కాదు కాస్త్రమేష్ చెర్నియావిన్. ఇక్కడనుంచి నీకు వెళ్ళా లనిపించదు. నా కాసంగతి తెలుసును."

ఉపాధ్యాయుని మాటల్లో మధురభావం వ్యక్తమైంది. అతని సుడి తిరిగిన మీసాలు, ఎఱ్ఱని చెక్కిళ్ళు, మధురసంభాషణ ఇవన్నీ ఇగోర్‌ను ఇట్టే ఆకర్షించాయి. ఉపాధ్యాయుడు మాట్లాడుతున్న ప్పుడు అతని కళ్ళు వెలుగులను విరజిమ్మాయి. సరైనమాట కోసం వెదుక్కుంటూ అతను తనచూపులను ప్రక్కకు మరల్చుకున్నాడు.

ఏదిలో స్త్రీ అది మాట్లాడకుండా ప్రతిమాటను తూచితూచి, అప్రయత్న పూర్వకంగా ఇవానొవిచ్ మాట్లాడడం ఎంతో హాయిని కలిగించింది. అతనిమాటలు ఇగోర్‌ను ఆకట్టుకున్నాయి. విద్యాప్రాముఖ్యతనుగురించి ప్రధానంగా ఇవానొవిచ్ కొంతసేపు ముచ్చటించాడు. సోవియట్ యూనియన్‌లో యువకులముందు ఉన్న నిర్దిష్ట మార్గం విద్యాభ్యాసమేననీ, విద్యవల్ల మానవవ్యక్తిత్వం పెంపొందుతుందనీ, అతను స్పష్టంచేశాడు. ఇగోర్ జీవితంపట్ల ప్రత్యేకమైన శ్రద్ధను, ఆసక్తిని కనపరుస్తూ అంకులోనే లీనమయ్యాడు. అతన్ని ఎంతో గౌరవంగా చూచాడు. ఉపాధ్యాయుడు అలా మర్యాద ఇచ్చి తనతో మాట్లాడడం ఇగోర్‌కు ఎంతో ఆనందం కలిగించింది. అందువల్ల ఆ సంభాషణ తుంచినట్లుగా ముగియకూడదని ఇగోర్ భావించాడు. తాను ఎంతో విశ్వాసంగా, ఆత్మశుద్ధిగా ఉండాలని కోరుకున్నాడు.

"పని చెయ్యడమెలాగో నేనింకా నేర్చుకోలేదు నికొలాయ్ ఇవానొవిచ్. నా జీవితంలో నేను ఏ పనీ చేసి ఎరుగను."

"అది నిజమే కావచ్చు."అంటూ ఇవానొవిచ్ ప్రశాంతంగా నవ్వాడు. "నీ జీవితంలో ఏపనీ చేయకపోవచ్చు. కాని ఇప్పుడు నీ వయస్సెంత ? ఏపాటి కాలం గడిపావని ? నీది చాలా చిన్నవయస్సు. నీకింకా కొన్ని అలవాట్లయినా అలవడలేదు."

"అలవడకపోతే వచ్చిన నష్టమేమిటి ?"

ఇవానొవిచ్ తన కడుపుమీద చేతులానించుకున్నాడు. జాలిగా నవ్వాడు.

"నష్టమేమిటా ? నీవు కొన్నింటికి అలవాటు పడాలి. అప్పుడెంతో హాయిగా ఉంటుంది."

"హాయిగా ఉంటుందా ?

"ఆ. చాలా హాయిగా ఉంటుంది. నా విషయమే చూడు. నేను నలభై ఏళ్ళుబట్టీ పని చేస్తున్నాను. ఇంకా నాకు పని చెయ్యాలనే ఉంది. చూచావా మరి ?"

"మీకెలా ఉన్నదంటే మీరు ఉపాధ్యాయులు"

"నీవుకూడా ఉపాధ్యాయుడివి కావాలని ఉన్నదా? అలా అయితే మరీ బాగుంటుంది. కాని చాలామందికి ఈ వృత్తి నచ్చదు. ఇతరులకు పాఠాలు చెప్పడం విసుగ్గా ఉంటుందని వారి ఉద్దేశం. కాని అలా అనుకోవడంలో అర్థంలేదు. పనంటూ ఒకటిచేస్తే ఏదైనా హాయిగానే ఉంటుంది. ఆ విషయం ముందుముందు నీకే బోధపడుతుందిలే."

"అయితే ప్రయత్నించి చూస్తాను" అంటూ ఇగోర్ కుర్చీలో నుంచి లేచాడు.

"అలాగే ప్రయత్నించిచూడు. నీకిక్కడ ఏ ఇబ్బందీ ఉండదు. కావలసినంత సహాయం లభిస్తుంది. ఇక్కడ చాలా మంచి పిల్లలున్నారు."

"మీకెంతో కృతజ్ఞుణ్ణి, నికొలాయ్ ఇవానొవిచ్."

"అయితే మరి చదువు ఎప్పుడు ప్రారంభిస్తావు?"

"జూన్ మొదటి తారీకున అయితే సరిపోతుందా?"

"మంచిది, మంచిది. ఆవేళే ప్రారంభిద్దువుగాని. నీ పేరు చేర్చుకుంటాను."

ఇవానొవిచ్‌కి ఇగోర్ తలవాంచి నమస్కరించాడు. ఇవానొవిచ్ మనఃపూర్వకంగా అతని నమస్కారాన్ని స్వీకరించాడు.

ఇగోర్ గదిలోనుంచి ఇవతలికొచ్చాడు. ఆరు బయటికొచ్చి చుట్టూ చూచాడు. ఏదో ఒకభావం అతనిలో తలెత్తింది. ఒక దానిని వ్యతిరేకించాలనే కోపం పుట్టుకొచ్చింది. తన తీవ్రనిరసనను ప్రకటించాలనే కోరిక జనించింది. పరిస్థితులు ఇలా ఎంతోకాలం కొనసాగలేవు. ప్రొద్దుటినుంచీ ఇప్పటివరకూ అతను యథేచ్ఛగా మసలాడు. తన్నుతాను ప్రకటించుకునే ఒకభావం, ఒకశక్తి అతనిలో రేకెత్తింది. అయిదు గంటలయ్యేసరికి అతను దళంలో చేరవలసి ఉంటుంది. కాని ఆ దళం ఈ ఉపాధ్యాయునిలాగా తనను మర్యాదగా చూస్తుందా?

18

కొందరికి నచ్చని సంభాషణ

అయిదు గంటలకల్లా ఒలెంకో ఒక యువకునితో విశ్రాంతి మందిరంలోకి ప్రవేశించాడు. ఆ యువకుడు పొడుగ్గా, లావుగా ఉన్నాడు. సద్గుణాలను వ్యక్తపరిచే ముఖం. అతన్ని చూడగానే చాలా నమ్రతగల వ్యక్తి అని ఇట్టే తెలిసిపోతుంది.

"కామ్రేడ్ ఇగోర్ చెర్నియావిన్! ఇదిగో, ఇతనే మీ కమాండర్‌కు. ఈయన పేరు నెస్ట్రెంకో" అన్నాడు ఒలెంకో.

ఒలెంకో కంఠంలో కొంచెం హాస్యం కనిపించడం ఇదే ప్రథమం. ఇగోర్ వంక అతను చూపించిన వైఖరిలోను, చూచిన చూపులోను ఒక విధమైన వ్యంగ్యభావం ద్యోతకమైంది. అతన్ని కమాండర్ అప్పగిస్తూ ఒలెంకో ఇలా అన్నాడు.

"ఇతన్ని అన్నివిధాలా పనికి సిద్ధంచేసి నీ దగ్గరికి తీసుకొచ్చాను. క్రాఫు చేసుకున్నాడు. అన్నింట్లో పరిశుభ్రంగా తయారైనాడు. పెరేడు యూనిఫారం త్వరలోనే వస్తుంది."

"ఇగోర్‌ను ఆ దళాధిపతికి అప్పగించగానే ఒలెంకో తన బాధ్యత తీరినట్లు స్థిమితపడ్డాడు. ఈ విషయాన్ని కమాండర్ గ్రహించినట్లుగా వ్యంగ్య స్ఫూర్తితో నవ్వాడు:

ధన్యవాదాలు కామ్రేడ్ కమాండర్! దీనికి ప్రత్యామ్నాయంగా నేనూ ఇంకొక కుర్రవాణ్ణి మీకు అప్పగిస్తాను" అన్నాడు.

ఒలెంకో శాల్యూట్ చేసిగదిలోనుంచి బయటికి వెళ్ళిపోయాడు.

ఇది ప్రతిరోజూ జరిగే కార్యక్రమమే అయినా దీనిలో ఒక విశేషం, కొద్దిపాటి హాస్యం కనిపించినట్లు ఇగోర్ గ్రహించాడు. ఒలెంకో, చెస్ట్రెంకో లిరువురూ మంచి స్నేహింతులు. లాంఛన ప్రాయంగా ఒకరికొకరు నమస్కరించుకోవడమే కాక ఒకరి హృదయ గత భావాలను ఇంకొకరు అర్థంచేసుకుని హాస్యమాడుకున్నారు. నెస్ట్రెంకో మొదట మామూలు మనిషిగా కనిపించాడు కాని, చతుకోక్తు లాడినప్పుడు తాను అసమాన్యుడనిపించుకున్నాడు. అతని కంఠస్వరం నిశ్చలమైనది. ఆకర్షణీయమైనది. కంఠ ధ్వనిని ఎలాగా మలుచుకుంటూ ఉండాలో అతనికి తెలుసును. అతను హఠాత్తుగా దేనినీ ప్రారంభించడు. మెల్ల మెల్లగా ప్రారంభించి అసలు విషయం దగ్గరికి వస్తాడు. ఆతని స్వరంలో మంద గమనమైన యుక్రేనియన్ హాస్యం స్ఫురిస్తూ ఉంటుంది, అతనూ, ఒలెంకో వేసు కున్న దుస్తులే వేసుకోవడం ఇగోర్ గమనించాడు. ఒలెంకో వెళ్ళి పోగానే నెస్ట్రెంకో పాత్రాభినయం ముగిసింది.

"నీవు ఎనిమిదవదళంలో ప్రవేశించాలి. వాళ్ళిప్పుడే అక్కడే సమావేశమవుతున్నారు. వెడదాం, పద" అంటూ నెస్ట్రెంకో లేచి వాకిలిదాకా వచ్చాడు. ఇగోర్ అతన్ని మధ్యలో ఆపాడు.

"కామ్రేడ్ కమాండర్!"

"ఏంకావాలి నీకు?"

ఇగోర్ కలవరపడ్డాడు. ఇందాక పెరట్లోకలిగిన తత్తరపాటు మళ్ళీ ఇప్పుడు వచ్చింది. కిటికీలవంక చూచాడు. పెదవులపై ఏర్పడిన కుటిలరేఖను దాచుకోలేకపోయాడు,

"మీరు చదువుకుంటున్నారా కామ్రేడ్ కమాండర్?"

"స్కూల్లోనా?"

"అవును."

"దీనికి సమాధానం అవుననే చెప్పాలి. పదవఫారం చదువు కుంటున్నాను. అసలు విషయం ఏమిటంటే నన్ను నీవు కామ్రేడ్

కమాండర్ అని పిలువకు. ఇక్కడ అలా పిలవవలసిన అగత్యంలేదు. నన్ను నీవు వాస్యా అని పిలిస్తేచాలు."

"నిజంగా అలా పిలవవచ్చునా? ఒలెంకోను అందరూ డ్యూటీలోఉన్న కామ్రేడ్ కమాండర్ అని పిలుస్తారు."

"దానికీ దీనికీ భేదముంది. ఇక్కడ డ్యూటీలోఉన్న కమాండర్ చాలా ప్రధానమైన వ్యక్తి. ఆరోజు కార్యక్రమమంతా అతని చేతులమీదిగానే నడుస్తుంది. సైనికబాడ్జీని అతను ధరించినప్పుడు నీవు శాల్యూట్ చేయనిదే అతనితో మాట్లాడకూడదు."

"ఊఁ"

"చెపుతాను విను...ఇవాళ నీకోసం ఎంత శ్రమపడ్డాడో నీవు గమనించలేదూ? ఇలా నీ ఒక్కడిపనేకాదు. అతనికెన్నో పను లుంటాయి. ప్రతివాడూ అతనితో వాదిస్తూ కూచుంటే ఏపని చేయ డానికీ వ్యవధిఉండదు. అదీకాక...డ్యూటీఉన్న కమాండర్‌తో వాదించడానికి విషయాలు ఏముంటాయి కనుక?"

"అయితే మీతో నేను వాదించవచ్చు నన్నమాట?"

"ఆ. కాని ఒక్కవిషయం. అది ఇక్కడి పద్ధతికాదు."

"మీకు శాల్యూట్ చెయ్యనక్కర్లేదా?"

"ఒకప్పుడు చెయ్యాలి, మరొకప్పుడు అక్కర్లేదు. అవన్నీ నీకు తరువాత తెలుస్తాయిలే. సరే, రా. అవతల దళం మనకోసం చూస్తూ ఉంటుంది."

వారిద్దరూ బయటికివెళ్ళారు. ఒక కాపలావాణ్ని దాటి మేడమీదికి వెళ్ళారు. మొదటి అంతస్థులో ఒకగది ఉంది. అది విశ్రాంతిమందిరంలాగా తళతళలాడుతోంది. గదిముందు 'ఎనిమిదవ దళం' అని బోర్డుఉంది. సెమ్యోనకో వాకిలిమీద చెయ్యివేశాడు.

"మనకు రెండు పడకగదులున్నాయి. ఒక్కొక్కదానిలో ఎనిమిది మంచాలు. మరొకగది అవతలే ఉంది" అన్నాడు.

నెస్టెర్టెంకో పడకగదివాకిలి తెరిచాడు. ఆగది చాలా పెద్దది. అందులో ఉన్న మంచాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. మంచాల మీద ఎర్రసంపెంగ రంగులో ఉన్న దుప్పట్లు పరిచారు. ఎక్కడా మచ్చఅన్న మాటలేదు. మంచాలన్నీ అందంగా ఉన్నాయి. ఎవరూ వాటిని కదపలేదు. వేసినమంచాలు వేసినట్లేఉన్నాయి. గదిలో టేబిల్ చుట్టూ పదిపన్నెండు మంది పిల్లలు మూగారు. గోడకు ఆనించి ఒక బెంచీ ఉంది. కాలనీలో అంత పెద్దబెంచీ ఇంతవరకూ ఇగోర్ చూడలేదు.

పడక గదిలోకి వెళ్ళగానే పిల్లలందరూ వారిరువురివంక చూచారు. లోపలికి వెడుతూనే నెస్టెర్టెంకో లాంఛనప్రాయంగా ఆ పిల్లలతో మాట్లాడాడు. అతని గొంతుకలో హాస్యం ఉన్నట్లు ఇగోర్ కు కనిపించలేదు.

"ఇతను క్రొత్తకామ్రేడ్. స్వాగతం ఇవ్వండి. ఇతని పేరు ఇగోర్ చెర్నియాహిన్"

అతని మాటలు వినగానే పిల్లలు కుర్చీల్లోనుంచి లేవలేదు. కాని వాటిని టేబిల్ కు దగ్గరగా జరుపుకున్నారు. మరి రెండుకుర్చీలు తెచ్చి అక్కడవేశారు. నెస్టెర్టెంకో ఒక కుర్చీలో కూచుని, ఇగోర్ ను కూడాకూచోమని ప్రక్కకుర్చీ చూపిస్తూ ఆహ్వానించాడు.

"కూచో"

అంతా ఆతృతతో నిరీక్షిస్తున్నారు. నెస్టెర్టెంకో కళ్ళతో నవ్వుతూ ఇలా అన్నాడు:

"క్రొత్తపిల్లవాడు వచ్చినప్పుడు మొత్తం దళాన్నంతా సమావేశపరుస్తాం. కమాండర్ అతన్ని అందరికీ పరిచయం చేస్తాడు. ఇది ఇక్కడపద్ధతి. చాలాకాలంనుంచీ కాలనీలో ఇలాగే చేస్తున్నాం. ఇప్పటికి అయిదేండ్లవుతుంది. పరిచయం చేస్తున్నప్పుడు కమాండర్ ఏ దాపరికంలేకుండా అన్ని విషయాలూ చెప్పాలి. ఆయా వ్యక్తులను గురించి తాను ఏమనుకుంటున్నాడో దాచకూడదు. కొంతకాలం

పోయాక నీవూ ఒక కమాండర్ వు అవుతావు_చెర్నియావిన్. అప్పుడు నీవూ ఇలాగే మాట్లాడాలి. అందుకే వాళ్ళంతా నా కేసి అలా చూస్తున్నారు."

దళంలో ఉన్న ఒక పిల్లవాడు ఇనా అన్నాడు:

"చెప్పు వాస్యా! త్వరగా కానీయి. మమ్మల్ని ఇలాగ నిరీక్షించనియ్యకు.

ఆ పిల్లవాడి వయస్సు పద్నాలుగు సంవత్సరాలు. ఎంతో చురుకైనవాడు! అతని ముఖంలో జ్ఞానం మూర్తీభవించింది.

"పాపం రొగోవ్ ఉండబట్టలేకపోతున్నాడు. త్వరగా చెప్పమంటున్నాడు. అందుకే ఇక్కడికి వచ్చామని అతనికి తెలుసు."

"కానీండి. త్వరగా చెప్పండి.

నెస్ట్రెంకో మెల్లగా చెప్పడం మొదలుపెట్టాడు

"మాకు మరో ఆచారంకూడా ఉంది. ఎవరూ వాదించకూడదు, కోపం తెచ్చుకోకూడదు. కమాండర్ ఏదిచెపితే అది. నీవు కొత్తకుర్రాడివి చెర్నియావిన్. నీవు డాంబీకం ప్రదర్శించకూడదు. నిజంమాట్లాడ్డం నేర్చుకోవాలి, నిజంవినడం నేర్చుకోవాలి. తెలిసిందా?"

ఇగోర్ నోరువెళ్ళబెట్టాడు: అతని ముఖంలో గంభీరత ఆవహించింది.

దళంలో ఉన్న పిల్లలను ఒక్కొక్కరినే నెస్ట్రెంకో పరిచయం చేయడం ప్రారంభించాడు. ముందు పద్దెనిమిదేండ్లయువకుణ్ణి పరిచయం చేశాడు! అతని జుట్టు చిందరవందరగా ఉంది. కనుబొమలు చిన్నవి. ముఖంలో ఏ భావాలూ వ్యక్తంకాకపోయినా పెదవులుమాత్రం నిండుగా ఉన్నాయి. ముఖం బలంగా, ప్రకాశవంతంగా, పౌరుషవంతంగా, శక్తివంతంగా కనిపిస్తోంది.

"ఇదిగో, ఇతనిపేరు మిషాగొంటార్. మంచి ఫిట్టరు. వచ్చిన చిక్కుల్లా ఒక్కటే. ఇతనికి స్కూల్లో ఏదీ నెర్చుకోవాలని ఉండదు.

అయిదవఫారంలోకి వచ్చేసరికి అతనికంతా తెలిసిపోయినట్లు అనిపించింది. పట్టి అమాయకుడు. అందుకని ఇతన్ని స్కూల్లో చేర్పించాం. ఇతర విషయాల్లో బాగానేఉంటాడు. సరైన కామ్రేడ్. ఆ విషయంలో తక్కినవారంతా అతని స్థాయిని అందుకుంటే చాలా బాగుంటుంది. కాని అతను ప్రత్యేకంగా పేర్కొనదగిన వ్యక్తి. అయితే అతనిలో ఒకలోపం ఉన్నది. అతను ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక హడావుడిచేస్తాడు. అన్నీ గందరగోళం చేస్తాడు. ఒక పని మీద పంపిస్తే తీరా వెళ్ళి మధ్యలో అదేమిటో మరిచిపోతాడు. ప్రతిరోజూ అతను క్షౌరం చేసుకోవడం మంచిది. కాని మూడు రోజుల బట్టీ గడ్డం మాయబెట్టాడు. పిల్లవాళ్ళ కాలనీలో అతనిలా ఉంటున్నాడు. చూడండి మరి. ఆ విషయం జ్ఞాపకం ఉంచుకోండి. పరిశుభ్రత విషయంలో మనదళానికి మంచి మార్కులు రాలేదంటే అందుకు కారణం ఇతనే. మనదళం. మంచి దేమరి. కాని ఏంచెయ్యం? ప్రొద్దున్నే బట్టలూ అవీ వేసుకుని షాపుదగ్గర నిలుచుంటాడు. అతను ఫిట్టరని చెప్పానుకదూ. షాపునుంచి అలాగే అసహ్యంగా భోజనశాలలోకి వస్తాడు. చూశారామరి. సరే. అక్కడ ఆరోగ్య దళం తగినజాగర్తలు తీసుకుంటుందనుకోండి. మిషా పనిలో ఉన్నప్పుడు చిన్నపిల్లవాణ్ని బెదిరించినట్లు మనం బెదిరించాలి. అతనికి మరొక బలహీనతకూడా ఉన్నది. వరుసగా నిలుచుని దళంతో వెళ్ళడమంటే అతనికి కష్టం. అందరిలా వరుసలో అడుగువెయ్యలేడు. తొడుక్కున్న యూనిఫారం గుడ్డపీలికలా వ్రేలాడుతూ ఉంటుంది. ఇలా చేస్తుంటే దళంలో అందరికీ చికాకుగా ఉంటుంది. ఏమంటే ఇది అసలు స్వల్పవిషయం. అతను క్షణంలో సరిదిద్దుకోవచ్చు. కాని అతనాపని చెయ్యడు. అయితే మిషా మంచిఫిట్టరు. మంచి కామ్రేడ్ కూడా. స్వభావం మంచిది, పనిఅంటే ఇష్టం. అతనికి లారీడ్రైవరు కావాలనిఉంది. లారీ డ్రైవరుకుకూడా కొంతచదువు అవసరం. అన్నిటికంటె ముఖ్యవిషయం ఒకటిఉంది. అతనీమధ్య ప్రేమలోపడ్డాడు. కాని అతను పరిశుభ్రంగా ఉండనిదే అతన్ని ఎవరు

ప్రేమిస్తారు! అతనిజట్టు దళంలో వాళ్ళంతా కలిసికట్టుగా పనిచేసినా సరికాదు అంత అసహ్యంగా ఉంటే ఎలామరి?"

నెస్టెరింకో తన సహాచరులను మధ్య మధ్య అవలోకిస్తూ ఎంతో నమ్మకంతో చక్కగా ప్రసంగించాడు. పిల్లలు ఇంతసేపూ మిషావంక చూస్తున్నారనడం స్పష్టం. అతనిశీలాన్ని గురించి కమాండర్ తెలియచేసిన విషయాలన్నీ నిజమేనన్నట్లు వాళ్ళు చూడ సాగారు. మిషాకూడా కమాండర్ అభిప్రాయాలతో ఏకీభవించినట్లే కనిపించాడు. తనప్రేమ వృత్తాంతాన్ని వెల్లడిచేసినందుకు తన అసమ్మతిని సహితం తెలియపర్చలేదు.

"సరే. ఇహ ఇప్పుడు అకులిన్‌ను పరిచయం చేస్తాను." అంటూ నెస్టెరింకో మరొక పిల్లవాణ్ణి చూపించాడు.

అకులిన్ కుర్చీలో కూచుని ఉన్నాడు. ఈమాటవిని అతను కుర్చీలోనుంచి కదలనైనా కదల్లేదు. అతనిది కోలముఖం. కొంచెం మొరటుగా ఉంది. చూద్దామన్నా అతనిముఖంలో నవ్వు కనిపించదు.

"కాలనీలో అకులిన్ గొప్ప టర్నర్. ఎనిమిదవ ఫారం చదువుతున్నాడు క్లాసులో ఫస్టుమార్కు అతనిదే. పని చకచకా చేస్తాడు. క్రమశిక్షణ అంటే గౌరవం. కొమోసామూల్‌లో ప్రథమ శ్రేణి సభ్యుడు. కొన్నాళ్ళలో విమాన చోదకుడు అవుతాడు. తప్పదు. ఇక్కడ అందరిలాగానే అతనికీ ఒక పనిముట్లపెట్టె ఉన్నది. మన మొత్వారం పెట్టెలకు తాళాలు వేసుకోం. అలా వేసుకోవడం ఇక్కడిపద్ధతికాదు. కాని మూడురోజులక్రితం ఏమైందో తెలుసా? అకులిన్ తన పెట్టెకు పెద్దతాళం బిగించుకున్నాడు. అలా చెయ్యడం చాలా అసహ్యం. తన పెట్టెలో సామాను ఎవరో ఎత్తుకపోతారనో లేక ఎవరో చూస్తారనో భయపడి ఉంటాడు. ఏమనుకున్నాడో నాకు తెలీదు కాని తాళంమాత్రం వేసుకున్నాడు. అతనేమనుకుంటేనేం? కాలనీలో పెట్టెలకు తాళాలు వేసుకోవడం చాలా చెడ్డపని. వర్కుషాపుల్లో అయితే అక్కడి పరిస్థితులు వేరు. ప్రభుత్వం ఆస్తులను

సక్రమముగా ఉంచడంకోసం తాళాలువేసి భద్రపరచవలసి ఉంటుంది. కాని ఇక్కడ మన దళంలో అలాంటి అవసరంలేదు. మనమంతా కార్మికులం. అలాంటప్పుడు తాళాలు వేసుకోవడం దేనికి?"

అకులిన్ నెస్ట్రెంకోవైపు చూడలేదు. ప్రక్కనఉన్న కుర్చీ మీద చేతులు ఆనించుకుని మెల్లగా ఇలా అన్నాడు:

"ఇక్కడివాళ్ళకోసమని నేను తాళాలు వేసుకోలేను."

"ఆ సంగతి మాకు తెలుసు. కొత్తఅతను వస్తాడని నీకు తెలుసును. ఏమరుపాటున ఉన్నప్పుడు అతను నీ పెట్టెలో వస్తువులు దొంగిలిస్తాడని నీ భయం. ఆ పని పెట్టెకు తాళం ఉంటేనేచేస్తాడు. ఇంతకూ కొత్తగావచ్చిన పిల్లవాడు దొంగ అని నీ వెందుకు అనుకోవాలి? పోనీ అతను దొంగే అనుకో. ఇదివరకు మనలో ఎంతమంది దొంగతనం చెయ్యలేదూ? అవి వెనకటిరోజులు. ఇగోర్ కూడా మనలాంటి కుర్రాడే. ఇప్పుడే దళంలో చేరుతున్నాడు. ఇక్కడే మన మధ్య కూచున్నాడు. అతను ఏ మిత్రుడి వస్తువులూ దొంగిలించడని నీవు ధైర్యంగా ఉండవచ్చు."

అకులిన్ కుర్చీమీదనుంచి చేతులు తీశాడు:

"నా పెట్టెకు వేసిన తాళం తీసివేస్తాను" అన్నాడు బొంగురు గొంతుతో.

దళమంతా ఊపిరి బిగబట్టుకుని ఎదురుచూస్తూ కూచున్నారు. అతనీమాట అనగానే బరువు దించుకున్నట్లు ఊపిరి పీల్చారు.

"ఇప్పుడు అలెగ్జాండర్ ఆస్టాప్చిక్‌ను పరిచయం చేస్తాను. ఇతను ఫస్ట్ ఆఫ్ మే లేబర్ కాలనీ ఎనిమిదవ దళానికి డిప్యూటీ కమాండర్."

అతను డిప్యూటీ కమాండర్ అని ప్రత్యేకించి చెప్పనక్కర లేకుండానే అతని దుస్తులు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దళంలో అతను అందరితోనూ కలిసి మెలసి ఉంటాడు. తనపేరు విన పడగానే అలెగ్జాండర్ కమాండర్ వంక చూచాడు. గడ్డంక్రింద చేతులు పెట్టుకున్నాడు. అతనికళ్ళు నల్లగా తళతళ మెరుస్తున్నాయి.

"ఇతను మనిషి మంచివాడు. మంచివనివాడు. పదపత్రం చదువుతున్నాడు డిప్యూటీ కమాండర్. అవును మనిషంటే ఇతనే కాని ఇతనిలో ఒక్కపొరపాటు ఉంది. పట్టి కబుర్ల రాయుడు. మాట్లాడడం మొదలుపెడితే ఇహ దానికి అంతూ పంతూ ఉండదు. మాటల్లోపడి తిండిమాటకూడా మరిచిపోతాడు. అవకాశం దొరకాలే కాని దొరికితే విడిచిపెట్టడు. నోరు అలా వాగుతూనే ఉంటుంది. కాస్త నోరు బిగబట్టి ఊరుకోవడం అతనికి చాతకాదు. పోనీ మాట్లాడేమాటలు సవ్యంగాఉంటాయా అంటే అదీలేదు. అంతా అపసవ్యమే. ఎవరినీ లక్ష్యపెట్టడు. మిత్రుడవనీయండి, పరిచితుడు కానీయండి, -అపరిచితుడుకానీయండి, ఎవరన్నా లెక్కలేదు. ఎవరన్నా ఒకటే ధోరణి. చరచర వెళ్ళిపోయి ఏదో నోటికివచ్చినట్లు వాగడమే. దళమంతా వెళ్ళి ఊరుకోమన్నా ఊరుకోడు. తాను ప్రాక్ట్యరేటర్ కావాలని కలలుకంటున్నాడు. కాని ఏంలాభం? ఆ ఉద్యోగం చేయాలంటే వాగడం పనికిరాదు. నోరు కట్టేసుకోవడం మంచిది. ఆలోచించి మాట్లాడాలి. వెనుకనుంచి పులివస్తున్నదని బెదరగొట్టినా మన అలెగ్జాండర్ కదలకుండా అలా వాగుతూనే ఉంటాడు."

కమాండర్ మాటలువిని అలెగ్జాండర్ కోపగించుకోలేదు. ఆవేశపడలేదు. స్నేహపూర్వకంగా, సవినయంగా అతనివంక చూస్తూ నవ్వాడు. కమాండర్ పరిచయవాక్యాలు అతనికి ఉల్లాసం కలిగించినట్లుగానే ఉంది.

"మాట్లాడకూడని విషయాలు నేనేం మాట్లాడాను?" అని అలెగ్జాండర్ అడిగాడు.

"జ్ఞాపకం చెయ్యమంటావా? విద్యాశాఖా కార్యాలయం నుంచి ఆవేళ ఒకావిడ వచ్చింది. జ్ఞాపకంఉందా? ఆవిడకు కళ్ళనీళ్ళు వచ్చే పర్యంతం నీవు నీ మాటలతో వేధించుకతిన్నావు."

"నేను ఆవిడకు నిజం చెప్పాను."

"నిజం చెప్పావా? కాని అందుకది సమయంకాదు. మనం ఇక్కడ ఎలాగ జీవిస్తున్నామో తెలుసుకునేందుకు ఆ వేళ ఆవిడ వచ్చింది. బహుశా మనజీవితాన్ని పరిశీలించి తానేమైనా నేర్చుకో గలనేమోనని అనుకుని ఉంటుందికూడా. ఇంకోమాటలో చెప్పాలంటే ఆవిడను వాళ్ళు కాలనీకి పంపించారు. అలాంటప్పుడు నీవు నీ ఉప న్యాసంతో బెదరగొట్టి పారేశావు. అది ఉపన్యాసంకాదు. టన్నుల కొద్దీ రాళ్ళుతీసి ముఖాన కొట్టినట్లు ఎడాపెడా మాట్లాడేశావు. విద్యాశాఖాధికారులకు తమ కర్తవ్యమేమిటో ఏమాత్రం తెలీదనీ, తాము చేస్తున్న పనేమిటో తమకే తెలీదనీ; వాళ్ళకిస్తున్న జీతం శుద్ధదండుగ అనీ, ఏమిటేమిటో మాట్లాడేశావు. అంతావిని ఆవిడ ఏమన్నది! ఈ ప్రపంచంలో నీవెవరవని అడిగింది. ఆ తరువాత నేనా విడకు సర్దిచెప్పాననుకో. నీవు కొత్తకుర్రవాడివనీ, ఏవిషయం తెలీదనీ, అంచాత అలా బాధ్యతారహితంగా ప్రవర్తించావనీ చెప్పాను".

దళంలో వారంతా పకపకనవ్వారు. అలెగ్జాండర్ బిత్తర పోయి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. కాని అతనికళ్ళల్లో నవ్వే కనిపించింది.

నెస్ట్రెంకో మరో యువకునివైపు తిరిగాడు.

"ఇతను శాంకోజోరిన్! ఇతనెలాంటివాడో మీ అంతట మీకే తెలుస్తుంది."

జోరిన్ స్వభావం సాయంకాలపు సూర్యునివలె అతి సరళ మైనది. దాపరికంలేని మనిషి. తనపేరు వినిపించగానే అతను కుర్చీలో నుంచిలేచి దానిమీద కాలుపెట్టాడు. కమాండర్ కంఠధ్వని కొంచెం కఠినంగాను అయినా ప్రేమతోను వినిపించింది.

"కుర్చీమీద కాలెందుకుపెట్టావు?...ఇతనే నీ మంచి చెడ్డలు చూస్తుంటాడు ఇగోర్ చెర్నియావిన్. నీకోసం చాలాసేపటినుంచీ ఎదురు చూస్తున్నాడు. నీపేరు కాలనీవాసిగా నమోదయ్యేవరకూ నీ వ్యవహారమంతా ఇతనే చూస్తుంటాడు. ఇతను నీకన్నీ బోధిస్తాడు. కొంతకాలంపోయాక నిన్ను కాలనీలో చేర్చుకోమని సాధారణ

సమావేశంలో ప్రతిపాదిస్తాడు. జోరిన్ కోపిష్టి. మాటిమాటికీ ఇట్టే కోపం వస్తుంది. న్యాయమైన మనిషే కాని అప్పుడప్పుడు బుద్ధిచలిస్తూ ఉంటుంది. ఎవరన్నా ఏమైనా అంటే తోకతొక్కిన త్రాచులా కస్సుమంటాడు. కాని నీవదేమీ పట్టించుకోకు."

ఇగోర్ తల ఊపుతూ జోరిన్ వంక నిశితంగా చూశాడు. జోరిన్ కూడా తలఊపాడు. అతని ముఖం అనేక భావాలతో వెలుగొందింది. అతనెంతో చురుకైనవాడు. ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటాడు. ముఖంలో సందేహం ఏమాత్రం కనిపించదు. కమాండర్ చెప్పిన మాటలు విని అతను తన కోపాన్ని తగ్గించుకుంటానన్నట్లు చూచాడు. దళంలో అందరూ తనను అభిమానిస్తున్నట్లుగానే తను కూడా అందరినీ ప్రేమిస్తానని చూపులద్వారా వ్యక్తపరిచాడు. మంచి కాలనీ నివాసిగా ఇగోర్‌ను తయారుచేయడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నట్లు సూచించాడు.

దళంలో ఇంకా ఆరుగురిని పరిచయం చేయవలసి ఉంది. వాళ్ళ వయస్సు పదహారు పద్దెనిమిది సంవత్సరాల మధ్య ఉంటుంది. నెస్ట్రెంకో వాళ్ళనుకూడా పరిచయం చేశాడు. వాళ్ళందరూ మంచి పనివాళ్ళనీ, ఉత్తమ స్నేహితులనీ అభినందించాడు. ఎవరి తప్పులను వారికి ఎరుకపరచాడు. లోపాలను ఎత్తిచూపుతున్నప్పుడు నవ్వుతూ జాగ్రత్తగా, ఎవరిమనస్సూ నొప్పించకుండా మాట్లాడాడు. సెర్గీలిస్ట్‌వెన్నీ ఎప్పుడూ పుస్తకాలనే చదువుతూ ఉంటాడనీ, అందువల్ల పిచ్చివాడిలా కనిపిస్తాడనీ పేర్కొన్నాడు. ఖారిటన్ సావ్ చెంకో అనే కుర్రవాడు వట్టి అమాయకుడనీ, లోకంపోకడ ఏమీ తెలీనివాడనీ అన్నాడు. బోరిస్ యనోవిస్కీ అనేపిల్లవాడు నిజంచెప్పడనీ, ఖోకిల్లా అనీ; దానిలో గొరొవోయ్ నిర్దయుడనీ, చెంతకు ఎవరినీ చేరనివ్వడనీ కమాండర్ నెస్ట్రెంకో వివరించాడు.

కమాండర్ చెప్పినదంతా అందరూ నిశ్శబ్దంగా విన్నారు. ఎవరూ ఎట్టి అభ్యంతరం చెప్పలేదు. ఒకరి స్వభావాన్ని ఒకరు తెలుసుకున్న తరువాత అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుని నవ్వుకున్నారు. ఇంకా

చెప్పమని నెస్టెర్రింకోను ప్రతిమాలుకున్నారు. కాని నెస్టెర్రింకో మరేమీ మాట్లాడలేదు.

"ఇప్పుడదంతా ఎందుకు ? మనం ఇక్కడికి ఎందుకొచ్చామో మీరు మరచిపోయినట్లున్నారు. ఇగోర్‌ను కలుసుకునేందుకు మనం ఇక్కడ సమావేశమయ్యాం."

"మా గురించి మీరు చెప్పారు. బాగానే ఉంది. మరి మీ గురించి మీరు చెప్పుకోరూ ?" అన్నాడు అలెగ్జాండర్: "నేను కమాండర్‌ను అయినతరువాత మీగురించి కొంత చెప్పవలసి ఉంటుంది."

"అయితే నీవు కమాండర్‌వు అయ్యేవరకూ నేను ఎదురు చూస్తుంటాను. అప్పుడు నన్నుగురించి చర్చిద్దువుగాని ప్రస్తుతానికి ఇగోర్ బాగోగులు చూడు."

"అతన్ని అప్పుడే మాలో కలుపుకున్నాం. ఇగోర్ చెర్నియావిన్ ! ఏదీ, నీ చేతులిలా ఇవ్వు" అంటూ అలెగ్జాండర్ కరస్పర్శ కానించి "శాంకో ! ఇతన్ని పనిలో ప్రవేశపెట్టు. మంచి పనివాడవు తాడులే" అన్నాడు.

అంతా ఇగోర్‌ను చూచారు. ఇగోర్ తన ధన్యవాదా లర్పించాడు.

"అయ్యో అలెగ్జాండర్ ! నన్ను మీలో చేర్చుకున్నందుకు నేనెంతో కృతజ్ఞుణ్ణి. మీ అందర్ని గురించి ఇంతసేపూ కమాండర్ అంతా చెప్పాడు. మరి నన్నుగురించి కాస్తో కూస్తో మీకు నేను చెప్పుకోవాలికదా ?"

దళంలో కొంతమంది మళ్ళీ నవ్వారు. ఇగోర్ తన్నుతాను పరిచయం చేసుకోవడం గోంటార్‌కు నచ్చలేదు. అకులిన్ సందేహంగా చూచాడు.

ఇగోర్ మాటలు విని కమాండర్ నెస్టెర్రింకో "అలా పరిచయం చేసుకోవడం మా పద్ధతికాదు." అన్నాడు: "కొత్తగావచ్చిన కుర్రవాడు తన్నుతాను పరిచయం చేసుకోకూడదు. ఇంతకూ నీవు

చెప్పవలసిందేమీ లేదు. నీ వెలాంటివాడివో క్రమేణా మేమే తెలుసుకుంటాం. ఇందాక నీవు అలెగ్జాండర్‌ను 'అయ్యా' అని సంబోధించావు. అలా ఎవరినీ ఇక్కడ మన్నించక్కర్లేదు."

"తెలిసింది. నా పొరపాటు తెలిసింది కామ్రేడ్ కమాండర్."

గదిలో ఒకమూల జోరిన్ నిలుచుని ఇగోర్ కోసం నిరీక్షిస్తున్నాడు.

"ఇగోర్! ఇలారా. ఇదిగో! ఇది నీపరుపు. ఇది నీటేబిల్. టేబిల్ మీద వస్తువులున్నాయి. సబ్బు, టూత్ పేస్టు, తరువాత నీవు తెచ్చుకుందువుగాని. డిప్యూటీ కమాండర్ అలెగ్జాండర్‌ను అడిగితే ఇస్తాడు. రెండురోజుల్లో పనిలో ప్రవేశిద్దువుగాని. ఏంచేయాలో సాయంత్రం చెపుతానులే. ఇంతకు నీవు ఏఫారంలో చేరుతున్నావు?

"ఎనిమిదవ ఫారం."

"చాలా బాగుంది. నేనూ అదే చదువుతున్నాను. ఇప్పుడు నీవు స్వతంత్రపౌరుడివి. నీవు ఎక్కడికిబడితే అక్కడికి వెళ్ళవచ్చు."

జోరిన్ కిటికీ తెరిచి బయటికిచూచాడు. దూరంగా దిఙ్మండలం కనిపించింది. విశాలమైన మైదానం గోచరమయింది. ఎంతో ఎత్తుగాఉన్న నగరభవంతులు ఇగోర్ దృష్టిని ఆకర్షించాయి.

19

ఇంకా లోకం తెలియనివాడు

ఆ రాత్రి ఇగోర్ చెర్నియావిన్ పరుపుమీద పడుకున్నాడు. మెల్లమెల్లగా నిద్రపట్టసాగింది. పరుపుకొత్తది. మెత్తగా పరిశుభ్రంగా ఉంది. అలాంటి పరుపుమీద అతను పడుకుని ఎన్నాళ్ళయిందో! ఇల్లు వదిలిపెట్టినది మొదలు నిద్ర సుఖం ఎరుగడు. ఇలాంటి పరుపు మీద పడుకోవడమే ఆనందమని అతను అనుకున్నాడు. ఇందుకు ఎవరిని అభినందించాలా అని ఆలోచించసాగాడు. పరుపేకాదు. కొత్త దుప్పట్లు, చక్కని పూటు, సన్నని నల్లటిబెల్టు, ఇవన్నీ బాగానే ఉన్నాయి. ఇవన్నీ లభించడానికి ఎవరు కారణం? ఎవరు అభినంద నీయులు? అలెక్సీ స్టెపానొవిచ్ కావచ్చునా? లేక ఒలెంకో కావచ్చునా? లేక ఎనిమిదవ దళమా? వీళ్ళెవరూ కాకపోవచ్చు. బహుశా సోవియట్ ప్రభుత్వం అయిఉంటుంది. మొత్తంమీద ఇగోర్‌కు సోవియట్‌ప్రభుత్వం అంటే స్పష్టమైన అభిప్రాయం లేదు. అతని అభిప్రాయాలు సంకీర్ణమైనవి. పాఠశాలలో చదువుకున్న గ్రంథాలు అతనిమనస్సులో కొన్ని పదాలముద్రలను వేశాయి. లెనిన్‌గ్రాడ్‌లో అతని బాల్యం గడిచింది. నాటి బాల్యస్మృతులు సైతం అతనికి అస్పష్టంగానే ఉన్నాయి. "స్వేచ్ఛా జీవితం"గడుపుతున్నప్పుడు అతని పరిస్థితి వేరు. సోవియట్ ప్రభుత్వం అతనికప్పుడు ఎంతో నిష్కర్షగా ఉన్నట్లు కనిపించింది. వీధులలో రక్షకసైనికులు, కాపలావాళ్ళు, కనిపించసాగారు. అన్ని శాఖలతోనూ సోవియట్ ప్రభుత్వం పకడ్‌బందీగా ఉన్నట్లు అతనికి తోచింది. అతనికి నచ్చిన వ్యక్తి పొలినా నికొలయవ్నా. ఆవిడ ఏ ప్రమాదమూలేని సోవియట్ ప్రభుత్వ ప్రతి

విధినిగా అతనికి తోచింది. ఆవిడ కులాసాగా ఉంటుంది. కాని ఇప్పుడు ఆవిడకూడా కటువుగా ఉంటున్నట్లు కనిపించింది. ఇప్పుడిక్కడ కాలనీలో సోవియట్ ప్రభుత్వ పద్ధతి అతనికి చికాకు కలిగిస్తున్నట్లుగా ఉంది. అయితే ఈ సోవియట్ ప్రభుత్వం ఎక్కడ ఉందో కనిపెట్టడం కష్టంగాఉంది. కాని కాలనీ డైరెక్టర్ అలెగ్జీ స్టెపానోవిచ్‌కి దానితో ఏదో సంబంధం ఉంది. ఇదివరకు ఇక్కడ ఇలాంటి భవనాలేవీ లేవనీ; ఇది వట్టి శూన్యప్రదేశమనీ తనకు శాంకోజోరిన్ చెప్పాడుకదా. కాలనీ అంతా సరికొత్తది. నూతన భవనాలు, తివాసీలు, పూలమొక్కల వరుసలు, అద్దాలు, అన్నీ సోవియట్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందట. ఇందులో మరో చిత్రం ఉంది. సోవియట్ ప్రభుత్వంఅంటే ఒలెగ్జీస్టెపానోవిచ్ మాత్రమేకాదు. స్కూలు మాస్టరూ కాదు. కాలనీలో ఉన్నవాళ్ళంతా ప్రభుత్వం తమదే అన్నట్లు భావించుకుంటున్నారు. ఆ విషయం శాంకో మాట్లాడేతీరులోనే వ్యక్తమవుతోంది. శాంకో ఎప్పుడు మాట్లాడినా "ఇది మేంచేశాం. మేం ఇది కొన్నాం. ఇలామేం తీర్మానంచేశాం. ఇలా మేం ఉత్తర్వులిచ్చాం" అంటూ ఉంటాడు. ఏపని చేసినా మేము, మేము అనే చెపుతుంటాడు. "మేము"అనేమాటలోనే అందరూ ఉన్నట్లు అర్థం. వారిలో శాంకోజోరిన్ ఒకడు. ఒగోనక్ కూడా అలాంటివాడే.

అవును! ఇక్కడ అందరూ నేర్పరులే. ఏపనిచేసినా సులువుగా చేస్తారు. ఎనిమిదవదళంలో ఏం జరిగిందో అతనికి తెలుసును. సామాను పెట్టెలకు తాళాలు అక్కర్లేదని అందరూ అనుకున్నారు. ఎంత వింత! ఏది ఏమైనప్పటికీ ఒకటిమాత్రం ఒప్పుకోవాలి. పెట్టెలు ఎవరూ తెరవరు. దొంగతనం జరగదు. కనుక తాళాలు అక్కర్లేదన్నారు: తెలివైన నిర్ణయం కాని ఒక తమాషాఉంది. రైజికోవ్ ఇక్కడఉంటే ఏం చేసేవాడో? పెట్టెలు ఎత్తుకపోయేవాడా! దొంగతనం చేసేవాడా! కాని రైజికోవ్ వట్టి పనికిమాలినవాడు. ఆ విషయం వేరే చెప్పక్కర్లేదు. ఇక్కడ అందరూ ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. సరిపెట్టుకుని పోతున్నారు. ఆఫీసులో అలెగ్జీ స్టెపా

నొవిచ్ కూచున్నాడు. ఇక్కడ కనిపించే ప్రతివాడూ తానొక యజమానిగానే భావిస్తున్నాడు. హెచ్చుతగ్గులు లేవు. అంతవరకూ ఎందుకు? ఆ కుర్రవాడు పెట్యాను చూస్తే చాలు. అతనిది పెద్ద నుదురు. మంచికళ్ళు. మనిషి గదిలోకి రాగానే బూట్లను తుడుచుకోమని యజమానిలా హెచ్చరిస్తాడు. ఎవరైనాసరే, వెంటనే బూట్లు తుడుచుకోవలసిందే. కాలనీలో ఉన్న ఆచారాలు, అలవాట్లు, పద్ధతులు ఇగోర్‌కు విచిత్రంగా కనిపించాయి. కొన్ని అర్థం కాలేదు మరికొన్ని విషయాలను అతను అపార్థం చేసుకున్నాడు కూడా.

స్ప్రింగు మంచంమీద చక్కని దుప్పట్లు, పరుపు వేసుకుని పడుకోవడం అతనికి హాయిగానే ఉంది. కాని ఒకవిషయం. ఇందులో కూడా అంతరార్థం లేకపోలేదు. ఎవరినైనా మచ్చికచేసుకోవాలంటే ఇలాగే లంచాలివ్వాలి. అందులోనూ కావలసిన వస్తువులిస్తే మనిషి ఇట్టే లొంగిపోతాడు. ఇగోర్ ఇలా భావించడానికి కారణం ఉండి ఉండవచ్చు. అతన్ని మచ్చిక చేసుకునేందుకు అతనితండ్రి కోరిన వస్తువులిస్తూ లాలించేవాడు కాబోలు. కాని తండ్రి ఆశించినట్లుగా పరిస్థితులు తటస్థపడలేదు. సరే. మంచి పరుపుమీద నిద్రపోవడం సుఖంగా ఉంటుంది. అందులో హాని ఏమీ లేదు. సరే. ముందు ఏం జరుగుతుందో చూద్దాం. ఇక్కడ తాను పనిచేయవలసిఉంటుంది. పని సుఖంగానే ఉంటుందని నికోలాయ్ ఇవానొవిచ్ చెప్పాడు. మాటవరుసకి అతను చెప్పినట్లుకాక పని కష్టంగా ఉంటే, అప్పుడు తను ఏం చెయ్యాలి? స్కూలుగదిలో కూచుని పాఠాలు చెపుతూ ఉంటే బాగానే ఉంటుంది. ఒకవేళ అలా కాక తనను ఏదో శ్రమపడే పనిలో పెడితే?

ఇగోర్ ఈవిషయాలను తీవ్రంగా తనలో తాను వితర్కించుకుంటున్నాడు తన్ను తాను సంబోధించుకుంటున్నాడు. నే నసలు పనే చెయ్యను. అప్పుడు నన్ను బయటికి పంపేస్తారా! బయటికి పంపిస్తే బాగానే ఉంటుంది. కాని ఫస్ట్ ఆఫ్ మే లేబర్ కాలనీకి అదెంత

అవమానకరం! పదిమంది ఏమంటారు? ఇగోర్ చెర్నియావిన్ అనే ఒకానొక మనిషి బందిపోటు దొంగకాదు. చాలా తెలివైనవాడు. పెద్దమనిషి. అలాంటి కుర్రవాణ్ని మంచిమార్గంలో పెట్టలేక, పని నేర్పలేక మేకాలనీ అధికార్లు బయటికి పంపివేశారని అంటారు. ఈ అపకీర్తి మేకాలనీకి చుట్టుకుంటుంది.

ఎనిమిదవ దళంలోఉన్న సభ్యులు అతనికి జ్ఞాపకంవచ్చారు. ఎంత గౌరవంగా మాట్లాడినా, ఎన్ని తమాషాలు చేసినా, ఎలాంటి నేర్పు చూపినా, తననువాళ్ళు మోసగించలేరు. తనను వశంచేసుకో లేరు. తనచేత పని చేయించలేరు. ఇక్కడ పని చెయ్యకుండానే తాను ప్రపంచంలో బ్రతగ్గలడు. ఇలా అనుకుంటూ ఇగోర్ తన "స్వేచ్ఛా జీవితాన్ని" జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. తాను చేసిన దొంగతనాలు నిజంగా అద్భుతమైనవి. తలుచుకుంటే వళ్ళు గగుర్పొడుస్తుంది. ఎన్నోవింతలు వ్యూహాలు. అనుకోని ఫలితాలు! ఇక్కడ ఈ పరువు ఎంత బాగుంటే ఏం? ప్రపంచంలో ఏనస్తువూ తాను గడిపినస్వేచ్ఛా జీవితానికి సాటిరాదు.

ఇగోర్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అవును, లేదు అనే భావాలు అతన్ని కలవరపెడుతున్నాయి. కొన్ని ఆలోచనలు విచారాన్ని మరికొన్ని సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ఎంత ఆలోచిస్తున్నా ఈ భావ వైరుధ్యాలమధ్య అతనికి పరిష్కారం కనిపించడం లేదు, అలాగే ఆలోచిస్తూ ఇగోర్ కొంతసేపటికి నిద్రపోయాడు.

ప్రొద్దున్నే లేచి చూచేసరికి బయట సూర్యకాంతి ప్రస రిస్తోంది. లేచేముందే అతనికొక కలవచ్చింది. కలలో ఒక ఇల్లు కాలి పోతున్నట్లు కనిపించింది. ఆకాశం ఎత్తున మంటలు లేచాయి. ఫెళ ఫెళ దూలాలు విరిగి పడిపోతున్నాయి. జనం గుంపులు గుంపులుగా మూగారు. ఎక్కడికో వెళ్ళిపోతున్నారు. తనుకూడా ఆ గుంపుల మధ్య ఉన్నాడు. ఎవరో తన చెవిదగ్గర గొణిగినట్లు అనిపించింది. "నీకు వినిపించలేదా ? నీకు వినిపించలేదా ?" అనే ప్రశ్న చెవిదగ్గర వినిపించింది.

ఆ ప్రశ్నకు ఉలిక్కిపడి ఇగోర్ కళ్ళు తెరిచాడు. ఎదురుగా రొగోవ్ మంచిదుస్తులు వేసుకుని నిలుచుని ఉన్నాడు.

"నీకు వినిపించడంలేదా చెర్నియావిన్ ? లే. నిద్రలే."

రొగోవ్ గొంతు గింగురుమని వినిపించింది. ఇగోర్ లేచాడు. రొగోవ్ కంఠధ్వని తగ్గించి మెల్లగా అడిగాడు:

"ఇంకా లేవలేదేం ? మేం గది తుడవాలి."

ఎనిమిదవ దళసభ్యులు తమతమ పనుల్లో నిమగ్నులయ్యారు. పడకగదుల్లోకి వెళ్ళి తువాళ్ళతో దులుపుతున్నారు. పరుపులు చుట్ట బెడుతున్నారు. తలగడలు సర్దుతున్నారు. దుప్పట్లు మడతలుపెట్టారు. కొందరు గదుల్లోకి వెళుతున్నారు. మరికొందరు ఇవతలికి వస్తున్నారు. రొగోవ్ తెల్లని డస్టర్‌తో గోడలు దులిపాడు. కుర్చీమీద నిలుచుని కిటికీ అద్దాలను తుడిచాడు. గోడలకున్న పటాలను శుభ్రపరిచాడు. అతను పనిచేసుకుంటూఉంటే ఇగోర్ పరుపుమీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు. మళ్ళీ తన మధురమైన కలలో మునిగిపోయాడు.

గది అవతలనుంచి ఒక పిలుపు వినిపించింది.

"ఇంకా అతను పడుకునే ఉన్నాడేం ?"

అది నెస్టెరెంకో గొంతుక అని ఇగోర్ గుర్తుపట్టాడు. మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

"రొగోవ్ ! అతన్ని లేపలేదటోయ్ ?" అని ప్రశ్నించాడు నెస్టెరెంకో.

"లేపాను, లేపాను. అతను లేచేఉన్నాడే"అన్నాడు రొగోవ్.

ఇగోర్‌కు ఇదంతా చిత్రంగా ఉంది. తాను లేస్తేనేం లేవక పోతేనేం ? తను లేవకపోతే సోవియట్ ప్రభుత్వపు ఈ ప్రతినిధులు ఏంచేస్తారు ? అలాగే పడుకుని చూద్దాం. అప్పుడే లేవడమెందుకు ? ఇంతకూ తను ఏపనీ చెయ్యక్కర్లేదు. కాలనీలో ఉన్న ఆచారాల ప్రకారం తనింకా పనిచెయ్యక్కర్లేదు. మొదటి రెండు రోజులూ ఏపని ఉండదని అతను తనకు చెప్పాడు కదా ?

నెస్ట్రెంకో ఇగోర్‌ను పిలిచాడు. ఇగోర్ మాట్లాడలేదు.

"చెర్నియావిన్"

బలమైన చేతులు అతని భుజాలు పట్టుకుని కదపసాగాయి. ఇగోర్ కళ్ళు తెరిచిచూచాడు.

"ఎందుకు లేపావ్?"

"బిగిల్ ఊది చాలాసేపయింది."

"ఏ బిగిల్?"

"నిన్న నీకు శాంకో జోరిన్ చెప్పలేదూ?"

ఇగోర్ పరుపుమీద దొర్లుతూ కమాండరువంక నవ్వుతూ చూచాడు.

"చెప్పాడు, చెప్పాడు, కాని నాకు అలవాటు లేదు."

"నేనిప్పుడు చెపుతున్నాను విను. బిగిల్ ఊదగానే అందరూ లేవాలి."

"లేవకపోతే ప్రమాదమేమీలేదు కామ్రేడ్."

నెస్ట్రెంకో అతనివంక ఆశ్చర్యంగా చూచాడు. వొగోల్ గదంతాతుడిచి పరుపు దగ్గరికి వెళ్ళాడు. ఇగోర్ పకపకనవ్వసాగాడు. నెస్ట్రెంకో అతన్ని ఇలా ప్రశ్నించాడు:

"ఏమిటి నీ ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నావు? ఆలస్యంగా లేస్తే ప్రమాదంలేదూ? బాగానేఉంది. కాని మరో నిముషంలో మనల్ని తనిఖీచేస్తారు."

ఇగోర్ ఒకవైపుకు ఒత్తిగిలాడు. "తనిఖీకి వచ్చినా ఫరవా లేదు."

శాంకోజోరిన్ తనపని ముగించుకుని నెస్ట్రెంకో దగ్గరికి వచ్చాడు:

"కామ్రేడ్ కమాండర్! అన్నీ శుభ్రంగా తుడిచేశాను. ఎక్కడివక్కడ సర్దేశాను."

కాని అతనిమాటలు నెస్ట్రెంకో వినిపించుకొనే స్థితిలో లేడు. ఇగోర్ చెప్పినజవాబు అతనికి కోపం తెప్పించింది.

"నీవు లేవకపోతే ఏమీ ప్రమాదం లేదంటావా? మాటవరు సకు ఈ బెల్టు తీసుకుని నిన్ను కొడితే ఎలా ఉంటుందో రుచి చూస్తావా?"

"అదీ ప్రమాదంకాదు. కాని అది చట్టవిరుద్ధం."

"అయితే నీవు చట్టాలకు కట్టుబడి ఉంటావన్నమాట?"

ఎలాగో ఒకలాగ అతను కప్పుకున్న దుప్పటి బయటికి వచ్చింది. అలాంటిస్థితిలో తనింకా పడుకుని ఉండడం అసహ్యంగా ఉంటుందని ఇగోర్ లేచి కూచున్నాడు. రెండవసారి బిగిల్ కూత విని పించింది. రొగోవ్ బ్రష్‌లు క్రిందపడేశాడు.

"అబ్బో! చాలా వేళ అయిపోయింది. తనిఖీవేళ అయింది" అంటూ అతను బూట్లకోసం పరుగెత్తాడు.

అద్దంముందు నిలుచుని పిల్లలు జుట్లు దువ్వుకుంటున్నారు. ఇవాళ అందరూ స్కూలు యూనిఫారాలు వేసుకున్నారు. భోజ నాలవేళ అయ్యేవరకూ దళం సభ్యులు ఇవాళ స్కూలులో పని చెయ్యాలి. ఆ విషయం ఇగోర్‌కు తెలుసును. అద్దంముందు పిల్లలు గుమిగూడారు. వెంటనే చక చక పనులు ముగించుకుని గది మధ్యకు వచ్చారు. అక్కడ లైనుగా నించున్నారు. నెస్ట్రెంకో చుట్టూ చూచాడు. ళ్యాంకోజోరిన్ అతనిదగ్గరి కొచ్చాడు. ఇగోర్ ఇంకా పరుపుమీద అలాగే కూచుని ఉన్నాడు.

"అతన్ని అలాగేపడుకోనియ్యండి. ఇవాళ డ్యూటీ క్లావాది."

"క్లావా దా?" అన్నాడు నెస్ట్రెంకో.

నెస్ట్రెంకో ఇగోర్‌మీదికి దుప్పటి విసిరేశాడు. క్లావా మాట వినగానే ఇగోర్‌కు భయం పట్టుకుంది. క్లావా ఆడపిల్ల తన వంటిమీద దుస్తులులేకుండా అలా కనిపిస్తే సిగ్గుచేటు. ఇగోర్ దుప్పటి తీసుకుని కప్పుకున్నాడు.

నెస్ట్రెంకో గదంతా పరిశీలించాడు. కిటికీలదగ్గరికి వెళ్ళి అద్దాలు ఎలా ఉన్నాయో చూచాడు. అన్నీ శుభ్రంగా ఉన్నాయి. పరుపులక్రిందికి చూపులుపోనిచ్చాడు.

తనిఖీకి అలెగ్జీ వస్తాడా ?" అని జోరిన్‌ను అడిగాడు.

"అలెగ్జీ ప్రొద్దున్నే నగరంలోకి వెళ్ళాడు."

ఇదే తరుణంలో రొగోవ్ లోపలికివచ్చి తనిఖీ ప్రారంభమైందని చెప్పి తాను లైనులో వచ్చి నిలుచున్నాడు. వాకిలి తెరుచుకుంది. నెస్ట్రెంకో కమాండర్ కంఠస్వరంతో ఇలా అన్నాడు:

"దళం, దళం శాల్యూట్!"

దళమంతా అటెన్‌షన్‌లో నించున్నారు. లైను కదిలింది. మార్చ్‌చేసుకుంటూ నెడుతున్నారు. నెస్ట్రెంకో వాకిలికి ఎదురుగా ఏకంగా నిలుచున్నాడు. బంగారపు నగిషీలతో ఉన్న టోపీ పెట్టుకుని చేతికి బాడ్జీ కట్టుకుని ఒక పొట్టిపిల్ల లోపలికి వచ్చింది. ఆ అమ్మాయి వయస్సు పదిహేనేండ్లు. ఆవిడ వెంట మరో పిల్లవాడున్నాడు. వారికి వెనకాల బిగోనక్ వచ్చాడు. వస్తూనే పరుపుమీద పడుకుని ఉన్న మనిషివైపు చూచాడు.

ఆ వేళ డ్యూటీ క్లావాకషిరినా అనే అమ్మాయిది. ఆవిడ కూడా ఒక కమాండర్. అందమైన పిల్ల. నల్లగా ఉంగరాలు తిరిగిన జుట్టుటోపీదిగువనుంచి కనిపిస్తోంది. కళ్ళుమాత్రం చిన్నవి. గదిలోకి రాగానే నెస్ట్రెంకోను చూచి శాల్యూట్ చేసింది. అతనికి దగ్గరగా నిలుచుంది. అతను కొంచెం ప్రక్కకు జరిగాడు.

"కామ్రేడ్ కమాండర్!" అంటూ ఆవిడతో ఇలాఅన్నాడు. "ఫస్టఅఫ్‌మే లేబర్ కాలనీ ఎనిమిదివ దళంలో అంతా సవ్యంగాఉంది. కాని ఇగోర్ చెర్నియావిన్ మాత్రం తనిఖీవేళకు లేచి వెళ్ళలేదు."

క్లావా చటుక్కున అటుతిరిగి ఇగోర్‌వంక చలితనేత్రాలతో చూచింది. మధుర కంఠంతో,

"గుడ్‌మార్నింగ్ కామ్రేడ్స్" అన్నది.

"గుడ్ మార్నింగ్" అనే పిల్లవాళ్ళ గొంతులు వినిపించాయి. అంతటితో దళం లైన్లోనుంచి చెదిరిపోయింది. నవ్వులు వినిపించాయి. ఇంతలో గదిలోకి ఒకతను వచ్చాడు. ఆ పిల్లవాడు చేతికి రెడ్ క్రాస్ పట్టీ ధరించాడు. అతను ఆ వేళ డ్యూటీలో ఉన్న శానిటరీ కమిషన్ ఇన్స్పెక్టరు. అతని పేరు కసాట్కిన్. అతను రాగానే నాలుగువైపుల నుంచీ అనేక గొంతుకలు వినిపించాయి.

"ఇలారా. ఇటువచ్చి ఒక్కసారి చూడు."

"ఇలారండి. ఇటువైపు."

"చూస్తే మీకే తెలుస్తుంది, ఎంత శుభ్రంగా ఉందో!"

కసాట్కిన్కు నవ్వు రాలేదు. అతని చూపులు చాలా నిశితమైనవి. ఏమాత్రం పొరపాటున్నా ఇట్టే పట్టేస్తాడు. కళ్ళల్లో బూరరింపు కనిపిస్తూఉంటుంది. పడకగదిలోకి రాగానే నలువైపులా కలయచూచాడు. బుట్టలలోకి తొంగిచూచాడు. కిటికీలను తడిమి చూచాడు. అతనిచేతిలో సరికొత్త చేరుమాలు ఉంది. దాంతో కిటికీ అద్దాలను తాకి దుమ్ము ఉన్నదేమోనని పరిశీలించాడు. కాని దుమ్ములేదు. చేరుమాలుకు ఏమీఅంటుకోలేదు. దుమ్ముఏమాత్రం అంటని చేరుమాలును కళ్ళదగ్గర పెట్టుకుని పరిశీలిస్తుంటే పిల్లలంతా విజయోత్సాహంతో నవ్వారు. రొగోవ్ మాత్రం సందేహంతో అతనివంక చూడసాగాడు. అతను ఆనాడు దళానికి మానేటరు. దళంతోపాటు అతనూ ఉత్సాహపడుతోంటే ఆ గడబిడలో అతని జుట్టు రేగిపోయింది. ఇన్స్పెక్టర్ అతని జుట్టుచూచి ఇలా అడిగాడు: "నీవీపూట తలదువ్వుకోలేదేం?"

రొగోవ్, క్లావా వంక భయపడుతూ చూచాడు.

"ఓ! చాలా పనులున్నాయి...మీరు చూస్తున్నారు కదా, తీరిక లేకపోయింది...."

తప్పు పట్టడానికి ఎంతమాత్రం లేదని కసాట్కిన్ తెలుసుకున్నాడు. ఇహ ఆ ప్రయత్నం విరమించుకుని విస్యుద్దీవం వంక చూచాడు.

"అయినా మీరు అనండి. దీపం చుట్టూ పురుగులున్నట్లు ఏలాగుంది?" అన్నాడు కసాట్కిన్.

"అలాంటిదేమీ లేదు" అని ఎవరో జవాబు చెప్పారు: "ఆ గ్లాసులోనే చిన్న చిన్న చుక్కలున్నాయి. ప్రతి కమాండర్ ఇదే ప్రశ్న వేస్తున్నాడు. కాని ఆ గ్లాసు తయారేఅంత"

ఇలా సంభాషణ జరుగుతూ ఉండగా ఇగోర్ చెర్నియావిన్ గాఢనిద్రలో ఉన్నట్లు నటించాడు. ఇవాళ అందమైన పిల్ల క్లావా డ్యూటీలో ఉన్నదని అతనికెలా తెలుస్తుంది? ఆ పిల్ల తన పడక ప్రక్కనే నిలుచుని ఉన్నదని కంఠధ్వనిని బట్టి పోల్చుకున్నాడు. ఒక క్షణం క్రితం అతను గాఢనిద్రలో ఉన్నవాడివలె గుర్రుపెట్టాడు. ఇప్పుడు ఊపిరికూడా బిగబట్టాడు.

"అతనివంట్లో బాగాలేదేమో, కొంచెంసేపు అయిన తరువాత అతన్ని పరీక్షచేసి చూడండి కసాట్కిన్" అన్నది క్లావా.

"అలాగే చూస్తాను కామ్రేడ్ కమాండర్" అన్నాడు కసాట్కిన్.

"అదేం ప్రమాదం లేదు" అనే ఇగోర్ మాటలు ఈసారి నెస్ట్రెంకోకి వినిపించలేదు. కాని ఆ మాటలు అతని మనస్సులో మెదులుతూనే ఉన్నాయి.

"ఏమంటున్నారు? అతని వంట్లో బాగులేదూ? బాగానే ఉంది. ఇంచక్కా ఉన్నాడు. యింతసేపూ ఎలామాట్లాడో మీకు తెలీదు. అన్నాడు నెస్ట్రెంకో. ఇప్పుడిప్పుడే నిద్రపోతున్నాడు"

క్లావా ఇగోర్ భుజాలను తడుతూ లేపింది:

"చెర్నియావిన్! చెర్నియావిన్! నీకు సిగ్గుగా లేదూ? నిజంగా సిగ్గుపడవలసిన విషయం" అన్నది.

అయినా ఇగోర్ ఏమాత్రం చలించలేదు! తనలో తాను ఆలోచించుకుంటున్నాడు. తన వ్యక్తిత్వాన్ని తాను నిందించుకుంటున్నాడు. అతనికి సిగ్గువేసింది. తనూ, వాళ్ళందరిలాగా నిలుచుని,

సంతోషంతో నవ్వుతూ ఆ అమ్మాయితో మాట్లాడుతుంటే ఎంత బాగుండేది! అలా అయినట్లయితే తన ముఖం, తన నవ్వు ఆ పిల్ల చూచేది.

క్లావా ఇగోర్‌ను తట్టి లేపసాగింది, ఇహ ఆమె తనను వదిలి పెట్టేటట్లులేదని ఇగోర్ గ్రహించుకున్నాడు. కాని ఇంతలోనే జోరిన్ జోక్యం కలిగించుకున్నాడు ఇగోర్ మనస్సు కుదటపడింది.

"అతన్ని లేపకు క్లావా. అతన్ని అలాగే పడుకోనీయి. అతని కింకా ఏమీ తెలీదు. లోకజ్ఞానం లేనివాడు" అన్నాడు జోరిన్.

క్లావా అక్కడనుంచి వెళ్ళిపోయింది. ఆమె కాళ్ళచప్పుడు వినిపించగానే ఇగోర్ కళ్ళు తెరిచిచూచాడు. అందరూ బయటికి వెళ్ళిపోతున్నారు. బిగోనక్ చాలా ఘటికుడు. అతను తనవంక చూస్తాడేమోనన్న భయంతో ఇగోర్ మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

20

అన్యాయం

ఒకగంట గడిచింది. ఇగోర్ చెర్నియావిన్ దుస్తులు వేసుకుని భోజనాలగదిలోకి వెళ్ళాడు. అతనికెంతో హాయిగా ఉంది. కొత్త యూనిఫారం వేసుకున్నాడు. సన్నని బెల్టు పెట్టుకున్నాడు. అవన్నీ తనవేనన్న భావం అతనికి గలిగింది. కొత్తదుస్తుల అలంకారంలో అతని ముఖం ఎంతో ప్రకాశవంతంగా ఉంది. కాని క్రాపుమాత్రం సరిగ్గా లేదు.

భోజనాలగదిలో మొదటిజట్టు పిల్లలు భోజనాలకు కూచున్నారు. భోజనాలయినతరువాత వాళ్ళు స్కూల్‌కు వెడతారు. నెస్టెరెంకో తనంటే అసహ్యించుకుంటాడని ఇగోర్ అనుకున్నాడు.

అతనితో మాట్లాడడమంటే కొంచెం కష్టంగానే ఉంటుంది. అదీకాక తనొక తిరుగుబాటుదారని అందరూ భావిస్తున్నారు. ఇగోర్ ధైర్యం తెచ్చుకుని భోజనశాలలోకి వెళ్లాడు. అదెంతో విశాలంగా, పువ్వులతో అలంకరింపబడి ఉంది. టేబిల్ మీద పరిచిన గుడ్డలు తెల్లగా, ధగధగ మెరుస్తున్నాయి. కిటికీలలోనుంచి సూర్యకాంతి వచ్చి వాటి మీద పడుతోంది. ఆ కాంతికవి మరీ కళకళ లాడుతున్నాయి. భోజనాలు ముగించుకుని చాలామంది వెళ్ళిపోయారు. కొందరు అతనివంక హేళనగా చూచారు. తను ఎక్కడ కూచోవాలో అతనికి తెలుసును. హాలులో ఒక టేబిల్ ఉంది. ఆ టేబిల్ దగ్గర, నెస్ట్రింకో, గొంటార్, శాంకోజోరిన్, వీరితోపాటు తనూ కూచోవాలి. అతననుకున్నట్లుగానే జోరిన్, నెస్ట్రింకోలు అక్కడే ఉన్నారు. భోజనాలు చేసి ఇరువురూ మాట్లాడుకుంటూ కూచున్నారు. హాలులో అక్కడక్కడ నలుగురైదుగురు కూచుని భోజనాలు చేస్తున్నారు. హాలుకొసన క్లావా నిలుచుని ఉంది. ఆ పిల్ల ప్రక్కనే బిగోనక్ నిలుచుని దేనికో వేగిరపడుతున్నాడు. పనివేళ అయింది. అందుకే అతని తొందర. ఇగోర్ ఇప్పుడప్పుడే పనిలో చేరనక్కర్లేదు. ఇంకా వ్యవధి ఉంది. అంచాత దర్జాగా టేబిల్ దగ్గరికి వచ్చాడు.

"ఓహో!" ఇదా నేను కూచోవలసిన చోటు!" అన్నాడు డాబుగా.

అతను అనుకున్నట్లు నెస్ట్రింకో కటువుగా మాట్లాడలేదు. అందుకు ఇగోర్ ఆశ్చర్యపోయాడు.

"బాగా నిద్రపట్టిందా?"అని నెమ్మదిగా అడిగాడు నెస్ట్రింకో.

ఇలా నెమ్మదిగా అడిగినందుకు ఇగోర్ మరింత ఆశ్చర్యపోయాడు.

"పట్టిందనే చెప్పాలి – మంచి నిద్ర. కాని ఎవరో నన్ను లేపడానికి ప్రయత్నించినట్లుంది?" అన్నాడు ఇగోర్.

"అవును, లేపారు."

"అప్పుడు నేనేదో నిద్రలో అన్నట్లుంది!"

"అవును, అన్నావు."

శాంకోజోరిన్ కిటికీ దగ్గరికి వెళ్ళాడు. మిషాగోంటార్ అక స్మాత్తుగా లోపలికి వచ్చాడు. ఇగోర్ వంక చూస్తూ నిలుచున్నాడు. క్లావాకూడా అక్కడికి వచ్చింది. ఆవిడ రాగానే మర్యాదగా నెస్టెరెంకో కుర్చీలోనుంచి లేచాడు.

అభివందనాలు క్లావా! భోజనం బాగా ఉంది. మమ్మల్ని గర్వపడేటట్లు చేశావు"

ఈసంభాషణ ఇగోరుకుకూడా బాగానచ్చింది. భోజనంఅయిన తరువాత డ్యూటీలో ఉన్న కమాండర్ను అభినందించడం ఒక ఆచారం. ఈ విషయం శాంకోజోరిన్ మొన్ననే అతనికి చెప్పాడు.

ఆ, అందులో ఏముంది!" అన్నది క్లావా. ఇలాఅని తనచేతి గడియారం చూచుకుంది. తనవెంట నీడలా వస్తున్న బిగోనక్ను చూచింది.

"ఒక్క క్షణంలో బిగిల్ ఊదుదువుగానిలే. తొందరపడకు" అన్నది.

బిగోనక్ తన బిగిల్ను ఒకమాటు చూచుకున్నాడు. హడా వుడిలో సరిగ్గా శ్యాల్యూట్ చేయలేకపోయాడు.

"నీవు సరిగ్గా శాల్యూట్ చెయ్యలేకపోయావు. కమాండర్ ఉత్తర్వును నీవు ఆవిధంగా అనుసరించకూడదు. ఈ విషయం అలె గ్జితో చెప్తానుండు" అన్నాడు నెస్టెరెంకో.

బిగోనక్ ముఖం వెలవెలబోయింది. ఏదోపని ఉన్నట్లు త్వరత్వరగా వాకిలిదగ్గరికి వెళ్ళాడు.

"నీవు అతన్ని పాడుచేస్తున్నావు క్లావా! నా ఆజ్ఞలను అతను సరిగ్గానే అనుసరించేవాడు. నీవే అతనికి చనువిచ్చి చెడగొడు తున్నావు" అన్నాడు నెస్టెరెంకో.

క్లావా నవ్వింది. ఆవిడది చక్కని పలువరుస. నవ్వుతున్న ప్పుడు ఆ అమ్మాయి మరీ బాగుంటుంది.

"అతనలా ప్రవర్తించడం నేను చూడలేదు. ఇంతవరకూ అతను సరిగ్గానే ఉన్నాడు...ఎవరిక్కడ? ఇగోర్ చెర్నియావిన్ అంటే నీవేనా?"

ఇగోర్ మర్యాదగా నమస్కరించాడు.

"ఇందాక గదిలో ఎందుకలా బిడియపడ్డావు? చిన్నపిల్లవాడివి కాదే!—ఏమంత బిడియం?" అన్నది క్లావా మళ్ళీ.

ఇగోర్ ముఖం ఎర్రబారింది. ఆవిడ అందమైన అమ్మాయిగా, లలితంగా భావించుకోవాలని అతను అనుకున్నాడు. కాని ఇంత నిర్మొహమాటంగా అడుగుతుందని అనుకోలేదు. అయితే ఆవిడ డ్యూటీలో ఉన్న కమాండర్ అనే విషయం అతను మరిచిపోయాడు. చేతికి సిల్కుపట్టీ కట్టుకుని కమాండర్ కాగానే ఎవరికైనా అంత నిష్కర్షగా ఉండే పద్ధతి అలవడుతుంది కాబోలు!

ఆవిడ ప్రశ్నవిని ఇగోర్ తత్తరపాటు చెందాడు.

"ఒక్కొక్కప్పుడు అలాగే సంభవిస్తుంటుంది కామ్రేడ్..." అన్నాడు.

"అలా సంభవిస్తూఉంటుందా? అంటే ఏమిటనినీఉద్దేశం?... అది సరేకాని, ఇక్కడ, ఈ భోజనశాలలో నీవు ఏంచేస్తున్నావు?"

"భోజనం చెయ్యడానికి వచ్చాను."

"భోజనమా? ఇంత ఆలస్యంగానా? ఆలస్యంగా రాకూడదని నీకెవరూ చెప్పలేదూ? అయిదు నిముషాలకంటె ఎక్కువఆలస్యంగా రాకూడదు. అందరూ భోజనాలు చేసి వెళ్ళిపోయారు. వడ్డనపూర్తి అయి ఇరవై నిముషాలయింది. ఇహ ఇప్పుడు రెండవజట్టు భోజనాలకు వస్తుంది. టేబిళ్ళు అవీ, సర్ది శుభ్రం చేస్తున్నారు. ఈ విషయం నీకెవరూ చెప్పలేదా?"

"కామ్రేడ్ జోరిన్ చెప్పాడు. కాని నేనే మరిచిపోయాను."

"మరిచిపోయావా?"

ఇగోర్ జవాబుకోసం ఎదురు చూడకుండానే క్లావా తలుపు దగ్గరికి వెళ్ళింది. ఆవిడ అలా వెళ్ళిపోవడం అతనికి బాధ అనిపిం

చింది. ఆవిడకు తనతో మాట్లాడాలని లేదా? తనను సోవియట్ న్యాయసూత్రాలు ఎరగని మూఢునిగా వీళ్ళంతా భావిస్తున్నారా?

ఇగోర్ గబగబ ముందుకువెళ్ళి ఆవిడకెదురుగా నిలుచున్నాడు.

"మీరు మాట్లాడకుండా వెళ్ళిపోతున్నారే. అంటే దీనిఅర్థమేమిటి? నాకు భోజనం పెట్టకుండా చేస్తారా?" అన్నాడు.

"నీవు చాలా విచిత్రమైనవాడివి! కామ్రేడ్? నిన్ను వేళకు వచ్చి ఎవరు భోజనం చెయ్యవద్దన్నారు? నీ భోజనం నీవే మానుకున్నావు."

"అయితే ఇహ ఈపూట నాకు భోజనం పెట్టరన్నమాట!"

ఈ ప్రశ్నకు నెస్టెరింకో నవ్వుతూ ఇలా జవాబు చెప్పాడు:

"అందులో ఏమీ ప్రమాదం లేదులే!"

ఇగోర్ కుర్చీమీద చేతులువేసి కుర్చీకి బలంగా ఆనుకున్నాడు. ఇదివరకు పోస్టుమాస్టర్‌తో మాట్లాడినట్లు బింకంగా ఇలా అన్నాడు:

"ఏమైనా ఇదిమాత్రం చట్టవిరుద్ధం. తిండిలేకుండా చెయ్యడం చట్ట సమ్మతంకాదు. ఆ విషయం నాకు బాగా తెలుసు."

అతనిలా అనగానే జోరిన్ చాలా సంతోషించాడు. డ్రాఫ్‌లోకి చెయ్యి పోనిచ్చి గంభీరంగా ఇలా అన్నాడు.

"నీవన్నది నిజం కామ్రేడ్! క్లావామీద కంప్లయింట్ చెయ్యి."

"తప్పకుండా చేస్తాను. గుర్తించుకోండి కామ్రేడ్ కమాండర్! విధిగా కంప్లయింట్ చేస్తాను. కాని నేను ఎవరికి కంప్లయిట్ చెయ్యాలి?"

జోరిన్ అమాయకంగా గొంతు సవరించుకున్నాడు.

"సాధారణ సమావేశం జరిగినప్పుడు ఫిర్యాదు చేద్దువుగాని" అన్నాడు జోరిన్.

క్లావా, నెస్టెర్లు ఇద్దరూ పకపక నవ్వసాగారు. జోరిన్ కి మాత్రం నవ్వురాలేదు.

"ఎందుకు ఫిర్యాదు చెయ్యకూడదూ?" అని అడిగాడు వాళ్ళనుజోరిన్. "అతనికి ఆహక్కున్నది. చెయ్యనివ్వండి. . .ఫిర్యాదు చెయ్యనివ్వండి."

కొంతసేపటికి జోరిన్ కుకూడా నవ్వు ఆగిందికాదు. వారిద్దరితోపాటు తానుకూడా నవ్వసాగాడు.

బయట బిగిల్ వినిపించింది. క్లావా త్వరత్వరగా వెళ్ళిపోయింది. ఇగోర్ ఆవిడవంక చూస్తూ కూచున్నాడు. ఆవిడ వెళ్ళిపోగానే కోపంగా జోరిన్ వంక చూచాడు. కాని ఇప్పుడు అతనికీ నవ్వు ఆగిందికాదు.

21

రష్యాన్

భోజనం అయినతరువాత ఇగోర్ కు ఎంతో బాగుంది. కాలనీ చూద్దామని బయలుదేరాడు. ఆకలిగా ఉన్నా ఎప్పుడూ అతనికి కష్టంగా ఉండేదికాదు. స్వేచ్ఛా జీవితం గడిపేటప్పుడు అతను వేళ పట్టున అన్నం తినేవాడుకాదు. సమయా సమయాలనుపట్టి వేళలు మారుతుండేవి. ఒక్కొక్కప్పుడు ఆకలి లేకపోయినా త్వరగా తినేవాడు. మరొకప్పుడు ఆకలిగా ఉన్నా ఆలస్యంగా తినేవాడు. ఇవుడు బాధిస్తున్నదల్లా ఒక్కటేవిషయం. ఆపిల్ల తనపట్ల నిష్కర్షగా ప్రవర్తించిది. తన వైఖరిని గమనించికూడా తనకు ఎలాగా పాఠాలు బోధించాలనుకుంటూ ఉందో అతనికి అర్థంకాలేదు.

భవనందగ్గరికి వెడుతూ మధ్యలో అతనిలా భావించుకున్నాడు: వీళ్ళంతా సోవియట్ ప్రభుత్వానికి తామే ప్రతినిధుల మనుకుంటారు. ఇక్కడి నియమాలు, బాడ్జీలు, బిగిల్ ఊదుళ్ళు, నమస్కారాలు; వీటినిచూచి వీళ్ళ కెంత గర్వం! ఏమైనాసరే వీళ్ళు నిజంగా నిరంకుశాధికార్లు. ఇదివరకు ఇగోర్ నిరంకుశుల ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చింది. "నీకు ఇదే ప్రదేశానికి మనియార్డరెందు కొచ్చింది?" పోస్టాఫీసులో జరిగిన సంఘటన అతనికి జ్ఞాపకం వచ్చింది. భోజనానికి ఆలస్యంగా రాకూడదట. అయిదు నిముషాలు ఆలస్యంగావస్తే ఆకలితో అల్లాడవలసిందేనట! క్లావా అన్న మాటలు అతను గుర్తు తెచ్చుకున్నాడు. ఇలాంటి మనుష్యులు ఇగోర్ చెర్నియావిన్‌ను విద్యావంతుణ్ణి చేయడానికి ప్రయత్నిస్తున్నారు! అయితే ఇగోర్ చెర్నియావిన్ సైతం నిరంకుశాధికారిగా పాపం, మారిపోగలడేమో ఎవరు చెప్పగలరు! అందరు నిరంకుశాధికారులవలె కావలిస్తే నన్నూ వాళ్ళు ఫిర్యాదు చేసుకోమంటారు.

ఇలాంటి ఆలోచనతో అతను నడుస్తూ పూలమొక్కల దగ్గరికి చేరుకున్నాడు. పువ్వులు అతన్ని అంతగా ఆకర్షించలేదు. అక్కడ నుంచి ఏ ఆటంకం లేకుండా తిన్నగా అవతలపడి నగరానికి వెళ్ళవచ్చు అనుకున్నాడు. దానికితోడు ఆ చుట్టుప్రక్కల ఎవరూ లేరు. కాని ఇవాళే పారిపోవాల్సిన పనిలేదు. రేపూ ఈ అవకాశం ఉంటుంది. ఉడాయిస్తే రేపు చల్లగా ఉడాయించవచ్చును.

పూలతోటలోనుంచి కుడిప్రక్కకు మళ్ళాడు. అటువైపున పెద్దపెద్ద చెట్లుగల ఒకతోపు ఉన్నది. ఆ తోపు చివర ఒక నూతన భవనం కనిపిస్తున్నది. ఈ భవనంలో పడకగదులు తప్ప మరేమీలేవని శాంకోజోరిన్ అతనికిదివరకే చెప్పాడు. ఇప్పుడున్న స్కూలు పాత గదుల్లోకి మారుస్తారట. ఇప్పటి పాఠశాలా భవనం మరెందుకో ఉపయోగిస్తారట. ఎందుకు చెప్మా? ఆలోచించగా అతనికొక విషయం తట్టింది. సాధారణ అభివృద్ధికి ఉపయోగిస్తారని ఇప్పుడతనికి జ్ఞాపకం వచ్చింది. ఎంతో సంతోషంతో శాంకో ఏవేవో పెద్దపెద్ద

అంకెలు చేర్చాన్నాడు. 2,00,000; 3,00,000, ఇలా చెపుతూనే శాంకో మరెందుకో కోపం తెచ్చుకున్నాడు. కొత్తగదుల నిర్మాణా నికి ఎవరో కొంత ధనాన్ని మంజూరుచేశారట. ఈ భవనాలు కొత్తగా చేరేపిల్లలకు ప్రత్యేకిస్తారట. కాని ఉత్పత్తి అభివృద్ధికోసం ఒక చిల్లి కోపెక్కు కూడా మంజూరు చెయ్యడానికి ఎవరికీ మనస్సు ఒప్పిందికాదు. కాలనీలో ఉన్నవాళ్ళే ఆ విషయాలన్నీ ఆలోచించు కోవాలట. కాలనీలో చాలామంది చేరతారు. ఈ చేరినవాళ్ళంతా ఎక్కడ పనిచెయ్యాలి? ఉత్పత్తి అధికంచెయ్యాలి. శాంకో జోరిన్ "ఉత్పత్తి" అనేమాట వచ్చినప్పుడల్లా ఆ పదాన్ని ఎంతో గౌరవం తో ఉచ్చరించేవాడు. సాలోమన్ డవిడొవిచ్ బ్లమ్ అనే అతనంటే శాంకోజోరిన్‌కు ఉత్సాహం ఉబికిపోతుంది. కాని అతనుమాత్రం జోరిన్‌ను కొంచం పరిహాసం చేస్తుంటాడు.

మొత్తంమీద ఇక్కడంతా కట్టుదిట్టంగా ఉంది. కాని అదెలాఉందో, ఎందువల్ల ఉందో ఇగోర్‌కు చెప్పేదెవరు? క్రిందటి రాత్రి పడుకునేముందు దళసభ్యులంతా నవ్వుకుంటూ మాట్లాడు కుంటూనే ఉన్నారు. ఏదో స్టేడియమ్‌ను గురించి చర్చించుకుంటు న్నారు.

"మన కాలనీలో స్టేడియమ్ అలా ఉండడం ఎంతో సిగ్గు చేటు!" అన్నాడు నెస్టెర్కో.

ఇగోర్ నూతనభవనం ద్వారం దగ్గరికి వెళ్ళి చూశాడు. భవనం పూర్తి అయింది. కిటికీల అద్దాలు తళతళ మెరుస్తున్నాయి.

దూరంగా ఒకపార్కు ఉంది. ఆపార్కులో బెంచీలున్నాయి. విశాలమైన ఇసుకత్రోవలు ఏర్పరచారు. ఈ పార్కును ఎంతో సంతోషంగా వర్ణిస్తూ శాంకో ఉబ్బిపోయాడు. ఇది నిజంగా అద్భుతమైన కృషి. చక్కటి త్రోవలు. ఆడుకునేందుకు స్థలం! క్రీడా స్థలాలను చూడాలంటే లెనిన్‌గ్రాడ్‌లోనే చూడాలి! ఇక్కడ ఈ కాలనీలో ఇవన్నీ తమకు తాము నిర్మించుకున్నవే. ఇక్కడ కోనేరుకూడా మళ్ళీ ఏర్పరచుకున్నారు.

ఈ ప్రదేశం ఎంతో ఎత్తుగా ఉంది. దారపువలలాగా అనేక త్రోవలు అల్లుకుని ఉన్నాయి. కొంచెం దూరం వెళ్ళి చూస్తే అక్కడొక చక్కని కోనేరు, కోనేటి ఒడ్డున కూచోడానికి బెంచీలు. కోనేరు చాలా చిన్నది. ఒడ్డున ఉన్న చెట్లు కోనేట్లోకి ఒరిగి చూస్తున్నాయి. కోనేట్లో దిగడానికి ఒకచోట కొయ్యమెట్లు కట్టారు.

ఇగోర్ అక్కడికి వెళ్ళి ఒక బెంచీమీద కూచున్నాడు. ఈ కోనేట్లో దిగి కాసేపు ఈతకొడితే ఎంత బాగుండును! దుస్తులు ఊడ తీసి కోనేట్లో దూకాడు. నీళ్ళు హాయిగా వింత పరిమళంతో చల్లగా ఉన్నాయి. ఈ నీళ్ళలో సెంటు కలిపారా ఏమిటి?

కాదు, కాదు. కోనేట్లో ఏ పరిమళద్రవ్యాలు కలపలేదు. కాని చుట్టూ ఉన్న రకరకాల చెట్లు వింతపరిమళాలను వెదజల్లుతున్నాయి అందుకే ఈనీళ్ళకు ఈతావి అబ్బింది. ఇగోర్ కోనేరులో ఈదుకుంటూ వెళ్ళి మధ్యన తేలాడు. అక్కడి నీళ్ళు మంచులా మరీ చల్లగా ఉన్నాయి. వెనక్కు తిరిగి ఒడ్డువైపు చూచాడు. ఒడ్డున తన దుస్తులు పెట్టుకున్న బెంచీదగ్గర ఒక కుర్రవాడు కనిపించాడు. ఇగోర్ ఈదుకుంటూ వెళ్ళి ఒడ్డుకు చేరుకున్నాడు. బెంచీదగ్గర నిలుచున్న ఆ కుర్రవాడు జేబుల్లో చేతులుపెట్టుకుని అతనివంక చూచాడు... అతను కొత్తకుర్రవాడు కాబోలు! అతని తలకు టోపీఉంది, క్రాపు చక్కగా కత్తిరించుకున్నాడు. దృఢంగా ఉన్నాడు కుర్రవాడు.

"నీళ్ళలో చల్లగా ఉందా?" అని ఆ కుర్రవాడు కేకవేశాడు.

"చాలా హాయిగాఉంది" అన్నాడు ఇగోర్.

"అయితే నేనూ వస్తున్నాను."

ఒక నిమిషంలో ఆ కుర్రవాడు కోనేట్లోదూకాడు. ఇద్దరూ దగ్గరపడ్డారు. కుర్రవాడి క్రాపు ఇగోర్‌కు ఎంతో అందంగా కనిపించింది

"నీవు కాలనీలో ఉంటున్నావా?" అని ఆ కుర్రవాడు ఇగోర్‌ను అడిగాడు.

"ఇంచుమించుగా ఉంటున్నట్లే."

"కొత్తగా వచ్చావుకదూ? ఇంతకుముందు నిన్ను చూళ్ళేదులే."

"నిన్ననే వచ్చాను."

"ఓహో! అదా సంగతి."

"అయితే నీ వెప్పుడొచ్చావు?"

"నేనొచ్చి పదిహేను రోజులైంది."

"అయితే నీవ్వూ కొత్తవాడివే. కాదూమరి?"

"అవును."

"నీకిక్కడ ఎలా ఉంది?"

"ఇక్కడనుంచి వెళ్ళిపోతాను?"

"నిజంగానా?"

"అవును. ముమ్మాటికీ నిజం. వీళ్ళతో వేగలేకుండా ఉన్నాను" అన్నాడా కొత్తగావచ్చిన కుర్రవాడు.

ఆ కుర్రవాడు కోనేట్లో రకరకాలుగా ఈతలు కొడుతున్నాడు. వెల్లకిల పడుకుని నీళ్ళమీద తేలుతున్నాడు. కాళ్ళు పైకెత్తి ఇటూ అటూ దొర్లుతున్నాడు.

"అబ్బో! వళ్ళు కొంగర్లుపోతోంది. ఈనీళ్లు ఇంత చల్లగా ఉన్నాయేమిటి? ఇహ వెళ్ళిపోయి బట్టలు తొడుక్కుంటాను."

ఇరువురూ ఒడ్డుకు ఈదుకుంటూ వచ్చారు.

"ఇక్కడనుంచి ఎక్కడికి వెడతావు?" అని ఇగోర్ బట్టలు వేసుకుంటూ ఆ కుర్రవాణ్ణి అడిగాడు.

నగరంలో మా నాన్న ఉన్నాడు. కాని వాడొక పశువు. ఇహ వాడిదగ్గరికి వెళ్ళను. ముష్టి అయిదువందల రూబుళ్ళు పెట్టెలో నుంచి సంగ్రహించానో లేదో ఊరికే నానా అల్లరి చేశాడు. ఇంతా అంతా గొడవ కాదు. ఇల్లంతా ఎగిరిపోయేటట్టు గోల

పెట్టాడు. నన్ను బర బర లాక్కుపోయి రక్షక సైనికుడికి అప్ప గించాడు. చూడు ఎలా ఉందో! మా నాన్న చిన్నవాడా చితక వాడా? ఏమీ తెలియనివాడా? అంత పెద్ద ఉద్యోగంలో ఉండీ కూడా, పరువు మర్యాద చూసుకోకుండా నన్ను రక్షక సైనికుడికి అప్పగించాడు. వాడు నన్ను ఇక్కడికి పంపించాడు."

"ఇక్కడ నీవు పనిలో చేరావా?"

"ఓస్, పనా? దానికేముంది. ఎలాగో ఒకలాగా నాచేత చేయిస్తున్నారులే. చేయించనీ. సామ్యవాదాన్ని స్థాపించడమట. ఈమాట వాళ్ళు అంటూ ఉంటారులే. అందుకోసమే పనిచేస్తున్నా రట. బాగుంది, చెయ్యనీ."

"ఇవాళ నీవు పనిలోకి ఎందుకు వెళ్ళలేదూ?"

"అదీ వాళ్ళ సామ్యవాదంలో ఒక భాగమే. పని చెయ్యడా నికి అక్కడ సామగ్రి ఏమీ లేదు. నేను కుసులు తయారుచేసే మిషన్‌దగ్గర పనిచేస్తున్నాను. చిత్రిక పని బాగుంటుంది. కాని చెయ్యడానికి వస్తువులు లేనిదే ఏమిటి చెయ్యడం?"

"నీ పేరేమిటి?"

"గొరొంఖోవ్. ఇది మా ఇంటిపేరు. ఇంతరకూ బాగానే ఉంది. మిగతాదిమాత్రం—రస్లాన్. నాకీ పేరు పెట్టినందుకు మా వాళ్ళను ఏమనాలి!"

ఇగోర్ నవ్వాడు. అదిచూచి రస్లాన్‌కూడా నవ్వడం మొదలు పెట్టాడు. అతనిముక్కు చాలా పెద్దది, ముఖంనిండా మొటిమలు. అందువల్ల ముఖం మరీ ఎర్రగాఉంది. అతను నవ్వగానే పళ్ళు బయట పడ్డాయి. ఎగుడుదిగుడుగా ఉన్న పలువరుసలు కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి.

"రస్లాన్!" అనే మాటను రస్లాన్ ఉచ్చరించాడు. "పుష్కిన్ వ్రాసిన 'రస్లాన్ ల్యూడ్మిలా' అనే గేయం చదివేవరకూ నాకు రస్లాన్ అనేపేరు బాగానే ఉంది, ఇహ ఆపేరు పెట్టుకోవడమంటే అసహ్యం వేసింది...నీవాగేయం చదివావా?"

"చదివాను" అన్నాడు ఇగోర్.

"అయితే రస్లాన్ ముఖం కూడా నాలాగే ఉందా? చెప్పవయ్యా? అయిదువందల రూబుళ్ళు తీశానో లేదో మావాళ్ళు నన్నలా చేశారు. నేనుకనుక సరిపోయింది..."

"నేనూ ఇక్కడనుంచి వెళ్ళిపోతానేమోలే" అన్నాడు ఇగోర్.

"నీకు అమ్మ, నాన్న ఉన్నారా?"

"ఉన్నారు. అబ్బో! చాలాదూరం. ఎక్కడ లెనిన్‌గ్రాడ్, ఎక్కడ కాలనీ!"

"అయితే అక్కడికి వెళ్ళిపోవాలనుకుంటున్నావా?

"లేదు. వెళ్ళనంటే వెళ్ళను"

"మరెక్కడికి వెడతావు?"

"సరేలే, నామాటకేం? నీమాట?"

ఇరువురూ బెంచీమీద కూచుని ఒకరినొకరు చూచుకున్నారు.

"తగలడనీ! ఎలా తగలడితే మనకేం?...వాళ్ళు అంటున్నది నిజమేనేమోలే..." అన్నాడు రస్లాన్.

"ఎవర్ని గురించి మాట్లాడుతున్నావు?"

"ఇంకెవరు? వీళ్ళసంగతే. అన్నీ రూల్సు, ప్రతిదానికీ ఒక రూలు. అన్నీ ఆరూల్సుప్రకారమే జరగాలి. ప్రతివిషయంలోనూ అలా పీడించడం నాకేం బాగాలేదు. ఉట్టినే ఒలవంత పెడతారు. షూటింగు నేర్చుకోమంటారు. లేదా నాటకానికి రమ్మంటారు. లేకపోతే బొమ్మలుగీయడం నేర్చుకోమంటారు. ప్రతివాడూ చదువుకోవాలట బాగుంది. నాకుమాత్రం బ్యాండ్ వాయించడం నేర్చుకోవాలని ఉంది. కాని దానిక్కూడా ఒకరూలు ఉన్నదట."

"నీవు వెళ్ళిపోతావని వాళ్ళతో చెప్పావా?"

"చెపుతాను, ఇహ ముందు చెపుతాను. లేకపోతే నేనిక్కడ ఉండగలనని అనుకుంటున్నావా నీవు? బ్యాండ్‌లో చేర్చుకో మన్నాను. కాని కొన్నాళ్ళు ఆగమన్నారు వాళ్ళు. కాలనీ సభ్యులు కాని వారిని చేర్చుకోరట."

"మరి నీవు కాలనీ సభ్యుడివేగా?"

"ఏమిటో వాళ్ళదో గొడవ. నీవు అవునో కాదో నీకు చెప్పారా?"

"కాలనీసభ్యుడు అనేమాట నేనూ విన్నాను."

"ఆ, అదే అదే సంగతి. కాలనీసభ్యుడు అనే బిరుదు. నీవు కాలనీ సభ్యుడివికాదు. నీవింకా ట్రెయినింగ్‌లోనే ఉన్నావన్న మాట. నీకో యూనిఫారం ఇస్తారు. తళతళ మెరుస్తుంది చూచావు? ఆ బాడ్జీమాత్రం నీకివ్వరు. అదిస్తే నీవు కాలనీసభ్యుడివి. ఈలోగా నిన్ను నానాబాధలు పెడతారు. ప్రత్యేకంగా పనులు చెపుతారు. సెలవు ఇవ్వరు. నీకు రోజూవచ్చే అలెవెన్సుకూడా వాళ్ళే కాజే స్తారు. అలెగ్జీ చూడు! తనిష్టమొచ్చినట్లు చేసేస్తాడు. నిన్ను ఒకదళం నుంచి మరో దళానికి, అక్కడనుంచి వేరేచోటికి; ఇలా మారు స్తునే ఉంటారు. పెద్దపెద్ద పనులు ఒప్పగిస్తారు....అంతేలే. చివరకు నన్ను బ్యాండ్ వాయించనివ్వరు."

ఇగోర్ ఆశ్చర్యపడి "అబ్బబ్బ! ఎంతగొడవ పెడతారు! ఇలా ఎన్నాళ్ళు చేస్తారు?" అని అడిగాడు.

"ఎన్నాళ్ళా? కనీసం నాలుగు నెలలు. ఆ తర్వాత దళంయిష్టం సాధారణ సమావేశంలో నిన్ను ఎక్కడికి పంపించాలో చర్చిస్తారు. ఆ విషయాన్ని ఓటుకు పెడతారు. ఎక్కువమంది ఏది నిర్ణయిస్తే అది. కాని ఈ సమావేశాల్లో ఏం జరుగుతుంటుందో నీకు తెలుసా? అసలు విషయాన్ని నిర్ణయించేది కొమ్సొమోల్ సభ్యులు. వాళ్ళంతా ఎక్కడో రహస్యంగా సమావేశమవుతారు. ఏం మాట్లాడుకుంటారో నీకు తెలియనివ్వరు."

"కాలనీ సభ్యులను మాత్రమే వాళ్ళు బ్యాండ్‌లో చేర్చు కుంటారా? అలా ఎందుకని?"

"ఎందుకా? ఎందుకో ఆ దేవుడికే తెలియాలి.. కాని ఒక విషయం. ఒకమాటు కాలనీ సభ్యుడనేవాడు బ్యాండులో చేరడా మళ్ళీ అంత సులభంగా బయట పడలేడు.*"

"బయట పడలేడూ?"

"ఊహూ వీల్లేదు. నీ వొకసారి ఏదైనా వాయిద్యం నేర్చుకుంటే బ్రతికినన్నాళ్ళూ సంగీతజ్ఞుడివిగానే ఉండాలి. రూల్సు, అన్నీ రూల్సేయ్! మాటవరసకు మనకు వాయిద్యం వాయించడం త్వరగానే వచ్చిందనుకో. అప్పుడిహ చాలునయ్యా అన్నా వినిపించుకోరు. అలా గడువు పూర్తయ్యేవరకూ నేర్చుకోవలసిందే. హు! నాకెందుకు? నే నెలాగూ పోతున్నాను."

రస్లాన్ చికాకుగా ముఖంపెట్టి పార్కు వంక చూస్తూ ఆలోచనా నిమగ్నుడయ్యాడు. ఇగోర్ కూడా ఏదో ఆలోచనలో మునిగి పోయాడు. పార్కుకు అవతల దూరంగా, మెషీన్‌షాపులోనుంచి ధ్వనులు వినవస్తున్నాయి. ఆ ధ్వనుల తరువాత పిల్లల కేకలు, కుక్కల అరుపులు వినిపించాయి. సిమ్మెంట గంట మ్రోగింది. ఒక

* వాయిద్యదళంలో చేరి ఒక వాయిద్యాన్ని నేర్చుకునే విద్యార్థికి, ఆ వాయిద్యాన్ని బట్టి ఎంతకాలం నేర్చుకోవాలో ఒక గడువు నిర్ణయిస్తారు. శిక్షణ పొందుతున్న విద్యార్థి హఠాత్తుగా మానేస్తే మొత్తం దళంచేసే పనికి ఆటంకం కలుగుతుంది. కనుక అలా మానుకోవడానికి వీలులేకుండా కొన్ని ప్రత్యేకమైన నిబంధనలు రూపొందించారు. దళంలో చేరేముందు విద్యార్థి తాను ఆ నిర్ణయించిన కాలమంతా శిక్షణ పొందుతానని వాగ్దానంచేస్తూ ఒక పత్రం వ్రాసి ఇవ్వాలి. ఒకవేళ అతను మానుకోదలుచుకుంటే మూడునెలలు ముందుగానే ఆ విషయం తెలియచెయ్యాలి. ఇందువల్ల కాలనీ విద్యార్థులలో ఒక క్రమశిక్షణ ఏర్పడింది. తొందరపడి ఎవరూ నిర్ణయాలు చేసుకోకుండా తమ అభిరుచులను గ్రహించుకుని ఆ ప్రకారం నడుచుకుంటారు. ఎవరైనా మధ్యలో వెళ్ళిపోవడానికి తగిన కారణాలు ఉంటే వాటినిబట్టి ఈ నిబంధనలను సడలిస్తూ ఉంటారు.

సారి, రెండుసార్లు, మూడుసార్లు—గంట గణగణ మ్రోగింది. రస్లాన్ అటు తొంగిచూచాడు..

"నీది ఎన్నో దళం?" అని అడిగాడు ఇగోర్.

"ఏమిటి అడుగుతున్నావు?"

"నీవు ఏ దళంలో చేరావని? మొదటి దళంలోనా?"

"అవును."

"ఒలెంకో దళం అన్నమాట."

"అవును, ఆ దళంలోనే చేరాను."

"ఒలెంకో మంచి కమాండరేనా?

"ఇక్కడ అంతా ఒకటేలే!"

"ఆ చప్పుడేమిటి?"

"దూలాలు మోసుకొస్తున్నారు. సరే. ఇహ నే వెళ్ళిపోవాలి. వాళ్ళు కలప పట్టుకొచ్చారు."

రస్లాన్ పూలమొక్కల్లోనుంచి వెళ్ళిపోతున్నాడు. అతన్ని చూస్తూ ఇగోర్ అక్కడే కూచున్నాడు. రస్లాన్ అప్పుడే చాలా దూరం వెళ్ళాడు. పూలమొక్కల సందుల్లోనుంచి అతని నీలిదుస్తులు ఇగోర్‌కు కనిపిస్తున్నాయి.

22

బ్లమ్‌స్టేడియమ్

ఇగోర్ ''ప్రొడక్షన్ యార్డు''లోకి వెళ్ళాడు. దాన్ని కాలనీలో అలాగే పిలుస్తారు. కాలనీకి అనుబంధించి అనేక వర్కుషాపులు ఉన్నట్లు జోరిన్ ఇదివరకే అతనికి చెప్పాడు. ఈ మధ్యనే కాలనీలోకి ఒకతను వచ్చాడు. వస్తువులను జాగ్రత్తగా తయారు చేయించడం అతనికి ఉద్యోగం. ఉత్పత్తిశాఖకు అతను ప్రధాన బాధ్యుడు.

ఇప్పుడు పని గదులకు మారుగా ప్రత్యక్షంగా షాపులే ఉన్నాయి. ఒకటి యంత్రసామాగ్రి ఉన్నది. మరొకటి యంత్రాలున్నది. ఇంకొకటి చిన్నచిన్న లోహ వస్తువులను పోతపోసేది. మరొకటి యంత్రభాగాలను అతికించేది. ఇంకొకషాపులో బుట్టలు తయారుచేస్తారు. ఇన్ని షాపులను ఇగోర్ తన జన్మలో చూళ్ళేదు. ఉత్పత్తి సంబంధమైన విషయాలలో అతనికి బాత్తిగా ఆసక్తి లేదు. అంచాత ఈ పేర్లు అతనికి అర్థంకావటేదు. కాని తను ఈషాపుల్లో పని చేయబోతున్నానని మాత్రం అతను గ్రహించుకున్నాడు. కనుక ఆ షాపులు ఎలా ఉంటాయో చూద్దామని నిశ్చయించుకున్నాడు.

రస్లాన్ పార్కులోనుంచి ముందు నడుతున్నాడు. ఇగోర్ అతని వెనకాలే వెళ్ళాడు. ఇసుకపుంత తోపుదగ్గరికి వెళ్ళారు. తోపులో అక్కడక్కడ చెట్లు నరికిఉన్నాయి. చెట్ల మ్రోడులు కనిపిస్తున్నాయి. కొన్ని చెట్లు గాలికి ఊగుతున్నాయి. వాటి వేళ్ళు ఎంతో బలంగా ఉండి బయటికి కనిపిస్తున్నాయి. తోపులో రకరకాల వస్తు

వులున్నాయి. బల్లలు, దూలాలు, బొగ్గుబుట్టలు, ఇనపరేకులు, రంపపుపొట్టు; ఇంకా అనేక పనిముట్లు యార్డుచుట్టూ కర్రలతో కట్టిన ఎత్తుతక్కువ భవంతులు ఉన్నాయి. అవి ఎంతో ముచ్చటగా కన్పిస్తున్నాయి. కప్పులమీద పొగగొట్టాలు ఆ గొట్టాల్లోనుంచి దట్టంగా నల్లటిపొగ వస్తోంది. ఒక భవంతి కొంచెం దృఢంగాఉంది. అందులోనుంచి దూలాలు కోస్తున్న చప్పుడు వినిపిస్తోంది. మనుష్యుల మాటలు, కేకలు వినవస్తున్నాయి. ఈభవంతి ముందు బళ్ళు నిలబడి ఉన్నాయి. బండ్లల్లోనుంచి పనివాళ్ళు బల్లచెక్కలను దించుతున్నారు.

ఇగోర్ చరచరా అక్కడికి వస్తున్నాడు. మధ్యలో ఒక చోట కొందరు మనుష్యులు నిలుచుని ఉన్నారు. వారిలో అలెగ్జి స్టెపానొవిచ్ జఖరోవ్ విట్యా టార్‌స్కీ, క్లావా కపిరినా ఉన్నారు. వాళ్ళతో మరో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుతున్నారు. ఒకతను స్థూలకాయుడు. పెద్దపొట్ట గుండ్రని తలకాయ, తలమీద వెంట్రుక లేవు. అది బట్టతలో లేక నున్నగా గొరిగించుకున్నాడో! అతనే సాలొమన్ డవిడొవిచ్ బ్లుమ్ కాబోలనుకున్నాడు ఇగోర్. అయితే అతను ఉత్పత్తిశాఖా ప్రధానోద్యోగి అన్నమాట.వరుస లొగుసలుగా ఉన్న భవంతులవంక చూపిస్తూ బ్లుమ్ ఏదో చెపుతున్నాడు. ఆ భవంతి కొత్తగా కట్టినప్పటికీ వికారంగా కనిపిస్తోంది. అది పెండె బద్దతో కట్టారో, బల్లలతో కట్టారో, పాత పొరల చెక్కతో కట్టారో చెప్పడం కష్టం. భవంతి పైకప్పు, చూరుకూడా వేటితో కట్టారో ఊహించలేం. ఇనుపరేకులు, పొరచెక్కలు, రకరకాల ఇనపవలలు; ఇవన్నీ దాని నిర్మాణంలో ఉపయోగపడి ఉంటాయి. దానిపొడుగు, ఆకారం పరమఅసహ్యంగా ఉన్నాయి. ఒకచోట ఎత్తు, మరోచోట పల్లం. మొత్తంమీద ఆభవంతి వాస్తుశాస్త్ర విరుద్ధంగా, పరమ రోతగానిర్మించారు.

బ్రహ్మరాక్షసిలా కనిపిస్తున్న ఆభవంతిని చూచి జఖరోవ్ నివ్వెరపోయి నిలుచున్నాడు.

"అ-వు-ను ! అది ఆవిధంగా ఉంటుందని నేను ఊహించాను కాని......ఏమైనప్పటికీ......"

జఖరోవ్ నవ్వుతూ జేబులో చేతులు పెట్టుకున్నాడు. టార్‌స్కీ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వసాగాడు.

"అది నీకోసమే, సాలొమన్ డవిడొవిచ్ ! ఒక్క వారంలో అయిపోతుంది."

క్లావా వస్తున్న నవ్వును ఆపుకుంది.

"దాని పేరే బ్లమ్‌స్టేడియం" అన్నాడు టార్‌స్కీ.

బ్లమ్ మూతి ముడిచిపెట్టాడు.

"ఏమిటి నీవు మాట్లాడేది? బ్లమ్ స్టేడియమ్‌ను గురించేనా! అది అంత చెడ్డ షాపు అంటావా! చెప్పు? అందులో ఏం లోప మున్నదో చెపితే మంచిదే" అన్నాడు బ్లమ్.

ఇగోర్‌ను చూడగానే జఖరోవ్ "రా, చెర్నియావిన్! ఇలారా !" అని పిలిచాడు.

ఇగోర్ నిటారుగా నిలుచుని శాల్యూట్ చేయడానికై చెయ్యి ఎత్తాడు. క్లావా అతనివంక వింతగా చూచింది.

"గుడ్ మార్నింగ్ కామ్రేడ్ డైరెక్టర్."

"గుడ్ మార్నింగ్. ఇలారా...నీవు లెనిన్‌గ్రాడ్ నుంచి వచ్చావు. లెనిన్‌గ్రాడ్‌లో చాలా భవనాలు చూసిఉంటావు. అటుచూడు ! ఆ భవనం - ఆ షాపు ఎలా ఉన్నదో చెప్పు ?"

"ఆ కనిపించేది షెడ్డేనా ?"

"అది షెడ్డుకాదు, స్టేడియమ్" అన్నాడు టార్‌స్కీ.

"షెడ్డనండీ స్టేడియమ్ అనండీ ఎలా పిలిస్తేనేం ? అందులో మీరు పని చెయ్యొచ్చు. అందుకేం ఇబ్బంది రాదుకదా ?" అన్నాడు డవిడొవిచ్.

"అదిపడిపోదంటారా ? "అని ఇగోర్ అడిగాడు.

అతని ప్రశ్న ఆలోచించదగ్గదే అన్నట్లూ, అతను తనకు పాతస్నేహితుడే అయినట్లూ బ్లమ్, ఇకోర్ వంక చూచాడు.

"అతను వేసిన ప్రశ్న విన్నారా! పడిపోతుందేమో అంటున్నాడు...పడిపోతుందంటావా పడిపోదంటావా ఒలాన్ చెక్?" అని అడిగాడు బ్లమ్.

ఒలాన్ చెక్ బోధకుడు. శిక్షణా తరగతులను నిర్వహిస్తూ ఉంటాడు. ఇతను బ్లమ్‌కు కుడిభుజం. అతని ప్రశ్నవిని ఒలాన్ చెక్ చలించలేదు. ఒలెన్ చెక్ మనిషి చాలా మడ్డిగా ఉంటాడు. కండలు తిరిగిన శరీరం.

"ఎప్పుడో ఒకప్పుడు అది పడిపోకతప్పదు. కాని ఈ క్షణం లోనే పడిపోతుందని మనం చెప్పలేం." స్టేడియం ఎంతకాలం నిలుస్తుందో జాగ్రత్తగా తూచిచెపుతున్నవాడిలాగా ఒలెన్ చెక్ సమాధానమిచ్చాడు.

అది విని బ్లమ్ ఇలా అన్నాడు:

"ఏడాదిలోగా పడిపోతుందంటావా?"

"ఏడాది లోపుగా?" ఇలా అని ఒలాన్ చెక్ భవంతివంక చూచి మళ్ళీ చెప్పసాగాడు. "లేదు ఏడాదివరకూ ఏధోకా లేదు. ఈ మధ్యలో వర్షాలు మిక్కుటంగా పడితేమాత్రం చెప్పలేం."

"వాతావరణం విషయం నిన్నెవరడిగారు? గాలివాన వస్తే కథేలేదు. నోవాకాలంలో తుపాను వచ్చినప్పుడు లోకమంతా మునిగిపోయిందట...ఒకడు ఒకటి నిర్మిస్తున్నప్పుడు వానలు కురుస్తాయో, వరదలొస్తాయో మనస్సులో పెట్టుకోడు. మామూలు వాతావరణ పరిస్థితులను మాత్రమే దృష్టిలో ఉంచుకుంటాడు".

బ్లమ్ కోపంగా అన్నమాటలు ఒలాన్ చెక్ ప్రశాంతంగా విన్నాడు.

"వాతావరణం సరిగ్గా ఉంటే దానికేమీ ధోకాలేదు."

జుఖరోవ్ తన కళ్ళజోడు సర్దుకుని ఆవరణచుట్టూ పరిశీలనగా చూచాడు. అతని చూపుల్లో ఎంతో ఓరిమి, నిబ్బరం గోచరించాయి.

"సరే, మంచిది. ఇహ మనం ఒకమాటు లోపలికి వెళ్ళి చూద్దాం" అన్నాడు ముందుకు నడుస్తూ.

"లోపలికా!" అన్నాడు బ్లమ్ ఉల్లాసంగా. "అవును మనం లోపలికి వెడదాం. అంటే లోపల పని ఎలా జరుగుతున్నదో చూడ్డానికేకాని అక్కడ అందచందాలు చూడ్డానికి కాదుసుమా! అందచందాలు కావాలంటే డబ్బుకూడా ఖర్చు కావాలి కామ్రేడ్స్. నీదగ్గర డబ్బు లేకపోతే నీవు వారానికి ఒకమాటు గడ్డంచేసుకుంటావు. అయితే మీలో ఎవరికీ అలాంటి అధ్వాన్నపుస్థితి పట్టలేదనుకోండి."

పగిలిన తలుపు సందులోనుంచి అడ్డంవచ్చిన కర్రముక్కలూ అవీ ఇవతలికి లాగేసి వారు సామానులు తయారుచేసే గదిలోకి ప్రవేశించారు. అక్కడ లోపల ఏమీ అమర్చిలేదు. అంతానూ అందరికళ్ళూ నేలమీదికి వాలాయి. నేలంతా కర్ర సామగ్రితో నిండి ఉంది. కొయ్యపని చేయడానికై తెచ్చిన కర్రముక్కలు లెక్క లేనన్ని పడి ఉన్నాయి. కొన్ని పొడుగు, కొన్ని పొట్టి, కొన్ని వెడల్పు, కొన్ని మందం, ఇలా రకరకాల సైజులలో ఉన్నాయి. అందరికన్నా ముందు టార్స్కీ ఆ భవంతి లోపలభాగాన్ని నిర్మించే విషయంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

"ఇక్కడ మీ కేదైనా పనిముట్టుకాని మరల విడిభాగాలుగాని పడేస్తే అవి అలా అలా దొర్లుకుంటూపోయి చివరకు మన చేతికి దొరకకుండా పోతాయి!" అతనీ మాట కొంచెం నిబ్బరంగానే అన్నాడు.

అయినా అందరూ పగలబడినవ్వారు. ఒక్క బ్లమ్ మాత్రం నవ్వలేదు.

"ఏం? ఎందుకని దొర్లిపోతాయి?" అని అతను వెంటనే అందుకుని మళ్ళీ ఎదురుప్రశ్న వేశాడు: "ఇప్పుడిదంతా ఖాళీగానే

ఉంది. కాని రేపు మనం మనుష్యులను పనిచేసుకునే బెంచీలను, బల్ల చెక్కలను ఇందులోకి చేరిస్తే, అప్పుడు వస్తువులు ఎందుకు దొర్లు కుంటూ పోతాయి? ఏం ఒలెన్ చెక్? నే చెప్పేది వింటున్నావా? నీ ఉద్దేశం ఏమిటి? అవి క్రిందికి దొర్లిపోతాయంటావా?"

ఒలెన్ చెక్ అన్నిటినీ ఒకమాటు పరిశీలించి చూచాడు.

"అలా క్రిందికి దొర్లిపోవనుకుంటాను. ఏదో ఒకదాన్ని పట్టుకుని ఉండిపోతాయి.

"ఏదో ఒకదానికి పట్టుకుని ఉండిపోతాయనేది వేరే విషయం" అన్నాడు విట్యా, తీవ్రంగా.

ఇహ ఇప్పుడు బ్లుమ్ పూరిగా కోపంతో రెచ్చిపోయాడు. అనేకమార్లు తన పొట్టి చేతులతో రొండిన కొట్టుకున్నాడు. దెబ్బ లాటకు సిద్ధంగా ఉన్నవాడికిమల్లే అతని ముఖం ఉబ్బిపోయింది.

"మీకు కావలసింది ఫర్నిచరు తయారుచేసుకునేచోటా లేక బిలియర్డ్ ఆడుకునే హాలా?" అని అతను రెట్టించి అడిగాడు: బిలియర్డ్ ఆడేగదిలో మనంవచ్చి ఆట మొదలెట్టిందాకా ఎక్కడి కక్కడ బీమంతయినా కదలకుండా ఉంటాయి. ఇక్కడకూడా అలాగే ఉండాలనా మీ ఉద్దేశం? ఏమిటీమాటలవల్ల ప్రయోజనం? మనం ఇక్కడికి నిజంగా ఒక పనిచేయడానికి వచ్చామా లేక ఊరిక వెర్రి వేషాలు వేయడానికి వచ్చామా? బహుశా ఈ షాపును ఒకరాతి భవనం చెయ్యాలని మీ కున్నదేమో! సరే, మీరు నాకు డబ్బు చూపించండి! చూపించడానికేముంది? మీ దగ్గర ఇటుకలున్నాయా? ఇనపరేకులున్నాయా? పెట్టుబడి ఉన్నదా! మీ ఫిట్టర్లంతా ఆరు బయటకూచుని పనులుచేస్తుంటే నేను వాళ్ళతలలకాస్త ఆధారంగా ఒక పైకప్పు వేయించాను. కాని మీరంతటితో తృప్తిపడలేదు. శిల్పకళంతా ఉట్టిపడే ఒక మంటపమో - ఒక పెద్ద దేవాలయపు సింహద్వారమో కావాలని మీ కోరిక. మీరు మీ తనిఖీ సభ్యు లతో వచ్చి దీన్ని ఒక స్టేడియమ్ అని పిలుస్తున్నారు! కాని మీరు

నాకేమిస్తారని అడుగుతున్నాను, చెప్పండి? అంచనా వేసిన లెక్కలు ప్లానులు, అచ్చులు వేసిన కాగితాలు-ఏమిటిస్తారు? మీ డబ్బెక్కడ? నా దగ్గర ఒక్క ఇంజనీరుకూడా లేడు! ఇహ మీరు నాకోసం ఏం ఏర్పాటు చేశారు? కమాండర్ల కౌన్సిల్ కార్యదర్శిగారైన కామ్రేడ్ విక్టర్ టార్స్కీ! - మిమ్మల్నే అడుగుతున్నా, మాట్లాడరేం?"

కమాండర్ల కౌన్సిల్ కార్యదర్శియైన టార్స్కీకి మాట్లాడడానికేమీ దొరకలేదు. జఖరోవ్ బ్లమ్‌ను శాంతపరుస్తున్నట్లుగా అతని మోచెయ్యి పట్టుకున్నాడు.

"సాలొమన్ డవిడొవిచ్! మీరు కోపపడకండి ఇంతకంటె ఏదో ఒరిగిపడాలని మేం అనుకోలేదు. చూడండి, మనం అనుకున్నట్లు వచ్చేఏడు అసలు ఫ్యాక్టరీని నిర్మిద్దాం. అప్పటిదాకా ఈ భవంతితో పని జరుపుకుని అప్పుడు దీన్ని హాయిగా తగలబెట్టేద్దాం. క్రింద గడ్డి పెట్టి నిప్పు అంటిస్తే......"

"అది నాకిష్టమే! కనుక మీరు దీన్ని తగలబెడతారు! మరి దీన్ని ఒకటోరకపు గిడ్డంగిగా ఎందుకు తయారుచేసింది?"

"అయితే సరే. అప్పుడు మీయిష్టం మీ ఇష్టంవచ్చినట్లే చెయ్యండి"

"థ్యాంక్యూ! ఇహ ఇప్పుడు పనులు చేయించడానికి మీకొక జాగా ఉన్నది. ఈ బ్లమ్ స్టేడియమ్ కట్టకపోయినట్లయితే మీరేం చేసి ఉండేవారు కామ్రేడ్ టార్స్కీ?"

"మన పడక గనులముందు ఒక ఫ్యాక్టరీ కట్టాలని నేను ఎప్పుడూ చెపుతూనే ఉన్నాను" అన్నాడు టార్స్కీ.

"అదా సంగతి! నేను భవంతి పూర్తి చేయించిన తరువాత మీ రామాట చెపుతున్నారన్నమాట."

"ఫ్యాక్టరీ నిర్మించాలనే నేను చెప్పాను. కాని మీరు స్టేడియమ్ తయారుచేశారు.

"కామ్రేడ్ టార్స్కీ! ఒక్క విషయం వినండి, లేనిపాయసం కంటె ఉన్న గంజిమేలు."

జఖరోవ్ నవ్వాడు. మళ్ళీ పేమపూర్వకంగా బ్లమ్‌ను చెయ్యి పట్టుకుని వాకిలిదగ్గరికి తీసుకెళ్ళాడు.

ఇగోర్ చెర్నియాబిన్ వాళ్ళందరూ అక్కడనుంచి వెళ్ళిపోయిందాకా వేచి ఉన్నాడు. తరువాత ఖాళీగా ఉన్నా ఆ భవంతిని పరికించి చూచాడు. అతని కెవరిమీదనో విచారం కలిగింది. వాకిలి దాటివచ్చిన తరువాత ఆ విచారం ఎవరిమీదనో తెలుసుకున్నాడు. అతనికి విచారం కలిగింది సాలోమన్ డవీడవిచ్‌ని గురించి.

23
అంతరార్థం

ఆ సాయంత్రం నెస్ట్రెంకో, ఇగోర్‌ను పిలిచి "రేపు నీవు యంత్రభాగాలను అతికించే షాపులో పనిచెయ్యడం మొదలుపెట్టాలి" అని చెప్పాడు.

"అలాంటిచోట నేనింతకుముందెన్నడూ పని చెయ్యలేదు."

"సరే. రేపు చేద్దువుగాని."

"అంటే స్టేడియమ్‌లో - అవునా!"

"స్టేడియంలో తరువాత. ముందు నీవు యార్డులో పని మొదలుపెట్టాలి."

"అక్కడ నేనేం పని చెయ్యాలి?" అని అడిగాడు ఇగోర్.

"ఏం చెయ్యాలో అక్కడుండే ఫోర్‌మన్ నీకు చూపిస్తాడు."

"కాని యంత్రభాగాలు అతికించే పనివాడుగా ఉండాలని నేను అనుకోిండేదే?"